# ఋతవాణి


## (Voice Real - 2)

రచయిత :

శ్రీ రామచంద్రజీ

శ్రీ రామచంద్ర మిషన్

షాజహాన్‌పూర్.



# తొలి పలుకు

భారతదేశమునందు యోగము అనాది కాలము నుండి ఆచరింపబడుచున్నది. యోగము అనగా భగవంతునితో ఐక్యత. అన్ని యోగములలో రాజయోగము ఉత్కృష్టమైనది. మానవుని అత్యున్నత ఆధ్యాత్మిక స్థితికి విజయవంతముగా తీసికొని పోగలది రాజయోగము మాత్రమే. ప్రాణాహుతితో కూడిన రాజయోగ సాధన మిక్కిలి ప్రాచీనమైనది. మానవునిలో మార్పు తెచ్చుటకు వుపయోగింపబడు దివ్యశక్తి అని ప్రాణాహుతి నిర్వచింపబడినది. ప్రాచీన భారతీయ ఋషులు ప్రాణాహుతితో కూడిన రాజయోగ సాధనను యోగ్యులైన కొందరకు మాత్రమే అందించారు. శ్రీ కృష్ణపరమాత్మ ఈ పురాతన విధానము ద్వారానే తనకాలంలో ఆధ్యాత్మిక శిక్షణనిచ్చారు. ఆయన తరువాత కాలంలో భక్తి, భాగవతము మొదలగునవి ప్రవేశించి కాలగతిన ఈ విధానము మరుగున పడిపోయి పూర్తిగా మరువబడినది. ఆధ్యాత్మికతకు నిలయమైన భారతదేశము పురాతనమైన ప్రాణాహుతితో కూడిన రాజయోగ సాధనను పూర్తిగా మరచి అంధకారమున తడవులాడు చున్నది. ఇటువంటి తరుణంలో పరిస్థితులను చక్కబరచి మానవాభ్యుదయమును సాధించుటకు ఒక మహాత్ముడు అత్యంత ఆవశ్యకమయ్యెను. మహాత్ములు యాధృచ్ఛికముగా జన్మింపరు. ప్రపంచము మహాత్ముల కొరకు ఆతురతతో నిరీక్షిస్తూ కాచుకొని వున్నప్పుడే వారు అవతరిస్తారు. అది ప్రకృతి ధర్మము.

1873వ సంవత్సరములో ఫిబ్రవరి 2వ తేది వసంత పంచమి శుభ దినమున ఉత్తర ప్రదేశ్ రాష్ట్రమునందలి ఫతేఘర్‌లో సమర్ధగురు మహాత్మ శ్రీ రామచంద్రజీ (లాలాజీ మహారాజ్) అవతరించినారు. మహోన్నత ఋషులను సైతం కలవర పెట్టిన జీవిత సమస్యకు ఒక సులభ పరిష్కారాన్ని అందజేసారు. ఆయన వెలుగులోకి తీసికొని వచ్చిన పురాతనమైన ప్రాణాహుతితో కూడిన రాజయోగ సాధనా విధానము మన ప్రాపంచిక కర్తవ్య బాధ్యతలను తగురీతిగా నెరవేరుస్తూనే అత్యున్నత ఆధ్యాత్మిక పురోగతికి తేలికైన పద్ధతిని సమకూర్చినది. ఇట్లు వారు ప్రపంచములో ఆధ్యాత్మిక పునరుజ్జీవనానికి, ఔన్నత్యానికి ఒరవడి పెట్టి నూతన శకానికి నాంది పలికారు. ఆయన ఆధ్యాత్మిక రంగమున తన పాత్రను పూర్తిగా నిర్వహించి ఆ బాధ్యతను పరమయోగ్యుడగు తన శిష్యుడు మహాత్మ శ్రీ రామచంద్రజీ (షాజహాన్‌పూర్) కప్పగించి ఈ భౌతిక ప్రపంచమును వీడెను.

మన గురువర్యులు పూజ్య శ్రీ రామచంద్రజీ మహారాజ్ (బాబూజీ మహారాజ్) 1899వ సంవత్సరములో ఏప్రిల్ 30వ తేదీన షాజహాన్‌పూర్‌లో అవతరించినారు. వారు ప్రకృతి ప్రసాదించిన విశిష్ట మూర్తిమత్వము (Special Personality). వీరి అవతరణతో ప్రపంచ మానవాళి ఎదుర్కొంటున్న జీవిత సమస్యకు పరిష్కారము సులభతరమైనది. దివ్యాదేశాల ప్రకారము వీరి అవతరణకు ముందున్న అనుసంధానము తెంపివేయబడి మన గురువర్యులతో అనుసంధానము ఏర్పరబడినది. ఆధునిక జీవితంలో మానవుని కార్యకలాపములు నిత్యము అధికమవుతున్నాయి. అవి ప్రస్తుత జీవిత పరిస్థితులకేమాత్రం సరిపడని నిర్బంధ, కఠోరనియమాలతో కూడిన పా యాంత్రిక విధానాలలో నిర్దేశించిన సాధనలన్నీ ఆచరించడానికి అవసరమయ్యే కాలాన్ని తగినంతగా లభ్యం కానీయవు. ఈ విషయాన్ని దృష్టిలో వుంచుకొని మన గురువర్యులు ప్రస్తుత కాలావసరాలకు అవసరమయ్యే కాలాన్ని తగినంతగా లభ్యం కానీయవు. ఈ విషయాన్ని దృష్టిలో వుంచుకొని మన గురువర్యులు ప్రస్తుత కాలావసరాలకు అనువుగాను, సామాన్య మానవుని సాధారణ జీవిత విధానానికి అనుగుణంగాను తగు మార్పులుచేసి తేలికయైన ప్రాణాహుతితో కూడిన రాజయోగ సాధనను మనందరికీ ప్రసాదించారు. ఈ సాధన ఐహికం, ఆధ్యాత్మికం అనే జీవితంలోని రెండు భాగాలుకూడా సమానంగా ప్రకాశించేటట్లు చేసి మన నిజ జీవిత లక్ష్యమైన శాశ్వత సత్యప్రాప్తిని సులభంగా పొందుటకు సాధ్యపడుతుంది. జీవిత లక్ష్యమును సాధించుటకు కుటుంబ జీవితము ఆటంకమేమియు కాదు. ఉన్నత స్థితులను సులభముగా పొందుటకు గృహస్థాశ్రమమే అన్నింటికంటే మేలైనది. ఆది గురువర్యులు పూజ్య శ్రీ లాలాజీ మహారాజ్, మన గురువర్యులు పూజ్య శ్రీ బాబూజీ మహారాజ్ గృహస్థులే. మానవుడు గృహస్థాశ్రమ మందుండియే ఒక జీవిత కాలమందే ఆధ్యాత్మిక సాధనయందు పరిపూర్ణతను సాధించుటకు వారు సులభమార్గమును చూపిరి. గృహస్థ జీవితమందలి కష్టములు, బాధలు ఆధ్యాత్మిక సంపదకు కావలసిన తపస్సులు, త్యాగములు అని వారు చెప్పినారు.

మన గురువర్యులు పూజ్య శ్రీ రామచంద్రజీ మహారాజ్ (బాబూజీ మహారాజ్) సమస్త మానవాళి ఆధ్యాత్మిక సేవకొరకే గాక ప్రకృతి కార్యనిర్వహణ కొరకు అవతరించినారు. మన గురువర్యుల కృషి ఫలితంగా వ్యక్తులలో మార్పు, వారి ద్వారా సమాజములో మార్పు, అటు తర్వాత ప్రపంచములో మార్పు కనబడుతుంది. ప్రపంచములో ఇప్పటికే కొన్ని మార్పులు స్పష్టముగా కనబడుచున్నవి. మన గురువర్యుల పథకము ప్రకారము ప్రపంచములో ఇంకను పెనుమార్పులు సంభవించవచ్చును. మన

గురువర్యులు ఇలా అన్నారు. 'ఆధ్యాత్మికతను ఆధారము చేసికొనక ఏ దేశముగాని, ఏ జాతిగాని జీవింప జాలదు. ప్రతి జాతియు తన అస్థిత్వమునకై ఎప్పుడైనను అదే మార్గమవలంబించి తీరవలెను. కనుక మనందరము మన ప్రాపంచిక కర్తవ్య బాధ్యతలను తగురీతిగా నెరవేరుస్తూనే మన గురువర్యులు ప్రసాదించిన సులభమైన ప్రాణాహుతి ప్రక్రియతో కూడిన రాజయోగ సాధన చేసి ఆధ్యాత్మిక పథంలో అత్యున్నత స్థితిని సాధించి తరించాలి. ఈ విధముగా మన గురువర్యులు ఆశించిన విధంగా మనందరము పరిపూర్ణ మానవస్థితికి చేరుకొని దివ్యమానవ సమాజాన్ని నిర్మించాలి.

మన గురువర్యులు ప్రపంచములోని సత్యాన్వేషకులెల్లరకు వివిధ సందర్భములలో, ప్రదేశములలో వారిచ్చిన సందేశములు క్రోడీకరించి ఆంగ్లభాషలో నున్న వాటిని తెలుగు భాషలోనికి అనువదించి "శ్రీ రామచంద్ర అమృత వర్షిణి" అను పుస్తకమును తొలిసారిగా ప్రచురించుచున్నాము. దీని ముఖ్యోద్దేశ్యము తెలుగు సోదరీసోదరుల సౌకర్యార్థము విషయ సౌలభ్యము కొరకు మన గురువర్యుల అమృతవాక్కులలో వెలువడిన సందేశములన్నియు తేటతెలుగులో వివరించుటయే. సోదరీసోదరులెల్లరు మన గురువర్యుల సందేశములలోని జ్ఞానామృతమును గ్రోలి ఆధ్యాత్మిక పథంలో చైతన్యవంతులై పరిపూర్ణ స్థాయిని సాధించి మన గురువర్యులు ఆశించిన ప్రపంచ పరిణామమునకు సంపూర్ణ సహకారము అందించగలరని ఆశిస్తున్నాము.

# నా గురువర్యుల సంస్థ

1873 సంవత్సరంలో వసంత పంచమి శుభదినాన్న గురువర్యుల దివ్యాత్మ ఉత్తర ప్రదేశ్ రాష్ట్రము నందలి ఫతేఘడ్‌లో సమర్థ గురు మహాత్మా శ్రీరామచంద్రజీ వారి భౌతిక రూపంలో భువిపై అవతరించింది. ఆ శుభదినం సంవత్సరంలో అత్యంత ఆహ్లాదకరమైన వసంతఋతువుతో మనోహరంగా సమన్వయమై ప్రతి హృదయంలోను నవ వసంత శోభను చిగురింపజేసింది. ఆయన అవతరణచే ప్రారంభమైన యీ ఆనందపూరిత సమయం ఆధ్యాత్మిక చైతన్యంలో ఒక నూతన శకాన్ని ప్రవేశపెట్టింది. మానవ జీవిత సమస్యకు అనుభవపూర్వక పరిష్కారము అది అందజేస్తుంది. ఆధ్యాత్మిక రంగంలో వారు తీసికొని వచ్చిన యీ అద్భుత చైతన్యం మన మనస్సు గుర్తుచేసికొన్నప్పుడు మన హృదయాలు ఆనందంతో పరవశిస్తాయి. మహోన్నత ఋషులను సైతం కలవరపెట్టిన జీవిత సమస్యకు ఆయన ఒక సులభ పరిష్కారాన్ని యిచ్చారు. ప్రత్యాక్షానుభవం మాత్రమే నేనిక్కడ చెప్పే విషయంలో గల నిజాన్ని నిరూపిస్తుంది.

ఆధ్యాత్మిక ఔన్నత్య మహోన్నత శిఖరాలపై భారతదేశం ఒకానొకనప్పుడుండేది. మతం, ఆధ్యాత్మికతలకు తాను జగద్గురువునని అది చాటుకున్నది. కాని కాలగమనంలో పతనావస్థ ప్రవేశించి దాదాపు ప్రతిదానిని పోగొట్టుకుంది. కాలక్రమేణా యిదివరలో మన నుండి ఆధ్యాత్మికతను గురించి నేర్చుకున్నవారు కూడ మనకు మార్గదర్శకులమని చెప్పుకునే హీనస్థితికి దిగజారినాము. పరిస్థితిని చక్కదిద్ది సరిచేయడానికి మహాత్ములు అప్పుడప్పుడు ప్రయత్నించారు. కాని వారి ప్రయత్నాలేమైనప్పటికీ మొత్తంపై పరిస్థితి మరింత దిగజారుతూనే వచ్చింది. తుదకు మనం ప్రతిదానిని పోగొట్టుకోవడమే గాక దాని గురించే పూర్తిగా మరచినాము. ఇప్పుడు అదేదైనా మన దృష్టికి వస్తే అది మనకు పరాయి వస్తువుగ కనబడుతోంది. దానిని నమ్మడానికి కూడ మొగుగ చూపడం లేదు. ఏదేమైనా, చాలాకాలం నుండి, మరుగున పడివున్న యీ ఆధ్యాత్మిక శాస్త్రాన్ని పునరుజ్జీవింప చేయడానికే కాక, దానిని మరల మన అనుభవ జ్ఞానానికి, అవగాహనకు తీసికొనిరావడానికే సమర్థ గురుదేవులీ ప్రపంచంలోకి వచ్చారు.

ఆ విధంగా మానవాళి ఆధ్యాత్మిక పునరుజ్జీవనానికి, మోక్షం కొరకు పరితపించే ఆత్మల విమోచనానికి ప్రాణాహుతి అనే యీ పురాతన యోగ పద్ధతి ద్వారా దైవమార్గాన సామాన్య జనులనుద్ధరించడానికి సమర్థ గురువర్యులవతరించారు. ఈ పద్ధతి మిక్కిలి

ప్రాచీనమైనట్టిది. అయిన్పటికీ తరువాతి కాలంలో పూర్తిగా మరువబడింది. హైందవ ఋషులే యీ పద్ధతికి మూల పురుషులు. అటువంటిది హిందులకీనాడు అది లేకుండా పోయింది. యీ మహోన్నత సేవకే యీ సంస్థ ఉంది. యీ సంస్థ కార్యకర్తలకు ప్రశిక్షకులకు (ప్రిసెప్టరులకు) ధన, కీర్తి, ప్రతిష్ఠలకై ఎటువంటి స్వలాభాపేక్ష లేదు. వాస్తవానికి నిజమైన ఆధ్యాత్మిక గురువు యొక్క ప్రధాన కర్తవ్యాలలో యిదొక్కటి కాని యీ యదార్థాలను ఎవ్వరూ కూడా గుర్తించక పోవడం విచారకర విషయం. దానికి కారణం ప్రత్యేక వస్త్రధారణ, జీవిత విధానంలో ఒక విశిష్టత లేకపోవడం వలన మనం వారికి గంభీరంగా కనపడం. నా గురువర్యుల సామర్థ్యం మూటల్లో చెప్పనలవిగాదు. ఆయన యోగ్యతలన్నింటిని వివరించడం సూర్యుని ముందు దివిటీని వెలిగించడం వంటిది. యదార్థ భావంలో ఆయన సమర్ధ గురువని చెప్పితే సరిపోతుంది. మానవ జీవితాదర్శాన్ని, కష్ట దుఃఖాలతో నిండివున్న యీ సాధారణ ప్రాపంచిక జీవితంలోనే దానిని సాధించగల నిశ్చయకరమైన పద్ధతిని ఆయన ప్రజల దృష్టికి తీసికొని వచ్చారు. ఆయన తెలియజెప్పిన యీ పద్ధతి మహోన్నతస్థితి వరకు మనం సులభంగా ప్రవేశించేలా చేస్తుంది. దీనికై యిదివరలో గృహాన్ని, సంసారాన్ని, ప్రాపంచిక జీవితాన్ని త్యజించి సన్యాసి జీవన పద్ధతిని చేపట్టవలసి వచ్చేది. సహజమైన యీ సాధనా ప్రభావాన్ని గురించి ప్రజలు విశ్వసించేటట్లు నచ్చ చెప్పడమే కాకుండా ఆయన ఆధ్యాత్మిక పథంలో అత్యున్నత స్థాయి వరకు వారిని విజయవంతంగా నడిపించారు కూడా.

ఆయన వెలుగులోకి తీసికొని వచ్చిన యీ సాధనా విధానం మన ప్రాపంచిక కర్తవ్య బాధ్యతలను తగురీతిగా నెరవేరుస్తూనే అత్యున్నత ఆధ్యాత్మిక పురోగతికి సులభ పద్ధతిని అమర్చింది కూడా. శ్రీకృష్ణ పరమాత్మ కాలంలో వాడుకలో వున్న సాధన యొక్క తత్త్వసారం యిటువంటిదే. దీని ద్వారానే ఆయన తన కాలంలో ఆధ్యాత్మిక శిక్షణ నిచ్చారు. కాలగతిన ఆ విధానం మరుగున పడిపోయి పూర్తిగా లేకుండా పోయింది. ఇప్పుడా ప్రాచీన పద్ధతి మన సమర్థ గురువర్యులచే పునరుజ్జీవింపబడి, నూతన శోభతో వెలుగులోనికి వచ్చింది. నిస్సందేహంగా ఆయన యీ పరమోద్దేశం కొరకే ప్రపంచంలో అవతరించారు. ఆయన సాహచర్య అదృష్టం లభించిన వారు ధన్యులు. ఆయన సకల లోపరహితుడు. ఈ విషయంలో ఆయనకెవరూ సాటిలేరు. అయోమయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్న మానవాళికి ఆయన చేసింది నిజంగా మాటలకతీతం. తనతో సంబంధం ఏర్పరచుకున్న వారందిలోనూ శూన్యతా స్థితి భావాన్ని కలిగించి ఒక నూతన జీవితాన్ని ప్రసాదించారు. మానవ అస్తిత్వాన్ని విముక్తి కావించుటకది సరిపోతుంది. అత్యున్నతమైన దానిని

పొందుటకు తిరుగులేని ఫలితాన్నిచ్చే అనుభవపూర్వక పద్ధతిని ఆయన ప్రవేశపెట్టారు. అటువంటి శక్తి సామర్థ్యాలున్న మహా పురుషులు వాస్తవానికి చాలా అరుదు. అయినప్పటికి వారు ఎల్లప్పుడూ ఉన్నారు. భవిష్యత్తులో కూడా ఉంటారు. కాని వారిని తెలుసుకోవడం నిజంగా కష్టం. అది కొంతవరకు మన పూర్వ జన్మ సంస్కారాలపై కూడా ఆధారపడుతుంది. ఇంకొక ఇబ్బంది కూడ ఉంది. ఏదోవిధంగా అటువంటి మహాత్మునితో సంబంధం కలిగినప్పటికీ, చాలామంది ఆయనను ఆవిధంగా స్వీకరించుటకు యిష్టపడరు. దానికి కారణం ఆయన వద్ద ఏ ఆకర్షణ లేకపోవడమే. ఇదంతా వారు మాయా ప్రభావంలో చుట్టుకొని వుండటం వలన; అది అటువంటి స్వభావం కల వస్తువులకే వారిని అంటిపెట్టుకొని ఉంచుతుంది.

పూర్వకాలంలో గురువులు తమ శిష్యులలో దివ్యజ్ఞానాన్ని పొందే సామర్థ్యాన్ని, అర్హతను పెంపొందించుటకు వారి నుండి ఎక్కువగా వ్యక్తిగత సేవను కోరేవారు. అది లేకుండా లేశమైనా ఆధ్యాత్మికతను వారికి నేర్పేవారు కారు. కాని మన సమర్థ గురువర్యులు మానవుని నిస్సహాయ స్థితిని గమనించి తమ అపారకృపచే యీ నిబంధనను వదిలేసారు. అభ్యాసీలనుండి వ్యక్తిగత సేవను ఆయన తన జీవితంలో ఎన్నడు స్వీకరింపలేదు. అంతేగాక అభ్యాసీల అవసరకాలంలో ఆయనే వారికి శారీరక సేవను అర్పించారు. ఆవిధంగా ఆయన తన జీవితమంతా మానవాళి సర్వతోముఖ సేవకై అంకితమయ్యారు.

ఆయన ప్రతినిధిగా నాకాయన వెలిబుచ్చిన అభీష్టాలను అనుసరించి యీ సంస్థ స్థాపించబడింది. ప్రస్తుత కాలావసరాన్ని తీర్చడానికి “సహజ మార్గము” అను పేర ఒక నూతన విధానం ప్రవేశపెట్టబడింది. నూతనంగా ప్రవేశపెట్టబడిన యీ సహజమార్గ విధానం ద్వారా సమర్థ గురుదేవుల సిద్ధాంతాలను ప్రచారం చేయడం, తద్వారా నిద్రించుచున్న సామాన్య జన బాహుళ్యంలో దివ్యచైతన్యాన్ని కలిగించి జాగృతం చేసి ఆధ్యాత్మిక ప్రగతి మార్గంలో వారిని సక్రమంగా ఉంచడం యీ సంస్థ లక్ష్యాలు. ఈ ఉద్దేశం నెరవేరాలంటే ప్రస్తుత జీవిత పరిస్థితులకే మాత్రం సరిపడని నిర్బంధ, కఠోర నియమాలతో కూడిన పాత యాంత్రిక విధానాలను పక్కకు నెట్టాలి; వాటి స్థానే అశక్తుడు, అశాశ్వతుడు, అల్పాయుష్కుడు అయిన యిప్పటి మానవుని శారీరక మానసిక దౌర్భల్యాలకనుగుణంగా వుండే సరళమైన సహజ విధానాన్ని ఏర్పరచడం అవసరం. అంతేగాక ఆధునిక జీవితంలో మానవుని కార్యకలాపాలు నిత్యం అధికమౌతున్నాయి. అవి పాత విధానాల్లో నిర్దేశించిన ప్రయాసకరమైన సుదీర్ఘ సాధనలన్నీ ఆచరించడానికి అవసరమయ్యే కాలాన్ని మానవులకు తగినంతగా లభ్యం కానీయవు.

మానవుడపేక్షించే ఆ సత్‌తత్వం నిజానికి మిక్కిలి సరళమైనది; స్పష్టమైనది. ఆకారణంగానే అది సామాన్యులర్థం చేసికొనుటకు దొరకనిది. దానికి పొందాలంటే మనం కూడా దానివలెనే సరళంగా తయారు కావాలి. అందుకు మనం అవలంభించే పద్ధతి కూడ అదే విధంగా సరళంగాను, సహజంగాను వుండడం ప్రధానమైన విషయం.

ప్రకృతిలోని నిరాడంబరత, సరళత్వం ఆ ప్రకృతికే అడ్డు తెరలైనాయని నేను యిదివరకే వేరేచోట చెప్పాను. ఆ నిరాడంబరత్వస్థాయికి మన దృష్టి మారితేనే కాని, దానిలోకి తొంగి చూడడం కూడ అసాధ్యమౌతుంది. మన విధానంలో అటువంటి సామర్థ్యం అభ్యాసిలో అభివృద్ధి చెందనారంభిస్తుంది. సునిశితత కలిగిన వాడు దీనిని బాగా అర్థం చేసికొనగలడు. కాని అట్టి శక్తి సామర్థ్యాలను నిజంగా అర్హులైన వారు మాత్రమే నిశ్చయంగా కలిగివుంటారు. అయితే మానవుని ప్రస్తుత పతన స్థితి కారణంగా యీ నిబంధనను మార్చవలసి ఉంటుంది. కొందరు అనేక విధాల అనర్హులైనప్పటికి, ఆంతరంగికంగా శాశ్వత సత్య ప్రాప్తికై తపిస్తూ సాధనను చేపట్టడానికి ఉద్యుక్తులౌతారు. అట్టి వారికి అవకాశం కలుగజేయడానికి యీ నిబంధనను మార్చవలసి ఉంటుంది. ఆ సందర్భంలో వారిని సక్రమంగా తీర్చిదిద్దే బాధ్యతను కూడ గురువు స్వీకరిస్తాడు. అతడు తన సంకల్ప శక్తిచే వారిలో తగిన సామర్థ్యాన్ని పెంచుతాడు కూడ.

ఈ విషయాన్నే దృష్టిలో వుంచుకొని, గురువర్యులు ప్రస్తుత కాలావసరాలకు అనువైన యీ అద్భుత విధానాన్ని ఎంతో కృపతో మానవాళికి అనుగ్రహించారు. ఈ పద్ధతి సామాన్య మానవుని సాధారణ జీవిత విధానానికి అనుగుణంగా నడుస్తుంది. ఇదే యీ పద్ధతి యొక్క అత్యంత విశేషకరమైన అంశము. ఐహికం, ఆధ్యాత్మికం అనే జీవితంలోని రెండు భాగాలు కూడ సమానంగా ప్రకాశించేటట్లు చేయడానికి తన జీవిత కర్తవ్య బాధ్యతల ఎడల తగు శ్రద్ధ వహిస్తారు. యీ భావాన్ని కేవలం బోధించడం కాని, ప్రచారం చేయడం కాని మన ఉద్దేశం కాదు. వాటిని ఆచరణలోకి కొనివచ్చి దైనందిన జీవితంలో ప్రయోగించాలి కూడా.

# దక్షిణ భారత ప్రజలకు అధ్యక్షుని తొలి సందేశం

ప్రియతములారా !

నా సందేశాన్ని మీకు పంపే అవకాశం లభించడం నాకెంతో ప్రగాఢ ఆనందానుభూతిని కలిగించింది. ఇది అతి చిన్న సందేశం కావచ్చు, కాని ప్రేమానురాగాలతో నా హృదయాంత రాళం నుండి ఉప్పొంగి బయటకు వచ్చింది.

ఆత్మ తన యదార్థ స్వరూపం కనుమరుగైన తర్వాత దానిని తెలిసికోవాలని తపన చెందుతోంది. విముక్తి మార్గంలో పయనించే తోటియాత్రీకులకై యీ అనామకుడు అన్వేషిస్తున్నాడు. సహయాత్రీకుడు దొరకాలనే నా యీ ఆకాంక్ష, తపన కూడ గమ్యానికి అతడిని సురక్షితంగా చేర్చడానికి సహాయపడడం కోసమే. నా యీ భావం మీకు మొదట వింతగా కనబడవచ్చు. కాని కొంచెమాగి గమ్యం యొక్క సమస్యను గురించి ఆలోచిస్తే, మీరు మీ స్వగృహం వైపునకు పయనిస్తున్నారన్న అభిప్రాయానికి తప్పక వస్తారు. విధి వైచిత్ర్యం వలన మీ స్వగృహం నుండి విడిపోయారు.

"విధి వైచిత్ర్యం" అనే పదాన్ని ప్రయోగించినప్పుడు మన స్మృతికి అసమత్వ భావం స్ఫురిస్తుంది. సమత్వస్థితి వున్నంత వరకు మనకు మనదంటూ ఒక రూపం లేదు. మనలను వికసింప జేసుకొని మనం పోగొట్టుకొన్న సమత్వమును తిరిగి పునరుద్ధరించు కొనవలసి వున్నది.

మన సమత్వము తిరిగి పొందాలనడం ఎంతో సులభంగా కనిపిస్తుంది. సహజంగా అది సులభమే, కాని దానిని సాధించడం చాలా కష్టం. దీనికి కారణం సమత్వ స్థితిని పోగొట్టుకోవడమే కాక, మనం అనేక చిక్కులను నిర్మించుకున్నాం. మన దేశంలో బాగా ప్రబలంగా వున్న కఠిన పద్ధతుల ద్వారా మాత్రమే జీవిత సమస్యల్ని పరిష్కరించి, మార్గాన్ని అన్వేషించాలని ఎల్లప్పుడు కోరుకుంటాం. దాని ఫలితమే నిరాశ, నిస్పృహలు. వారు కొవ్వు పదార్థం నుండి తైలాన్ని తీస్తారు. అనగా భౌతిక విజ్ఞాన గర్వంతో అతిశయ పడేవారి నుండి సమస్యా పరిష్కారం పొందాలనుకుంటారు. అంతేకాని, వారి స్థితి ఎంతో మలినంగా ఉన్నప్పటికీ నిరహంకారుడైన నిజమైన ఆధ్యాత్మిక గురువును కలిసి తమలోని ప్రతి అణువును తేజోమయం కావించే భాస్వర పదార్థానిన అతని నుండి పొందడానికెన్నడు ప్రయత్నం చేయరు. అప్పుడు ప్రయత్నం మరింత కష్టమౌతుంది.

సులభమైన వస్తువును సంపాదించడానికి సులభోపాయాన్ని అవలంభించాలి. మూఢ సిద్ధాంతాలు ఎటువంటి మంచిని చేయవు. మూలము వరకు గల దూరాన్ని అంతా పయనించిన మార్గదర్శి పర్యవేక్షణలో చేసే సాధనే మీ భవిష్యత్తును రూపొందిస్తుంది.

గమ్యానికి మిమ్మల్ని అతి సులభంగా చేర్చగల అట్టి మహా పురుషులు భారతదేశంలో ఉన్నారు. కాని మార్గదర్శి నెంచుకోవడం మీకు మీరుగా చేయవలసిన పని. దాన్ని నిర్ణయించే ప్రమాణం ఏమిటంటే మార్గదర్శికి ఎటువంటి స్వలాభాపేక్ష లేకుండా సేవాభావం మాత్రమే ఉండాలి. మరొక విషయం ఆలోచించాలి. మీ కార్యభారాన్ని సులభతరం చేయడానికి మీలో దివ్యశక్తిని ప్రవేశపెట్ట గలవాడే దివ్యజ్ఞానాన్ని అందించుటకు సమర్థుడు. అటువంటి వ్యక్తి లభ్యం కావడమే నిస్సందేహంగా జీవిత సమస్య పరిష్కారమౌతుందనడానికి నమ్మదగిన సూచన. అన్వేషకులైన మీ అందరికీ అట్టి మార్గదర్శి లభ్యం కావాలని నేను ప్రార్థించాలి. భగవంతుడు మీకు సహాయపడుగాక!

మీ ఆధ్యాత్మిక ఔన్నత్యానికి గురువు ఒకరు దొరకాలని ప్రార్థించడం తప్ప నేను చేయవలసిందేదీ లేదు. మీరందరూ దీనిని గ్రహింతురు గాక! మన అత్యంత ప్రియతములపై ప్రేమతో యీ సందేశం నా హృదయాంతరాళము నుండి ఉప్పొంగి వచ్చింది.

# సహజ మార్గ పద్ధతి

సహజ మార్గ పద్ధతి, లేక సత్‌తత్వ ప్రాప్తికి సహజమైన మార్గములోని ముఖ్యాంశాలను కొన్నింటిని నేనీనాడు మీ ముందుంచుతున్నాను. ప్రాపంచిక జీవితంలో సాధారణ నిత్య కృత్యానికనువుగా సులభంగా మలచుకోగలిగే అత్యంత సరళ, సహజ పద్ధతులలో యీ విధానం నడుస్తుంది. మనస్సును, ఇంద్రియాలను అణచివేసే ఉద్దేశంతో చేసే కఠోర తపో నియమాలను, శరీరాన్ని శోషింప చేసికొనే విధానాలను వేటినీ యిది అనుమతించదు. సహజమార్గ విధానం ఎంత సరళమైందంటే ఈ కారణంగానే ప్రజలు దీనిని బాగా అర్థం చేసికోలేదు. వారు శాశ్వత సత్వప్రాప్తి ఒక మహా కష్టకార్యమని, దానికనేక జన్మలు, యుగాల తరబడి పట్టువీడని శ్రమ అవసరమనే భావంతో వుంటారు. అయితే సత్‌తత్వాన్ని గురించి అస్పష్ట భావాలతో నిండి యుండి, దానిని సిద్ధింప జేసికోవడానికి క్లిష్టమైన పద్ధతులననుసరించే వారికి అది కష్టం కావచ్చు. వాస్తవానికి మానవుడు కాంక్షించే ఆ సత్‌తత్వం ఎంత సరళమైనదంటే దాని సరళత్వమే దానిక అడ్డుతెర అయింది. సరళమైన దానిని సరళ పద్ధతులు ద్వారానే సాధించగలం. అందువలన సరళమైన దానిని పొందడంలో నిశ్చయంగా విజయాన్ని కలిగించేవి అత్యంత సరళ పద్ధతులు మాత్రమే.

నేలపైనుండి సూదిని వ్రేళ్ళతో సులభంగా ఎత్తగలం. కాని దానికై బరువు లెత్తే యంత్రాన్ని (క్రేన్‌ను) ప్రయోగిస్తే అది అసాధ్యమౌతుంది. శాశ్వత సత్వప్రాప్తి విషయం కూడ సరిగ్గా అటువంటిదే. అందుచే అత్యంత సరళమైన శాశ్వత సత్వప్రాప్తికి చెప్పబడిన అస్తవ్యస్త విధానాలు, క్లిష్టపద్ధతుల వలన ప్రయోజనం నెరవేరదు. పోగా అవి సాధకుడిని తను స్వయంగా సృష్టించుకొన్న జటిల పాశాలలో జీవిత పర్యంతం ఇరుక్కొనేటట్లు చేసి బయటకు రాకుండా చేస్తాయి. వాస్తవానికి శాశ్వతసత్వప్రాప్తి అంటే నరాలు, కండరాలతో ఆటల పోటీకాదు. కఠోర తపో నియమాలు శోషణతో కూడి వున్న శారీరక యత్నమూ కాదు; అంతఃస్థితి తన యదార్థ స్వరూపానికి మార్పునొందడం మాత్రమే అది. దానినే సహజ మార్గం పరిగణనలోకి తీసుకుంటుంది. దానికి సంబంధించిన అనుచితమైన అనావశ్యక విషయాలను లక్ష్యం చేయదు. ఈ పద్ధతిలో చెప్పబడిన సాధనలు ధ్యానానికి కళ్ళు మూసుకోవడానికి సంబంధించిన లాంఛన ప్రాయమైన యాంత్రిక విధనాలు మాత్రమేకావు. వాటికొక స్పష్టమైన లక్ష్యం, ఉద్దేశం, అంతము ఉన్నాయి. దానిలో రెండంశాలు ఉన్నాయి. ఒకటి అభ్యాసం; రెండవది సాధన మార్గంలో చిక్కుల్ని, అవరోధాన్ని

తొలగిస్తూ ప్రాణాహుతి లేక యోగశక్తి ప్రసారం ద్వారా అభ్యాసి పురోగమనాన్ని త్వరితం చేసే గురు సహాయం. పూర్వపు సాధనా విధనాలలో తన ఆటంకాలను, అవరోధాన్ని తొలగించుకోడానికి అభ్యాసి మాత్రమే తీవ్రకృషి చేయవలసియుండగా, గురువు బాధ్యత అభ్యాసికి కొన్ని యాంత్రిక సాధనలను చేయమని చెప్పడంతోనే తీరిపోయేది. అయితే సహజమార్గంలో ఆవిధంగా జరుగదు. ఈ విషయంలో బాధ్యత ఎక్కువగా గురువుపైనే ఉంటుంది. ఆయన ప్రాణాహుతి ద్వారా తన శక్తిని ప్రయోగించి అభ్యాసి మనస్సు నుండి చిక్కుల్ని, అవరోధాల్ని తొలగిస్తారు.

అతి పురాతనమైన యీ ప్రాణాహుతి విధానం సర్వదా రాజయోగనికాధారమై యున్నది. కాని తరువాతి కాలంలో దాని అసలు మూలకారకులైన హిందువులకు దాదాపు లేకుండా పోయింది. చాలాకాలం మరుగున పడివున్న యీ విధానం యిప్పుడునా గురువర్యులు ఫతేఘడ్ వాస్తవ్యులైన సమర్థగురు మహాత్మా రామచంద్రజీ వారి అద్భుత ప్రయత్నాల వలన పునరుజ్జీవనాన్ని పొందే వెలుగులోకి వచ్చింది. ఈ విధానంలో గురువు తన అంతఃశ్శక్తులను ప్రయోగించి అభ్యాసిలో నిద్రాణమైవున్న శక్తులను క్రియాత్మకం అయేటట్లు జాగృతం కావించి, వేగపరచి ఆ దివ్య ప్రవాహధార అతడి హృదయం వైపుకు మరులుస్తాడు. అభ్యాసి చేయవలసిన పని ఒక్కటి మాత్రమే. మనస్సు, ఇంద్రియాలన్ని, సంపూర్ణ నియంత్రణలోను, క్రమశిక్షణలోను కలిగివున్న గురువు యొక్క శక్తితో తనని కలుపుకోవడం, అప్పుడు గురుశక్తి అభ్యాసి హృదయంలో ప్రవహించి అతడి మానసిక ప్రవృత్తులను క్రమబద్ధం కావిస్తుంది. కాని ఇది అనాదిగా వస్తున్న సాంప్రదాయ గురుశిష్య అనుబంధానికి వర్తించదు. మా సంస్థలో దీనిని సేవాత్యాగ భావంతో కూడిన సాధారణ సోదరత్వంగా తీసుకుంటాం. కాని అక్కడొక యిబ్బంది ఉంది. అద్భుత మహిమలను ప్రదర్శిస్తూ ఆకర్షించే వారియందు సామాన్యంగా ప్రజలు మోజుపడతారు. సాధనా ఫలితంగా యీ సామర్థ్యం దానంతటదే బయటపడినప్పటికి, అది యోగసిద్ధికి ఏవిధంగాను ప్రమాణం కాదు. అంతేకాక నిజమైన రాజయోగి దానిని ప్రదర్శించడానికి ఎన్నడూ యిష్టపడడు. అయితే మహిమలు రెండు రకాలు, ఒక రకం దైవస్వభావ పరమైనవి కాగా, ఇంకొక రకం భౌతిక స్వభావపరమైనవి. మొదటి వాటి ఉద్దేశం దైవ సంబంధమైనది కాగా రెండవ దాని ఉద్దేశం ప్రాపంచిక సంబంధమైనట్టిది. మొదటి రకపు మహిమలు సూక్ష్మవిధనాలు అనుసరించే వారిలో చైతన్యవంతమై మనం ఎదుర్కొంటున్న జీవిత సమస్యను పరిష్కారం చేస్తాయి. దీనికి విరుద్ధంగా స్థూల విధానాలను అనుసరించే వారిలో రెండవ రకపు మహిమలు బయటపడి హృదయానికి భారతరమౌతాయి. అయితే

యీ నీచ సిద్ధుల వ్యామోహంలో లీనమైన వాడు మొత్తం మీద చెప్పడానికి ఒక చిక్కుముడివలె అవుతాడు. దానితోపాటు తనలో ఒక సుడిగుండాన్నేర్పచుకొని మునిగిపోతాడు. ఆ శక్తిని యితరులపై ప్రయోగిస్తే వారు కూడా అదే సుడిగుండంలోకి లాగబడతారు. మన సంస్థయందు ఇంచుమించు ప్రతిఒక్కరు ఈ సామర్థ్యము కలిగివున్నారు. కాని గురువర్యులు మెళకువ దృష్టితో అతడు పెడత్రోవ పట్టకుండా వుండటానికి దానిని అదుపులో ఉంచుతారు. అతనికిది తెలియదు కూడ. కాని నిజమైన అవసరం వచ్చినప్పుడు అది అతని ద్వారా జరుగుతుంది. అందువలన ఆధ్యాత్మికంగా మన సహాయానికి, రక్షణకు అద్భుత మహత్యాల్ని ప్రదర్శించేవాడు, ఆసన ప్రణాయామాల అసాధారణ గారడీ కృత్యాలు చేసేవాడు, మాయ, జీవము, బ్రహ్మముల తత్త్వంపై పండితోపన్యాసాల్నిచ్చే వాడు కాక, తన అంతః శక్తిచే సాధన సమస్యలను పరిష్కరించి, మార్గంలోని అవరోధాల్ని తొలగించి మనకు సహాయపడేవాడు మనకు గురువుగా వుండటం అవసరం. మీలో శాంతి నిశ్చలతా భావాల్ని వృద్ధిచేసి, తన ప్రభావంచే మనస్సులోని నిర్విరామతను సద్దుమణచగల వాని సాంగత్యం అదృష్టవశాన్న లభ్యమైతే అతడు ఇంద్రియాల పరిధికతీతుడని, తన అంతఃశ్శక్తులను ప్రయోగించి మీ జీవిత సమస్యను పరిష్కరించడంలో సహాయం చేయుటకు అర్హుడని తెలుసుకోవాలి. భక్తి ప్రేమలతో అతనితో సంబందమేర్పరచుకుంటే మీ స్వభావం కూడ ఆవిధంగానే రూపొందుతుంది.

మన సంస్థలో అనుసరించే అభ్యాసక్రమం హృదయంపై ధ్యానం చేయుట. ఇదే సాధన పతంజలిచే గూడా చెప్పబడింది. ఈ విధానం యొక్క మౌలిక సూత్రం "రాజయోగ ప్రభావం"లో యిదివరకే చర్చించబడింది. దానిని మరల యిక్కడ చర్చించదలచుకోలేదు. మనలోని స్థూల్యాన్ని బయటకు తోసి మహా సూక్ష్మస్థితిని పొందుటకు యీ విధానం ఎంతగానో తోడ్పడుతుంది. దైవం సంపూర్ణ స్థూలరహితుడని మనకు తెలుసును. కావున ఈశ్వరప్రాప్తి అంటే అటువంటి సూక్ష్మత్వ స్థితిని సాధ్యమైన చిట్టచివరి అవధివరకు పొందుట అని అర్థం. సహజమార్గంలో మన లక్ష్యమదే. ఆవరణల రూపంలో స్థిరపడిన స్థూల్యత నుండి విముక్తి పొందడానికీ విధానం సహాయపడుతుంది.

సహజమార్గ విధానం పరతత్వానికి మిక్కిలి సన్నిహితంగా వుండే అతి సూక్ష్మపద్ధతి. అందుచేతనే అదెంతో సరళం అయినప్పటికీ సామాన్యులు దాని నర్థంచేసికొనలేరు. దివ్యజ్యోతి ఉన్నదనే భావంతో హృదయంపై ధ్యానం చేయమని అది నిర్దేశిస్తుంది. కాని జ్యోతినే రూపంలోను చూడ్డానికి ప్రయత్నించవలదని ఆదేశిస్తుంది కూడ. అయినప్పటికీ అతడా విధంగా చేస్తే విధివశాన్న జ్యోతి కనబడవచ్చు. అప్పుడది మానసిక కలే గాని

నిజమైనది కాదు. అభ్యాసి దానిని కేవలం ఒక భావనా రూపంగా తీసుకోవాలి. అటువంటప్పుడది అత్యంత సూక్ష్మంగా ఉంటుంది. ఆ విధంగా మనం అత్యంత సూక్ష్మమైన దానిపైనే ధ్యానం చేస్తాం. ప్రతి మహాత్ముడు దానిని జ్యోతిగానే వర్ణించాడు. దానికి బాగా సరిపడే పదమదొక్కటే, కావున నేను కూడా దానిని ప్రయోగించక తప్పలేదు. కాని అది కొన్ని చిక్కు సమస్యలన్ని సృష్టిస్తుంది. జ్యోతి అనగానే ప్రముఖంగా కాంతి భావం కలుగుతుంది. దానిని ప్రకాశవంతంగా మెరిసే వస్తువుగ తీసుకుంటాం. అసలైన దివ్యజ్యోతిని ఆ భావంలో తీసుకోకూడదు. దానిని ''కాంతి లేని జ్యోతి'' అని వర్ణించవచ్చు. అసలైన వస్తువు కిది వర్తిస్తుంది. ఇంకా సరిగ్గా చెప్పాలంటే అది చీకటి వెలుగుల కతీతమైన వస్తువు.

మన సాధనా విధానంలో కూడా అభ్యాసి అప్పుడప్పుడు కాంతిని దర్శిస్తాడు. కాని మొదట్లో పదార్థం శక్తితో సంయోగం చెందినప్పుడు మాత్రమే అది సంభవిస్తుంది. అనగా శక్తి పనిచేయడం ప్రారంభించిందనడానికి అది సూచన. ఇదేకాక కాంతి మన గమ్యం కాదు. కాంతి దర్శనం లోపలైనప్పటికి, వెలుపలైన్పటికి శాశ్వతసత్వప్రాప్తి సిద్ధించిందనడానికి అది సూచన కాదు.

సహజమార్గ పద్ధతి కేంద్రంలోను, ఉపకేంద్రాల్లోను నిద్రాణంగా ఉన్న శక్తులను మేల్కొలుపుతుంది. అవి సక్రమంగా పనిచేసేటట్లు చేస్తుంది. ఉన్నత కేంద్రాలు జాగృతమైతే వాటి ప్రభావం నిమ్నకేంద్రాలపై పడుతుంది. అవి దివ్యత్వంతో సంయోగం చెందినపుడు నిమ్న కేంద్రాలు వాటిలో లయమౌతాయి. ఆవిధంగా పై కేంద్రాలు కింది వాటిని ఆధీనంలోకి తీసుకొంటాయి. కింది కేంద్రాలు కూడా వాటిపై స్థిరపడి ఉన్న స్థూల ప్రభావాల నుండి విముక్తి పొందుటకు క్షాళన కావింపబడతాయి. అది మాత్రమే అత్యున్నత ఫలితాన్ని తీసుకొని రాగల సరైన అత్యున్నత సహజవిధానం.

ముఖ్యంగా నేనెంతో ప్రత్యేకంగా చెప్పాల్సిన విషయం ఒకటుంది. లక్ష్యప్రాప్తికి అభ్యాసి నిర్విరామతతో కూడిన ఆతృత, వేదనతో కూడిన తపనలకు సమానమైన తీవ్ర ఆకాంక్షను అలవర్చుకోవాలి. సులభంగా విజయాన్ని సాధించడానికి ఈ వేదన లేక నిర్విరామత భావాన్ని పెంచుకోవాలి. వేదన, అస్తిమితత్వాల కోసం కాక, శాంతి నిశ్చలతను సాధించడానికే ఈ ఆధ్యాత్మిక రంగంలో అడుగెట్టామని ఎవరైనా చెప్పవచ్చని నా భయం. వారి దృష్టిలో అది సరైనదే కావచ్చు. కాని నా దృష్టిలో మొదటివైన వేదన, అస్తిమితత్వాలు దివ్యత్వాన్ని పొందగోరే వారికి అవసరం కాగా తరువాతవైన శాంతి నిశ్చలతలు మైక పారవశ్యాన్ననుభవించగోరే వారికి చెందుతాయి. ఈ తరువాతి దానిని సాధించడం ఏమంత

కష్టంకాదు. కాని మొదటి దానిని పొందడం పసిపిల్లలాటవంటి సులభకార్యం కాదు. అనేకులు శాంతి స్థితిని రుచి చూసివుండవచ్చును. ఇప్పుడు మనం మొదటి దానిని రుచి చూద్దాం. ఆ స్థితి రవ్వంత మాత్రమే అయినప్పటికీ దానికి వేలాది శాంతి నిశ్చలతా స్థితుల్ని వదలుకోడానికి సిద్ధపడవచ్చు. వాస్తవానికి అసాధారణ మహా పురుషులు ఈ ప్రపంచంలో అవతరించడానికి కావలసిన నిర్మాణ కార్యక్రమానికంతటికి ఇది పునాది. నిజమైన ప్రశాంతత యొక్క అసలు స్థితి మనం అర్థం చేసుకొనే శక్తి కతీతం. అక్కడ ఎటువంటి వైరుధ్యాలకు తావులేదు. యదార్థానికి అది ప్రశాంతతకాదు, నిర్విరామత కాదు, సంయోగం కాదు, వియోగం కాదు, ఆనందం కాదు. దానికి విరుద్ధమైంది కాదు. మన వేదనంతా దానికోసమే పెంచుకున్నాం. మీరందరూ ఆ బాధ చవి చూచెదరు గాక! అలవర్చుకోవడాని కదేమంత కష్టంకాదు. దానికి కావలసినదంతా దృఢసంకల్పం, దానిపై తదేక దృష్టి, అప్పుడు నీ వన్వేషిస్తున్న వస్తువు నీకు మరీ సమీపంగా ఉన్నట్లు తెలుస్తుంది. అదేకాదు! నీవన్వేషిస్తున్న వస్తువు నువ్వే అవుతావు. దానికి మార్గంలో అనావశ్యకాలైన కలుపు మొక్కల్ని, పొదలను దగ్ధం చేయగల దహించివేసే హృదయం కావాలి.

# ఈశ్వర ప్రాప్తికి అత్యంత సులభ మార్గం

మానవాళిపై నాకున్న ప్రగాఢానురాగాలను పురస్కరించుకొని నా హృదయ భావాల్ని వెల్లడిస్తున్నాను. నా సహజీవులు నా అస్తిత్వంలో అంతర్భాగాలువంటి వారు, ఇది వారి హృదయాల్లోకి పొంగి ప్రవిస్తూ, ప్రతి హృదయాన్ని శాంతి ఆనందాల వెల్లువతో నింపాలి. ఎక్కడెక్కడో వున్న మీ అందరితోనూ నాకు హృదయానుబంధం వుంది. అది మీ హృదయాలలో కాల క్రమేణా సహజమార్పు వచ్చుటకై నిశ్శబ్దం నుండి స్పందననిస్తూ ఉంటుంది. కాని ప్రతి జీవాత్మ పరతత్త్వ ప్రాప్తికై తన ఆధ్యాత్మికావసరాలను గమనించాలి.

మనము ఏదో ఒక రూపంలో పారమార్థిక భావం నిరంతరం ప్రవహిస్తూనే వున్న దేశమునకు చెందిన వారము. లక్ష్యమును పొందడానికి అనేక విభిన్న పద్ధతులనుసరింప బడుతున్నాము. అసలైన ఆ జీవితత్త్వంలో లీనం కావడానికి, హృదయం నిజంగా గమ్యంతో కలుస్తే, ఆ పద్ధతులు సరైనవి కావచ్చు. మనం ఏ సత్‌తత్వం నుండి బయటకు వచ్చామో, అదే దానితో సంయోగం పొందడానికి జన్మించాం. ఆ అనంతత్వ సారాన్నే మనతో తెచ్చుకున్నాము. అనంతత్వలో విలీనం కావాలనే మన భావనకు స్వేచ్ఛ కలిగేటట్లు, దానికి సన్నిహితంగా ఉండటానికి మనం ప్రయత్నం చేయాలి. దానిని నిర్లక్ష్యం చేస్తే అన్నింటికి మూలమైన ఆ అనంతమైన సత్‌తత్వానికి కాక, భావనా వ్యాపకానికే బద్ధులమౌతాం. అసలైన యదార్థసారాన్ని గ్రహించినప్పుడు మనంచేసే ప్రార్థనా సంకీర్తనలు పొగడ్తలే అవుతాయి.

మహా గురువులు మహోన్నత స్థితిని ప్రవేశించడానికి గల సాధనోపాయాల్ని గురించి సదా తీవ్రంగా యోచిస్తూనే ఉన్నారు. కాని పరిష్కారం వారికి సమీపంగానే ఉంది. వాస్తవానికి నీ కతిసమీపంగా ఉన్న మార్గమే దైవానికి కూడ అతి సమీప మార్గం అవుతుంది. నా పూజ్య గురువర్యులు ఫతేఘడ్ నందలి సమర్థ గురు మహాత్మా శ్రీరామచంద్రజీ మహరాజ్ ఈ విషయంలో మానవాళికి అద్భుత సేవ చేసారు. జీవిత లక్ష్య ప్రాప్తికి అత్యంత సులభ సాధనను అందించారు. ఆయన పద్ధతులు ఎంతో సులభమైనవి. వాటి సౌలభ్యమే సామాన్యుల అవగాహనకు అడ్డుతెరగా అయింది. అత్యంత సూక్ష్మమైన శాశ్వత సత్య ప్రాప్తికి కావలసినవి సూక్ష్మ, సరళ పద్ధతులే. శాశ్వతసత్య ప్రాప్తి చాలా చిక్కులతో కూడిన కష్టకార్యంగా చెబుతారు. ఇది ప్రజలకెంతో నిరుత్సాహాన్ని కలిగిస్తుంది. అందువలన వారు అదంటే భయపడి పారిపోతారు. అటువంటి భావాలను మనస్సు

నుండి బహిష్కరించాలి. దానికి కారణం అవి మన సంకల్పాన్ని బలహీన పరుస్తాయి. ఆ సంకల్పమే మన ఆధ్యాత్మిక ప్రగతి పథానికి సహాయపడే సాధనం.

నాస్వానుభవం ఆధారంగా నేనొక సరళమైన పద్ధతిని సూచిస్తాను. దానికి అందరూ మిక్కిలి సులభంగా అనుసరించవచ్చు. ఆ దివ్య ప్రభువుకు తన హృదయాన్ని విక్రయించ గలిగితే లేక కానుకగా యీయ గలిగితే మరి చేయవలసినది యింకేమీ ఉండదు. ఇది అతడా అనంత సత్‌తత్వలో సహజంగా విలీనమయ్యే స్థితికి తీసుకు వస్తుంది. సులభమైన ఈ సరళ విధాన అనుసరణ ఆ పద్ధతి యొక్క ఆద్యంతాలను ఏకం కావిస్తుంది. ప్రేరణ దానంతటదే లోనికి ప్రవహించి, మనిషి పూర్తి స్వరూపాన్నే మార్చివేస్తుంది. పరమ ప్రియమైన జీవిత లక్ష్యప్రాప్తికి చిన్న హృదయం తప్ప సముచితమైన కానుక వేరే ఏముటుంది ?

ఇంకొక విషయం కూడా ఉంది. ఆత్మ సమర్పణ అతి సులభంగా సఫలం కావాలంటే సంకల్ప క్రియ మాత్రమే అవసరం. సంకల్పం ఎంత సున్నితం, సరళం అవుతే దాని పని కూడా అంత సాఫల్యం అవుతంది. చేతన స్థితి యొక్క లోలోని అంతరాంతరాలలో సంకల్పం విత్తన రూపంలో అల్ప పరిమాణంలో ఉంటుంది. అది త్వరలోనే మహావృక్షంగా ఎదిగి తన కొమ్మలను ఎల్లెడలా విస్తరింప చేస్తుంది.

చివరగా, ఈ పద్ధతి అనుసరణ మొదటి దినం నుండే వైరాగ్య భావాన్ని నిశ్చయంగా కలిగిస్తుంది. అందుకు కావలసినది సాహసోపేతమైన ప్రయత్నారంభం. సత్యాన్వేషకుడు వాస్తవాన్ని తెలుసుకొని తన అంతరాత్మ పిలుపునందుకోడానికి చైతన్యవంతుడగు గాక !

జీవులెల్లరు యదార్థమైన ఆ జీవితానికి ఆత్మ చైతన్యం పొందాలని ప్రార్థిస్తూ ముగిస్తున్నాను.

# సహజమార్గ ప్రభావం

శాశ్వతసత్వ ప్రాప్తి, విముక్తికై ఆతృతతో కాంక్షించేవారు మనలో అనేకులున్నారు. అది తమ కర్తవ్యంగా భావిస్తారు. కర్తవ్యం అనగానే ఒక విధమైన హద్దు వలయంగా ఏర్పడి దానిలోనే ఉంటాం. ఆ హద్దేమై యుండవచ్చు? అది కేవలం వివేచన, విజ్ఞతల సంకుచిత పరిధి. మన ప్రస్తుత స్థితి పరిమితత్వానికి సంబంధించినది. దాని నుండి బయటపడలేకున్నాము. అక్కడ నుండే విశాల దృశ్యాలను చూడవచ్చు, అనగా పరతత్వ దర్శనం అని నా భావం. కాని అది మనముపయోగించే సాధనా పద్ధతులపై ముఖ్యంగా ఆధారపడి ఉంటుంది. విధివశాన్న మన పరిమితులను, బంధములను వృద్ధిచేసే సాధనల పాలపడితే ఆ పరతత్వ దర్శనానికి మనం నిశ్చయంగా దూరమవుతాం. కొందరు వ్యక్తుల స్వభావానికనువయ్యే పద్ధతులుండవచ్చు. కాని అవి మూలంలోనే లోప భూయిష్టమై, ఇతర విధాల కూడ వ్యర్థములై, పసిపిల్లవానికి తాత్కాలిక ఉపశాంతిని కలిగించుటకు సేకరించే ఆటబొమ్మ వంటివి. అవి మరింత భోగ సౌఖ్యాను భూతికోసం సాధకుడిని ఎక్కువ కామ ప్రలోభాలకు లోనయేటట్లు చేస్తుంది. బహుశః ఆనంద మార్గంలో అతనికి ప్రోత్సాహం కలిగించే ఆకర్షణ అదే. కాని దాని ఆకర్షణకులోబడి వున్నంతవరకు, అని పురోభివృద్ధి ఆగిపోతుంది. అతనిని నూతిలోని కప్పతో పోల్చవచ్చును. అది తన సంకుచిత రంగాన్ని విశాల విశ్వంగా భావిస్తుంది. కాని ప్రస్తుతం ఉన్న మన స్థితి ఆ బ్రహ్మానంద స్థితి యొక్క అనంత స్వరూప ప్రజ్ఞని మనలో కలిగిస్తే అనంతమైన మండలంలోకి యింకా ముందుకు పోవాలనే భావాన్ని మేల్కొలుపుతుంది. అందువల్లనే వీసమెత్తు విజ్ఞానానికి కనీసం పదిరెట్లయినా వివేకం కావాల్సి ఉంటుందంటారు. ఆ మాత్రం వివేకం వుంటే, గమ్యం తప్పక మన దృష్టిలో వుండి, ఆ సత్‌తత్వ మండలంలోకి మరింత ముందుకు పోవాలనిపిస్తుంది. మన తెలవి తేటలే మన ఆధ్యాత్మిక ప్రగతికి అవరోధాలవుతాయి. అక్కడొక యిబ్బంది ఉత్పన్నం అవుతుంది. అటువంటప్పుడు మనస్సులో స్వతంత్ర బావం కనీసం తలెత్తదు. అదే నిజానికి మన విషాద గాధ. అట్టి వ్యక్తులు భావనల బారి నుండి తమను కాపాడుకోలేరు. ఆ భావనలు వారి యోచనాశక్తికి, సాధనా భావానికి అడ్డు తెరలను ఒకదాని తరువాత మరొకటిని చేరుస్తాయి. వారు కచ్చితంగా తామనుకొన్న పద్ధతుల్లోనే రూపొందుతారు. ఆ ఉచ్చుల నుండి బయటపడే మార్గాన్ని సూచించినప్పటికీ వారెన్నడూ లక్ష్యపెట్టరు.

మొదట ఏ వస్తువుతో ప్రారంభించామో అదే మన ప్రగతి మార్గానికి ఆటంకమౌతుంది. మనం చివరకు చేరవలసినది ఆ అనంతత్వం కావున మనిషి ఆత్మవికాసానికి ప్రామాణిక గుర్తు వుండడం కష్టం. అయినప్పటికీ ఏదోవిధంగా మానవుడి అంతిమ గమ్యాన్ని దృష్టిలో పెట్టుకోగలిగితే ప్రారంభంలో మనం దేనినైతే చేపట్టామో అదే మార్గాన్న మనల్ని నడిపిస్తుంది. దైవమే మనకా నిజమైన నిరాకార నిర్గుణ బ్రహ్మ దర్శనాన్ని కలిగించే గురవును ప్రసాదిస్తాడు. దీనికి విరుద్ధంగా అసలైన ఆ సత్‌తత్వాన్ని గురించిన అవగాహన మనకు లేకపోతే దానికోసం చేపట్టే మన సాధనా పద్ధతులే ముందు ప్రగతికి ప్రతి బంధకాలవుతాయి. అందువల్లనే విజయం నిశ్చయంగా కలగడానికి అవసరమయ్యే ఒకే వస్తువు. లక్ష్య సిద్ధి కొరకు తీవ్ర నిర్విరామత. అదే అసలైన గురువును మీ ద్వారం వద్దకు తీసుకు వస్తుంది.

సత్‌తత్వములోనికి కనీసం తొంగిచూసి దర్శించగోరే వారికి హృదయాంతర్భాగాన్ని స్పృశించే పద్ధతే సరైనదని నా అభిప్రాయం. సాధారణంగా దానికవలంబించే బాహ్య విధానాలు నిజానికి నిరుపయోగాలు. అవి గమ్యానికి దారి చూపవు.

సరైన పద్ధతుల్ని తెలిసికొనాలంటే సృష్టి నిర్మాణమంతటికి మూలకారణాన్ని పరిగణించాలి. నిశ్చయంగా దానికొరకు పనిచేసిన శక్తి ఏదో ఉంది. అదేమిటి? అదే సృష్టి, స్థితి, లయ భావాలతో నిండిన 'సంకల్పం'. అదే సంకల్పం మానవులోనికి దిగివచ్చిన అతడి అంతర్భాగమైంది. మనలోవున్న ఈ శక్తిని సక్రమంగా వినియోగిస్తే రహస్యం నివృత్తి అవుతుంది. సంకల్పానికి అదే శక్తి ఉంది. మనం పెరుగుతున్న కొలది అది శక్తివంతమై మన అస్తిత్వపు విభిన్న మండలాల్ని, ప్రదేశాల్ని ఆవహిస్తుంది. గమ్యం వైపుకు మనం ప్రయాణం చేసేటప్పుడు వాటి గుండా పోవలసి వస్తుంది. వాటినే మనం బంధాలని అంటాము. అవి అడ్డుతెరలై సత్‌తత్వంలోనికి మనల్ని తొంగి చూడనీయవు కూడా. మనకు సహాయం చేయడానికి మహాత్ముడైన సమర్థ గురువు లభించినప్పుడు మాత్రమే వాటిని ఛేదించుకొని పరతత్వానికి మన మార్గాన్ని సులభం, సుగమం కావించుకుంటాం. మొదటి దశలలో మన పురోగమనాన్ని అడ్డే గ్రంథులు, కేంద్రాలు, ఉపకేంద్రాలు వున్నాయి. సత్‌తత్వ అన్వేషణలో వీటిగుండానే మనం పోవాల్సి ఉంది. మన ఆలోచనా సరళి, అభ్యాసం తప్పుగా ఉంటే వాటి ఫలితంగా చిక్కులు కూడా ఉత్పన్నమౌతాయి. వాటిని నిర్మలీకరణ పద్ధతి ద్వారా తొలగించుకోవాలి.

స్థూలంగా చెప్పాలంటే, అందువల్లనే గమ్యం వరకు గల దూరాన్నంతటినీ స్వయంగా పయనించి, తనలో దివ్యశక్తిని వికసింప జేసికొన్న గురువు సహాయం అపారమైన విలువకలిగినట్టిది. అప్పుడు మాత్రమే దివ్య కేంద్రాల నుండి ఆదైవశక్తి అభ్యాసిలోకి

ప్రవహించడం మొదలెడుతుంది. ఈ సూక్ష్మ శక్తి మిక్కిలి బలమైనట్టిది. ఎంతనగా, ఉన్నత స్థితులలో అభ్యాసి పైకి పోవుటకు ప్రయత్నించినప్పటికి ఆ శక్తి బలప్రవాహ ఫలితంగా అతడు క్రిందికి తోసివేయబడును. అటువంటి సందర్భంలో గురువు యొక్క మహత్తర శక్తి మాత్రమే అతనిని ప్రవాహం నుండి పైకిలాగి, సత్‌తత్వ దర్శనాన్ని కలిగిస్తుంది.

కాని అభ్యాసికి కూడా అవసరమైనది కొంత ఉంది. ప్రప్రథమంగా అతడు గురువపై సంపూర్ణ విశ్వాసం కలిగివుండి ప్రతి విషయంలోనూ ఆయనతో పూర్తిగా సహకరించాలి. అట్లయితే అతడు నిశ్చయంగా దిన దినాభివృద్ధి చెందుతూ తనలో వచ్చు మార్పును, పరిణామాన్ని గుర్తిస్తాడు. మేల్కొన్న అతడి నిమ్నప్రజ్ఞా స్థితి మార్పును పొంది, మహోన్నత ప్రజ్ఞాస్థితుల ద్వారా అతని ప్రయాణం మొదలవుతుంది. సాధారణంగా ప్రజ్ఞాస్థితికి మూడు స్థాయిలున్నట్లుగా చెప్పబడుతోంది. అవి చేతన, అంతశ్చేతన, అధిచేతన, అవి స్థూల విభజనలు మాత్రమే. ప్రతిదానిలో యింకా లెక్కింప శక్యంకాని స్థాయిలున్నాయి. నిమ్న స్థితిలో ఉన్న చైతన్య ప్రజ్ఞా కార్యకలాపాల ప్రభావం అంతశ్చేతన మనస్సుపై స్థిరపడి విధిగతిని నిర్ణయిస్తుంది. అందుచేతనే మనం చేయవలసిన మొదటి పని నిమ్నస్థాయిలో ఉన్న చైతన్య ప్రజ్ఞను సరైన ఆలోచనా భ్యాసాలచే సరిదిద్దుకొనడం. దాని కారణంగా అది అంతశ్చేతన మనస్సును తేజోమయ స్థితికి తీసుకువచ్చే శక్తిగా మారుతుంది. ఇది మనల్ని అధిచేతనాస్థితికి కొనివస్తుంది. అధిచేతనా స్థితి అనే పదాన్ని అధి అంతశ్చేతన ప్రజ్ఞా స్థితిగా మారిస్తే యిటుపై దాని ప్రభావాలను అర్థం చేసికోవడం మరింత సులభం అవుతుందని భావిస్తారు. ఏదో విధంగా గురు కృపచే మనకాస్థితి వస్తే, మరొక విషయం బహిర్గతం అవుతుంది. దానికన్నా మహోన్నత అంశాలు మన దృష్టికి వచ్చుటకు దానిలో ఒక విధంగా లయం అవుతాము. ''మహోన్నతం'' అనే పదం సూక్ష్మం కావింపబడిన దాని స్థితికి మాత్రమే వర్తిస్తుంది. ఈ సందర్భంగా గుర్తించిన ఆధ్యాత్మిక ప్రదేశములు, మండలాలకు ఇది అదే భావంలో ప్రయోగించబడింది. సంగ్రహంగా, విభిన్న చేతనాస్థితులు ఒకదాని వెంబడి మరొకటి మనల్ని త్రిమూర్తితత్వానికి అతీతంగా సత్వమున కతీతంగా కూడా తీసుకెడతాయి. అప్పుడు విముక్తి స్థితి ప్రారంభం అవుతుంది. కాని అధిక శ్రమతో కూడిన ప్రయాణం తర్వాతనే అది ప్రారంభం అవుతుంది. విముక్తి స్థితి ఉదయించగానే ప్రయాణపు అలసట అంతమవుతుంది. దాని భారం మనకిబ్బందికరంగా ఉన్నట్లనిపించదు.

కాని మన ప్రయాణమింకా పూర్తి కాలేదు. మనమింకా అక్కడ శాశ్వత సత్వప్రాప్తి దాని మూల రూపాన్ని పొందు మూలం (Base) వైపుకు పయనిస్తాం. వర్ణమయి దృశ్యాలంతమై, వెంటనే పరబ్రహ్మం దాని యదార్థ స్వరూపంలో దర్శనమిస్తుంది. కాని

ప్రయాణం యింకా అంతం కాలేదు. వివరింప శక్యం కానిదేదో యింకా అక్కడ ఉంది. విముక్తి భావం కూడా అక్కడ ఉంది. మన ప్రయాణం అంతమై ఉండేది కాని అక్కడ ఉన్నంతవరకు, అదింకా ఒక బంధమే అవుతుంది. అక్కడ మనల్ని ముందకు తీసుకుపోయేది దైవ సహాయం ఒక్కటే, కాని అది సంపూర్ణంగా మనం విస్మృతి (మైమరచిన) స్థితిలో ఉన్నప్పుడు మాత్రమే. నేనందుచేతనే ప్రజలను తమను తాము తెలుసుకోవడానికి బదులుగా, తమను తాము మర్చిపోవాలని ప్రోత్సహిస్తాను.

నిజమైన భక్తుడు ప్రభువైన ఆ భగవంతుని కృపానుగ్రహాలను ఆస్వాదిస్తూ ఆయన యిచ్ఛకు తనను సంపూర్ణంగా అర్పించుకుంటాడు. వాస్తవానికి అదే ఆత్మ సమర్పణ స్థితి. ప్రభువుకు ఆయన భక్తునికి ఉన్న సంబంధం అదే. తుదకు అత్యున్నతమైన అధిచేతన మనల్ని తీసుకొని వచ్చిన సంబంధం అదేకావున దానిని చివరి వరకు నిలుపుకోవాలి. ఇక్కడ మాత్రమే మన ఆత్మ యదార్థ స్వరూపం వెల్లడవుతుంది. విముక్తి భావం ఇంకా వదలనట్లయితే లేక ఏదోవిధంగా అదింకా ఉందనే భావం అతనికి ఉంటే, అతడు బంధాలనుండి స్వేచ్ఛను పొందనట్లే. విముక్తిని గురించిన ఎరుక కూడా పోయినప్పుడు, ఆశ్చర్య సంభ్రమంలో తననితాను మర్చిపోతాడు. సత్‌తత్వం యొక్క భావం కూడ అక్కడుండదు. తాను అనంతత్వం కంటే వెనుకబడినట్లు అతనికనిపిస్తుంది. ఆ స్థితిని సంపూర్ణ విలయమని కాని, లేక అనంతతత్వం మనలోకి పూర్తిగా ప్రవహించిందని కాని చెప్పిన యింకా బాగుంటుంది. ప్రతీది విలయం అయినప్పుడు తానెక్కడున్నాడో అతనికే తెలియదు. బ్రహ్మన్‌లో విలీనం ప్రారంభమౌతుంది కాని మానవునికి ఉద్దేశింపబడ్డ ఆఖరి దశను పొందడానికి యింకా ముందుకు పోవుదుము.

సహజ మార్గంకాక మరే యితర సాధన గాని ఆరాధన గాని అటువంటి ఉన్నతస్థాయి ఫలితాలను, అతిస్వల్ప కాలమైన మానవ జీవితభాగంలోనే యీయజాలదని చెప్పుటకు నేను సాహసిస్తాను. సహజమార్గం ఉన్నది దాని కోసమే.

భాగము - V

# భిక్షకుని పాత్ర

"వాస్తవానికి సాధకుడు ఒక భిక్షకుడు, కాని అతడు ఆ పరమ దివ్య ప్రభువు ముంగిట మాత్రమే భిక్ష అడుగుతాడు. చేతిలో భిక్షాటన పాత్రను ఉంచుకొని అతడు ఆ ప్రభువు ముంగిట నిలుస్తాడు. కాని తాను దేనికొరకు అర్థిస్తున్నాడో దాని ఎరుక అతనికి ఉండదు. భిక్షకుడు, ప్రభువు యిద్దరు కూడ అక్కడ ఉన్నారు. వారి మధ్యన ఉన్న తేడా ఒక్కటి మాత్రమే. అది చేతిలోని భిక్షాటన పాత్ర. చివరకు అతడీ స్థితిని నిలుపు కుంటాడు."

# ఫకీరు సంపద

భౌతిక సంపదల విషయంలో ఒక మహాత్మునికి, బిచ్చగానికి బాహ్యంగా ఎటువంటి తేడా లేదు. అప్పుడు ఆ మహాత్మునికి ఉన్న సంపద ఏమిటి? వాస్తవానికి అతడొక బిక్షకుడు. కాని అతడు ఆ పరమ దివ్య ప్రభువు ముంగిట మాత్రమే బిచ్చమెత్తుకుంటాడు. చేతిలో భిక్షాటన పాత్రను ఉంచుకొని అతడు ఆ ప్రభువు ముంగిట నిలుస్తాడు. కాని తాను దేనికొరకు అర్థిస్తున్నాడో దాని ఎరుక అతడికి ఉండదు. అతడట్టి బిచ్చగాడు.

అతడి మానసిక స్థితిని గూర్చి యోచిద్దాం. ఆ ప్రభువు ఔదార్యం వితరణల నర్థించే ఉద్దేశంతో అతడాయన దరిచేరాడు. కాని అతడక్కడ ఒక మరచిన స్థితిలో లయమై ఉన్నాడు. తనపాత్రను నింపుకోవడానికి ఆయన వద్దకు వచ్చాను అనే విషయం కూడ గుర్తులేదు. భిక్షాటన పాత్రను ముందుకు చాస్తాడు. కాని భిక్ష నడుగడు. ఎంతగా అంటే తానెవరి ముందు నిలబడి ఉన్నాడో ఆ ఎరుక కూడా లేదు. ఆ ప్రదేశ వైభవాన్ని ప్రకాశవంతం చేయడానికి చివరకు కాంతి కణం కూడా అక్కడ ఉండదు. అట్టి ప్రదేశంలో పూర్తిగా మరచిన స్థితిలో అతడు పిచ్చిగా చొరబడ్డాడు. భిక్షాటన పాత్రను పట్టి ఉన్న చేతులను మాత్రమే ఎత్తి ఉంచాడు. అతడంత లయస్థితిలో ఉన్నాడు.

అటువంటి బిచ్చగాడు ఆ మహాప్రభువు యొక్క ఔదార్య వితరణలచే సంపన్నుడు కాగలడని మీరు భావిస్తారా? అటువంటి మహాప్రభువు నిజమైన అట్టి బిచ్చగాని నుండి దేనినైనా దాచి వుంచగలడా? నిశ్చయంగా కాదు. పరిస్థితి ఏమౌతుంది? ప్రభువు అతనికి ఏది యిచ్చినప్పటికి తను పొందే దాని ఎరుక కూడా వానికి వుండదు. ఇప్పుడు మారిన తన పరిస్థితి కూడా తెలిసికొనడు. భిక్షకుడు, ప్రభువు యిద్దరు కూడా అక్కడ ఉన్నారు. వారి మధ్య ఉన్న ఏతడా ఒక్కటి మాత్రమే. అదే భిక్షకుని చేతిలోని పాత్ర చివరివరకు అతడీ స్థితిని నిలుపుకుంటాడు. ప్రభువు నుండి అతనికి చేరని వస్తువేది ఉండదు. అప్పుడా భిక్షకుని స్థితి ఏమౌతుంది. అతడు శాశ్వతంగా సంతుష్టి పొందిన స్థితిలో నివసిస్తాడు. మమా చక్రవర్తులు సిరిసంపదలు కూడా దానికి సమానం కావు. ప్రభువు తన కున్నదంతా అనుగ్రహించాడు, భిక్షకుడు దానిని పొందాడు. మహా చక్రవర్తులు, ఉన్నత శ్రేణి మహాత్ములు దాని ముందు మోకరిల్లవలసిందే. సాధకుడు అటువంటి భిక్షకుడుగా అవ్వాలి. అతడికి దానితో పోలిస్తే ప్రతీది వ్యర్థంగా కనబడుతుంది.

భిక్షాటన పాత్రను, హృదయంగా తీసికుంటే యిది సులభంగా అర్థమౌతుంది.

# తేలికగా పయనించండి

రైల్వే శాఖ వారు తోటి ప్రయాణీకుల సౌకర్యార్థమై రైలు ప్రయాణీకులందరికీ “తేలికగా పయనించుము'' అని సామాన్యంగా సూచిస్తారు. సాక్షాత్కార మార్గంలో ప్రయాణం చేసేవారికి కూడా యిదే వర్తిస్తుంది. సంస్కారములు, మొదలైన వాని రూపంలో ఉన్న సామాగ్రి భారంతో కృంగిపోతూ, మార్గాన్న పయనిస్తున్నామని మనకు తెలుసు. మన ప్రయాణం సౌకర్యకరంగా ఉండాలంటే ఆ భారం నుండి విముక్తులం కావాలి. అది రెండు విధాలుగా నెరవేరుతుంది. మొదటిగా రైలు ప్రయాణంలో బరువు సామాగ్రి నేవిధంగా రైలు గార్డుకు అప్పగిస్తామో అదేవిధంగా ఈ ప్రయాణంలో గూడా బరువు సామాగ్రిని గురువు ఆధీనానికి అప్పగించి దాని భారం నుండి విముక్తి పొందాలి. వేరే మాటల్లో అది శరణాగతి భావాన్ని తెలియజేస్తుంది. మన సామాగ్రినంతటిని గురువుకు అర్పించినప్పుడు, వాటి జంఝాటనా భారం నుండి స్వేచ్ఛను పొందుతాం. వేరొక పద్ధతి, వాటి భోగాన్ని కొద్ది కొద్దిగా అనుభవిస్తూ వదిలించుకుంటూ పోవాలి. కాని అది సుదీర్ఘమైన విసుగు పుట్టించే పద్ధతి. మిక్కిలి కష్టం కూడా. ఏదో విధంగా చివరకు మనం అతి తేలికగా అవ్వాలి. మీరందరూ ఈ విషయాన్ని పరిశీలించి, ఆ ప్రకారం నడచుకోవాలని నా కోరిక. కాలం తిరిగి ఎన్నడూ రాదు. అందుచే మనకు అధిక ప్రయోజనం కలిగేటట్లు దానిని వినియోగించుకోవాలి, సమర్థ గురుదేవుని నిజమైన అనుచరునిగా స్వల్ప సహాయం, శుభాకాంక్షలు తప్ప యివ్వడానికి మరేది నాకు లేదు. ఎవ్వరినీ తమ ప్రాపంచిక సముపార్జితాలను వదలి, సంసార జీవితాన్ని వర్జించాలని నేను చెప్పను. కాని ప్రతి దానిని ప్రభువుచే తనకప్పగింపబడిన బాధ్యతగా తీసుకొని జాగ్రత్త వహించాలి. వాస్తవానికి అదే నిజమైన జీవితం, ఐహిక ఆధ్యాత్మిక సమస్యలన్నిటికి అదే పరిష్కారం.

దాని కోసం ప్రతి క్కొరు తమ యావచ్ఛక్తిని వినియోగిస్తారని ఎదురు చూస్తున్నాను. నేను భౌతికంగా జీవించి ఉన్న కాలంలో మీరు సాధించి నేర్చిన సిద్ధులు నేనీ ప్రపంచాన్ని వీడిన తర్వాత కూడా మీకు ఉపయోగిస్తాయి. కాని యిప్పుడు దానిని అలక్ష్యం చేసి, నేనీ భౌతిక ప్రపంచాన్ని వదలి వెళ్ళిన తరువాత కూడా నా యందు అనురాగాన్ని పెంపొందించుకొని దానిని పొందగలమనే భావంలో మీరుంటే అప్పుడది మిక్కిలి దుర్లభం అవుతుంది. దీపం పురుగు మండే జ్వాలలో ఆత్మాహుతి చేసుకుంటుంది. కాని ఆరిన జ్వాలలో ఆత్మాహుతి చేసుకొనడం అరుదు, దాదాపు అసాధ్యం కూడ. ఈ విషయం కొందరికి వర్తించకపోవచ్చు. కాని అట్టి వారు నిజానికి చాలా అరుదు. కావున దానికి ఒకే ఒక పరిష్కారం ఆరిన జ్వాలలో ఆత్మాహుతిని సాధ్యం ఆచరణీయం అయిన విషయంగా చేసుకోవడం, లేదా ఎంత మాత్రం ఆహుతి అనే ప్రశ్న తలెత్తని మహోన్నత స్థితిని పొందడం. కాని యిది దైవ కృపపై, స్వీయ సాహస ప్రయత్నాలపైన ఆధారపడి ఉంటుంది.

# స్మరణ

శాశ్వత సత్వప్రాప్తి వైపుకు దృష్టిమళ్ళిస్తే అది చాలా సులభ సాధ్యం అని నేను వేరొక చోట చెప్పి ఉన్నాను. అనగా దాని ప్రభావం హృదయంపై గాఢ ముద్రవేయాలని. ఆ భావ ముద్ర ఎంత గాఢమైతే విజయం కూడా అంత శీఘ్రం, సులభం అవుతుంది. అంతచేసిన తరువాత యింక చేయవలసినది ఎక్కువగా ఏమీ ఉండదు. దీని ప్రభావాన్ని లోనికి తీసికోవడం అంటే సాధకుడు కాంక్షించే ఆ అసలు వస్తువును ఆస్వాదించడమే అవుతుంది. ఆ సందర్భంలో దివ్యాలోచన అతడి హృదయంలో సదా సజీవంగాయుండి అతని దృష్టి ఎల్లప్పుడు దానివైపే ఆకర్షింపబడుతుంది. సతత స్మరణ అర్థం సరిగ్గా యిదే. ఇప్పుడు ఈ ఆలోచన ఆ పరబ్రహ్మంలో లయమైనట్టి సహజీవి తలంపుతో కలిస్తే అది పరోక్షంగా ఆ పరబ్రహ్మంకు సంబంధిస్తుందో లేదో మీరే నిర్ణయించాలి. వాస్తవానికి అటువంటి సందర్భాలలో ఆ మనిషిని గురించిన భావం నామ మాత్రమే. ఈ ఆలోచనలో మీరెంత లోతుగా వెళ్ళితే అంత ఎక్కువగా సూక్ష్మ ఆవరణలు ఒక్కొక్కటిగా ఛేదింపబడతాయి. చివరకు అసలు మూలమైన ఆ ఒక్క ఆవరణ మాత్రమే అతడికి కనబడుతుంది. ఇప్పుడు ఆదిమూలం అతడి దృష్టిలో ఉంది కావున అతడికి నేరుగా దయాళు శక్తి ప్రాప్తిస్తుంది.

ఇప్పుడు ఆ అంతిమ స్థితి దృష్టిలో ఉన్నప్పుడు, దానినే తదేకంగా చూచుటవలన దాని నుండి ప్రసరించే అయస్కాంత శక్తి ప్రభావంచే చివరకు అతడి దర్శన శక్తి పూర్తిగా మూసుకుపోయి సత్ యొక్క మౌలిక లక్షణం అయిన స్థితి రహిత స్థితి స్థిరపడడం మొదలౌతుంది. ఈ కారణంగా తరతమ భావం వదలి, దాని స్థానంలో సమతా భావం ఏర్పడినప్పుడు మాత్రమే పరస్పర అనురాగం ఉంటుంది. కాని మీరింకా ముందుకు పోతున్న కొలది, సమతా భావం వృద్ధి అవుతూనే ఉంటుంది. ఆ ప్రభావంతో మీరు పూరింపబడతారు. ఆ భగవంతుని మహోన్నత భావం నేపథ్యంలో యుండి, ఇప్పుడు స్మరణ తప్ప మరేది యుండదు. స్మరణ ఫలితంగా సమతా భావం ఏర్పడి ఆ భగవంతుడే మన స్మరణలో లీనమై ఉన్నట్లు కనబడుతుంది. ఈ భావం శాశ్వతమై కబీరుదాసు “మేరా రామ్ ముఝే భజే తబ్ పాయున్ బిస్రామ్”గా వర్ణించినట్టి స్థితిని ప్రవేశ పెడుతుంది.

“నా ప్రభువు నా స్మరణలో నిమగ్నుడై వున్నప్పుడు మాత్రమే నా మనస్సుకు విశ్రాంతి లభిస్తుంది”.

ఇది పరభక్తి స్థితి. ఈ దశలో ప్రేమికుడే ప్రేయసిగా అవుతాడు. యదార్థమైన గురు శిష్యుల పరస్పర సంబంధ విషయంలో యిది అవస్యం నిజమౌతుంది. నిజానికి, స్మరణ, ఆదికాలంలో సృష్టి నిర్మాణ క్రమానికి ఏర్పడిన ప్రకంపనకు దాదాపు సరిపోలుతుంది. స్మరణ (ప్రకంప) యొక్క ఆది స్థితిలో లయం కావడం ప్రతివారికి సాధ్యమయ్యే పనికాదు. అరుదైన వ్యక్తి మాత్రమే దీనికి సమర్థుడు. కాని దానర్థం యితరులందుకు ప్రయత్నం చేయకూడదని కాదు.

నేను అది ప్రకంపనలను స్మరణగా వివరించడం మీకు ఆశ్చర్యాన్ని కలిగించవచ్చు. అది మొదట మనస్సులోకి వచ్చిన అతి సూక్ష్మభావం ఆ తరువాత యోచనగా మారుతుంది. కావున ఆవిధంగా సృష్టి నిర్మాణానికి అంతర్గర్భితంగా యున్న ఆ దివ్య సంకల్పం దానంతటదే ప్రకంపనలుగా ఏర్పడి ఆలోచనా రూపం దాలుస్తుంది. ఆలోచన, స్మరణ ఈ రెండింటి స్వభావాలు చాలా సన్నిహితంగా సరిపోలి ఉంటాయి. స్మరణలో ఒక విధమైన స్వల్ప ప్రేరేపణ యిమిడి ఉంది. అది ఆలోచనలో అంతర్గర్భిత స్థితిలో మాత్రమే వుంటుంది. ఆ ప్రేరేపణ శక్తి అధికమై దేహమంతట ప్రకంపనల్ని కదిలింపజేస్తుంది. ఈ ప్రేరేపణా కోశాన్ని దాటితే స్మరణ యొక్క మూల స్థానాన్ని చేరుతారు. దానినే మూలంగా భావించవచ్చు. ఆ స్థాయికి ఆవల ఉన్నదానిని వివరించడం సాధ్యం కాదు. బహుశః అది కొంతవరకు అత్యధిక సూక్ష్మస్థితి రూపంలో అనుభవంలోకి వస్తుంది. నా సహాధ్యాయులకు అట్టి సూక్ష్మత్వస్థితిని పొందు సామర్థ్యం అనుగ్రహింపబడాలని కోరుతున్నాను. అదే స్మరణ స్థితి ప్రకంపనలు వరుసగా ప్రతిదశలోనూ వస్తాయి. కాని సాంద్రత పరిమాణంలో తేడా ఉంటుంది. దీనిని వివరించడం మహా కష్టం.

"అహం బ్రహ్మాస్మి" స్థితి చాలా గొప్ప స్థితిగా చెప్పబడుతోంది. అది నానా విధాలైన భక్తులు ఎల్లప్పుడు నిరంతరం ఉదహరించే తార్కిక చర్చనీయాంశం. వీటిలో మొదటిది "నేనే బ్రహ్మము" అను భావము. రెండవది "సర్వ బ్రహ్మమే" అను భావం, మూడవది "సర్వం బ్రహ్మము నుండే" అను భావము. మొదటిది వ్యక్తిగత అస్తిత్వానికి (individuality) సంబంధించినది కాగా, మూడవది సర్వాంతర్యామిత్వానికి (universality) సంబంధించినది. రెండవది మధ్యంతర దశ మాత్రమే. చివరకు అది సర్వాంతర్యామిత్వానికి దారితీస్తుంది. జగతిలో ప్రసిద్ధులైన మహాత్ములలో అనేకులు మొదటి దశను దాటి పైకి వెళ్ళలేకుండిరి. అయినప్పటికీ భారతదేశ ఋషులలో అధిక సంఖ్యాకులు ఆ దశను దాటి సుదూరంగా వెళ్ళారు. ఈ స్థితులన్నీ ప్రతిబిందువు వద్ద ఉన్నాయి. అవి సూక్ష్మత్వ పరిమాణంలో మాత్రమే విభిన్నంగా ఉంటాయి. ప్రతి అభ్యాసికీ ఈ స్థితులన్నీ

అతడి ప్రగతి మార్గంలో అనుభవానికి వస్తాయి. కాని అవి అతడి ఎరుకకు రాకపోవచ్చు.

దైవం అతి నిష్కపటి, నిరాడంబరుడు అయివున్న ఏమీలేని నిరామయుడు. ఆయనకు ఘనత్వం అసలే ఉండదు. అందుచే ఆయనను పొందడానికి స్థూలత్వ, ఘనత్వాలను వదలించుకోవడం పూర్తిగా అవసరం. మన స్వతంత్ర ఆలోచనలు, కార్యకలాపాలు, పరిసారలచే ఘనత్వం ఏర్పడుతుంది. అందుచే మన ఆలోచనలు క్రమబద్ధం కావాలి. వ్యక్తిగత మనస్సు తనపై ఏర్పడిన భారాన్ని తొలగించుటకు సంపూర్ణ క్రమ శిక్షణను పొందాలి. మనం సాధ్యమైనంత వరకు తేలిక అవ్వాలి. అప్పుడు గురుదేవులు ఒకే ఒక శ్వాసవిడుపుతో మనల్ని సాధ్యమైనంత అత్యున్నత స్థితిలో విహరింపజేయగలరు.

మన సంస్థలో తొలి ప్రయత్నంలోనే అభ్యాసిలోనికి సత్‌తత్వం ప్రవేశపెట్ట బడుతుంది. ఆ తర్వాత అతడి పురోభివృద్ధికిది ఒక విత్తనంగా అవుతుంది. గురువర్యులు దానిని జాగ్రత్తగా కనిపెడుతూ ఉండడం వలన అది ప్రతికూల పరిస్థితుల ఉష్ణ తీవ్రతకు లోను కాకుండా వృద్ధి అవుతూనే ఉంటుంది. కాని మీ సతత స్మరణచే దానికి నీరు పోసి తడుపుతూ ఉండడం మీరు చేయవలసిన పని. ఆధ్యాత్మికతలో నిశ్చయంగా సత్వర అభివృద్ధినిచ్చే ఏకైక సాధనం అదే.

మన లక్ష్యాన్ని పొందేవరకు ఒక్కక్షణం కూడా విశ్రమించక, వేగంగా ముందుకు పోతూ వుండాలి. మనకు సరైన మార్గం దొరికినప్పుడు, దానినే దృఢంగా అంటిపెట్టుకోవాలి. ఎట్టి పరిస్థితులోలను దాని నుండి దూరం కాకూడదు. అన్నిరకాల స్థూల విధానాలను యాంత్రికమైన అభ్యాసాలను విసర్జించాలి. మనం దిన దినమూ తేలిక అవుతున్నామని గమనిస్తే అత్యంత సూక్ష్మం, తేలిక అయిన దానివైపుకు సక్రమంగా పురోగమిస్తున్నామని తెలుసుకోవాలి.

దయాళు శక్తి ఎడల మన మెన్నడు ఆశాభంగం చెందరాదు. దైవమే సర్వోత్కృష్ట ప్రభువు, ప్రతి విషయంలో ఆయన సంకల్పం నెరవేర వలసిందే. మనం సర్వాన్ని పోగొట్టుకొన్నవారుగా వుండి మన మార్గంలో సంభవించే ఆటంకాలను, ఆలజడులను లెక్కచేయక భక్తి, ఆరాధనతో సదా నిమగ్నమై ఉండాలి. అంతః కలతల వలన పూజను సక్రమంగా కొనసాగించలేకపోతున్నామనే భావంతో మనం ఎన్నడూ నిరుత్సాహపడకూడదు. వాటిని ''కుక్కల మొరుగు'' అని అంటాను. కుక్కల్ని బాగా కొట్టినప్పటికీ అవి మొరగడం మానవు. కుక్కలు మొరుగుతూనే ఉంటాయి, కాని ఏనుగు వాటిని లక్ష్యం చేయక ముందుకు నడుస్తూనే ఉంటుంది. సాధ్యమైతే మీ పూజకు అంతరాయం కలగకుండా ఉండటానికి, ఆ కుక్కలు మొరగకుండా ఉండేటట్లు శిక్షణ యివ్వడం యింకా మంచిది.

కాని దానికి వాటి దురలవాట్లను సరిదిద్దుటకు సరైన విధానాలను అనుసరించాలి. వాటి మొరుగును ఆపుటకు బలప్రయోగం చేస్తే అవి ప్రచండంగాను, హానికరంగాను ఎదురు తిరిగే ప్రమాదం ఉంది. అందుచే వాటి మొరుగు మనకు ఆటంకం కాదని చూపుట మంచిది. ఆ స్థితికి వచ్చినప్పుడు వాటి మొరుగు తుదకు సద్దుమణుగుతుంది. ఇంతేకాక, మనం ముందరే జాగ్రత్త వహించి ఉంటే అవి మొరగనే మొరగవు. క్లుప్తంగా చెప్పాలంటే మనం, అవి తమంతట తాముగా క్రమశిక్షణలోను అదుపులోను ఉండే విధంగా శిక్షణను యివ్వాలి. అందుకు ఒకటే మార్గం ఉంది. మన మనస్సు యొక్క అంతర స్థితి ప్రభావం వాటిపై కూడ పడేస్థాయికి మనం ఎదగాలి. అంటే మృగాలు కూడా ప్రభావితం అయ్యేటంత స్థాయి వరకు ఆధ్యాత్మిక ఔన్నత్యం ఉండాలి. ధ్యానాభ్యాసం వలన చివరకు నెరవేరే అసలు ప్రయోజనం యిదే.

కుక్కల మొరుగు మనస్సు, ఇంద్రియాల విశృంఖల కార్యకలాపాలకు అన్వయిస్తుంది. ధ్యానం చేతను, స్మరణచేతను అవి సులభంగా క్రమబద్ధం కావింపబడతాయి.

# ఆనందం

సాధారణంగా మనస్సుకు రెండు లక్షణాలున్నాయి, ఒకటి ఐహికం లేక అనేకత్వానికి దారి తీస్తుంది. వేరొకటి పరతత్వం లేక ఏకత్వానికి దారి తీస్తుంది. వాటియందు సరైన సమన్వయం వుండాలి. రెండిటిలో ఏ ఒక్కదానిపై కూడా అధిక ఆసక్తి చూపిస్తే అది లోపమే అవుతుంది. సాధారణ ఐహిక జీవికి, నిజమైన మహాత్మునికి గల తేడా అక్కడే ఉంది. నిజమైన మహాత్ముడు అధోముఖంగా ఉన్న మానసిక లక్షణాలను తన యిచ్ఛానుసారంగా ఊర్ధ్వ ముఖంగా మళ్ళించగలడు. అది సామాన్య మానవుని శక్తికి మించిన విషయం ఏకత్వ స్థితిలో పూర్తిగా ప్రవేశించినట్టి మహాత్ముడు ఆ తర్వాత మరల అనేకత్వం వైపుకు మళ్ళుతాడు. వేరే విధంగా చెప్పాలంటే ఏకత్వ స్థితిలో పూర్తిగా విలయం చెందినప్పుడు, రహితం చేసుకోవడానికి మరేమీ మిగలదు. అందుచేత, విపర్యయం అంటే పూర్వస్థితిని తిరిగి పొందడం (reversion) జరుగుతుంది. కేంద్రం తన మండలంలో ఉనికి స్థితిని యిముడ్చుకొని ఉండి ఆ తర్వాత ఏవిధంగా ఆకార, రూపాలలో పరిణమిస్తుందో అదే విధంగా జరుగుతుంది. నిజమైన లయస్థితికి "ఏకత్వంలో లయం" అనే పదం సరైనది కాదని దాని అర్థం. దానికి కారణం అక్కడ ఏకత్వం కూడ ఉండదు కావున. దానికి అత్యంత యుక్తమైన పదం "అది అదే" (It is as it is) కాని ఆదశలో ఆనందం కాని, ఆకర్షణ కాని వుండదు. ఆఖరికి బ్రహ్మానందం కూడా వుండదు. అది స్థితిరహిత స్థితి. ఈ స్థితికి తీసికొని రాబడిన వాడు తాను సర్వనాశనం అయ్యానని అనుకోవచ్చు. దానికి కారణం అతడు ఉత్సాహాన్ని కాని, ఉల్లాసాన్ని కాని, ఆనందాన్ని కాని అనుభవింపడు. అదే వాస్తవానికి అపేక్షించవలసిన నిజమైన ఆనంద స్థితి. కాని అప్పుడు ఆనంద భాండాగారమని శాస్త్రాలలో యిచ్చిన వర్ణనకు యిది సరిపోదు. కాని అది పొరపాటు భావం మాత్రమే. నిజమైన ఆనందానికి ఉల్లాస భావంతో ఏ విధంగాను సంబంధం ఉండదు. మధ్య దశలలో వచ్చే స్థితులు అనుభవంలోకి రాకుండానే ఆ స్థితికి వస్తే సాధకుడికి నమ్మిక ఉండదు. నిగ్రహం ఉండదు.

ఉన్నత స్థాయిల్లో అనుభవ జ్ఞానం కూడ అంతం అవుతుంది. తారతమ్య భావం దాదాపు పోయి, తెలియకుండానే "అజ్ఞాన స్థితి" వస్తుంది. వాస్తవానికి అదే కారణంగా నేను ప్రాథమిక శిక్షణ నిచ్చుటకు పూర్తిగా అనర్హుడనైనాను. ప్రాథమిక దశలో వుండి నా వద్దకు ఆధ్యాత్మిక శిక్షణకు వచ్చేవారు నా నుండి, నా ఆ స్థితిని కొంచెంగాకాని లేక

కనీసం దానిని పోలిన స్థితిని కాని పొందుతారు. దాన్ని వారేమాత్రం యిష్టపడరు. అది వారి అభిరుచికి తగినట్టిది కాదు. వారు ఉత్సాహకరం, ఆకర్షణమయం, ఆనంద భరితం అయిన దానిని కోరుకుంటారు. వారు అర్థం చేసుకొనే విధంగా అది అక్కడ ఉండదు. రాబందు మానవుడి భోజనంలోని షడ్రసోపేతమైన వంటకం కన్న కుళ్ళిన మాంసం ముక్కను ఎక్కువ ప్రీతిగా తింటుంది. నేనున్న స్థితికన్న బాగా తక్కువ స్థాయి నుండి వారికి ప్రాణాహుతిని యిస్తే నేను చాలా ఆయాసపడతాను. అందుకు కారణం నేనా స్థితికి అలవాటు పడకపోవడం. అయితే నేను అవసరమైనప్పుడు ఒకానొక స్థాయికి దిగిరావచ్చును, కాని అది కూడ ఒకటి రెండు నిమిషాలు మాత్రమే.

# గమ్యం - మార్గం

ప్రపంచంలో మన కార్యకలాపాలు దైవ క్షేత్ర వాతావరణంపై ఎటువంటి ప్రభావాన్ని కలుగచేస్తాయో మనం సరిగ్గా అర్థం చేసికోము మన కార్యకలాపాలు హృదయాంతర భావాలతో కలిసినప్పుడు విశ్వాతరాళంలో నాటుకునేటట్లు ప్రభావ ముద్రలను సృష్టిస్తాయి. అవి మానవ మనస్సును ప్రభావితం చేస్తాయి. విశ్వాంతరాళంలో ఉన్న ఆ శక్తి చర్య వలన అవి మరింత శక్తివంతమవుతాయి. అవి తాకినప్పుడు, ప్రజల హృదయాలు వాటి ప్రభావాన్ని గ్రహించి మరీ ఎక్కువగా ఆలోచనలను ఉత్పన్నం చేస్తాయి. ఈవిధంగా మనం పుట్టినప్పటి నుండి విశ్వాంతరాళాన్ని పాడు చేస్తూనే ఉన్నాయి. ఆకారణంగానే మనం ఒక క్షణమైనా ఆలోచన లేకుండ ఎన్నడూ ఉండలేము. కాని విశ్వాంతరాళాన్ని దాటి పోగల వారు నిస్సందేహంగా దాదాపు ఆలోచన లేని స్థితికి వస్తారు. మానవుడు తను సామాన్యంగా చేసే పని, అదెటువంటిదైనప్పటికి, తన హృదయంపై ఎటువంటి భారం, ప్రభావం లేకుండా కర్తవ్య భావంతో చేసుకుంటూ పోతే, అతడు తనను కాని విశ్వాంతరాళాన్ని కాని పాడు చేయడు. అందువల్లనే శ్రీకృష్ణ పరమాత్మ నిజమైన కర్తవ్య భావాన్ని గుర్తించాల్సిన అవసరం గురించి ఎంతగానో చెప్పడం జరిగింది. ఆవిధంగా మనం సదా విశ్వాన్ని కలుషితం చేస్తూ ఉండగా, సర్వోత్కృష్ట శక్తి అయిన ప్రకృతి యీ కాలుష్య విషయాలను తీసివేడంలో సదా నిమగ్నమై ఉంది. ఒక్కొక్కప్పుడు అది అధికంగా పేరుకుంటుంది. అప్పుడు ఒక యుగ పురుషుడు ఆ కార్యాన్ని నిర్వహించడానికి అవతరిస్తాడు. మానవాళికి బాధలు, కష్టాలు కలిగించే భోగ వాతావరణం ఎల్లెడల ఏర్పడుతుంది. యుద్ధాలు, రుగ్మతలు విధి వైపరీత్యాల రూపంలో ప్రత్యేక పద్ధతులు కూడా ప్రయోగించబడుతాయి. అట్టిరకపు మహత్తర శక్తి యీ కార్యనిర్వహణకై యిప్పటికే ఉపక్రమించి ఉంది. అది శ్రీకృష్ణ పరమాత్మ దేనికై అవతరించాడో ఆ పనిని పోలి ఉంది.

పూజకు, ఉపాసనకు తీరిక లేనంతగా తమ స్వకార్యములలో మునిగి ఉన్నామని ప్రజలు తరచు చెప్పుతూ ఉంటారు. కాని అత్యధికంగా పనిలో మునిగివున్న వాడికే అత్యధిక తీరిక ఉంటుందన్నది సామాన్య లోకోక్తి. నా ఉద్దేశ్యంలో మనిషి తన పనికి అవసరమయ్యే దానికంటే ఎక్కువ సమయం అతడి యిష్టానుసారంగ వినియోగించు కోవడానికి లభ్యం అవుతుంది. సేవా, త్యాగాలు రెండే ఆధ్యాత్మిక దేవాలయ నిర్మాణానికి అవసరమైన పరికరాలు. ప్రేమ వాటికి పునాది. నిస్వార్థంగా చేసిన సేవ ఏదైనా ఉపకరిస్తుంది. సేవలో ఆరాధనా భావం ఉండి, మన దైనందిన చర్యలో వలెనే దానిలో

కూడా మనం నిమగ్నమవ్వాలి. దానికి అత్యంత సులభ పద్ధతి ప్రతీ దానిని దైవాజ్ఞగా స్వీకరించి, తన కర్తవ్యంగా భావించడం. ఈ ప్రపంచంలో మనకున్న ప్రతీది దైవం నుండే వచ్చిందని మనం గుర్తుంచుకోవాలి. మనతోటి మానవులు కూడ ఆయనచే సృష్టింపబడిన వారే. ఆయన ప్రతీదానికి ప్రభువు. మనం ప్రత్యేకంగా సంరక్షించడానికి కొందరిని ఆయన మనకు అప్పగించినప్పటికి కూడ మనమంతా ఆయన బిడ్డలం. ఈ విధంగా మనం అనుచిత బంధాల నుండి విముక్తి పొందుతాము. ఈ భావం లోతుగా పాతుకుంటే కర్తవ్య భావంతో వారికి సేవ చేస్తాము. అదే సమయంలో ఆ మహాప్రభువునుకూడ స్మరిస్తాము. ఇది చివరకు అలవాటుగా మారి సతత స్మరణ అవుతుంది.

ఆ మహాప్రభువు తలంపును ఎల్లప్పుడు మనస్సున కలిగి వుండి దానికే మనఃపూర్వకంగా అంకితమైతే జీవితగమ్యం సులభంగ సిద్ధిస్తుంది. భక్తిచే మనకు, ఆ ప్రభువుకు మధ్య ఒక అనుసంధానమును ఏర్పరచుకుంటాం. అదే మన ప్రగతికి బాట అవుతుంది. మనం చేయవలసిందంతా ఆ మార్గంలో అవరోధాలైన ముళ్లు, పొదలను తొలగించి శుభ్రంగా ఉంచడం. మనఃపూర్వక సంకల్పం, తీవ్రమైన భక్తి యీ మార్గాన్ని నిర్మలంగా ఉంచుతాయి. మార్గం నిరాటంకం అయినప్పుడు హృదయం అతనిని ముందుకు నడిపిస్తూనే ఉంటుంది. మనస్సును వెంటాడే విరుద్ధ భావాలే ముఖ్య అవరోధాలు. ధ్యాన ఫలితంగా తాత్కాలిక ప్రశాంతత ఏర్పడితే దాని అర్థం మనం ఒక అడుగు ముందుకు వేసినట్లు. అది కొనసాగుతూ ఉంటే, యీ విరుద్ధ భావాలు అదృశ్యమవడం ప్రారంభమైందని తెలుస్తుంది. అది శాశ్వత స్థితిని పొందినప్పుడు దైవంతో సామీప్య భావం ప్రాధాన్యత వహిస్తుంది.

శాశ్వత సత్యప్రాప్తికి అనేక మార్గాలు నిర్ణయించబడ్డాయి. ప్రతి ఒక్కటి ఆయా వ్యక్తుల ప్రత్యేక అభిరుచి, మనస్తత్వాలకు సరిపోతుంది. అత్యంత నిమ్న తరగతికి చెందిన వాడు ధ్యానానికి మనస్సు పెట్టడు. అతడు తన అంతర స్థూల్య కారణంగా ఘనమైన వస్తువులతో ప్రారంభించి ప్రతిమ రూపమే సర్వ శక్తిమంతుడైన భగవంతుడనే భావంతో పూజిస్తాడు. కాని దురదృష్టవశాన్న ప్రతిమ రూపాన్నే దైవంగా స్వీకరించి దైవానికి సంబంధించిన మహోన్నత భావాన్ని పూర్తిగా వదిలేస్తాడు. మనస్సులో స్థిరపడి ఉన్న ఆ ప్రతిమను పోలిన ఊహాకల్పిత రూపాన్ని దృష్టిలో పెట్టుకొని, తన ఊహలో దానికి పుష్పములు, మంచి గంధం, హారతులను అర్పిస్తూ చేసే యాంత్రిక పూజను నిత్యకృత్యంగా కొనసాగించేవారిని కొంచెం ప్రగతి సాధించిన వారుగ భావింపబడుతారు. దీనిని వారు మానసిక పూజ అని చెప్పి, అదొక ఉన్నత దశగా భావిస్తారు. వాస్తవానికి వారు మొదటి తరగతికి చెందిన వారికన్న ఏవిధంగాను మిన్నకాదు. రెండు సందర్భాలలోనూ ఫలితం సరిగ్గా ఒక్కటే. చివరకు వారు శిలవలె ఘనంగా అవుతారు.

# సతి

సీతాపూర్ జిల్లాలో యిటీవల జరిగిన 'సతి' సంఘటన, ఆ సమయంలో ఆమె మానసిక స్థితిని తెలుసుకోవాలనే ఆలోచన ఆసక్తులను నాలో కలుగజేసింది. భర్తపై ఆమెకు గల తీవ్రమైన ప్రేమ ఆమెను ప్రేరేపించిందనే విషయం స్పష్టం. ఆ కారణంగా ఆమె ఆ ఎడబాటును భరించలేక మరణించిన భర్త చితిపై ఆత్మాహుతి చేసికొనుట మేలని భావించింది. భర్తపై ఆమెకు గల ప్రేమను, నా ప్రభువైన గురువర్యులపై నాకు గల ప్రేమతో పోలిస్తే నాకు సిగ్గు వేస్తుంది. నాకర్థం అయినంతవరకు ఆమె చేసిన ఈ పని భర్తతో ఆ తరువాత శాశ్వతంగా సన్నిహితమై ఉండాలనే తీవ్ర ఆకాంక్షచే ప్రేరేపించ బడింది. సతియొక్క ప్రధానోద్దేశం తన భర్తతో శాశ్వత సంబంధాన్ని కొనసాగించడమే అయితే ఆమెను, గురువు తన భౌతిక రూపాన్ని వీడిన తరువాత ఆయనతో తన సంబంధాన్ని కొనసాగించాలని కాంక్షించే నిజమైన శిష్యునితో పోల్చడం బాగుంటుంది. అటువంటి అంకిత భావం కల శిష్యుడు సతితో సమానం కాడా? ఇప్పుడు పురుషుడు, ప్రకృతి సిద్ధాంతాన్ని కొంచెం సేపు పరిశీలిద్దాం. ప్రకృతిలో పురుషుడు ధనాత్మక (Positive) శక్తి అని ప్రకృతి ఋణాత్మక (Negative) శక్తి అని భావిస్తారు. స్త్రీ లింగంగా ఆడది ప్రకృతి లేక ఋణాత్మకానికి ప్రతినిధి అయితే పుంలింగంగా మగవాడు పురుషుడు లేక ధనాత్మకానికి ప్రతినిధి. శిష్యుడు ధనాత్మకమైన గురువు తలంపులోనే లీనమై ఉంటాడు. దానికి తను ఋణాత్మకం అవడం అవసరం. గణిత శాస్త్ర దృష్ట్యా యీ రెండు పదాలను పరిశీలిస్తే, మొదటిది ఆధారం లేక సున్నకు పైగా పోవుటకు వర్తించగా తరువాతది. క్రిందికి పోవడానికి వర్తిస్తుంది. మానవుడి ప్రస్తుత స్థితి ప్రారంభస్థానం లేక ఆధారం అనుకొనండి. అందుచే విలయం లేక శూన్యస్థితి (Negation) అంటే క్రిందికి వెళ్లడం లేక త్యజించడం లేక బాహ్యంగా కనబడుతున్న భౌతిక అస్తిత్వ నిర్మాణాన్ని కావించిన అన్నింటిని రహితం చేసుకోవడం. దానిని సత్‌తత్వం వైపుకు పురోగమనంగా భావించరాదా? అట్లయితే శూన్యత్వం వైపుకు పురోగమించే వ్యక్తి క్రమంగా ధనాత్మకంగా మారతాడని దానర్థం. సతి అయిన స్త్రీ ఆ విధంగా పురుషునిగా మారుతుందనే నిర్ణయానికి రావచ్చు. కచ్చితమైన ఆధ్యాత్మిక భావంలో ధనాత్మకం పురుషత్వ భావరహితమైన దానికి వర్తిస్తుంది. ఆ సందర్భంలో అదప్పుడు స్త్రీత్వానికి సమాంతరం కావచ్చును. కాని అది కూడ కాదు; ఏలన స్త్రీత్వం శూన్యతతో కలుపబడి మనం ఋణాత్మకం అయినాము. కావున ఆ విధంగా

అతడు స్త్రీ కూడా కాదు. అప్పుడేమిటి? నిజార్థంలో అది ధనాత్మకం కాదు; ఋణాత్మకం కాదు. రెండింటికి అతీతమైనది. దీనిని నేనీ విధంగా చెప్పడానికి ప్రయత్నించాను.

"నీటి బొట్టు మహాసముద్రంలో లయం అయినప్పుడు అది తనకు తానే మహా సముద్రంగా మారుతుంది".

ఆధ్యాత్మికతకు సంబంధించినంతవరకు అదే ప్రేమ యొక్క అంతిమ అవధి. మనిషి లింగ భేదాలకతీతమైన వానితో గాఢమైన అనుబంధాన్ని పెట్టుకుంటే తను కూడ చివరకు ఆ విధంగా అవుతాడు. ఇప్పుడు సతికి తన భర్త పురుషుడనే భావం, పురుషుడిగా అతడిపై ఆమెకు గల తీవ్ర అనురాగం ఆమెను ఆ భావానికే గట్టిగా కనిపెట్టి వుంచి విముక్తి స్థితికి ఆమె ప్రవేశాన్ని అడ్డగిస్తాయి. అదే విధంగా శిష్యుడు గురువు ధనాత్మక, ఋణాత్మకాలకు అతీతుడనే భావంపై మనస్సును నిలుపకపోతే, అతడెన్నటికి అంతిమ లక్ష్యాన్ని సాధించలేడు.

మహోన్నత స్థాయికి చెందిన సతి మానవ దేహ నిర్మాణానికి కావలసిన మూల వస్తువులపై ఆధిపత్యాన్ని పొందుతుందని నేను విశ్వసిస్తాను. ఆమె ఆలోచన సదా దేహం మీదనే కేంద్రీకృతమై, అంతకన్న పైకి పోదు కావున ఇలా జరుగుతుంది. కాని ఆమె భర్త మహోన్నత స్థాయిని పొందినవాడైతే ఆమె కూడ ఊర్ధ్వంగా అతడి స్థాయికి లాగబడడం దానంతట అదే జరుగుతుంది. ఇది నా అభిప్రాయం. శాస్త్రాలు దీనిని గురించి ఏమి చెబుతాయో నాకు తెలియదు. నాకు సంబంధించినంతవరకు గురువు ఆధ్యాత్మిక ఔన్నత్యంలో అత్యున్నత అగ్రస్థానాన్ని చేరుకోని వాడైతే, అతని శిష్యుడు కూడ ఆ పరమ ప్రభువుతో ప్రత్యక్ష సంబంధం ఏర్పరచుకుంటే గాని కావలసిన ప్రమాణానికి బాగా దిగువగానే ఉండడం నిశ్చయం. బహుశః ఆ కారణంగానే ఆ పరమ ప్రభువు ఎడల ప్రత్యక్ష ప్రేమకు ప్రాముఖ్యాన్ని యిస్తున్నారు.

సతి అయిన స్త్రీకి భర్తపై గల అనురాగం, భక్తి, త్యాగం ఎంతో ప్రశంసనీయమైనవి. అయినప్పటికి ఆమె విముక్తి స్థితిని చేరలేకపోవడం ఆశ్చర్యకరంగా కనబడుతుంది. నా అభిప్రాయంలో ఆమె అతడిని మానవ మాత్రుడైన భర్తగాను, సంరక్షకుడుగాను తీసికోవడమే దానికి కారణం. దీనికి భిన్నంగా, ఆమె భర్త తన స్వీయ అస్తిత్వభావానికి దూరంగా ఉన్నవాడైతే (అది మిక్కిలి అరుదైన విషయం) ఆమె తనకు తానే అటువంటి నిమ్న భావాన్ని మించి పైకి వెడుతుంది. ఒక విధంగా ఆమె విముక్తి పొందకుండా ఉండడానికి ఒక రకంగా ఆమె భర్తే బాధ్యుడు అవుతాడు.

ఆత్మ ఆ భావము (Negation) గురించి నేను అంతగా చెప్పడానికి గల కారణం అది లేకుండా గ్రంథులు విడివడటం, మనం వ్యాప్తి చెందడం సాధ్యం కావు. గోధుమ గింజల్లో ప్రతిదానికి ఒక సంపూర్ణ వస్తుత్వం (ఉనికి) ఉంటుంది. వాటిని పిండిగా తిరగలిలో విసరినప్పుడు వాటిపై పొరలు విడిపోయి అవి తమ ప్రత్యేక వస్తు లక్షణాన్ని పోగొట్టుకుంటాయి. ఆత్మ ఆభావము అంటే ఘనరూపం లేక భావదశ ఏర్పడడానికి దోహదం చేసిన ఆ శక్తిని రహితం చేసికోవడం. గోధుమ గింజవలె మనిషి తన స్థూల స్థితిని సంపూర్ణంగా కలిగి వున్నంతవరకు అతడి వ్యక్తిగత అస్తిత్వం పరిగణనలోకి వస్తుంది. గోధుమగింజను తిరగలిలో విసరినప్పుడు లేక రహితం కావించినప్పుడు మాత్రమే మరింత సన్నగాను సూక్ష్మంగానూ అయి తన ప్రత్యేక అస్తిత్వాన్ని పోగొట్టుకుంటుంది. క్రమంగా స్థూల అణువులు విచ్ఛిన్నమై బంధాలు తెగిపోతాయి. వేరు మాటల్లో చెప్పాలంటే భావస్థితి (Positiveness) పోయి సమరూపస్థితి ప్రవేశిస్తుంది. అది సత్‌తో మన సంబంధాన్ని మరింత సన్నిహితం కావిస్తుంది. అప్పుడు మనిషి ధనాత్మకం కాదు, ఋణాత్మకం కాదు రెండింటికి అతీతుడు. నేను నా గురువర్యులను ఆ భావంతో తప్ప మరే విధంగానూ ఎన్నడూ స్వీకరించలేదు. మిత్రలైనా, శత్రువులైనా ఆయన కాంతే ప్రతి హృదయంలో ప్రకాశిస్తున్నట్లు అనుభూతి చెందాను. దాని ఫలితంగా ప్రతి జీవిలోను నాస్వీయాత్మే ఉన్నట్లు అనుభవానికి రావడం ప్రారంభమైంది. శునకం కూడా నాకు దగ్గర బంధువుగ కనబడింది. వ్యత్యాస భావం ప్రతీది పోయింది. బంగారం ముద్ద, మట్టి ముద్ద కూడ విలువలో నాకు ఒకటిగానే ఉన్నాయి. తారతమ్య భావం దాదాపు నశించి, సంబంధ బాంధవ్యాల ముడి పూర్తిగా తెంపి వేయబడింది. నా రక్తబంధువు లెవ్వరిని ఎన్నడు బంధుభావంతో చూడలేదు. నా తండ్రి, తల్లి, సోదరుడు, బిడ్డలు అందరూ నా దృష్టికి వారు ఉండవలసిన విధంగా కనబడెడివారు. ఇది సామాన్య సిద్ధి కాకపోయినప్పటికి సహజమార్గం యొక్క సరళమైన సాధన ద్వారా సులభంగా దీనిని పొందవచ్చును. ఈ స్థితి తగినంత ప్రగతి తర్వాత కలక్రమేణ దానంతటదే వస్తుంది. ఇది వాస్తవానికి వైరాగ్యం యొక్క ఉన్నతస్థితి. ఇప్పుడు నా శిక్షణలో ఉన్న సహచరుల విషయంలో, నేను వారిని నా శిష్యులని భావిస్తే నన్ను నేనే అవమానం చేసికొన్నట్లు కాదా! ఎందువలన అంటే గురువర్యుల అద్భుత కృపా ఫలితంగా ఎంతో దయతో త్రెంపివేయబడిన ఆ బంధాల ముడిని తిరిగి విధించుకోవడమే అవుతంది. వారు నా శిష్యులనే భావం నేను గురువుననే భావాన్ని నాలో కలిగిస్తుంది. ఆ సందర్భంలో నేనిచ్చే శిక్షణ ఎన్నటికి నిష్కళంకం కాదు, అహంకార భావం నుండి నివృత్తి కాజాలదు. నా స్థాయికి అప్రతిష్ఠ, అవమానాన్ని తెచ్చేది ఏదైనా నాకు ఆగ్రహాన్ని కలిగిస్తుంది.

ఆ పరమ ప్రభువు అతి నీచమైన యీ కళంకాన్ని శాశ్వతంగా మన సంస్థనుండి దూరంగా ఉంచుగాక! ఇప్పుడు ఎవరిని నా శిష్యునిగా భావించకుండా ఉండుట వలన, అతడు అనుచితంగా ప్రవర్తించినప్పటికి నేను లక్ష్యపెట్టనవసరం లేదు. మీరు దీనిని మీ హృదయ చక్షువుతో పరిశీలిస్తే, అది అస్తిత్వ రహిత భావాన్ని (non-beingness) పెంపొందిస్తుందనే విషయాన్ని గమనిస్తారు. ఆ విధంగా ప్రారంభం నుండే మనం చివరకు చేరవలసిన వస్తువును చేపడుతున్నాం.

# మన నిజ స్వరూపము

మనిషిలో ప్రాణాధార శక్తి అయిన మనస్సు అనేక విధాల అస్పష్టమైన రీతిలో వర్ణించబడింది. కాని అది సకల ఆలోచనల్ని భావోద్వేగాల్ని, ప్రేరణల్ని తన ఆధీనంలో ఉంచుకుంటుదన్న విషయం సర్వసామాన్యంగా ఆమోదించబడింది. అది ఎక్కువగా చెడువైపే విశృంఖలంగా మళ్ళుతుంది. అందుచేతనే అది సామాన్యంగా జీవియొక్క నిజ స్వరూపానికి విరుద్ధమై ప్రతికూలంగా ఉంటుందని భావిస్తారు. కాని అది దాని నిజస్వభావం వలన గాక తప్పుడు శిక్షనా ఫలితంగా వచ్చినట్టిది. వాస్తవానికి సుశిక్షితం కాబడి, సమత్వస్థితిలో ఉన్న మనస్సే జీవిత సమస్యను పరిష్కరించే ఏకైక పరికరం.

మనస్సు పుట్టుకను గురించి విభిన్న అభిప్రాయాలు వ్యక్తం చేయబడ్డాయి. అత్యంత సూక్ష్మమైన దాని ఉనికి యొక్క మూలాన్ని సృష్టి ఏర్పడిన సమయంలో కనుగొనవచ్చు. అప్పుడు అది పరిపూర్ణ స్థితిలో వుండి క్షోభ లేక ప్రేరణ రూపంలో కనబడింది. ఆ ప్రథమ స్థితిలో అది సృష్టి నిర్మాణానికి క్రియాత్మకం కాబడిన ఆ మూలశక్తికి దగ్గరగా పోలి వుంది. "రాజయోగ ప్రభావం"లో నేనీ విషయాన్ని విశదపరిచాను. అది యీవిధంగా ఉంది.

"ఈ గ్రంథంలో విశదీకరించిన మానవ మనస్సు పుట్టుకకు సంబంధించిన సిద్ధాంతం పూర్తిగా సహేతుకమైన ఆధారాలపై నిలచివుంది. నిద్రాణమైవున్న దైవ సంకల్పం ప్రథమ క్షోభను చలనంలోకి తీసికొనివచ్చి, ఉనికికే కారణం అయింది. ఆ క్షోభ అంతర్గతంగా ఉన్న శక్తులను చలనవంతం చేసింది. సృష్టి కార్యం, చైతన్యం ప్రతి ప్రాణిలోను ప్రధాన చలన శక్తి రూపంలో ప్రారంభమైనాయి. మనిషిలో అది మనస్సుగా తెలియ వచ్చింది. క్షోభలో వలెనే దాని మూలంలో కూడా నిద్రాణమై ఉన్న అదే సంకల్పం ఉంది. ఆవిధంగా మానవ మనస్సు మూలశక్తి లేక ప్రథమ క్షోభలో ఒక అంతర్భాగమై, దానిలో సన్నిహిత సారూప్యాన్ని కలిగి వుంది. అందువలనే, ఆ రెండింటి విధులు చాలవరకు ఒకే విధంగా వుంటాయి".

మనస్సు ఆ విధంగా విశ్వాన్ని ప్రస్తుత భౌతిక రూపంలోకి తీసుకొని వచ్చుటకు ఒక నిర్మాణాత్మక అంశంగా పనిచేసింది. ఆ పరబ్రహ్మము తరువాత వెనువెంటనే సంభవించిన క్షోభే మనస్సు. మతాలలో వివరించినట్లు సృష్టిదాని ఉద్దేశం. సృష్టి భావం దానిలోనే చేరి

వుంది. కాని నియమ ప్రకారం, పరస్పర వ్యతిరేకమైన రెండు వస్తువులు ఎల్లప్పుడు కలిసే వుంటాయి. పరిణామ (Evolution), విపరిణామ (Involution) కార్యక్రమాలు రెండు ఏకకాలంలో పనిచేస్తాయి. సృష్టికార్యం ఎక్కడైతే వుందో అందులోనే వ్యతిరేక పోకడలు కలిగిన విచ్ఛిన్నకర చర్య కూడ అంతర్గతమై ఉంటుంది. సహజంగానే, అది రెండు విధములైన శక్తిగ పరిణమించింది. వస్తువులను ఉనికిలోనికి తీసుకువచ్చే ధనాత్మక శక్తి ఒకటి; ఋణాత్మక శక్తి రెండవది. మన ఉనికిని పూర్తిగా విలయం కావించుకున్న తర్వాత మూలాన్ని చేరుకోవాలంటే, మనం ఋణాత్మకం కావడం అవసరం. దానికిదొకటే మార్గం.

ప్రకృతిలో ప్రతీది గోళాకారంలో ఉండడం ఆశ్చర్యంగా ఉంటుంది. అందువలన శక్తి ప్రవహించడానికి ఒక వర్తులమార్గం (circuit) ఏర్పడుతుంది. దైవేచ్ఛకు అనుగుణంగా చలనం వలన ఉష్ణం ఏర్పడి, దాని ద్వారా సృష్టికార్య నిర్వహణకు ధనశక్తి ఋణశక్తి పక్కన తిరుగుతోంది. సృష్టిక్రమంకు దాదాపు నూటయిరవై వేల సంవత్సరాలు పట్టిందని నాకు అధిచేతనా స్థితి (Super Consciousness)లో వెల్లడైంది. ఆవిధంగా సృష్టి ఆవిర్భవించి, చలన ఫలితంగా కలిగిన ఉష్ణము, ఆకార స్వరూపాలు ఏర్పడడానికి ఆధారమైంది. ఇది మనలో కూడా ఉంది. మన యీ నిర్మాణానికంతకు ఆధారంగా ఉంది. ఈ ఉష్ణాన్ని ఏదో విధంగా మితత్వ (Moderation) స్థితిని కొనివస్తే అది దాదాపు మూల ప్రవాహానికి సారూప్యం అవుతుంది. మన ప్రస్తుత చేతన స్థాయికి తీసుకొనివచ్చిన ఆ అంతరాగ్నిని ఉద్దీపింప చేయాలని కొందరు మతాచార్యులు చెబుతారు. అది ఒక వక్ర భాష్యం మాత్రమే. వాస్తవానికి దాని సృజనాత్మక ప్రభావాలు తొలిగే విధంగా ఆ అగ్నిని లేక ఉష్ణాన్ని చల్లార్చాలి.

సృష్టి ఎక్కడ నుండి ఆవిర్భవించిందో కాలం యొక్క మూలము కూడ అక్కడే ఉందని కనుగొనగలం. క్షోభ కార్య రూపంలోకి వచ్చుటకు పట్టిన వ్యవధే కాలం. పరిపూర్ణ స్థితిలో అదొక శక్తి సమర్థులైన యోగులు దానిని వినియోగింపగలరు. పూర్వమందున్న మహాత్ములకు దానిని గురించి ఏమీ తెలియదని కాదు. కొన్ని సందర్భాలలో వారు దానిని నిర్మాణాత్మక ప్రయోజనాలకై ఉపయోగించినప్పటికి వారు దానినొక శక్తిగా ప్రకటించలేదు. అది ఒక మహోన్నత సిద్ధి. దానిని సాధించిన వాడు అంతరిక్షం (Space)పై కూడా ఆధిపత్యం పొందుతాడు. శ్రీ అరవిందులుచే అంతగా పొగడబడిన, అధి మానసిక శక్తి (లేక అధి మనస్సు) నిజానికి దైవ శక్తి ఉనికిలో ఉన్నప్పుడు యుగపురుషుడి రూపంలో భూమిపైన ఎల్లప్పుడు ఉంటుంది. వాస్తవానికి యీ ప్రపంచ స్వభావాన్ని సంపూర్ణంగా

మార్చడానికి కావలసింది అధిమానసిక శక్తికాదు, అంతకన్న బలమైన శక్తి కావాలి. దానిని అతీత అధిమానసిక శక్తి (Super-supramental) అని చెప్పవచ్చును. అది అత్యంత సూక్ష్మమైనది; ఆకారణంగానే అత్యంత శక్తివంతమైనట్టిది. అది సత్వ, రజో, తమోగుణాల కంటె చాలా ఉన్నతంగా ఉన్న ఒక ఉత్కృష్ట మహత్తర శక్తి. దానికంటె ఉన్నతంగా యింకా మహత్తరమైన శక్తి కలదు. దానిని ప్రత్యేకమైన ప్రకృతి కార్య నిర్వహణ కోసం అవతరించిన సమర్థుడైన యోగి మాత్రమే ఉపయోగించగలడు. నా అభిప్రాయంలో దివ్యశక్తులను ఉపయోగించే సామర్థ్యం లేనివాడు, దివ్యత్వంలోకి కనీసం తొంగైనా చూసి వుండడు.

సృష్టి ఆవిర్భవానికి దిగి వచ్చిన శక్తి ప్రవాహం పరిపూర్ణ స్థితిలో ఉంది. మన వ్యక్తిగత మనస్సు దాని అట్టడుగు కొన. ఇప్పుడు మనం యీ రెండు కొనలకు మధ్య సమానత్వాన్ని సాధించగలిగితే మనం చేరే స్థితికి ఆవల ఆ పరబ్రహ్మం తప్ప వేరొకటి లేదు. నేనొక సారి పరిశోధన నిమిత్తం మిక్కిలి ఉన్నత స్థితిని పొందిన సహాధ్యాయిపై ఎంతో మెళకువతో సుమారు ఒక్క అర్థనిమిషం మాత్రమే దీనిని ప్రయోగించ ప్రయత్నించాను. అదికూడ అతని నిమ్నం మనస్సు ప్రవృత్తులు ఆదిమూలం (Original source) వైపునకు ప్రేరేపింపబడునంత వరకు మాత్రమే. తత్ఫలితంగా దాని ప్రభావం అతడి హృదయంపై ఎంతో భారాన్ని కలిగించింది. దానినెంతో కష్టంమీద సుమారు ఒక నెలా పదిహేనురోజులలో క్రమపరచగలిగాను. మానవ నిర్మాణానికై క్రిందికి ప్రవహించిన ఆ శక్తి ప్రవాహం దాని స్వభావ లక్షణం చేత ఆకాశం (space) గుండా పయనించి, అనేక చర్యలను ప్రభావితం చేస్తూ మార్పు చెందుతూ వచ్చింది. సామాన్యంగా ప్రతి ఒక్క చర్యవలెనే అదికూడ ఒక కేంద్రాన్ని ఏర్పరచుకుంది. ఈ కేంద్రమే ''చిత్‌సరస్సు'' (Chit-lake)గా తెలియబడుతోంది. అది తనకు అవసరమైన ప్రతి వస్తువును ఏర్పరచుకుంటూ క్రిందికి దిగి వచ్చింది. ఆ విధంగా సృష్టిక్రియకు సహకరించిన కారణాలన్నీ సమీకృతమయ్యాయి. ఈ విషయంలో అతడి స్వశక్తిగాని, గురుశక్తిగాని తోడ్పడకపోతే దానికి ఊర్ధ్వంగా పైకి వెళ్ళే స్వభావమే వుండదు. ఆ పరిస్థితిని అధిగమించినప్పుడు అది ఊర్ధ్వ గమన స్వభావాన్ని తిరిగి పొందుతుంది.

మన దేహ నిర్మాణంలో ప్రవేశించిన ఆ శక్తి ప్రవాహం అస్పష్టమైన కంపనాలను సృష్టించి ఒక సున్నితమైన శక్తి ఏర్పడడానికి కారణమైనది. ఆ సున్నిత శక్తి మన దేహాణువుల ద్వారా విశుద్ధి చక్రంలోకి దిగినది. ఈ చక్రాన్ని అనేక పేర్లతో ఉదహరిస్తుంటారు. ఇది పిండ బ్రహ్మాండ మండలాల కూడలి. ఇదే మాయకు స్థానం. అక్కడ అపారమైన శక్తి

ఉన్నట్లు కనుగొన బడింది. మనిషి ఆలోచన యీ ప్రదేశాన్ని స్పృశించినప్పుడు అతనికి స్వప్నాలు వస్తాయి. అగ్నిచక్రం దీనికి సమీపంలోనే ఉంది. శాస్త్రీయ రాగాలు ఆరింటిలో ఒకటి అయిన దీపక్ రాగాన్ని పాడినప్పుడు ఆరిపోయిన జ్యోతి తిరిగి వెలుగుతుంది. ఆరాగం యీబిందువు నుండే గానం చేయబడుతుంది. అది యీ బిందువు నుండి హృదయంలోకి దిగి వచ్చినప్పుడు తనతోపాటు మాయా స్థితిని తీసుకు వస్తుంది. కాని దాని తరువాత స్థితి కూడా దానిలో నిద్రాణ స్థితిలో ఉంటుంది. ఇప్పుడిది మూడు శాఖలుగా చీలుతుంది. మధ్యశాఖ కొంచెము క్రిందికి దిగి వచ్చి 'A' బిందువు ఉన్నచోట ఒక విధమైన గ్రంథిగా ఏర్పడుతుంది. మిగిలిన రెండు శాఖలు కుడి, ఎమడలకు వెడుతాయి. ఎడమవైపు అది హృదయం క్రింది భాగంలోకి ప్రవేశించును. అద్భుత మహిమలను ప్రదర్శించే శక్తి కావాలంటే మాయావిక స్థితితో నిండి వున్న ఆ శక్తి ప్రవాహ భాగంతో సంబంధం ఏర్పరచుకోవాలి. దివ్యత్వం లేక దైవసిద్ధులను గురించిన ఆలోచనలతో నిమిత్తం లేకుండ చేసే ధ్యానం మహిమా శక్తులను పెంపొందిస్తుంది. ఇది ఒక సూచన మాత్రమే. దానిని యింతకు మించి వివరింప దలుచుకోలేదు. భాగవత పురాణంలో కూడా ధ్యానంచే అద్భుత మహిమా శక్తులను పొందే విధానాలు తెలుపబడ్డాయి. కాని దాని చివర మహా విష్ణువు చెప్పిన మాటలు యివి "ఎవరు భక్తితో నన్ను పొందగోరెదరో వారు నాతోపాటు, నా మహిమల్ని కూడ పొందుతారు" ఇది నగ్న సత్యం. అగ్ని, వాయువు, యితర మూలకాలు ఏవిధంగా ఏర్పడినవో నేను చర్చించదలుచు కోలేదు. పురాణ గ్రంథాలలో యిది చాలినంతగ చర్చించబడింది.

ఇప్పుడు మనల్ని యిక్కడకు తీసుకు వచ్చిన ఆ శక్తి ప్రవాహం ద్వారా బలవంతంగా పైకి వెళ్ళుటకు ప్రయత్నిస్తే, అది అభ్యాసికి చాలా కష్టమైనపని అవుతుంది. అందువలన మనం వేరే మార్గాన్ని అనుసరిస్తాం. మొదట పక్కవైపుగా వెళ్లి రెండవ బిందువు వైపుకు పయనించి, ఆ తరువాత వరుసగా మూడు, నాలుగు, ఐదు బిందువులకు ప్రయాణం చేస్తాము. ఈ విధంగా యీ బిందువుల వద్దనున్న మాధ్యమిక శక్తులను (Sub-Powers) వినియోగించి, యీ ప్రయత్నానికి శక్తిని పొందుతాం. విశుద్ధి చక్ర పరిధి దాటిన తరువాత మన మార్గం సూటి అవుతుంది. మనం శక్తితో పూరింపబడుతాం. దైవత్వం సిద్ధించడం అరంభమౌతుంది. దైవత్వసిద్ధి అంటే సకల యింద్రియ శక్తులు సమరసం కావింపబడి వాటి మూలము యొక్క స్థితిని (ఆది స్థితిని) పొంది 'సత్'తో లయమౌతాయి. దేహంలో ప్రతి అణువు ఆ సత్‌స్థితి - పరతత్వంతో ఏకత్వాన్ని పొందినప్పుడే దైవత్వ సిద్ధి (Divinasation) అంతిమ దశ లభిస్తుంది.

# గీత

కాల గమనంతో పాటు మనస్సు యొక్క సహజ నిరాడంబర లక్షణం కూడ మార్పును పొంది, ఒక వర్ణమయతా స్వభావాన్ని సంతరించుకుంది. అది మన బాహ్యాంతరాలలో ప్రతి దానిపై ప్రభావాన్ని ప్రసరించింది. అందువలన మన ఆలోచనలోను క్రియలోను దేన్నైనా చేపట్టిన అది వర్ణమయతను అన్ని దశలలోను ప్రదర్శిస్తుంది. అటువంటి స్వభావాన్నే కలిగిన వాతావరణ పరిసరాలపై మనకుగల ఎడతెగని వ్యామోహం మనలో భారాన్ని స్థౌల్యతను కలిగిస్తుంది. సూక్ష్మత్వం పూర్తిగా పోతుంది. మనకు కనిపించిన ప్రతీది అదేవిధంగా గ్రహించబడుతుంది. ఇది మన గ్రహణ శక్తికి అడ్డుతెరగా ఉండడమే కాక, హృదయంపై, మెదడుపై కూడ దుష్ప్రభావాన్ని కలుగజేస్తుంది. ఇదే మానసిక వైఖరి మహా పండితులు, జ్ఞానుల రచనలన్నిటిలోను ప్రకటితమయింది. విషయాలను క్షుణ్ణంగా అర్థం చేసికోవాలంటే, దానికి అవసరమైన మనఃస్థితిని అనుభవపూర్వకంగా సిద్ధించుకోవాలి. ఆ తర్వాతనే బయటకువచ్చి వాటిని యితరులకు వివరించడం సాధ్యమవుతుంది. మన పవిత్ర గ్రంథమైన గీత విషయంలో కూడా యిదే జరిగింది. దానిపై అనేక వ్యాఖ్యానాలున్నాయి. ఇంకా అనేకమైనవి చేర్చబడుతున్నాయి. దాదాపు ప్రతి ఒక్కరు తమ పండిత జ్ఞానం, వివేచనా శక్తుల స్థాయి నుండి దానిపై వ్యాఖ్యానించ ప్రయత్నించారు. ప్రజలు అదే ఆలోచనా స్థాయిలో దానిని గ్రహించాలని వారి ఉద్దేశం. ఈ విషయంలో వారి శారీరక పరిశ్రమ కొంతరవకు మెచ్చదగినదే, కాని అసలు ఉద్దేశం ఏమాత్రం నెరవేరదు. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే యీ వ్యాఖ్యానాలు తప్పుడు అభిప్రాయాలతో అసలు నగ్న సత్యాన్ని కప్పి మరుగున పడవేసి మూలగ్రంథాన్ని మరింత జటిలం చేస్తాయి. వేరు మాటలలో చెప్పాలంటే మరిన్ని జటిల సమస్యలను కల్పించుకొని మన లోపాలను అధికం చేసుకుంటున్నాము.

భగవంతుని ఆరాధన విషయంలో యిదే జరిగింది. మనిషి వలెనే ఆయన కూడా దేహాన్ని కలిగి యున్నాడని వర్ణిస్తారు. తన గొప్పతనానికి తగిన విధంగా ఆయన ఒక సువిశాల కార్య నిర్వహణారంగాన్ని కలిగి వున్న మహోత్కృష్ట వ్యక్తి. అదే ఆయనకు, మనిషికి గల ఏకైక తేడా కాని ప్రస్తుతానికి ఆ విషయాన్ని ప్రస్తావించక, అసలు చర్చనీయాంశానికి నేను పరిమితమౌతాను.

గీతలో వివరించిన సత్యాన్ని శ్రీకృష్ణపరమాత్మ కాలావసరానికి అనుగుణంగానే అర్జునిడికి వెల్లడించారు. ఆయన వివరించినదంతా మన ప్రయోజనం కోసమే. దానికి ఆయనకు మనమెంతో రుణపడి ఉన్నాం. కాలక్రమం అది మనందరికీ మార్గాన్ని చూపే దీపం అయింది. అది కేవలం ఒక వృధా ప్రసంగం కాదు. నిజమైన దివ్య పథ అన్వేషణకు అవసరమైన యదార్థ వస్తువు యొక్క ప్రత్యక్ష దర్శనం. అభ్యాసి తన పయనంలో అనుభూతి చెందే వివిధ స్థితులకు నేరుగా సంబంధించి ఉంటుంది. సరైన సాధన ద్వారా పొందే ఆస్థితుల యొక్క ప్రత్యక్ష ప్రాప్తికి ఇది సంబంధం కలిగి వుంది. దానిని మీరు క్షణకాలం దర్శించునట్లు చేసి, తమస్వీయ అంతఃశ్శక్తుల ప్రయోగంతో తక్షణమే అదేస్థితిని మీలో కలిగించగల మహాత్ములు యీనాటికీ ప్రపంచంలో వుండవచ్చు.

మనం ఈనాడు చూస్తున్న గీత పూర్తి పాఠాన్ని చెప్పుటకు శ్రీకృష్ణపరమాత్మకు బహుశః ఎంత సమయం కావలసివచ్చి వుండెడిదో యిక్కడ పరిశీలిద్దాం. సైన్యాలు రణరంగంలో ఎదురెదురుగా నిలుచుని ఉన్నాయి. యుద్ధసమయం సమీపిస్తోందని సూచిస్తూ రణదుందుభులు మార్మోగుతున్నాయి. ధర్మబోధ చేసి, అర్జునుని సక్రమ మార్గంలోకి గొనిరావడానికి శ్రీకృష్ణ భగవానునికి సమయం ఎంత ఉంది? దానిని పఠించడానికి కొన్నిగంటలైనా పట్టుతుంది. అట్టి విపత్కర సమయంలో అది ఏవిధంగా సాధ్యం కాగలదు? ఆయన దానికి కొన్ని నిముషములకంటె ఎక్కువ తీసుకొని ఉండరనుట సుస్పష్టం. వాస్తవం ఏమిటంటే శ్రీకృష్ణభగవానుడు అర్జునుడికి కొన్ని నిమిషములలోనే ఆ సమయానికి కావలసిన మానసిక స్థితులన్నిటిని ప్రాణాహుతి ప్రసారంచే యదార్థంగా కలిగించారు. నిజానికి అభ్యాసి ప్రగతి మార్గంలో వచ్చే స్థితులే అవి. ఈ పద్ధతి అర్జునుడికి తక్షణం ఒక మహత్తర ఆధ్యాత్మిక చైతన్య స్థితికి తీసికొని వచ్చి అతడి హృదయంలోని అనుచిత భవబంధ వ్యామోహాన్ని కడిగివేసింది. అట్టి శక్తి సామర్థ్యం కల పురుషుడు ఉంటే అది యీనాటికి గూడా సాధ్యమే. కాని ప్రజలు జీవిత పర్యంతం గీతా శ్రవణం, పారాయణం చేస్తూ ఉండినప్పటికీ దాని కనీస ఫలితాన్ని కూడా పొందరు. దీనిని మనం సామాన్యంగా చూస్తూనే వుంటాం. సంవత్సరాల తరబడి గీతా శ్రవణం జరిగినప్పటికీ ఇంతవరకు ఎవ్వరూ కూడా అర్జునుడి వలె మార్పును పొందలేదు. కారణం ప్రాణాహుతిచే వారి హృదయాల్లోకి గీతా సత్యాన్ని ప్రసరింప జేయగల సమర్థత దానిని పఠింప చెప్పేవారికి లేదు. దాని ఫలితంగా శ్రోతలపై ఎటువంటి ప్రభావం ఏర్పడదు. అందుచే దానిని పఠించే వ్యక్తి అందులో వివరించిన స్థితులవరకు అనుభవ పూర్వకంగా ప్రవేశం పొందినవాడై, ప్రాణాహుతి పద్ధతి ద్వారా శ్రోతల హృదయాల్లోకి సూటిగా ఆ ప్రభావాన్ని చొప్పించగల

విధంగా తన స్వరాన్ని కంపింప జేయాలి. అందుకు కావలసిన దృఢ సంకల్పం, ఆధ్యాత్మిక శక్తి అతడు కలిగి వుండాలి. అప్పుడు మాత్రమే దాని పఠనం శ్రోతలకు ఉపయోగకరంగా ఉంటుంది.

గీతా బోధనల విషయానికి వద్దాం. ఉన్నత తరగతికి చెందిన ప్రసిద్ధి బోధకులు, గురువులు కూడా మానవుడు సకల విషయాలకు తానే కర్తనని భావించరాదని సదాచెబుతూనే వచ్చారు. కాని అదే సందర్భంగా కేవలం మననం, శ్రవణం మాత్రమే ఉపయోగకరం కాజాలవు. అనుభవపూర్వకంగా పొందే సాధనా విధానాన్ని మనం చేపట్టాలి. కాని ఆ ప్రయోజన సిద్ధికై అవసరమయ్యే సాధనా విధానాలను గురించి ఎల్లప్పుడు మనం చీకట్లోనే కొట్టు మిట్టాడుతున్నాం. వారి ఉపన్యాసాలలో ఎక్కడా కూడా దాని ప్రస్తావన స్వల్ప సూచనగానైనా కనబడదు. దాని ఫలితంగా "నేను కర్తను కాదు" అని తరచు వల్లెవేయడమే తాము చేయగలిగిందంతానని అదే తమకు చాలునని ఒక పొరబాటు అభిప్రాయానికి శ్రోతలు వస్తారు. వాస్తవానికి అది ఒక అంతర మానసిక స్థితి. అప్పుడు అభ్యాసి యొక్క భౌతిక క్రియా కలాపాలేవి కూడ అతడి హృదయంపై ఎటువంటి ముద్రను వేయవు. తత్ఫలితంగా, తను కర్తని అనేభావం అతనిలో ఉత్పన్నమే కాదు. ముద్రలు ఏర్పడనప్పుడు సంస్కారాలు ఏర్పడవు. ఫలితంగా వాటి భోగాన్ని అనుభవించే అవకాశాలే ఉత్పన్నం కావు. ఆవిధంగా సంస్కారాలు ఏర్పడడం ఆగిపోతుంది. ఆధ్యాత్మిక మార్గంలో ఉన్నవారికి యిది ప్రధానంగా అవసరం. వాస్తవానికి అర్జునుడిలో ప్రాణాహుతి ద్వారా ప్రసారం చేయబడిన అసలు స్థితి యిదే. దాని ప్రభావంగానే అతడు ఒక్కసారిగా ఆ మహోన్నత చైతన్య స్థాయికి ఎదిగాడు. ఆ సమయంలో ప్రాణాహుతి ద్వారా అర్జునుడి పొందిన స్థితిని వర్ణించడానికి క్లుప్తంగా సూచనలు యీయబడ్డాయి. అవి మాటల రూపేణ కేవలం ఏడు శ్లోకాలలో పొందుపరచబడ్డాయి.

గీతలో వర్ణించిన ఆత్మస్థితి యిదే విషయాన్ని మరింతగా వివరిస్తుంది. ప్రత్యక్షంగా ఆస్థితిని పొందినవాడు ఎల్లెడలా ఏకత్వాన్నే అనుభూతి చెందుతాడు. వాస్తవానికి అదే యదార్థమైన శాశ్వత సత్యప్రాప్తి స్థితి. నిష్కామ కర్మకు గీతలో ఎంతో ప్రాముఖ్యత యీయబడింది. దానిని గురించి అనంతంగా చెబుతూ పోవచ్చు. కాని దాని ప్రాప్తికై తగిన సాధనా పద్ధతులను అవలంబిస్తేనే కాని అది అతని తలపుకేరాదు. యదార్థానికి యిది ఒక లయావస్థ స్థితి. అది లేకపోతే అర్జునుడికి ప్రదర్శించిన విరాట్ దర్శనం సాధ్యం కాక పోయి ఉండెడిది. అయినప్పటికీ దానికై అభ్యాసికి కూడా సరైన శక్తి సామర్థ్యం లోతైన అంతర్ దృష్టి అవసరమౌతాయి. విరాట్ స్వరూపదర్శనం చేసిన తరువాత

అర్జునుడు కూడా ఆ భయానక దృశ్యం చూడ శక్యం కాదని మొరపెట్టుకున్నాడు. దీనికి కారణం అతనిలోకి ప్రాణాహుతి ద్వారా ప్రసారం చేయబడిన లయావస్థ విరాట్ మండలానికి చెందిన స్థితులకు మాత్రమే సంబంధించి వుండగా, అతడు దర్శించిన దృశ్యం విరాట్ ప్రవేశానికి ఆవల సుదూరంగా ఉన్న బ్రహ్మాండ మండలం యొక్క యావత్ సంపూర్ణ శక్తిని ప్రదర్శించింది. వాస్తవానికి ప్రతీది యీ మండలం నుండే భౌతిక స్థాయికి దిగి వస్తుంది. మహా భారత యుద్ధ వ్యూహరచన యావత్తు అక్కడ సూక్ష్మరూపంలో ఉంది. ఈ దృశ్యాన్నే శ్రీ కృష్ణభగవానుడు అర్జునుడిని ఆస్థాయి వరకు పైకి లాగి అతడి దృష్టికి తీసికొని వచ్చాడు. ఏమైనప్పటికి కొందరు వ్యక్తులు ఉన్నదానిని ఉన్నట్లుగా నమ్ముటకు యిష్టపడరు. దానికి వారి కారణాలు వారికి ఉండవచ్చు. అది యీనాటికి సుసాధ్యం, అనుభవ దర్శనీయం. అయినా దానికి ప్రత్యక్షనిదర్శనం లేదు. దానికి కావలిసింది అట్టి సామర్థ్యం కల వ్యక్తి ఉండడం - సాధకుడు కూడ ఆ స్థాయికి పైకి తీసికొని రాబడగలవాడై యుండాలి.

కర్తవ్య ప్రాముఖ్యతను గురించి కూడ గీత ప్రత్యేకంగా చెబుతుంది. ప్రపంచ సామాజిక వ్యవస్థకు అదే ఆధారంగా ఏర్పడుతుంది. ఇది రాజయోగ పరిధిలోకి వస్తుంది. సంస్కారాలు వదిలేటట్లు చేయడానికి యిది అపారంగా తోడ్పడుతుంది. సర్వ ఇంద్రియాలు సద్దుమణిగి నప్పుడు యీస్థితి ప్రారంభమౌతుంది. యీ విషయంలో కేవలం మననం కాని, శ్రవణం కాని నిరుపయోగాలు. దీనిని కేవలం అభ్యసించాలి. దానికి విశాల హృదయం కావాలి. స్వల్ప కాలపరిధిలో యిది అంత సులభసాధ్యం కాదు. దానికి నిరంతర శ్రమతోకూడిన సరైన సాధన అవసరం. నేనిక్కడ చెప్పేదానిని ప్రజలు నిర్లక్ష్యం చేయవచ్చును; కాని కాల ప్రభావచే అనేక చిక్కులతో కప్పబడి ఉన్న సత్‌తత్వం బహిర్గతమై ప్రజలు దాని యదార్థ ప్రాముఖ్యాన్ని గుర్తిస్తారు. ఆ సమయం త్వరలో వచ్చుగాక! తథాస్తు.

అంధ విశ్వాసం వలన ప్రయోజనాలు, నష్టాలు రెండూ వున్నాయి. మనం ఎంచుకున్న గురువు (Guide) నిజంగా అత్యంత మహాసమర్థుడై యుండి, అత్యున్నత స్థాయిని పొందిన వాడైతే దీని విలువ అపారంగా వుంటుంది. కాని దురదృష్టవశాన్న కావలసిన ప్రమాణస్థాయి లేకుండా, తన పాండిత్య ప్రకర్షచే గాని, మహిమా ప్రదర్శనచే కాని మిమ్ములను ఆకట్టుకున్న వ్యక్తితో సంబంధాన్ని పెట్టుకుంటే, అతనిపై వున్న మీ అంధ విశ్వాసం మిమ్ములను పెడత్రోవ పట్టించి, ఆత్మవంచనలకు దారి తీస్తుంది. ఆ సందర్భంలో అతడిని గ్రుడ్డిగా అనుసరించ పూనుకున్నారు కనుక, అతడి లోపాలు కూడ మీ దృష్టికి కనపడవు. దాని ఫలితంగా మీరు లక్ష్యాన్ని పొందజాలరు. అందుచే ఎవరిపైన అయినా

విశ్వాసం వుంచే ముందు ప్రతిఒక్కరు రెండు మూడు సార్లు ఆలోచించడం అవసరం. నా అభిప్రాయంలో మార్గాన్న మనలను నడిపించే సామర్థ్యం కల వ్యక్తి మనకు తారసిల్లినప్పుడు మొదట అతనితో తగినంత సాంగత్యం ఏర్పరచుకొని దానివలన మన మానసిక పోకడలలో ఎంతవరకు మార్పు వచ్చిందో అంటే అవి క్రమంగా సద్దుమణుగుతున్నాయా లేక మామూలు పద్ధతిలోనే కొనసాగుతున్నాయా అనేది నిర్ణయించుకోవాలి. మన హృదయంలపై అతడి సాంగత్య ప్రభావం చివరకు ఏవిధంగా వుండాలో అదేవిధంగా వుందా లేదా అనే విషయాన్ని అర్థం చేసుకోడానికి ప్రయత్నించాలి. ప్రస్తుత పతనకాలంలో అటువంటి మార్గదర్శకులు, గురువులు లభించడం నిస్సంశయంగా అరుదు. అందులో దానిపై ఆధిపత్యాన్ని కలిగిన వారు మరింత అరుదు. అస్తిమితత్వం, కలతలు మన కాలంలో ప్రస్ఫుటంగా కనపడే అంశాలు. ఆధునిక నాగరికత కూడ చాలామేరకు దీనికి బాధ్యత వహించాలి. ఈ అస్తవ్యస్తస్థితిని అధిగమించడానికి ఎక్కువ సమయం, పరిశ్రమ అవసరం అవుతాయి. దివ్య ప్రభువు ఎడల మనఃపూర్వక ప్రేమ, భక్తులు మాత్రమే దీనిని తొలగించగలవు. అన్ని విధాల ఇది మాత్రమే దానికి తిరుగులేని పద్ధతి. విజయానికి అత్యంత రూఢైన మార్గం.

# వ్యామోహం, విశ్వాసం

సీత వద్ద ఒక రామచిలుక వుంది. ఆమె దానినెంతో గాఢంగా ప్రేమించింది. అది మరణించింది. ఆమె తండ్రి జనకమహారాజు తన కుమార్తె సీతను ఎంతో ప్రేమగా చూసుకునేవాడు. అందుచే ఆమె మూలంగా అతడు కూడ దుఃఖం చెందాడు. దానివలన జనక మహారాజులాంటి మహాఋషి ఒక సామాన్య రామచిలుకపై అనుచిత వ్యామోహాన్ని పెంచుకున్నాడనే అభిప్రాయానికి కొందరు రావచ్చు. కాని ఆ అభిప్రాయాన్ని వారే విధంగా సమర్థించినప్పటికి, యితరుల బాధ చూసి దుఃఖం చెందని వ్యక్తి సామాన్యంగా వుండాల్సిన మానవత్వం లేనివాడని లేక వేరు మాటలలో చెప్పాలంటే అతడు మానవుడే కాడని నా నమ్మకం. అందుచేతనే తండ్రిని, తల్లిని, సోదరుని, పుత్రుని తమ శత్రువులుగ భావింపమని ప్రజలకు చెప్పే డాంభిక జ్ఞానులతో నేను ఏకీభవించను. నామట్టుకు నేనా సూత్రాన్ని ఏ విధంగానైనా అనుసరించడానికి ఎన్నడు యిష్టపడను. వారి అభిప్రాయం ఏమైనప్పటికీ వారు ప్రజలను వారి పవిత్రపరమోద్దేశానికి తుదకు భంగం కలిగించే వాటిని బోధిస్తూ చిక్కుల్లోకి లాగుతున్నారని నా ఉద్ధేశ్యం. ఆ అభ్యాసాన్ని చేపడితే అది ద్వేషవైముఖ్య భావాలను పెంపొందిస్తుంది. అవి మన ఆధ్యాత్మిక పరమోద్దేశాన్ని సమానంగా దెబ్బతీస్తాయి.

సాధనకు నిజంగా అవసరమయ్యేది మాయామోహ భావాలను అణచడం. కాని ద్వేషం, విముఖత రెండూ ప్రేమకు సరిగ్గా వ్యతిరేకమైనట్టివి. వ్యామోహం కూడ అదే తరగతికి చెందుతుంది. ఇంకా ఔచిత్యంగా చెప్పాలంటే, అది అదే విషయానికి వేరొక చివర కొన వంటిది. ఆవిధంగా వ్యామోహానికి బదులు దానికి వ్యతిరేకమైన వైముఖ్య, దేవషభావాలను నింపితే అది అర్థరహితం అవుతుంది. ఆవిధంగా చేయుటవలన మాయామోహభావాల నుండి ఎన్నటికిని విముక్తి కాజాలము. దానికి సక్రమంగా భర్తీ చేయగలిగేది ఆకర్షణ, వికర్షణలు రెండూ వుండని కర్తవ్య పరాయణత మాత్రమే. అందుచే తండ్రిని తండ్రిగాను, తల్లిని తల్లిగాను, పుత్రుని పుత్రుడుగాను ఆదరిస్తూ వారి ఎడల తన కర్తవ్యాన్ని సక్రమంగా నిర్వహించడంలో తప్పేమీ లేదు. అప్పుడతడికి రెండు భావాలూ ఉండవు. వాస్తవానికి అది నిజంగా వుండవలసిన విధంగా ఉంటుంది.

అతి ప్రాథమిక సిద్ధే సర్వస్వమని అదే తమకు సరిపోవునని తలచి ప్రజలు ఎందుకు అహంకరిస్తున్నారో నాకు ఆశ్చర్యమేస్తుంది. అయినప్పటికీ వారు గర్వం, అహంకారాలకు వ్యతిరేకంగా వేదికల పైనుండి బోధిస్తారు. అనుభవానికి రాని వారి వేదశాస్త్ర విజ్ఞానమే

బహుశః దీనికి కారణం కావచ్చు. సాధారణంగా ఆధ్యాత్మిక రంగంలో ఎటువంటి అనుభవాత్మక సిద్ధి పొందకమునుపే ఆధ్యాత్మిక శిక్షణను యితరులకు యిచ్చుటకు పూనుకునేవారు తరచుగా యీ దుష్టలక్షణం పాలవుతారు. ఇప్పటికే ఉన్న ఆహంకారపు గొలుసులో గర్వం, అహంకారం అనేవి మరొక లంకె అవుతాయి. నీచమైన యీ చెడు నుండి కాపాడుకోవడానికి మన సంస్థలో నిర్దేశించిన విధంగా మనఃపూర్వక ప్రార్థనచే దైవంతో నేరుగా సంబంధం కలిగి వుండాలి. ఈ ప్రాథమిక సూత్రాన్ని అలక్ష్యం చేస్తే, అతడు సాధనలో లేశ మాత్రం కూడా ఆసక్తి లేనివాడని, దానిని కేవలం ఒక వినోద కాలక్షేపంగా మాత్రమే చేపట్టాడని నేను నమ్ముతాను.

దృఢ సంకల్పం, ధైర్య సాహసాలు పురుష లక్షణాలలో ముఖ్యమైన అంశాలు. అంతిమ విజయానికి కావలసినదీ అదే. కాని ఈ విషయంలో సామాన్యంగా నా సలహా నిర్లక్ష్యం చేయబడుతూనే వుంటుంది. బహుశః అది నాకు శాస్త్రపాండిత్యం తగినంతగా లేకపోవడం వలన కావచ్చు. సామాన్యంగా ప్రజలు ఒక ఉన్నతాత్ముడి విషయంలో దానికే విలువిస్తారు. శాస్త్ర విజ్ఞానం, పాండిత్యాలకు వాటి ప్రాముఖ్యత వాటికి వుంది. అవి ఉన్నవారు తరచు ఉన్నతంగా గౌరవింపబడతారు. నాకు కూడా వారి ఎడల గౌరవం ఉంది. ఆకారణంగానే సాధారణంగా నేను వారికి సకల లాంఛన పద్ధతులలో అగ్రాసనాన్ని యిచ్చి వారి ఎడల అణకువతో ప్రవర్తిస్తాను. కాని నామట్టుకు నేను శాస్త్రవిజ్ఞానాన్ని ఎన్నడూ కాంక్షించలేదు. అయినప్పటికీ నిర్మొహమాటంగా చెప్పాలంటే ఏ విషయంలోను నాకు శాస్త్రజ్ఞానం లేదని అనుకోను. అది నాకు సంపూర్ణంగా వుంది. దానికి కారణంగా నా సమర్థ గురుదేవుడు తనకున్న ప్రతీదానిని నాకు ప్రాణాహుతి ద్వారా ప్రసారం చేసారు; అందులో శాస్త్రజ్ఞానం కూడా వుంది. ఆ కారణంగా అత్యంత నిమ్నస్థాయి నుండి మహోన్నత స్థాయి వరకు గల అన్నిరకాల శాస్త్రజ్ఞానం నాకు అపారంగా వుందని భావిస్తాను. కాని దానిని వెల్లడించుటకు సాంకేతిక పదజాలాన్ని ఉపయోగించ లేకపోవచ్చు. నా గురవర్యుల నుండి నేననుకరించిన సాధు ప్రవృత్తి, స్వభావాలే దానిని పొరతో కప్పివేసి వుంచాయి. శాస్త్ర గ్రంథాలనుండి సేకరించిన జ్ఞానం యదార్థానికి ఏవిధంగాను జ్ఞానం అనిపించుకోదు. అది యితరుల అనుభవంపై ఆధారపడిన పాండిత్యం, మేధాశక్తి ఘనత మాత్రమే, కాని ఆత్మానుభవంతోను, హృదయంతోను సిద్ధించుకున్న అనుభవాత్మక అజ్ఞానం కాదు. అసలు జ్ఞానాన్ని నిజంగా అన్వేషించేవారికి ఇది మార్గాన్ని చూపే దీపం అవ్వాలి. నా విషయంలో ఆవిధంగానే జరిగింది. శాస్త్ర జ్ఞానప్రాప్తికి ప్రయత్నించ డానికి మారుగా జ్ఞానానికి, పరిపూర్ణతకి నిలయం అయిన నా దివ్య గురువర్యులైన ఆయన అన్వేషనలోనే నేను

ఎల్లప్పుడూ వున్నాను. ఈ కారణంగానే నేను నా ఆలోచనలు, పలుకులు అన్నింటిలోను సత్‌తత్వం నుండి ఎన్నటికి దూరం కాలేదు. నా గురుదేవులపై నాకున్న ప్రేమ యొక్క అంతాన్ని దర్శించాలనే దహించి వేస్తున్న ఆకాంక్షతో నేనీ రంగంలో ప్రవేశించాను. అది నాకు సంపూర్ణంగా నెరవేరింది.

# శాశ్వత సత్య ప్రాప్తి స్థితి

అత్యుత్తమమైనవిగాను, అత్యంత ఫలదాయకంగాను చెప్పబడే సాధనా విధానాలు అనేకం వున్నాయి. నిస్సందేహంగా అవన్నీ శాశ్వత సత్యప్రాప్తే తమ గమ్యమని చాటుకుంటాయి. కాని యిక్కడ మనం కొంచెమాగి హృదయ చక్షువుతో వాటిని పరిశీలించి అంచనా వెయ్యాలి. 'హృదయం' అనే పదాన్ని ప్రయోగించడానికి కారనం అది కేంద్రమై (Nucleus) ఎటువైపు లక్ష్యం చేయబడుతుందో అటువైపు కంపించే చలనం ఏర్పడుతుంది. మనస్సు పని చేసే రంగం యిదే. మన వివేచనాశక్తిని పెంచుకొనే సాధనం కూడా యిదే. దైవశక్తి దిగిరావడానికి సూక్ష్మశక్తులు యీ మండలంలో క్రియాత్మకం అవుతాయి. ఏదో విధంగా మన ఆలోచన దానితో జతకూడితే సరైన దానిని సంగ్రహించునట్లు దానికి శిక్షణ నిచ్చి, సత్‌తత్వం వైపుకు మళ్ళిస్తే సమస్య పరిష్కారమవుతుంది. కాని శాశ్వత సత్యప్రాప్తిని గురించిన స్పష్టమైన భావం వుంటేనే కాని అది అసాధ్యం. ప్రతి మతచింతనా పరుడు, వైజ్ఞానిక శాస్త్రపరిశోధకుడు అత్యంత సూక్ష్మశక్తే పని చేస్తోందని అభిప్రాయ పడతాడు. పెడత్రోవ పట్టిన మీ ఆలోచనలచే సంతరించుకున్న స్థూల్యత నుండి మీరు విముక్తిని పొందితే, దీనిని సులభంగా తెలిసికొనగలరు. సూక్ష్మత్వం వైపుకు మనం కదలడానికి అది దోహదం చేసినట్లైతే పద్ధతి సక్రమమైనదని మీరు యిప్పుడు సులభంగా ఊహించవచ్చు కాని అది మిమ్ములను యింకా స్థూలత్వంతో నింపితే అది తప్పేగాక మిమ్ములను క్రిందికి లాగివేస్తుంది కూడా. శాశ్వత సత్యప్రాప్తి చాలా దూరం అవుతుంది.

మహిమలు సంభవిస్తాయి. వాటిని రెండు తరగతులుగా విభజించవచ్చు. మొదటి రకం ఎల్లప్పుడూ దైవమునకు, రెండవరకం ప్రాపంచికమునకు ఉద్దేశించబడినవి. మొదటి రకము మహిమలు సూక్ష్మవిధానాలకు అనుసరించేవారిలో చైతన్యవంతమై మనమందరం ఎదుర్కొంటున్న జీవిత సమస్యను పరిష్కరిస్తాయి. దీనికి విరుద్ధంగా స్థూల విధానాలను అనుసరించే వారిలో రెండవ రకము మహిమలు పెంపొంది హృదయానికి భారతర మౌతాయి. అయితే యీ నీచసిద్ధుల స్థితులలో లీనమైన వాడు మొత్తం మీద చెప్పుటకు ఒక చిక్కుముడివలె అవుతాడు. దానితోపాటు తనలోనే ఒక సుడిగుండాన్ని ఏర్పరచుకొని దానిలో మునిగిపోతాడు. ఆ శక్తిని యితరులపై ప్రయోగిస్తే వారు కూడ అదే సుడిగుండంలోకి లాగబడుతారు. దైవ సంబంధమైన కార్యనిర్వహణాభారం అప్పగింపబడిన వారిలో సూక్ష్మసంబంధమైన మహిమలు వృద్ధి అవుతాయి. మన సంస్థలో గురువుపై

దృఢ విశ్వాసం కల అభ్యాసి యీ సూక్ష్మసంబంధమైన మహిమాశక్తులు లేకుండ ఉండడం అరుదు. కాని గురువర్యుల హస్తం అతడిని అదుపులో ఉంచి, పెడత్రోవ పట్టకుండా చేయుటకు అతనిని కుడి, ఎడమల వైపునకు కూడ తొంగి చూడనీయడు. అతడు వాటి ఎరుకను కూడ కలిగి వుండడు. కాని తనకు అప్పగించబడిన ఆ దైవకార్యం యొక్క స్వభావం కేవలం దివ్యసంబంధమైన మహిమా శక్తులను పెంపొందించే "హైలెమ్ షాడో" (Hylem Shadow) జాగృతం కావింపబడినప్పుడు వాటిని గురించి అతడికి తెలుస్తుంది. ఈ విషయంపై మరికొన్ని వివరాలలోకి నేను వెళ్లను. మనిషిని సత్క్రమ మార్గంలో పెట్టగలిగితే అదే అత్యుత్తమమైన మహిమలలో ఒకటని చెబితే సరిపోతుంది.

సహజ మార్గ విధానం పరతత్వంకు మిక్కిలి సన్నిహితంగా వుండి, సూక్ష్మపద్ధతులపై నడుస్తుంది. అందుచేతనే యిది ఎంతో సరళం, సహజం అయినప్పటికీ సామాన్యులు అర్థం చేసికోలేరు. దివ్యజ్యోతి ఉందనే భావంతో హృదయంపై ధ్యానించమని అది నిర్దేశిస్తుంది. కాని విద్యుత్కాంతి లేక చంద్రకాంతివలె ఏదో ఒక రూపంలో ఆ జ్యోతిని చూచుటకు ప్రయత్నించవద్దని అభ్యాసిని ఆదేశిస్తుంది. అట్టి సందర్భంలో అక్కడ కనబడే జ్యోతి నిజమైనదికాక, అతడి మానసిక కల్పనే అవుతుంది. అభ్యాసి దానిని దివ్యభావనతో కూడిన ఒక ఊహగా మాత్రమే తీసికొని ముందుకుసాగాలని చెబుతాము. అప్పుడది అత్యంత సూక్ష్మమైనది అవుతుంది. దాని ఫలితంగా అది మనం పొందవలసిన అత్యంత సూక్ష్మమైన దానిపై ధ్యానం చేస్తాం. ప్రతి మహాత్ముడు దానికి "జ్యోతి" అనే పదాన్నే ప్రయోగించాడు. సత్‌తత్వానికి అదే అత్యుత్తమ పదం కావున నేను కూడ దానిని ప్రయోగించక తప్పదు. కాని దానివలన కొంత చిక్కు సమస్య ఏర్పడుతుంది. "జ్యోతి" అని అనగానే కాంతిమయ భావం ప్రముఖంగా కలుగుతుంది. దానిని మెరిసే కాంతిగా తీసుకుంటాం. అసలైన ఆ జ్యోతికి అటువంటి స్వభావం ఏదీలేదు. అది కేవలం ఆ సత్పదార్థానికి, మరింత యుక్తంగా చెప్పాలంటే "పదార్థ రహిత పదార్థం"కు చెందుతుంది. మన పద్ధతిలో అభ్యాసి ఒక్కొక్కప్పుడు జ్యోతిని నిస్సందేహంగా సందర్శిస్తాడు. కాని మెరిసే కాంతి ప్రారంభంలో పదార్థం శక్తితో సంయోగం చెందినప్పుడు కనబడుతుంది. వేరు మాటలలో చెప్పాలంటే శక్తి పనిచేయడం ప్రారంభించిందని చెప్పడానికి ఇది ఒక సూచన మాత్రమే. నేను "రాజయోగ ప్రభావం"లో చెప్పినట్లు, నిజమైన ఆజ్యోతి అరుణోదయవర్ణంగాను, లేక వర్ణరహిత స్థితి యొక్క అసమగ్ర ప్రతిబింబంగాను వుంటుంది.

ఈ విధానంలో ఆత్మచుట్టూ మేఘంలా క్రమ్మివున్న దట్టమైన ఆ మబ్బువర్ణం పోయేటట్లు స్థూలత్వాన్ని తొలగించడానికి ఎక్కువ ప్రాముఖ్యత యీయబడుతుంది.

అది సంస్థలోని ప్రశిక్షకులు (Preceptors) అందరూ చేయవలసిన కర్తవ్యంలో ఒక ముఖ్యభాగం. కాని యీ విషయంలో అభ్యాసి తనకు తానుగా చేసుకోవలసింది ఎంతో మిగిలి వుంది. అందుకు ఒక పద్ధతి అతడికి నిర్దేశించబడింది. ఇదివరకే చర్చించబడింది కావున, మనం హృదయంపై ఎందుకు ధ్యానం చేయాలి అనే విషయాన్ని నేను ప్రస్తావించదలచుకోలేదు.

పాండిత్య ప్రకర్షకల మహాత్ములు శాశ్వత తత్వ ప్రాప్తిస్థితిని అనేక భిన్న విధాలుగా నిర్వచించడానికి ప్రయత్నించారు. కాని దానిని నిర్వచించగలిగితే అది శాశ్వత తత్వ ప్రాప్తి కాజాలదు. నిజానికి అది ఒక మూగ స్థితి (Dumb State). దానిని వివరించడానికి ఏ పదం చాలదు. లోపల, వెలుపల కూడ కాంతిని అనుభూతి చెందడం కాని, దర్శించడం కాని ఏమాత్రం శాశ్వత తత్వప్రాప్తి కాదు. నా అభ్యాసపు తొలిదశలో నేను తరచు కాంతిని దర్శించి అనుభూతి చెందేవాడిని, కాని అది గమ్యం కాదు. నా గురువర్యులు ఎంతో మెళకువతో అందించిన సహాయంతో నేను డాక్టరు కె.సి. వరదాచారి గారు (మన విధానానికి) చెప్పినట్లు "కాంతి నుండి బూడిద వర్ణం" వరకు ముందుకు పయనించాను. వాస్తవానికి మనం చివరకు చేరేది కాంతి భావంతో కూడిన జ్యోతి కాదు. అది మన సంస్థ చిహ్నం సూచించిన విధంగా చీకటి, వెలుగు రెండూ లేని గమ్యస్థానం. అది బహుశః ఏమైవుండవచ్చు అనేది మాటలకు అతీతం.

మానవ హృదయం సత్‌ప్రాప్తికై అంతరంగా తపించడమే, వైజ్ఞానికంగా (consciously) సత్‌తత్వప్రాప్తి గ్రాహ్యాతీతము (ప్రజ్ఞ) వైపు వెళ్ళడానికి యిది నిచ్చెనవంటిది. ఈ తపన తీరినప్పుడు మనం ఎవరో మనకే తెలియకుండా అవుతాం. ఆవిధంగా ఒక మరచిన స్థితిలోకి ప్రవేశిస్తాము. అక్కడ మనల్ని మనమే సంపూర్ణంగా మరచి, దేహాత్మల ఎరుక కూడా పూర్తిగా లేకుండ వుంటుంది. హృదయానికి భారం కలిగించే అస్తిత్వపు భావముద్రలు అన్ని కడిగివేయబడతాయి. తానెవరు, యితరులెవరు అనేదాన్ని కూడ అక్కడ ఊహింపజాలడు. సంబంధ బాంధవ్యాల ముడి తెంచి వేయబడుతుంది. తనకు ఎవరితోను సంబంధంలేదని భావిస్తాడు. క్లుప్తంగా చెప్పాలంటే తన అస్తిత్వాన్నే (entity) పోగొట్టుకుంటాడు. అతడు చేసే పనులు అతనిపై ఎటువంటి ముద్రను వేయజాలవు. సంస్కారాలు ఏర్పడడం ఆగిపోతుంది. వాటి ప్రభావం నుండి విముక్తి పొందుతాడు. ఆవిధంగా అతడు శ్రీకృష్ణ భగవానుడు గీతలో ఎంతో మనోహరంగా వివరించిన నిష్కామకర్మ స్థితిని పొందుతాడు. ఈ దశలో మనిషి సృష్టి ఆవిర్భవానికి పూర్వ నెలకొని వున్న స్థితిని పోలి ఉన్న సమత్వస్థితిని దాదాపు సాధిస్తాడు. అతడి హృదయం ప్రశాంతతో

నిండి వుండి, మనస్సు సుశిక్షిత మౌతుంది. ఒక్క క్షణం కూడ విడిపోలేనంతగా అతడు బ్రహ్మంలో లీనమైవుంటాడు. అందువలన యిటుపై అతడు దైవంపైనా లేక తనపైన కూడా ధ్యానం చేయజాలడు. అయినప్పటికి అతడు కొంచెం సేపు ధ్యానం చేయడానికి ప్రయత్నించినా ఊపిరి ఆడదు. దానికి కారనం అతడు ఎటువంటి సాంద్రత లేని మండలంలో యీదుతున్నాడు కావున. ఈ దశలో ఆత్మ శాశ్వత తత్వాన్ని పొందుతుందని అంటారు. కాని అది పొరబాటు అభిప్రాయం. తానెవరిననే ఎరుక అతడికి యింకా వుంటుంది. దీనికే వారు ఎక్కువ ప్రాముఖ్యత నిస్తారు. ఈ దశలో దేహకణాలు అన్నీ శక్తివంతంగా మారి చివరకు దాని అంతిస్థితిని పొందడం జరుగుతుంది. అక్కడ అందం లేదు; ఆకర్షణ లేదు; ఆనందం (ప్రజలు అర్థం చేసికొనే భావంలో) లేదు. అది రుచిలేని స్థితి. మార్పులేనట్టిది. శాశ్వతంగా వుండేటటువంటిది. దానిని "సంగ్-ఇ-బేనమక్" ఉప్పదనం తీసివేసిన ఉప్పురాయి గడ్డవంటిదని మరింతౌచిత్యంగా చెప్పవచ్చు.

శాశ్వత తత్వప్రాప్తి స్థితిని పొందినవాడు ఆధ్యాత్మిక రంగంలో తిరుగులేని సంకల్ప శక్తిని పెంపొందించు కుంటాడు. అతడు మరచిన స్థితిలో (State of forgetfulness) వున్నప్పటికీ ప్రపంచంలోని విజ్ఞాన శాస్త్రాలన్నిటినీ తెలిసినవాడుగా (పరిమిత భావంలో) వుంటాడు. దైవం సర్వవిషయాలు తెలిసినవాడు. ఆయనలో లీనమైవున్న వ్యక్తి కూడ సర్వం తెలిసినవాడై (మానవ పరిమితులకు లోబడిన విషయం గుర్తుంచుకోవాలి) వుండాలి. కాని గురువర్యులచే పరిమితులు విచ్ఛిన్నం చేయబడినప్పటికీ, మానవత్వ భావం యింకా పోదు. సహజస్వభావం తుదివరకు ఉంటుంది. సహజ స్వభావం (Instinct) కూడా లీనమైతే మనిషి ఒక్కసారిగా దేహాన్ని పరిత్యజించాలి. అందుచే ఆ స్థితిలో అతడు పరిస్థితిని అనుసరించి ఇహపరాలు రెండింటిని గమనిస్తూ ఉంటాడు. అందుచే, అనంతత్వాన్ని పొందడానికి అనంత దృష్టి ఉండటం అవసరం. దాన్ని సిద్ధించుకోవడానికి అనుసరించే పద్ధతి కూడ సక్రమమైన పద్ధతి అయివుండాలి.

సహజమార్గ విధానంలో కేంద్రాలు, ఉపకేంద్రాలలో అణగారివున్న శక్తి వాటి సక్రమ కార్యనిర్వహణకై జాగృతమవుతుంది. ఉన్నత కేంద్రాలు జాగృతమైనప్పుడు వాటి ప్రభావం నిమ్న కేంద్రాలపై పడడం ప్రారంభిస్తుంది. అది దివ్యత్వంతో సంయోగం చెందినప్పుడు, నిమ్న కేంద్రాలు వాటిలో లయమౌతాయి.

ఆవిధంగా ఉన్నత కేంద్రాలు నిమ్న కేంద్రాలను ఆధీనంలోకి తెచ్చుకుంటాయి. నిమ్న కేంద్రాలు కూడ వాటిని ఆవరించి ఉన్న స్థూలతర ప్రభావం నుండి విడుదల కావడానికి పరిశుభ్రం కాబడుతాయి. అదిమాత్రమే సహజమైనటువంటి విధానం.

సహజమార్గంలో అనుసరించే పద్ధతి తప్ప మరేది అటువంటి ఫలితాలను ఎన్నటికి తీసుకురాజాలదు. అభ్యాసి సామర్థ్యం పెంపొందించుకుంటే గురువుపై అచంచల విశ్వాసం వున్న యీ సంస్థలోని ప్రతి ప్రశిక్షకుడు (Preceptor) ఒక్క క్షణంలోనే అటువంటి ఫలితాలను తీసికొని రాగలడు.

మన ప్రగతి మార్గంలో ఒకదాని వెంబడి మరొకటిగా అనేక విభిన్న పరిస్థితులు యీదశలో వస్తాయి. కాని అక్కడ నెలకొని వున్న పరిస్థితి ఎట్టిదన అభ్యాసి స్వప్రయత్నం చేతనే ఆదశను దాటి తరువాతి దశకు చేరడానికి యత్నిస్తూ అక్కడ దివ్యశక్తి యొక్క ప్రవాహబలాన్ని తట్టుకునే శక్తి లేక వెంటనే క్రిందకు జారుతాడు. సమర్తుడైన గురువు యొక్క శక్తి మాత్రమే అతడిని నిలిపి వుంచి దానిని అధిగమించునట్లు చేస్తుంది. మరీ ఉన్నత దశలలో ప్రవాహబలం మరింత అధికమౌతుది. దానికి కారణం దైవశక్తి యింకా సూక్ష్మమై ఉంటుంది. సహజంగా ఆ సూక్ష్మశక్తి మరింత బలీయమౌతుంది.

నేను పండిలును ఎక్కువగా గౌరవిస్తాను. అయినప్పటికీ సాధారణంగా వారు శాశ్వత తత్వప్రాప్తి స్థితిని గురించి విశ్వసింపదగిన అనుభవాత్మక జ్ఞానంపై కాకుండ, తమ శాస్త్ర పాండిత్యాన్నే ఆధారంగా తీసికొని తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తారు. ఆకారణంగా శాశ్వత తత్వప్రాప్తి యీనాడొక ఆధునిక కళగా అయిందని చెప్పడానికి నేను చింతిస్తున్నాను. సత్‌తత్వం దాని బాహ్యాపొరను కళాకారులు తమ మానసిక అభిరుచికీ, నైపుణ్యానికి తగినట్లు విభిన్న వర్ణాలలో చిత్రీకరించుకునేటట్లుగా లోతుగా కూరుకొని పోయింది. దాని ఫలితంగా ప్రజలు తమదృష్టిని ఆ చిత్రలేఖనాల పైనే కేంద్రీకరించి వాటిలో చాలావరకు మునిగి వున్నారు. అది ఆధ్యాత్మికత కాదు, యదార్థమైనదికాదు. నిజభావంలో దానిని పొంది, దాని నుండే అతడిలో దివ్యజ్ఞానం కలిగివుంటే కాని శాశ్వత తత్వ ప్రాప్తి విషయాన్ని స్పృశించడానికి కూడ ఎటువంటి హక్కులేదని నేను నమ్ముతాను.

# దివ్యదృష్టి

మనిషికి రెండు కళ్ళు ఉన్నాయని ప్రతి వ్యక్తికి తెలుసు. కాని శాస్త్రజ్ఞులు మనిషి పాల భాగంలో ఒక గ్రంథి నేత్ర రూపంలో వుందంటారు. దానికి దివ్యదృష్టితో సంబంధం ఉంది. అది మనిషి యొక్క మూడవ నేత్రంగా తెలియబడుతోంది. మానవ దేహాన్ని కోసి పరిశీలించడం ద్వారా సమీకరించిన సమాచారం దానిని గురించి మనకు ఒక సమగ్రమైన అభిప్రాయాన్ని యీయదు. యోగం ద్వారానే దానిని గురించి సరిగా తెలిసికొనగలం. పతంజలి మహాఋషి సంయమన (Method of control) విధానం గురించి తన గ్రంథంలో వివరించాడు. ఒక యోగికి వుండే అత్యధిక శక్తివంతమైన ఆయుదం అదేనని ఆయన భావిస్తాడు. దీని సహాయంతోటే తనాధ్యాత్మిక శక్తిద్వారా యోగి ప్రతివస్తువును గురించి తన దేహనిర్మాణంలోని అంతర స్థితులన్నిటి గురించి తెలుసకుంటాడు. శరీరంలో యంత్రాంగం యావత్తు చేసే పనిని అతడు చూడగలడు. శరీరంలోని ఏభాగమైనాసరే దాని సమగ్రస్వరూపం అతడి దృష్టికి వస్తుంది. ఎట్టిశక్తినైనా సరే ఆయన దానినే ప్రదేశంలో ఉపయోగించ తలచినప్పటికీ, ప్రయోగించగలడు. ఎంత స్వల్పవిషయమైనా అది ఆయన దృష్టి నుండి తప్పించుకోజాలదు. ఆవిధంగా చూచుటకు పద్ధతి వుంది. ఏ ప్రదేశాన్ని గురించి అయితే ఆ యోగి తెలుసుకొనగోరునో దానిని తన సంకల్ప బలంతో బయటకు తీసి దాని సంపూర్ణ ప్రభావాన్ని వాతావరణంలో విస్తరింప చేస్తాడు. ఈవిధంగా తను చూడగోరేది ఏదైనా దాని సమగ్ర స్వరూపం ఆయనకు కనబడుతుంది. దానికి అతడికి చాలా తక్కువ కాలం మాత్రమే పడుతుంది. దానిని చూసి ఆ ప్రభావాన్ని అవగాహన చేసికోవడానికి కొంత సమయం తీసికుంటుంది.

యోగం ద్వారా యీ దివ్యనేత్రాన్ని గురించిన నా స్వీయ పరిశోధనను, అనుభవాన్ని చదువరుల ముందు పెడుతున్నాను. పీనియల్ నేత్రం (Pineal eye)గా తెలియబడే యీ గ్రంథిలో మూడు రంగులు కనబడతాయి. ముందుభాగం కాంతివంతంగా ఉండి దాని నిర్మాణం యిసుక రేణువుల వలె ఉంటుంది. ఈ బాహ్య ఉపరితల భాగమే మేథస్సు యొక్క స్థానం. దాని వెనుకన వున్న భాగం అనగా మధ్యభాగం ముదర ఊదారంగులో ఉంటుంది. అన్నిటికంటె వెనకాల భాగం ఎరుపు వర్ణంలో ఉంటుంది. ఇదే దివ్యజ్ఞానం యొక్క స్థానం. యోగాభ్యాసంలో కాంతివంతమైన యీ బాహ్య ఉపరితల భాగం మొదట తెరచుకుంటుంది. దానిలోకి పూర్తి ప్రవేశాన్ని పొందిన తరువాత మధ్యభాగం తెరచుకోవడం ప్రారంభించి కాంతివంతమౌతుంది. కాని ఆ కాంతిలో

ఊదారంగు ఛాయ తప్పనిసరిగా ఉంటుంది. చివరగ ఆఖరి భాగం తెరువబడే సమయం వచ్చినప్పుడు, అది కూడ కాంతివంతమౌతుంది. ఈ స్థితులను అన్నిటిని పొందిన యోగి గొప్ప సమర్థుడైన యోగిగా భావించబడతాడు. ఇంకా ముందుకు పోతే, యీ రెండు వర్ణాలు కూడ పోయి, కేవలం ఒక్క స్థితి మాత్రమే ఉంటుంది. అదే కాంతివంతమైన తేజస్సు. ఈ ప్రదేశము శుక్ర గ్రహంతో సంబంధం కలిగి వుంటుంది. దానిమీద ఆధీనం పొందినవాడు శుక్రగ్రహం మీద పూర్తి ఆధిపత్యాన్ని సంపాదిస్తాడు. ఈ గ్రంథికి వెన్నుపాము (సుషుమ్నానాడి)తో ఎటువంటి సంబంధం కలిగి వుంది. ఈ ప్రదేశం పూర్తిగా తెరువబడినప్పుడు, దాని క్రింది చక్రాలన్నీ పరిశుద్ధం కావింపబడినప్పుడు దివ్యజ్ఞానం ఉదయించడం ప్రారంభిస్తుంది. అందువల్లనే యోగంలో యీ ప్రదేశాన్ని జ్ఞాన స్థానమని (Place of wisdom) అందురు. ఈ ప్రదేశానికి కొంచెము పైగా మరియొక బిందువు వుంది. అది చైతన్యవంతం అయినప్పుడు, అంతర విషయాల అనుభూతి మిక్కిలి ప్రభావితమవుతుంది. వాతావరణంలో తేలియాడే మంచి ఆలోచనలు, చెడు ఆలోచనలు కూడ అనుభూతి చెందడం కాని, తెలసికొనడం గాని జరుగుతుందని దీని అర్థం. ఇతరుల ఆంతరంగిక ఆధ్యాత్మిక స్థితిని తెలుసుకొనడంలో యీ ప్రదేశం ఉపయోగపడుతుంది. దీనిరంగు గోధుమ (Brown) వర్ణంలో ఉంటుంది. ఈ ప్రదేశాన్ని చేరి తరువాత, మన బుద్ధి యొక్క కార్యకలాపాలు ఆగిపోయి, ఆధ్యాత్మిక రంగం మొదలవుతుంది. దీనిలో పూర్తిలయం అయినప్పుడు దాని గోధుమ వర్ణం కనబడకుండ పోయి ఆ ప్రదేశం కూడ కొంచెము తేజోవంతమౌతుంది. దీనితరువాత గ్రంథికి ఎటువంటి వర్ణం లేదు. కొంచెం బూడిద వర్ణంతో కలిసిన మరింత తెలుపు వర్ణమని లేక వేరు మాటలలో వెలుగు కాదు, చీకటి కాదు అని మనం చెప్పవచ్చు. దీని సహాయంతో భౌతిక ప్రపంచంలో జరిగేముందు బ్రహ్మాండ మండలంలో సూక్ష్మరూపంలో సంభవించే సంఘటనలను గురించి తెలుసుకోవచ్చును. కాని యీస్థితిపై సంపూర్ణ ఆధిపత్యం పొందినప్పుడు మాత్రమే యిది సాధ్యం కాగలదు.

ఇక మూడవ నేత్రం ఉంది. దానిని తెరచినంతనే ఒక్క క్షణంలో ప్రపంచమంతటిని భస్మం చేయగలదని అంటారు. దానికి పైన చెప్పిన గ్రంథులతో ఎటువంటి సంబంధం లేదు. ఈ విధ్వంసక శక్తి గల నేత్రం శివునికి చెందినదని సామాన్య అభిప్రాయం. వాస్తవానికి అది తల వెనుకవున్న ఉబ్బెత్తు భాగంలో (Occipital Prominence) ఉంటుంది. ఆంగ్లంలో నేను రచించిన ‘‘రాజయోగ ప్రభావం’’లో దీనిని వివరించాను. మహాభారత యుద్ధంలో అవిచ్ఛిన్నంగా పద్దెనిమిది రోజుల పాటు యీ విధ్వంసక నేత్రం తెరచి ఉంచబడింది. ఈ మహా విధ్వంసం సంభవించడానికి కారణం యిదే.

# హృదయంపై ధ్యానం

భౌతిక తత్వంతో నిండివున్న ఈ యుగంలో ఆధ్యాత్మికత ఒక విభిన్న మార్గాన్ని పట్టింది. ప్రయోగాత్మక విలువ అసలు విషయం కన్నా సదా ముందే ఉంటోంది. ప్రస్తుతం ఒక మహాత్ముని తెలుసుకొనుటకు అసలైన పరీక్ష అతడి యదార్థ అంతరస్థితి కాదు. అతడి బాహ్య స్వరూపం మాత్రమే. అంతరస్థితులను ప్రయోగాత్మకంగా పరిశోధించి తెలుసుకొనే పద్ధతులు అరుదుగా లభ్యం అవుతాయి. కావున ప్రాచీన ఆధ్యాత్మిక శిక్షణా విధానాలు ప్రక్కకు నెట్టబడ్డాయి. అందువల్లనే యిప్పుడు ముందుగా పాఠకులకు అవలంభించవలసిన సరైన జీవన పద్ధతులను వివరించడం అవసరం అవుతుంది. అందుచే ఆధ్యాత్మిక శిక్షణా పద్ధతి అంతా ఆధారపడి ఉన్న ఆ అసలైన హేతువులను పాఠకులు ఊహించుకొనుటకు ఏదో ఒకటి వ్రాయడం అవసరమైంది. నా గ్రంథాలు ఈ రంగంలో నాకున్న స్వానుభవంపై ఆధారపడి వ్రాయబడినవి. నేను అనావశ్యక వ్యాఖ్యానాలను వదలి, ప్రాథమిక విషయాలను మాత్రమే చర్చించాను. వాటియందు చెప్పిన విషయాలు నేను చేపట్టిన కార్యక్రమంలో అసలు భాగానికి సరిగా వర్తిస్తాయి.

సాధారణంగా మీకు హృదయ స్పందనలు కలిగేచోట హృదయంపై ధ్యానం చేయమని నేను సలహానిచ్చెదను. దాని దృశ్యం హృదయ మండలం అంతా విస్తరింప చేయాలని నా ఉద్దేశం కాదు. అందుచే అభ్యాసిపైన చెప్పినట్లుగ, ధ్యానం చేయడానికి హృదయాన్ని తెలుసుకోవాలి. 'ఎ' (A) మరియు 'బి' (B) పై కూడ ధ్యానం చేస్తారు. అవి ప్రారంభదశలో అనవసరం. కావున నేను వాటిపై ధ్యానం చేయమని అందరినీ నిర్దేశించలేదు. దాహం వేసినప్పుడు నీటిని త్రాగితేనే అది తీరుతుంది. దాని కారణం గురించి గాఢంగా ఆలోచిస్తూ వుంటే దాహం తీరదు. హృదయాన్ని రెండు భాగాలుగా విభజించాను. దాని వివరాలు జోలికి పోదలుచుకోలేదు. అవి అభ్యసించి అనుభవాత్మకంగా గ్రహించవలసిన విషయాలు. అయితే సంస్థలోని ప్రశిక్షకుల (Preceptors)కు వారు చేయవలసిన పని అంతా వాటితోనే ఉంది. కనుక యివి పూర్తిగా స్పష్టం కావింపబడినాయి. వివిధ ప్రకృతి శక్తులు హృదయంలో దాగివున్నాయి. వాటి నుండి సంప్రాప్తించిన శక్తి దుర్వినియోగం కాకుండా ఉండడం కోసం అది వెల్లడి కానటువంటి రహస్యంగా ఉండి పోయింది.

మన ప్రయాణ మార్గంలో "సత్యోదయము"లో వివరించిన వృత్తాల గుండా మనం

పోవలసివస్తుంది. ప్రతి అణువులో కూడ ఈ వృత్తాలతోపాటు యావత్తు విశ్వాన్ని మీరు చూడవచ్చు. కాని అది మనకు సరిగ అర్థంకావడానికి చాలా సమయం, అనుభవం కావలసి ఉంటాయి. కావున మనం సత్పదార్థాన్ని (real substance) చూడాలి కాని అది ప్రదర్శించే దృశ్యాన్ని మాత్రం కాదు. హృదయానికి పై, క్రింది భాగాలను చూపిన పటము అర్థం చేసికోడానికి ఊహాధారంగా వేసింది మాత్రమే. నిమ్న స్థితిలో ఉన్న హృదయం పరివర్తన మార్గాన్ని ఏవిధంగా అవలంబిస్తుందో అనేది అంత సులభంగా అర్థంకాని సమస్య. ఈ పరమ రహస్యాన్ని వివరించడానికి మాటలు దొరకవు. దానిని "మారిన దశ, జీవిత పరిణామం" అని మాత్రమే చెప్పగలను. అప్పుడు హృదయం దుష్టమానసిక కార్యకలాపాల నిలయంగా కాక, ప్రకృతి కార్యరంగంగా మారుతుంది. సర్వము సత్ అవుతుంది. హృదయం కూడ. శారీరకంగా దాని స్థానంలో అది ఉన్నప్పటికీ మారుతుంది. "L" "U"గా మారుతుందని చెబితే అది మరింత అర్థం కాని విషయం. కాని దానిని విశదీకరించడానికి "నిశ్శబ్దం" అనే మాట మాత్రమే బాగా సరిపోతుంది. పుస్తకాన్ని మరో మాటు చదవమని అర్థిస్తున్నాను. నీవు ఆవిధంగా చేస్తే, దానిలో నీ సంశయాలన్నింటికీ సమాధానాలు దొరుకుతాయి. నాకు అత్యంత ప్రీతిపాత్రమైన అభిప్రాయాన్ని మీ ముందు వ్యక్తం చేస్తున్నాను. ఈ జగత్తు ఏవిధంగా ఉద్భవించిందో ఆలోచించడానికి మారుగా దానిని సృష్టించిన ఆ పరమాత్మను (Being)ను శ్లాఘించాలని నేను చెబుతాను. ఈ అద్భుతమే సృష్టి ఏవిధంగా ఏర్పడిందో మీకు వెల్లడిస్తుంది. కాని ఎప్పుడు? సత్ అయిన ఆ పరమాత్ముని (Real Being) ఆయన యదార్థ స్థితిలో తెలుసుకున్నప్పుడు మాత్రమే. ఒక చెట్టు ఆకులను లెక్కిస్తూపోతే మీరు అంతవరకు లెక్కించిన ఆకుల సంఖ్యను త్వరలో మరచిపోవడానికి అవకాశం వుంది. ఆ చెట్టు ఫలాన్ని రుచి చూడడానికి మీకు ఆ పద్ధతి ఎన్నడు వీలుపడనీయదు. నీవు ఆకును విశ్లేషించదలిస్తే, దాని ఫలాన్ని విశ్లేషించడం మరింత ఉత్తమం. దానినేవిధంగా విశ్లేషిస్తావు? ఆధునిక పద్ధతులలో అయితే దానిని ప్రయోగశాలలో పరీక్షించడం కాని పురాతన పద్ధతితో అయితే దానిని తిని, జీర్ణించుకొని ఆ ఫలితాన్ని అనుభవించడం. అందువలన, నీవు అగస్త్యమునివలె మహా సముద్రాన్ని త్రాగగల శక్తిని పెంపొందించుకోవాలి. చిన్న నదుల నుండి నీరు త్రాగుతూ కూర్చుంటే మహాసముద్రాన్ని అంతటిని ఒక్క గుటకలో త్రాగుటకుగాని, కనీసం దాని తీరాన్ని చేరడానికి గాకి కావలసిన కాలం, వయస్సు సమకూడడం ఎన్నటికి సాధ్యంకాదు.

అందుచే ప్రతి ఒక్కరికి నేనిచ్చే సలహా "నిన్ను అలక్ష్యం చేసే దానిని కాక, నిన్ను అన్వేషించే సత్‌తత్వాన్ని అన్వేషించు".

# మనో నిగ్రహం

హిందూదేశం ఆధ్యాత్మికతకు నిలయం. అందువలన తత్వచింతన అన్ని యుగాలలోను చైతన్యవంతంగా ఉంది. మనిషిలో నిద్రాణంగా ఉన్న శక్తులు ఆధ్యాత్మిక భూమికై లోతుగా పాల్గొనే జాడ కనపడుతున్న సమయం యిది. ప్రపంచం కూడ మానవ స్వరూప సర్వస్వాన్ని ఆధ్యాత్మిక పునాదిపై నిర్మించడంలో తనవంతు కార్యాన్ని అది నిర్వర్తిస్తోంది. ఈనాడు అందరు శాంతి మార్గాన్ని అన్వేషించడం అత్యంత సంతోషకరమైన విషయం. ప్రపంచంలో కొన్ని దేశాలు సిరిసంపదలతో నిండి ఉన్నప్పటికీ శాంతి కొరవడింది. శాంతిని సంపాదించడానికి అవలంబించే బాహ్య విధానాలు వ్యర్థాలు. మనం శాంతి అన్వేషకులమై అంతర్ముఖులం కానిచో అణుమాత్రమైనా అది లభ్యంకాదు. శాంతిని పొందడానికి విభిన్న పద్ధతులు అనుసరింప బడుతున్నాయి. ఎవరి స్వభావానికి తగినట్టుగా వారు ఆయా పద్ధతులను అనుసరిస్తారు.

ఈ రోజులలో గురువులు మనస్సును నిగ్రహించే భారాన్ని ఎక్కువగా శిష్యులకే వదలివేస్తారు. నిజానికి అది అభ్యాసికి కఠిన సమస్యగ తయారవుతుంది. తత్ఫలితంగా అతడు కష్టాలను అధిగమించలేకపోతున్నాడు. అటువంటి పరిస్థితులలో గురువులు తాము చేయవలసినదేమీ లేదని భావిస్తారు. మరోమాటలో గురువుపైబడిన కర్తవ్య బాధ్యత శిష్యుని మీదకు నెట్టివేయబడింది.

యోగ మార్గసాధనతో బాటు నిజమైన భక్తి ప్రక్కనే ఉంటే ఫలితం సత్వరమే లభిస్తుంది. భక్తి సాధన ద్వారా ప్రియతమునితో సత్వరమే అనుబంధం ఏర్పడుతుంది. అక్కడ ప్రియతముని స్మరణ వుండి మనిషిని ప్రగాఢ చైతన్య స్థితిలోకి వెళ్ళుటకు తోడ్పడుతుంది. బ్రహ్మనిష్ఠచే పొందిన అంతఃశ్శక్తిచే మనలను ఉద్దీపింప చేయగల గురువు ఏదో విధంగా మనకు లభ్యం అవుతే అప్పుడు కష్టం చాలావరకు తీరినట్లే. త్వరలోనే మనంసత్వము (Real Being) లోకి తొంగి చూడడం మొదలెడుతాం. విభిన్న పేర్లతో వ్యవహరింపబడే యోగ పద్ధతులు అనేకం ఉండవచ్చును. నేను సహజమార్గం పేరిట సవరింపబడిన యోగ పద్ధతిని మీకు సమర్పిస్తున్నాను.

అభ్యాసి లోపల దివ్యజ్యోతి ఉందనే భావంతో హృదయంపై ధ్యానం చేయవలెనని చెప్పబడింది. మల, విక్షేప, ఆవరణలను తొలగించి నిర్మలీకరణము చేయడంలో గురువు

నిమగ్నులవుతారు. అభ్యాసి ఆధ్యాత్మిక జీవితమంతటికీ అది మహోపకారిగా ఉంటుంది.

మనం అసలు మూలం నుండి దిగి వచ్చాము. మనం తిరిగి అక్కడకు చేరుకోవాలంటే విభిన్న చక్రాలను దాటుకుంటూ ఊర్ధ్వంగా వెళ్ళవలసివస్తుంది. ఇక్కడ సహజమార్గం పద్ధతి గురించికాక, పైకి ఎదగాలనే అభిప్రాయాన్ని ఏర్పరచుకున్న వారికి అవసరమైన కొన్ని విషయాలను గురించి వివరిస్తాను. సహజమార్గంలో శిక్షణ కారణ శరీరం నుండి ప్రారంభమవుతుంది. అక్కడ సంస్కారాలు బీజరూపంలో ఉంటాయి. అభ్యాసికి వచ్చు ఆలోచనలను ఆపివేయడం జరుగదు. అన్ని నరాల కేంద్రాన్ని, చిత్ సరోవరాన్ని కూడ పరిశుద్ధం చేయడానికి ప్రయత్నిస్తాము. ఆలోచనా తరంగాలు ప్రారంభమయ్యే చిత్-సరస్సు (mind-lake) యొక్క అట్టడుగు భాగాన్ని మేము శుభ్రం చేస్తాము. ఆ తరంగాలను ఆపడంలో ఏదోవిధంగా విజయం పొందితే అవి ఉత్పన్నం కావడానికి కారణమైన పదార్థం యధాతథంగా ఉంటుంది. సంకల్ప బలంతో ఆలోచనా తరంగాలను ఆపుచేడం సాధ్యం అవుతుంది. కాని ఆ ఆలోచనా తంరగాలకు కారణమైన పదార్థం మాత్రం ఆవిధంగానే ఉండిపోతుంది. దానిని తొలగించకపోతే ముక్తి సాధ్యంకాజాలదు. మూలాన ఉన్న విషపదార్థం తొలగిపోయే విధంగా మనం సహజ పద్ధతిలో ముందుకు పోవాలి. ఆలోచనలు దండెత్తుతున్నాయని మన సహజరులుకూడ చెబుతూ ఉంటారు. కాని అదే సమయంలో ఆలోచనలు అంతగా బాధించక పోవడం గమనించి వారు సంతోషిస్తారు.

పూర్వ సంస్కారాల వలయం నుండి విముక్తిని పొందినప్పుడు మాత్రమే ముక్తిని (Liberation) పొందగలమని మన పవిత్ర గ్రంథాలు చెబుతాయి. ప్రస్తుతపు సంస్కారాలు వాటంతట అవే ఆధీనంలోకి వచ్చి, కొత్త సంస్కారాలు ఏర్పడకుండా ఉంటాయి. అది ఒక ఆధ్యాత్మిక స్థితి. చైతన్య స్థితి (consciousness)లోకి లోతుగా వెళ్ళినప్పుడు, దానిని సహజమార్గంలో సులభంగా చేరగలం.

మనస్సు సృష్టించే ఆలోచనలు పూర్వపు సంస్కారాలను భోగంలోకి తీసికొని రావడానికి ఎంతో సహాయపడతాయి. యోగ పద్ధతులను అనుసరించడం వలన, దాని ఫలితంగా సంస్కార భోగం వెంటాడడం వలన, ఇంకా ఎక్కువ కష్టాలు, రుగ్మతలు, రోగాలు, విపత్తులు తమను బాధిస్తాయని కొందరు వ్యక్తులు భయపడతారు. వారి భయాలు నిజమే కావచ్చు. కాని అటువంటివి ఏమైనా సంభవిస్తే, అప్పుడు గురువు ఉండటమే వ్యర్థమౌతుంది. వాటి తీవ్రతను తొలగించుకోవాడానికి అభ్యాసి తనకుతానుగా శ్రమిస్తాడు. గురుశక్తి కూడ వాటిని దహించి వేయడానికి అభ్యాసి చేసే ప్రయత్నాలలో చాలావరకు

తోడ్పడుతుంది. పాఠకులకు ఈ పద్ధతి పరాయిదిగా కనబడవచ్చు. కాని అది యింతవరకు మరుగునపడిన పురాతన పద్ధతి. అనేక సంస్కారాలు భోగింపబడడానికి ముందుకు వచ్చినప్పటికి, అభ్యాసి అనుకున్నంతగా ఈ భోగ ఫలితం తీవ్రంగా ఉండదు. క్షాళన అంటేనే వీటన్నిటినీ తొలగించడం అని అర్థం. క్షాళన ఆశించిన ఫలితాన్ని సత్వరమే తీసుకు వస్తుంది. మనం దినదినానికి తేలికగాను, సూక్ష్మంగాను అయి అత్యంత సూక్ష్మమైన దానితో సంయోగం పొందవచ్చు.

# మనో నిగ్రహం

ప్రపంచం భగవంతుని సజీవ బింబం. దాని అంతటా ఆయన శక్తి పనిచేస్తోంది. సువిశాలమైన ప్రకృతి కర్మాగారం దాని కార్య నిర్వహణకు అవసరమయ్యే సామాగ్రితో అమర్చబడి ఉంది. కేంద్రం నుండి శక్తి ప్రవహిస్తూ ఆ యంత్రాలను చలనంలో ఉంచు తుంది. ఒక్కొక్క విధమైన పనికి ఒక్కొక్క ప్రత్యేక యంత్ర విభాగం ఉంది. శక్తి తిరుగుతూనే ఉంటుంది. కాని వాటి ఉద్దేశం, పరమార్థాల గురించి, సంభవిస్తున్న సంఘటనల గురించి దానికి ఎటువంటి ఎరుక ఉండక చివరకు మాత్రం నిర్దేశించబడిన ఫలితాలను యధావిధిగా యిస్తుంది. బాహ్యకారణాల వలన కాని, దాని యంత్రభాగాలు సక్రమంగా పనిచేయకపోవడం ఫలితంగా కాని సంభవించే ఎట్టి ప్రమాదాన్ని, అవరోధాన్ని, విపత్తులను అది అలక్ష్యం చేయదు. అందువలన యంత్రాంగం సమర్థవంతంగ పనిచేయుటకు, ఏదీకూడ వదులుగాను, లోప భూయిష్టంగాను ఉండకుండ అన్నిభాగాలు సక్రమంగా ఉండటం అవసరం. దీనికై మేస్త్రీలుగాను, పర్యవేక్షకులుగాను, అధికారులు గాను, పనిచేయుటకు క్రిందిస్థాయి కార్య నిర్వాహకులు ఉన్నారు. యంత్రాంగంలోని వివిధ భాగాల పనులను సరిగ క్రమపరచి, సమన్వయం చేయడం వారి విధి. ఈ అధికారులు ఎవరై ఉండవచ్చు? వారు దేవుళ్ళు, దేవతలు అని అనుకోవచ్చు. కాని నిశ్చయంగా వారు కాదు. వాస్తవానికి యంత్రంలోని వివిధ భాగాల వలే దేవుళ్ళు, దేవతలు ప్రకృతి యొక్క వివిధ శక్తులు. దేని ప్రసక్తి లేకుండ, వారు తమకు నియమించబడిన కార్యాన్ని యధావిధిగా నిర్వహిస్తూ ఉంటారు. వారికి దానిని మించి ఒక్క అంగుళం కూడ పోవుటకు సామార్థ్యం చాలదు. మూలంలో ఉన్న అసలు అధికారి "మనిషి". ప్రకృతి యంత్రాంగాన్ని సరిగ క్రమబద్ధం కావించి, దాని భాగాలు సక్రమంగా పనిచేయునట్లు చేసే బాద్యత అతడిదే. ఇది కొందరికి ఆశ్చర్యం కలిగించవచ్చు. కాని అది నిస్సందేహంగ యదార్థం.

మనిషి ప్రకృతి యొక్క పనిముట్టు. అతడు అపార శక్తిని కలిగి ఉన్నాడు. ఆ శక్తి వినియోగానికి అవసరమయ్యే పరికరాలు కూడా అతనికి ఉన్నాయి. అద్భుతమైన ఆ పరికరమే మనస్సు. అది కేవలం మనిషి సొత్తు. మనం పూజించే దేవుళ్ళకు సైతం మనస్సు లేదు. అయితే జంతువులకు మనస్సు ఉందని అంటారు. కాని దాని స్వభావమే వేరు. సంపూర్ణ సజీవ చైతన్యంకల మనిషి యొక్క మనస్సుతో పోలిస్తే అది ఒక జడ స్థితిలో వుంటుందని చెప్పవచ్చు. మనస్సుకు మూలం ప్రథమ "క్షోభ" ఆ క్షోభ సృష్టి నిర్మాణం

కోసమై దేవ సంకల్పం ఫలితంగా ఏర్పడింది. మానవ మనస్సు యొక్క నిజస్వభావం అటువంటిది కావున దానిని ఈ కపట గురువులు మానవునికి అత్యంత ప్రమాదకరమైన శత్రువుగా ప్రకటించి తీవ్ర పదజాలంతో దూషించుట ఎంతో అప్రతిష్టకరమైన విషయం. దాని యదార్థ విలువను, గొప్పదనాన్ని వారు పరిగణించరు.

అన్నింటిని కార్యరూపంలోకి తీసుకువచ్చే సాధనం వాస్తవానికి అది మాత్రమే. క్షోభ రూపంలో అవతరించినది అదే దివ్యశక్తి. మనిషి యొక్క చిన్న సృష్టిని ఇప్పుడు ఉనికి లోకి తీసుకువచ్చినది సూక్ష్మరూపంలో ఉన్న అదే శక్తి. ప్రతి వస్తువు మూలంలో అదే శక్తి పనిచేస్తోంది. ఇప్పుడు ఆ శక్తి ఎవరిది? అది దైవానిదా? లేక మానవునిదా? సమాధానం సులభమే దైవానికి మనస్సులేదు కావున అది నిస్సంశయంగా మానవునిది. దైవానికి మనస్సు ఉంటే ఆయన కూడ సంస్కార ప్రభావానికి లోనయి ఉండేవాడు. అందువలన తప్పనిసరిగా మానవ మనస్సే మూలంలో పని చేస్తుంది. మానవ మనస్సు అది చేసే చెడును గురించి చాలా వింటూ ఉంటాము. కాని అదంతా ప్రస్తుతం దిగజారిన దాని స్థితికి సంబంధించింది కావచ్చు. నిజానికి, మనస్సు తమ అసలు స్వభావాన్ని కోల్పోయేటంతగా మనమే పాడుచేసాము. అందుచే అది మనకు ఎడతెరపిలేని బాధలకు ఆలవాలంగా తయారయింది. ఆవిధంగా అది ప్రకృతి యంత్రాంగం యొక్క సక్రమ కార్య నిర్వహణకు సహాయపడక పోగా, కేవలం ఒక ఆటంకంగాను, అవరోధంగాను పనిచేస్తోంది. అందువలన సర్వ అనర్థాలకు కారణంగా భావించబడే మనస్సును సరిగ ఉపయోగించినట్లయితే అదే ఏకైక నివారణోపాయం అవుతుందనే నిర్ణయానికి మనం వస్తాం.

ప్రపంచం పూర్తి పతన దిశలో దిగజారుతున్నప్పుడు మానవ మనస్సు పెడదారి పట్టుట వలన ఉత్పన్నమైన దుష్ప్రభావం నుండి విముక్తి గావించడానికి యుగ పురుషులు, కొన్ని సమయాలలో మహాత్ములు, ప్రవక్తలు, అవతారాల రూపంలో అవతరిస్తారని యించుమించు ప్రపంచం యావత్తు నమ్ముతోంది. ఆవిధంగా ప్రకృతి కార్యం ఎవరో ఒక మానవాతీత వ్యక్తి ద్వారా మాత్రమే నెరవేరుతుంది. దానికి కారణం అన్నింటిని కార్యరూపంలోకి తెచ్చే మనస్సును అతడు కలిగి ఉండడం. అతడికి ఉన్న ఆ మనస్సు పరిపూర్ణ స్థితిలో ఉండి క్షోభ రూపంలో ఉన్న ఆ దివ్యశక్తికి దాదాపు సరిపోలి ఉంటుంది.

వాస్తవానికి ప్రకృతి యంత్రాంగ కార్యక్రమం యావత్తు మనస్సు, మాయ అనే ఈ రెండిటిపై మాత్రమే ఆధారపడి ఉంది. కాని అవి అనుభవహీనులచే చాల వక్రంగా చిత్రీకరించబడ్డాయి. మనం దివ్యత్వాన్ని చేరుకోవాడానికి సహాయపడే ప్రధాన అంశాలు

ఈ రెండేనని వారికి తెలియదు. నిజానికి మానవ జీవితానికి మనస్సు ఒక చివర అయితే, మాయ యింకొక చివర అవుతుంది. సత్‌తత్వం యొక్క మహాసముద్ర తీరాన్ని చేరడానికి మన ప్రయాణంలో ఆరెండు కలిసి ఒక నావవలె ఉపయోగిస్తాయి. ఇంతవరకు ప్రతి ఒక్కరు శాశ్వతంగా ఆ సత్‌తత్వంలో లయం చెందాలని భావిస్తుండగా నేను మహా సముద్రం గురించి మాట్లాడటం ప్రజలకు ఆశ్చర్యం కలిగించవచ్చు. పవిత్ర గ్రంథాలు కూడా ఈ విషయాన్ని తగినంత స్పష్టంగా విశదపరచలేదు. సత్‌తత్వాన్ని ప్రయాణ మార్గంలో దాటవలసిన ఒక ప్రదేశంగా తీసుకొనవచ్చు. ఆవల తీరాన్ని చేరిన తరువాత మనం యింకా ముందు ప్రయాణం చేయాలి వస్తుంది. ఎంతవరకు? ఎవ్వరూ దానిని ఖచ్చితంగా నిర్ణయించలేదు. 'తీరం' అనే పదం ఒక మహా విశాలమైన భావాన్ని స్ఫురింపజేస్తుంది. దానికి తీరం అనేది ఒక విభజన రేఖ మాత్రమే. ఈ ప్రదేశం ఎంత దూరం విస్తరించి వుందో ఊహకు అందని విషయం. ఇంతవరకు మనం మహాసముద్రం గుండా పయనిస్తున్నాం. నావలో ఉన్నంతవరకు మన ప్రయాణం ఉదయపు చల్లని మంద మారుతాన్ని, నీటి ఆహ్లాద ప్రభావాన్ని ఆస్వాదిస్తూ ఎంతో ఉల్లాసంగా కొనసాగింది. ఇది ప్రతి ఒక్కరిని అట్టి వినోద యాత్రను కాంక్షించే విధంగా ఆకర్షిస్తుంది. అది ఒక విధమైన సంతృప్తిని ఉద్వేగంతో కూడిన ఉల్లాసాన్ని, మనశ్శాంతికి సమానమైన దానిని దేనినో యిచ్చింది. అదే ఆనందంగా తెలియబడింది.

మనం యిప్పుడు ఎడారివలెవున్న తీరంలో దిగినాము. అక్కడ ఆహ్లాదపూరితమైన నీరు లేదు. భావోద్రేకాన్ని రేకెత్తించే చల్లని పిల్లవాయువు. చిన్న చిన్న అలలు లేవు. అందం లేదు. ఆకర్షణ లేదు. అక్కడ సర్వం శూన్యమైన నిర్జన ఎడారి ప్రదేశం మాత్రమే ఉంది. అది కూడ ఆనందానికి ఒక మూలస్థానమే. కాని ఆ ఆనందం వేరొక విధంగా వుంటుంది. ఇంతకుముందు ఉన్న ఆనందానికి దీనికి తేడా తెలియజెప్పడానికి దీనిని నేను ''పరిపూర్ణ ఆనందం'' అంటాను. అది శాశ్వతమైనది. స్థిరమైనది. నిజమైనది. సమత్వాన్ని కలిగినట్టిది.

అనంతమైన ఈ విశాల మైదానంలో ముందుకు పోతూ ఉంటే కాలక్రమంలో మనం మనిషి మూలస్థానాన్ని చేరుకుంటాము. దానిని చేరడం అవతారములకు కూడా దుస్సాధ్యం. ఆనందపు నిజస్థితి అప్పుడు వెలుగులోకి వస్తుంది. ఇది మాటలకు అతీతం కావున ఏవిధంగాను వివరించడానికి వీలుకాదు. దానిని కేవలం సాధన పూర్వకంగా సిద్ధింప జేసికొని, అనుభూతి చెందాలి. దానివరకు చేరిన వ్యక్తి తన విలయమును అనుభవిస్తాడు. కాని అది ప్రకృతి రహస్యం కావున ప్రకృతితో ఏకమైన వ్యక్తికి మాత్రమే

ద్యోతక మవుతుంది.

ఆధ్యాత్మిక మార్గంలో ఉన్న వ్యక్తి, తన అధీనంలో ఉన్న సర్వసాధనోపాయాలను వినియోగించుకుంటూ పురోగమిస్తాడు. అతడి మనస్సు, ఇంద్రియాలు సేవకు అంకితం చేయబడాలి. సేవ అనేది భక్తి దిశలో ఒకమెట్టు కాని ఏ విధంగాను అదే సర్వస్వమని, సరిపోవునని కాదు. ఇంద్రియాలతో సహా ఈ భౌతిక శరీరం చేసే ఒకానొక కార్యమే సేవ. దాని నేపథ్యంలో మనస్సుకూడా ఉంది. అదే దానిలో కూడా ఉండాలి. శారీరక క్రియలన్నీ మనోకార్యకలాపాలకు లోబడి ఉంటాయి అని చెప్పవచ్చు. కావున దేహం సేవలో నిమగ్నమై ఉన్నప్పుడు, మనస్సు కూడా దానితో ఉండాలని అనవచ్చు. నా భావం అది కాదు. ప్రేమానురాగాల భావంతో ప్రేరేపించబడినప్పుడు ఆ పని సక్రమంగా ఉంటుంది. లేకపోయినట్లయితే అది ఏదో ఒక స్వార్థ భావంతో ముడిపడి వుండి లాంఛన ప్రాయమాత్రంగా మిగిలిపోతుంది. ఆ సందర్భంలో ఫలితం పూర్తి వ్యతిరేకంగా ఉంటుంది. ప్రథమ ఆశయం భక్తిని పెంచుకోవడం. దీనికి సేవ అనేది ఒక సాధనం మాత్రమే. మన ఆశయం న్యాయమైనదై ఉన్నప్పుడు మాత్రమే మనం నిజార్థంలో సేవచేస్తాము. ఆ సేవ ప్రేమతోపాటు, కర్తవ్య భావాన్ని కూడ తనలో యిముడ్చుకుని ఉంది. ఆ రెండింటిని విడదీయలేము.

కొందరు సేవా కార్యక్రమాలలో పాల్గొనినట్లు పైకి కనబడక పోయినప్పటికి తమ హృదయంలో ఇతరుల ఎడ సానుభూతి భావాన్ని కలిగి ఉండవచ్చు. అది కూడ కనీసం కొంతవరకు మంచిదే. కాని వారు ఒక కాలితో మాత్రమే నడుస్తున్నారని చెప్పవచ్చు. దివ్యత్వంలో దృఢంగా స్థిరపడివుండి హృదయంలో భగవంతుని ధ్యాస తప్ప మరేది లేని ఆ ఉన్నతాత్ములను ఉద్దేశించి నేను చెప్పడం లేదు. నిజానికి అట్టి మహాత్ములు మిక్కిలి అరుదుగ ఉన్నారు. కర్తవ్య బాధ్యతగ వారు చేయనిది ఏదీ ఉండదు. ప్రేమ తీవ్రతచే రెండుగ చీలిన హృదయం కలవారై దాని ఎరుక కూడ వారికి ఉండదు. ఏమి చేయాలి, ఏమి చేయకూడదు అనే దానిని నిర్ణయించగల స్థితిలో వారు ఉండరు. కాని అంతిమ దశను పొందిన పిమ్మట, వారు కూడ వేరే మార్గంలో అయినప్పటికీ పూర్వపు స్థితికి రావలసి ఉంది. అప్పుడు వారి సేవలు చైతన్య స్మృతికి (conscious knowledge) అతీతంగా ఉండి, సేవాభావం కూడ మనస్సులో ఉండదు. పని అంతా అసంకల్పితంగాను (automatic) అప్రయత్నంగాను జరుగుతుంది. ఏరకమైన ఆలోచన, ప్రయత్నం ఎరుకలో ఉండదు.

ఆ మహోన్నత స్థితిని పొందడానికి మూలం (Base) వద్ద తన హృదయవాణిని

వినిపించేటట్టు చేయడం అవసరమవుతుంది. అది ఏవిధంగా నెరవేరుతుంది? దానికి సమాధానం సులభం. సాధ్యమైనంత ఎక్కువగా సామీప్యతను పొందడం. దానినేవిధంగా పొందగలం ? దానికి సాధన, అభ్యాసం తప్ప మరేమీలేదు. అభ్యాసము దృఢంగా హత్తుకొని పోవుటకు గల ఫలప్రదమైన మార్గం ఒక్కటే. అది అనంతత్వంతో (unlimited) దృఢంగా తాను సంబంధాన్ని ఏర్పరచుకోవడం. లేదా వేరు మాటలలో అనంతత్వంతో సంబంధాన్ని ఏర్పరచుకొని పరిపూర్ణత్వ స్థితిని పొందినవానితో సంబంధాన్ని కలిగి ఉండడం. ఆవిధంగా మీరు సంబంధమేర్పరచుకున్నప్పుడు ఆ మహాపురుషుడు మిమ్ములను తన హృదయంలో ఆప్తునిగా స్వీకరించాడని అర్థం. ఆయన హృదయంలోకి లోతుగా పోవాలనే మీ ప్రయత్నం, మీరు పరతత్వం (Ultimate) వైపుకు మార్గాన్ని అనుసరిస్తున్నారని తెలుపుతుంది. శరణాగతి పదం యొక్క భావం అదే. సంపూర్ణ పరిపూర్ణత్వము పొందడానికి ఇదొక్కటే అత్యంత రూఢియైన మార్గం మీరొక పనిని చేస్తుండగా, దానిని చేస్తున్నామనే ఎరుక మీరు ఉన్నంతవరకూ, అది సక్రమ మార్గం కాదు. ఎందుకంటే అక్కడ అహంభావం కూడ ఉంటుంది. కనుక మీరు శరణాగతి స్థాయికి దూరమై ఉంటారు. శరణాగతియందు ఎటువంటి అహంభావపు ఎరుక ఉండదు. అక్కడ ప్రతీది సమయానుకూలంగా ఎటువంటి ముందు ఆలోచనగాని, తరువాత ఆలోచనగాని లేకుండ అప్రయత్నంగా జరిగిపోతుంది.

కాని ఈ విషయంలో అత్యంత జాగ్రత్తను పాటించాలి. ఆధ్యాత్మిక ప్రమాణస్థాయి యింకా అడుగును ఉన్నటువంటి వ్యక్తికి లేక పరిపూర్ణత్వపు చిట్టచివరి అవధి వరకు చేరకుండా ఉన్నటువంటి వ్యక్తికి సమర్పించుకోవడం మన అంతిమ లక్ష్యానికి మహా హానికరం. కాని అదే సమయంలో ఒక వ్యక్తి నిజంగా అటువంటి వాడు అవునో కాదో పరిశీలించి నిర్ణయించడం చాలా కష్టం. అది అదృష్టాన్ని బట్టి జరిగే విషయం. అది సంస్కారాల ప్రభావాలకు లోబడి జరుగుతుంది. ఈ విషయంలో ప్రార్థన కూడ సహాయకారి అవుతుంది. దాని వలన మాత్రమే మీరు ప్రకృతి కెరటాలలో తరంగాలను సృష్టించగలరు. దాని ప్రతిస్పందన అప్రయత్నంగా జరుగుతుంది. సమస్యా పరిష్కారం దానంతట అదే వస్తుంది.

# సహజ మార్గం - ఒక చైతన్య మార్గం

ప్రకృతి రహస్యాన్ని ఛేదించుటకు మనిషి విడవని పట్టుదలతో ప్రయత్నిస్తూనే ఉన్నాడు. అది విజ్ఞానపు సరిహద్దులను విస్తృతం కావించింది. ప్రకృతిలో కనపడే ప్రతి విషయంలో అతి పరిశోధన కొనసాగుతూనే ఉంది. దేనినైనా మనం అన్వేషిస్తున్నప్పుడు, మన ఆలోచనకు ఏదో ఒకటి దొరుకుతుంది. దానికి అతీతంగా పోయినప్పుడు ఒకదాని వెంబడి యింకొకటి నిగూఢ రహస్యాలను కనుగొంటూ ఉంటాము. ఆలోచన తనంతట తానే తరువాతి పరిణామాన్ని పొందినప్పుడు, ప్రతి విషయం వెనుక ఉన్న దానిని చేరుతాము. మన పూర్వీకులు (దానిని పరిశీలించినప్పుడు) దానిలోకి తొంగి చూచినప్పుడు ఈ విశ్వానికి మూలకారణాన్ని, మనిషికి దైవానికి గల సంబంధాన్ని, ప్రకృతికి ప్రత్యామ్నాయాలైన వస్తువుల అచేతన, చేతన విలువలను ప్రత్యక్షంగా కనుగొనుటకు ప్రయత్నించారు. దానిలోనికి నిజంగా తొంగిచూస్తే నిర్మాణాత్మక శక్తులను విధ్వంసక శక్తులను అణువులు, కణాల రూపంలో వుండటాన్ని కనుగొంటాము. శక్తి వలయభాగాలు కూడ అక్కడ ఉంటాయి. ధనాత్మక కణాలు, రుణాత్మక కణాలు తమ సంపూర్ణ స్వరూప స్థితిలో అక్కడ ఉంటాయి. మన ఋషులు నిగూఢంగా కనబడే ఈ శక్తులను అన్నింటిని నిర్మాణాత్మక కార్యాలకు వినియోగించడానికి పూనుకున్నారు. వారు అన్ని విషయాలకు అతీతంగా వెళ్ళారు, తత్ఫలితంగా సృష్టి అంతటికి కారణం కొన్ని చలనాలేనని వారు కనుగొన్నారు. మనం యింతవరకు వెళ్ళినప్పుడు తన ఉనికి జ్ఞానము గురించి తెలియజెబుతున్న కేంద్రం, దానిచుట్టూ ఉన్న ప్రదేశం ఉనికిని గురించి తెలుసుకుంటాము. ఇప్పుడు ఇంకా ముందుకు పోతాము. దానికిపైన, దిగువ ఏముంది. మనం ప్రతి ఒక్కటి కేంద్రంవైపుకే మొగ్గి ఉండడాన్ని, కేంద్రం కూడా పరిధి వైపుకు విస్తరించి తెరచుకోవడాన్ని చూస్తాం. మన సాహసయాత్ర అయిన తరువాత మన జీవితం విలువను సంతరించుకోవడం ప్రారంభమౌతుంది. మన చుట్టూ ఉన్న అత్యంత మహత్తర శక్తి సహకారం అనుభవంలోకి వస్తుంది. ఆ ప్రధాన విషయ ప్రదర్శనవైపుకు దృష్టిని మరల్చిన మన ఆలోచన ప్రవాహధార యిది. క్రమంగా మానవ దేహంలోని చలన ధర్మాన్ని తెలుసుకోగలిగినాము. కేంద్రమండలం వైపుకు మనలను కొనిపోగల మార్గం తెరువబడి ఉంది.

నా ఉద్దేశంలో ఏదోవిధంగా మన జీవిత సమస్యను పరిష్కరించగలిగితే, మనం ఈ రహస్యాన్ని పరిష్కరించిన వారమౌతాము. మనలను మనం దర్శించినపుడు మనిషి విశ్వం

యొక్క సంగ్రహ స్వరూపుడని తెలుసుకున్నాము. ఇది మన పురోగమనానికి తోడైనది. మన స్వీయ గ్రంథులు వాటి చర్యలను, చలనాలను, మానవ మనస్సును దేహం వాటి ధర్మాలను పరిశీలించ మొదలెట్టాము. మనలోనున్న ఆ శక్తిని విధ్వంసకర కార్యాలకు కూడ వినియోగించవచ్చును. కాని మన పూర్వీకులు యిచ్చిన పవిత్ర వాగ్దాన కారణంగా మొత్తంగా దానిని వదలివేసి, ఆ శక్తిని మనిషిలో సంపూర్ణ పరివర్తన రావడం కోసం ఉపయోగిస్తాము. నిజంగా మనం నిర్మాణాత్మక కార్యక్రమాన్ని చూస్తే దాని ప్రక్కనే వినాశకర కార్యక్రమాలు కూడా మనకు కనబడతాయి. నిర్మాణాత్మకము కాక, వినాశాత్మకము కాక తటస్థంగ వుండేవి కూడా అక్కడ ఉన్నాయి. శాస్త్రజ్ఞులు వాటిని యింకా పరిశోధించవలసి ఉంది. ఈ విషయాలతో మనకు సంబంధం లేదు కావున వాటిని వదిలివేద్దాం. మనం నిర్మాణాత్మక కార్యక్రమానికి వద్దాం. ఈ భావంతో మనలోకి చూసినట్లైతే ఉన్నత కేంద్రాలు మన కేంద్రములోకి కేంద్రీకృతమై ఉండటాన్ని గమనిస్తాము. కాని మన తప్పుడు ఆలోచనా విధానం, చర్యల వలన ఆ ఉన్నత కేంద్రముల ప్రభావం ఏవిధంగాను లోపలికి వచ్చుట లేదు. స్థూల్యత ఆ కేంద్రాలపై దట్టమైన పొరగా ఏర్పడి దృఢంగా పేరుకుంది. దాని ఫలితంగా అవి అభేద్యమైనాయి. మానవ దేహంలో అనేక కేంద్రాలు ఉన్నాయి. వాటి కార్యవిధానం ఐహికం, పరమార్థికం రెండూను, మానవాళి అందరి శ్రేయస్సుకై ఈ విషయాలను అన్నింటిని తెలుసుకొనడానికి పరిశోధన అవసరమౌతుంది. ఇది మానవాళి ప్రగతికి తమ శక్తిని వినియోగించి శ్రమించుటకు యిష్టపడని బలహీనులు మాత్రమే పరిశోధించే విషయమని అంటారు. ఆవిధంగా ఆధ్యాత్మికత మనలో అనేకుల దాడికి గురిఅయింది. వారు ఆధునిక నాగరికతలను, మితిమీరి పెరిగిన భౌతికవాదాన్ని (Materialism) అనుసరించే వారిని ఉదహరిస్తారు. వారు పరిమితమైన దానికోసమే ప్రయత్నిస్తారు. కావున వారు తమను పరిమితం చేసుకొని, అటుపిమ్మట జారిపోతారు. పరిమితం నుండి అనంతం వరకు పురోగమించాలనే భావం ఉండాలి. పరిమితం అయిన దానిని కూడా అనంతంలో లయం చేయాలనే భావం ఉండాలి. వేరు మాటలలో, మొదట పరిమితత్వం ఆకర్షణీయంగా మెరుస్తున్నట్లు ఉండాలి. అప్పుడు మనం ఆధారం వైపుకు పురోగమించగలం. పరిమితం అంటే ఏమిటి? మనలో ఉన్న కేంద్రం అనంతాన్ని గ్రహించగల సామర్థ్యాన్ని కోల్పోయింది. సహజ మార్గసాధన అందుకే ఉండి, పరిమితత్వానికి అవసరమైన పద్ధతిలో మన బాధ్యతను నిర్వహిస్తూ, దాని ప్రక్కనే అనంతం (infinite) వైపుకు పురోగమించడం మనకు సాధ్యం అయ్యేటట్లు చేస్తుంది. మన కర్తవ్య నిర్వహణ అత్యంత ప్రధాన విషయమని అది

మనకు తెలుపుతుంది. అందువలన ఈ రెండింటిని సరిచేయవలసి ఉంది. అనగా రెండు రెక్కలతోటి విహరించవలసి ఉంది. మనం కేవలం పరిమితత్వం కోసం ప్రయత్నిస్తే బలహీనమైన పునాదితో కొనసాగుతున్నట్లు అవుతుంది. అనంతం కోసమే మనం పరిమితత్వాన్ని ప్రయత్నించాలి. దీనికి చైతన్యవంతమైన పద్ధతులను అవలంబించాలి. ఆ పద్ధతులు ఏమై ఉంటాయి? ప్రారంభం నుండే అనంతం (infinite) యొక్క స్వభావాన్ని ప్రవేశపెట్టి పద్ధతులు మాత్రమే. చదువరులు ఈ వాక్యాన్ని కొంచెం గాఢంగా ఆలోచిస్తే నేను వారికి చాలా కృతజ్ఞుడనై ఉంటాను.

ఆ అనంతత్వపు యదార్థ లక్షణాన్ని తమ కేంద్రాలలోకి గ్రహించి యిముడ్చుకొన్న వారు మాత్రమే, దీనిని ప్రవేశపెట్ట సమర్థులు. వారు శక్తిని, దైవభక్తిని ఉన్నత కేంద్రాల నుండి నిమ్న కేంద్రాలకు ఏవిధంగా ఆకర్షించాలో తెలుసుకొని, ఆప్రభావాన్ని అభ్యాసిలోకి ప్రాణాహుతి ద్వారా ప్రసారం చేయగలరు. అప్పుడు ఆ అభ్యాసి అదే స్వభావాన్ని సంతరించుకోవడం వీలవుతుంది. దీనికి శక్తివంతమైన సిద్ధహస్తుడి అవసరం ఎల్లప్పుడూ ఉంటుంది. మన కేంద్రాలలో (centres) పేరుకొనియున్న స్థూల్యత్వాన్ని తొలగించనంత వరకు, మనమే తయారు చేసుకున్న స్థూల్యం, చిక్కుల కారణంగా కృప లేక ఉన్నత కేంద్రాల ప్రభావం వేరుపడి దూరంగా ఉండిపోతుంది. మన సహజమార్గం కేంద్రాలను శుద్ధిచేసుకునే విధానాన్ని ఉపదేశిస్తుంది. గురువే ప్రాణాహుతి ద్వారా, కేంద్రాలను శుద్ధిచేయడం జరుగుతుంది. అభ్యాసి కృప (grace)ను ప్రత్యక్షంగా పొందనంతవరకు, గురువే తనకు నేరుగా వచ్చుచున్న ఆ కృపను అతడి వైపుకు మళ్ళించడం జరుగుతుంది.

ప్రకృతి శక్తులు, శక్తి వలయాలు గురించి నేనిదివరకే ఉదహరించాను. కావలసిన రీతిలో మనిషిలో పరిణామాన్ని తీసికొని వచ్చుటకు అవన్నీ ఉపయోగించబడతాయి. మనం లోపల దివ్యజ్యోతిని ఊహించుకొని, హృదయంపై ధ్యానాన్ని కొనసాగిస్తాము. ఆ విధంగా చేయుట వలన మనం క్రమంగా అభివృద్ధిని సాధించడం ప్రారంభిస్తాము. ఇంకా బాగా వ్యక్తం చేయాలంటే అంతర్ చైతన్యం (inner consciousness)లోకి లోతుగా మునుగుతాము. దాని ఫలితంగా అభ్యాసి విస్తృత వ్యాప్తిని అనుభూతి చెందనారంభిస్తాడు. ఇది ప్రథమ దశ. అనంతత్వం (infinite) యొక్క బీజాన్ని నాటినామని లేక వేరు మాటలలో, మన దృష్టినుండి వేరుపడిపోయిన వస్తువును తిరిగి పునరుజ్జీవింప చేసినామని దాని అర్థం.

ఇప్పుడు రెండవ దశ గోచరమౌతుంది. ప్రతి జీవరాశిలోను దైవం ప్రత్యక్షంగా కనబడుతున్నట్లు, మనిషికి అనుభవానికి వస్తుంది. ఈ అనుభవం యొక్క పరిణామ

లక్షణాన్ని మూడవ దశలో మనం తెలుసుకుంటాము. ఇది మార్పును పొంది ప్రతీది భగవంతుని నుండే వచ్చిందని ఆయన ప్రత్యక్ష దర్శనమే (His manifestation)నని అనిపిస్తుంది. నాలుగవ దశ మనం చివరగా పొందవలసిన అభావ స్థితి (Negation)కి తీసుకువస్తుంది. ప్రతి అణువులోను అన్ని వస్తువులలోను సమానత్వాన్ని (uniformity) చూస్తాము. పద్ధతి సరైనదై వుండి, గురువు పరిపూర్ణుడు అయితే ప్రతివ్యక్తి వరుస క్రమంలో ఈ స్థితుల గుండా పయనిస్తాడు. బ్రహ్మాండ మండలం చేరువరకు మనిషి వరుసగా తరువాత వచ్చే ప్రదేశానికి పయనిస్తున్నప్పుడు ఈ విషయాలు సూక్ష్మము కావించబడతాయి. అక్కడ కూడా ఈ విషయాలు పునరావృతం అవుతూనే ఉంటాయి. కాని అవి మిక్కిలి సూక్ష్మ వర్ణములలో మాత్రమే గ్రహింపబడగలవు. గురువు పరిపూర్ణుడు కానట్టయితే ఆధ్యాత్మికతకు సంబంధం లేని శక్తులలో మనస్సును లగ్నం కాగల ప్రమాదం ఉంటుంది. గురువు కార్య నిర్వహణ అంతిమ అవధి చేరేవరకు కొనసాగుతూనే ఉంటుంది. మానవాళి ఉన్నత స్థితిని పొందడానికి గురువు అవలంబించే పద్ధతి యొక్క సాంకేతికత విధానాన్ని గాని, గురు కార్యనిర్వహణ జరిగే హృదయ కేంద్రాలనుగాని, మనస్సును, ఇంద్రియాలను క్రమపరచుటకు అవలంబించే పద్ధతిని గాని ప్రస్తావించకుండ అభ్యాసి చేయవలసిన పనిని గురించి, గురు కార్యనిర్వహణ గురించి మాత్రమే చర్చించాను. గురువకు సంపూర్ణ విధేయుడుగా ఉండుటయే అభ్యాసి నిర్వహించవలసిన పాత్ర. అతడు గురువుపై భక్తి, కనీసం నమ్మకం కలిగియుండి ఆత్మ విశ్వాసంతో తనకీయబడిన ఆదేశాలను విధేయతతో పాటించవలెనని నా ఉద్దేశం. అంతిమ అవధిని చేరుకొనిన అటువంటి ఉత్తమ గురువకై మనం అన్వేషించాలి. అటువంటి గురువు లభించడం చాలా కష్టము. శిష్యుడు దొరకడం కూడ అంతే కష్టమని ఉపనిషత్తులు చెబుతున్నాయి. శాశ్వత సత్యప్రాప్తి (Realisation)కై దహించివేసే ఆకాంక్ష ఉన్నప్పుడు, గురువే అన్వేషకుని ద్వారం వద్దకు వస్తాడు. నమ్మకం, అపనమ్మకం అనేవి రెండు విషయాలు, ఆ రెండూ అవసరమే. కాని మనం సాధారణంగా అపనమ్మకం అవసరమైనచోట నమ్మకాన్ని, నమ్మకం అవసరమైన చోట అపనమ్మకాన్ని ఉంచుతాం.

చివరగా నిజమైన తపన ఉన్నవారికి శాశ్వత సత్యప్రాప్తి ఎంతమాత్రమూ కష్టం కాదని నేను ఉద్ఘాటిస్తాను. తపన ఉన్నప్పుడు నిజమైన మార్గానికి అతడే రావడం జరుగుతుంది. దీని వలన శాశ్వత సత్య ప్రాప్తి తక్కువ కాలంలోనే సిద్ధించగలదు. మానవుని నిజమైన తపన అతనిని నిరంతర నిర్విరామ స్థితిలో ఉంచుతుంది. అతడు తన అసలు లక్ష్యాన్ని సాధించడం కోసమే శ్రమిస్తాడు. మనలో అనేకులు సామాన్య నియమంగా

చేసే దైవారాధన, నివేదించే ప్రార్థన, కేవలం మన ఇంద్రియాలకు ఆనందం కలిగించడం కొరకే. ఈ విషయంలో మానసికానందం వుంది. ఇంద్రియ భోగం వుంది. ఈ విధంగా వారనేక భోగాలలో చిక్కుకుపోయి ఉండుట వలన శాశ్వతసత్వ ప్రాప్తికి ఉద్దేశించిన జీవితంలోకి మరింత లోతుగా తొంగి చూడటం సాధ్యంకాదు.

# ఆదర్శము - లోపములు

ప్రపంచం అశాశ్వతం కావున ప్రతి ఒక్కరు ముందో, వెనుకో నిష్క్రమించ వలసినదే. కాని కొందరు ఎటువంటి బరువు సామాగ్రి లేకుండ వెడతారు. కొందరు బరువు సామాగ్రితో వెడతారు. చాలమంది సిరిసంపదలను తమ వెనుక విడిచి వెడుతారు. కేవలం దీనివల్లనే వారి వారసుల మనస్సులలో వారి స్మృతి చిరస్మరణీయంగా ఉండిపోతుంది. కాని ఆధ్యాత్మికంగా పరిపూర్ణుడైన వ్యక్తి సంపద వేరుగా ఉంటుంది. ఏమీలేని వాడై ఉంటాడు. సకల సంపదలతో నిర్గమిస్తాడు. ఏమీలేని వాడుగా ఉండి సర్వాన్ని కలిగిన వానిని అన్వేషించడం అంటే ఏకాకిగా అయి ఏకైక ప్రభువును అన్వేషిచండమే. ఏమీలేనివాడై ఉండటమంటే నా అర్థంలో యిదే. అతడికి ప్రాపంచిక సంబంధమైన సౌఖ్యాలు, విలాసాలు, భోగ భాగ్యాలతో నిమిత్తం లేదు. తన జీవిత కాలంలోనే అతడు వాటి దాస్య శృంఖలాల నుండి విముక్తుడై ఉంటాడు. నా భావంలో సంపన్నుడంటే అతడు ప్రయాణానికి కావలసిన గ్రాసాన్ని అనగా తన ఆధ్యాత్మిక సంపాదనల యదార్థసారాన్ని, తనతో తీసుకు వెడుతాడు. గృహస్థునివలె అతడు తన ఆధ్యాత్మిక సముపార్జనలను తన ఆధ్యాత్మిక వారసులకు వదలి వెడతాడు. ఒక్కొక్కరు తమ సామర్థ్యాన్ని అనుసరించి దాని పరిమానాన్ని పొందుతారు. మిగిలినది అతడి స్థానాన్ని అలంకరించు వ్యక్తి సంపూర్ణంగా గ్రహిస్తాడు. ఇది దీక్షోపదేశం పొందిన సభ్యులకు (initiated memebrs) మాత్రమే చేరుతుంది. న్యాయ సమ్మతంగా ఆధ్యాత్మిక సంతతి మాత్రమే దానికి అర్హులు. తమ గురువుపై విశేష ప్రేమాభిమానం కలిగి లయావస్థను పొందిన వారికి కూడ కొంతభాగం చేరుతుంది. అది సక్రమమే కూడ. ఆధ్యాత్మికతలో నిజంగా అర్హులైన వారికే వాటా ముడుతుంది. అందువల్లనే ఆ వస్తువుకై అర్హతను పొందమని అభ్యాసీలను మరల మరల వేడుకుంటాను. దానికి రెండు విషయాలు అవసరం. అవి ప్రేమ, విధేయతలు. ఈ రెండు విషయాలు ఒకదానిపై యింకొకటి పరస్పరం ఆధారపడి వుంటాయి.

దీక్షోపదేశం అత్యావశ్యకమైన విషయమనడం నిజం అది లేకుంటే గత్యంతరం లేదు. నిజమైన ఉన్నత గతులను పొందుటకు దీని సహాయం ఆవశ్యకం. ఎవరైనా తనకు తానుగా తనలో ఉన్నత గతి స్థితులను సృష్టించుకొనినట్లైతే అది వేరే విషయం. అప్పటికి కూడా ఆ మహా అనుగ్రహము (great gift) లేకుండ అతడుండిపోవును. దీక్షోపదేశం అయిన తరువాత, తండ్రి తన పుత్రులకేవిధంగా బాధ్యుడవుతాడో ఆవిధంగా

దీక్షోపదేశం కావించిన వ్యక్తి బాధ్యుడవుతాడు. పుత్రుడు ఎంత చెడ్డవాడైనప్పటికి అతనిని తన పుత్రునిగానే తండ్రి చెప్పుకుంటాడు. ఆ పితృ సంబంధం అలాగే వుంటుంది. అవును. ఆధ్యాత్మికతలో కూడా తన ఆధ్యాత్మిక వారసులు ఎవరైనప్పటికి వారిని ఆ బంధం నుండి గురువు తృంచివేయడం ప్రత్యేక సందర్భాలలో జరుగుతుంది కాని యిది మరీ అసాధారణ సందర్భాలలోనే జరుగుతుంది. దానిని నిర్ణయింప గలిగినది గురువు మాత్రమే. అన్వేషకుడి విశ్వాసం పరిపక్వమై అతడు ప్రేమలో తగినంత లోతుగా వెళ్లినప్పుడు మాత్రమే దీక్షోపదేశం కావింపబడుతుంది. ఇదే దీక్షోపదేశం యొక్క మూల సూత్రం.

ఇప్పుడు మన సభ్యుల సమావేశం గురించి వినండి. ఒకానొక పెద్దమనిషి సభామర్యాద కోసం పూజచేస్తాడు. మరియొకరు లాంఛనం కోసం పూజకు కూర్చుంటాడు. కనీసం ఈ మాత్రమైనా ఉన్నందులకు భగవంతునికి ధన్యవాదాలు. ఒక పెద్దమనిషికి ఎప్పుడో ఒకమారు పూజకు కూర్చోవడం అలవాటు, నాకు నేనుగా అతనిలో ఈ అలవాటును కలుగజేయాలని కాంక్షిస్తాడు. తమ క్లిష్ట సమయాలలో భగవంతునికి మారుగ నన్ను స్మరిస్తూ, ఆ విధంగా దైవాపచార పరిధిలోకి ప్రవేశించిన వారు కూడ ఎవరో ఒకరు ఉంటారు. ఎవ్వరికి నిజమైన శ్రద్ధ ఉన్నట్లు కనపడదు. అటువంటి వారున్నప్పటికి, వారిని వేళ్ళమీద లెక్కపెట్టవచ్చు. వారికి తపనగాని, ఆసక్తిగాని లేదు. ఒకమారు గురువర్యులు లాలాజీ ఒకరికి ఈ విధంగా వ్రాసారు. "నాకు కావలసినది సింహాలు కాని గొర్రెలు కాదు". ఇంకొకరితో ఆయన "మర్యాద కోసం నా సత్సంగంలో కొన్ని గొర్రెలను కూడా చేర్చుకున్నాను" అని చెప్పారు. ఇది ఆయన అనుభవం. ఇది గుర్తుంచుకుంటే ఎవ్వరిని నిందించవలసిన పనిలేదు. ఇది కేవలం నా లోపమేనని అపిపిస్తుంది. కాని ప్రతియొక్కరి అవసరాలను తీర్చవలసినదే. అందుకు పద్ధతులను గురించి ఆలోచించాను. ఏమీ లేని దాని కన్నా అదైనా కనీసం మెరుగే. కనీసం ఏదో ఒక పని జరుగుతుంది. ఏమైనప్పటికి మన ఉద్దేశం సరైనది. ఈ క్రింది సంఘటన నుండి నా హృదయ పరిస్థితిని మీరూహించగలరు. నిన్నటిరోజున నేను ఆఫీసు (కార్యాలయం) నుండి తిరిగి వస్తూండగా రోడ్డు (బాట) ప్రక్కన గాయంతో అంతిమ శ్వాసను విడుస్తున్న ఒక కోతిని చూసి ఎంతో చలించాను. నేను ఏమీ చేయలేకపోయాను. ఒక్క నిమిషం పాటు నిలబడి భవిష్యత్తులో దాని స్థితి మెరుగు అగుటకు ప్రాణాహుతిని ప్రసారం చేసాను. ఇంతకంటె ఎక్కువ చేయడం నాకిష్టం లేదు.

ఆఖరి ఉత్తరం చాల కఠినంగా వ్రాసాననే భావం నాకు మళ్ళీ మళ్ళీ వస్తోంది. కాని నేను ఆ విధంగా వ్రాయవలసి వచ్చింది. నాలుకలో కఠినత్వం లేక పోతేనేమి కలలో

ఉన్నది కదా అని అనుకున్నాను. ఎందువలనంటే దానిలో ఉక్కు, కొయ్య కూడా ఉన్నాయి. ఈ కఠినత్వం కారణంగా సాధ్యమైతే నీపైననే నీవు కాఠిన్యం వహించి దివ్యప్రేమ ధారను ప్రదర్శించవచ్చు. దైవసంకల్పం లేనిదే ఆయన దాసుని కూడ తనవైపుకు ఆకర్షించడు. ఆయన దర్శనం కూడ అసాధ్యం. ఇది నిజం. అయినప్పటికి యీ కాఠిన్యత కొంత మంచి ఫలితాన్నే తీసికొని రావచ్చును. మరి దాసుని తనవైపుకు ఆకర్షించుటకు ఆయన ఎందుకు శ్రమపడవలెనన్న ప్రశ్న ఉత్పన్నమౌతుంది. ఎందువలననగా ఆ ప్రభువునందు ఏదో ఒక ఉద్దేశం ఉంటే ఆయన కూడ మన వలెనే సంసారిగానే వుండేవాడని అనుకుంటాను. కాని దీనితోపాటు ఆయనతో కలయికే మన ఉద్దేశమైనప్పుడు అటువంటి పద్ధతులను మాత్రమే మనం అనుసరిస్తామనడం యదార్థము. దీనినే అభ్యాసమని అంటాము. ఆయనతో కలవాలనే తీవ్ర ఆకాంక్ష ఏర్పడినప్పుడు ఆయనలో ఒక విధమైన ప్రేరణ కలగడం మొదలెడుతుంది. కాని, సోదరా! యీ ఆకాంక్షను ఎవరు కలిగించు కోవాలి? ఆ తీరిక ఎవరికి ఉంది? మన ఊబిలోనే మనం పడి ఉన్నాము. కేవలం దానిలోనే ఆనందాన్ని పొందుతున్నాం. కాని ఇక్కడ బాధ కూడా ఆనందమే. అంత మాత్రమున మనం మహాత్ములమైనామని అర్థము కాదు.

సామాన్యంగా చెప్పవలెనన్న, ప్రతి యొక్కడు తన స్వీయ ఆలోచన పైనే పిచ్చి వ్యామోహాన్ని కలిగి యుంటాడు. ప్రజలు ఏవిధమైన దుస్థితినైనా భరించగలరు. కావున నేను బాధను ఆనందమని అన్నాను. కాని మనం మన స్వీయ దుస్థితి నుండి బయటకు అడుగు వేయుటకు యిష్టపడము. అందుకు కారణం వంటింటి నుండి బయటకు అడుగు వేసిన క్షణముననే, వంటిల్లు మలినమైపోతుంది. ఒక అడుగు వంటింటిలోను రెండవది బయట ఉంటాయి. మనం బయటపడి అదే సమయంలో వంటిల్లు మలినం కాకుండా ఉండటానికి రెండు అడుగులూ వంటింటి నుండి బయట పెట్టాలని కూడ ఆలోచించము.

# ఆధ్యాత్మిక పురోగమనము

ఈ ప్రపంచంలో మాయా తెరను ఛేదించిన మహాత్ములు పెక్కుమందిని చూడవచ్చు. కాని అహంకారపు పొరను తొలగించకొనినవారు ఒక్కరూ కనబడరు. జీవితపు యుగముల పర్యంతంగూడా యీ విషయం అసాధ్యం అవుతుంది. మనిషికి, దైవమునకు మధ్యనున్న తెర అదొక్కటి మాత్రమే. అభ్యాసీలు యీ తెర దరిచేరకముందే తాము పరిపూర్ణులమని చెబుతారు. నిజంగా కూడా వారంతే కాని యీ తెరను ఛేదించగల మహాపురుషుడు వేలాది సంవత్సరముల తరువాతనే ఉద్భవిస్తాడు. అధిగమించవలసిన విషయము అదొక్కటే. అటుపిమ్మట సర్వశక్తిమంతుని ఆ దివ్యతరంగం నిరాటంకంగా ప్రవహించ మొదలెడుతుంది. అట్టి సమర్థత గల మనిషి దొరుకుట మిక్కిలి దుర్లభం. నేనెవరికైనా యీ ఉపదేశాన్ని ప్రభోదిస్తే, అది తెలివి తక్కువ వాని మాటగా కనపడుతుంది. దానికి కారణం నాలో అతడికి యీ లోపాలు కనబడతాయి. కాని నీవా స్థితిని పొందుటకు ఇది నీకు మార్గదర్శకంగా ఉంటుందని వ్రాస్తున్నాను. మీ అందరికి ఆ విధంగా చెప్పడం నా కర్తవ్య బాధ్యత. దీనికి కూడ నాకు అర్హత లేదనుకుందాము. అయినప్పటికి మీరందరూ ఆ స్థితిని సంపాదించవలెనని ప్రార్థించడానికి నా హృదయం సిద్ధంగా ఉంది. అయినప్పటికి మీరెవ్వరు మీ సోమరితనాన్ని, జడత్వాన్ని అధిగమించనప్పుడు అటువంటి వస్తువును ఏవిధంగా పొందగలరు? మహోన్నతమైన ఆదర్శాన్ని చేరాలనే సంకల్పం ఉన్నప్పుడు, మార్గానికి అవరోధాలైన విషయాలను వదలుకోవలసిందే, అవాంఛనీయ విషయాలను వదలుకోలేకపోయినట్లయితే అతడు యింకా తన జీవిత ఆదర్శాన్ని నిర్ణయించుకోలేదని అర్థం. నేనిప్పుడు నీ విషయానికి వస్తున్నాను. నేను ఎక్కువకాలం జీవిస్తానో లేక తక్కువ కాలం జీవిస్తానో చెప్పలేను. ఈ మధ్యకాలాన్ని మీరు ఏమీ చేయకుండా వృధా పుచ్చితే అది పెద్ద పొరపాటవుతుందని భావిస్తాను. నాతో సమానంగా మీకు ఆధ్యాత్మిక స్థితులను యిచ్చుటకు ఎవరో ఒకరుంటారు. అయినప్పటికీ మీ అందరి పురోభివృద్ధి నేను నా కళ్ళతో చూడాలని నా ఆకాంక్ష.

మనిషి తన ఆదర్శాన్ని (దైవ సంబంధమైనదని నా భావము) యదార్థ భావంలో దృష్టిలో ఉంచుకుంటే ప్రప్రథమమైన యీ కర్తవ్యాన్ని అతడు ఎన్నటికి అలక్ష్యం చేయజాలడు. కొంచెము శ్రమపడి మీ సంకల్ప శక్తిని వినియోగిస్తే మీకు మీరే సృష్టించుకొన్న ఆటంకాలను కూడ అధిగమించగలరు. మీ బలహీనతను గురించి మీకు

తెలియజెప్పడానికి కొన్ని సందర్భాలలో నేను సంకోచిస్తాను. పవిత్ర లక్ష్యమైన శాశ్వత సత్యప్రాప్తి ఎడల శ్రద్ధ వహిస్తే, యివన్నీ మిమ్మల్ని సత్వరమే విడిచి వెళ్లిపోతాయి. ముక్తికై మీ పయనంలో మీరు మీకుగా కొంతవరకు చొరవ తీసుకుంటే, యీ విషయంలో నేను కూడ మీకు సహాయపడగలను. సామాన్యముగా మనుష్యులు తాము మరిగిన అలవాటును వదలుకొనుటకు ప్రయత్నించరు. దానికి కారనం తామెంతో శ్రమతో ప్రయత్నించి కష్టపడవలసి వస్తుందని. సరే దాన్ని నేను అంగీకరిస్తాను. వాటిని వదలుకొనుటకు ప్రయత్నించవద్దు, కాని అదే సమయమున జీవితపు నిజమైన గమ్యమును పొందుటకు, తగు పద్ధతిని అవలంబించి మీ శక్తికొలది ప్రయత్నించాలి. నీవు దాన్ని నిజంగా ప్రారంభిస్తే, నాకు తెలుపవలసింది. అడుగడుగునా నీ ప్రయోజనాల ఎడల నేను శ్రద్ధ వహిస్తాను. నేను నా ఆశలను నీమీద కూడ పెట్టుకున్నానని నీకు తెలుసు. అటువంటప్పుడు నీవు అభివృద్ధి చెందకున్న నేను చింతించకుండ వుండగలనా?

ఆధ్యాత్మిక పురోగతిపై నీ ఆకాంక్ష నిన్ను దహించి వేస్తున్నదని వ్రాసినావు. నేను దానిని విశ్వసిస్తున్నాను. కట్టెలు మండుటలో మూడు స్థితులున్నాయి. ఆ స్థితులలో మొదటిది పొగ, రెండవ స్థితి నిప్పురవ్వ, మూడవది మంట యొక్క యదార్థ సారం. సూక్ష్మంగా పరిశీలించినప్పుడే అది కనబడుతుంది. దాని వర్ణము విద్యుచ్ఛక్తి వంటిది. అది ఆహారాన్ని అతి శీఘ్రంగా వండుతుంది. దానికున్న తైలపదార్థ కారణంగా యిది జరుగుతుంది. మిగిలిన విషయాలు అనగా పొగ, నిప్పురవ్వ వరుసగా తేమ, ఘనత్వముల కారణంగా సంభవిస్తాయి. విద్యుత్ రవ్వతో సమానమైన దహించి వేసే ఆకాంక్ష నీకు ఉంటే, ఆధ్యాత్మిక రంగంలో ఎంతో వేగంగా పురోగమించి ఉండాలి. విద్యుత్చ్ఛక్తికి పొగ, ఘనత్వం లేవు. మరి అది ఏవిధంగా పనిచేస్తుంది ? విద్యుత్చ్ఛక్తి వలె అయి జ్వలించాలి. అప్పుడే నీవు అభిలషించే ఫలితాన్ని తేగలవు. తేమ, ఘనత్వాల నుండి విముక్తుడవైతే అప్పుడు సహజంగానే నీవు విద్యుత్ రవ్వవలె అవుతావు. తేమ అంటే ఏమిటి? ఘనత్వం అంటే ఏమిటి? ఈ విషయంలో నీ జీవితానుభవమే నీకు నమ్మకం కలిగిస్తుంది. ఈ ప్రశ్ననే నీవు అడిగితే తేమ, ఘనపదార్థంతో కలిసి మిమ్ములను ఎక్కువగా కలుషితం చేస్తాయని సమాధానం యిస్తాను. సూక్ష్మతకు విరుద్ధమైన ప్రకృతి చర్యలు కోరికలుగా ప్రకాశిస్తాయి. జీవితగమ్యాన్ని పొందాలనే కోరిక మనిషికి ఉండాలి. ప్రజలు నన్ను విమర్శించకుండ ఉండుటకే యీ వాక్యాలను నీకు వ్రాస్తున్నాను. జీవితగమ్యం ఎడల శ్రద్ధ వహిస్తే యీ కోరిక సహజంగానే నిష్క్రమిస్తుంది. కాని యిది సుదూరమైన విషయం. ప్రస్తుత స్థితిలో నీవు దీన్ని గురించి యోచించవద్దు. ఇది ప్రతిఫలంగా వచ్చే

దైవానుగ్రహము. అభ్యాసికి తైలం ఏదవుతుంది? భక్తే! సతతస్మరణ భక్తిని మరింత సమీపంగా తీసుకుని వస్తుంది. ఈ విత్తనము నుండే తైలమును పొందవచ్చు. ఇతర అనుచరుల విషయానికి వస్తే, వారిలో చాలామంది సోమరులని నేను చెబుతాను. దానికి వారు బాగా అలవాటు పడినవారై తమకు అత్యధిక ప్రయోజనకరమైన దాని విషయమై శ్రద్ధ వహించుటకు తీరిక లేకుండ ఉంటారు. దానికి కూడ చింతింపనవసరం లేదు. సోదరునిగా మన కర్తవ్యమేమిటి? మనము వారిని ఎల్లప్పుడు ఒకే తండ్రి బిడ్డలుగా గౌరవించాలి. మనలో ఎవరో ఒకరు తన కర్తవ్యాన్ని నిర్వహించలేదనుకొనండి; నాకు వారి ఎడల గల కర్తవ్యాన్ని నిర్వహించకుండ ఉండుటకు కారణం లేదు. ఆధ్యాత్మిక సోదరులు అనుసరించవలసిన విషయాలను నేను ఎల్లప్పుడు పరోక్షంగానే ప్రస్తావిస్తాను. నా గురువర్యుల వలెనే ధ్యానం మినహా మరే విషయాన్ని నిర్బంధం చేయను. కాని కనీసం దీన్నైనా అనుసరించడం వారి బాధ్యతగా గుర్తించరని నేను చెప్పవలసి వస్తోంది. నేనీ విధంగా ఎందుకు చేస్తున్నాను? దానికి కారణం నేను దేనినైనా నిషేధించినప్పుడు వారాపని చేస్తే, వారు బాద్యతా రహితులుగా వారికి వారే నిరూపించుకుంటారు. బోధనలోని యదార్థ భావాన్ని సూక్ష్మంగా పరిశీలిస్తే అది పాపకృత్యమౌతుంది. వారెటువంటి పాపం చేయడానికి నేనిష్టపడను. నా భావాన్ని అభ్యాసీలు అర్థం చేసుకుంటారు, కాని దానిని అనుసరించరు. ఉదాహరణకు, మన సంస్థలో మాంసాహారం ఖచ్చితంగా నిషేధించబడింది. ఇది నా గురువర్యులు శాసించిన విధానమని నేను ప్రకటించివున్నాను. కాని ఎవ్వరూ దానిని వదల లేకున్నారు. ఆధ్యాత్మిక ప్రయోజనానికి అది ఏవిధంగాను ఉపయోగకరం కాదు. బలహీనులు దానిని తీసుకొనవలసిందని చెప్పవచ్చు. కాని ఆరోగ్యవంతులకు కాదు. సామాన్యంగా ప్రజలు అది రుచికరంగా వుంటుందని తింటారు. ఆధ్యాత్మిక ప్రగతి ప్రయోజనాలకు అది హానికరం. నిజం చెప్పాలంటే ఏవిధమైన అనుచిత వ్యామోహం కూడ అది అనుకూలమైనది కాని, వ్యతిరేకమైనది కాని ఆధ్యాత్మికతకు విషతుల్యం.

# ఆధ్యాత్మిక పథంలో ప్రగతి

## I

ఒక వ్యక్తి ఆధ్యాత్మిక జీవితంలో యిప్పుడే ప్రవేశించినాడనుకొనుము. అతనిని "A" అని అందాము. అతడు ఏవిధంగా ప్రవేశిస్తాడు. ఒకానొక మహాపురుషుని మహోన్నత్వాన్ని గురించి విని ప్రవేశిస్తాడు. 'B'ని తన విధి నిర్ణయకర్త అయిన ఒక మహోన్నత వ్యక్తిగా 'A' తెలుసుకుంటాడు. ఇప్పుడు అతడు 'B'ని ప్రేమించనారంభిస్తాడు. కొంతకాలం తరువాత అతడి ప్రేమ మరింత వృద్ధి అవుతుంది. 'B'ని ఒక మానవాతీత అద్భుత వ్యక్తిగా భావిస్తాడు అతడి ప్రేమ వృద్ధి అయినప్పుడు, ఆ వ్యక్తిని ఎంతో ఆరాధనా భావంలో పెట్టుకోవాలనే తలంపు అతడికి కలుగుతుంది. ఇది నిజమైనప్పుడు, 'B'ని దైవంగా భావించి, ప్రగాఢ ప్రేమ కారణంగా అతడి రూపాన్ని తన హృదయంలో ఏర్పరచుకుంటాడు. అతడు ఒక్క క్షణం కూడ ఆ ఆలోచన నుండి విడివడుటకు యిష్టపడడు. ఆ మహావ్యక్తిని తన హృదయంలో పదిలంగా ఉంచకుంటాడు. కాని అతడికి ఎక్కువగా బాధనుకలిగించే విషయం 'B' యొక్క వినోద క్రీడ. అది పసిబిడ్డ కొంత ఎదిగిన తరువాత తల్లి ధరించిన వస్త్రముల ముసుగులోనే దాగి ఉండి తనను వెదకి కొనమని ఆమెను అడిగినట్లు ఉంటుంది. బిడ్డతల్లికి ఆచ్ఛాదనలేదనుకొనుము. అప్పుడు బిడ్డ ఎక్కడ దాగుతుంది? 'B' మీద 'A' ధ్యానం చేస్తున్నాడు. ముసుగు దానంతట అదే వచ్చి అతడి రూపం దాగినట్లు అనిపిస్తుంది. ఈ ముసుగు ఎక్కడ నుండి వచ్చింది? అది అతని స్వీయ ఆలోచనవలన ఏర్పడిన తెర. అదే అతనిని సర్వశక్తిమంతుడైన తన ప్రభువు నుండి దూరంగా ఉంచింది.

ముసుగు మాటున తన గురువును అతడు దర్శించలేదనుకొనండి. అతడు విసుగు చెందరాదు. ఎందువలన? కారణం 'B' అని పిలువబడుచున్న అతడి గురువు యీ ముసుగులోనే ఉన్నాడు. అతడు తన గురువును ఆయన రూపంలో దర్శించలేనట్లయితే ఏమాత్రం కలవరపడరాదు. విస్పష్టంగా చెప్పాలంటే ఆయన సర్వాంతర్యామిగ ఉన్నాడు. కాని ఆయన ఉనికిని అన్నిచోట్ల దర్శించడం అతడికి సాధ్యం కాని పని. అందువలన ఏకాగ్రత కోసమై ఆయన తనలోనే వున్నట్లు పరిమితం చేసాడు. తన గురువు తనలోనే వున్నట్లు భావిస్తే, అది అతడిలో ఆయన ఉనికి భావాన్ని పరిపూర్ణం కావిస్తుంది. అతడి

హృదయంలో అతడి గురువర్యుల భావం లోతుగ నాటుకొని వుందని దానర్థం. అతడు గురువుని తను కల్పించిన స్థానంలోనే అన్వేషించుట చాలా అపహాస్యంగా ఉంటుంది. గురువుని తన హృదయ ఫలకంపై ఆసీనులు కమ్మని ప్రార్థించినాడనుకొనండి. అతడి మొరవిని అతడు అర్థించినట్లుగానే గురువు "నేను మార్పును పొందుదును కాని, అంతం కాలేను" అని మాటలలో ప్రత్యుత్తరం పలికితే, ఆ భావము సంపూర్ణంగా సరైనదేనని అనాలి. భావం ఉన్నదున్నట్లుగ ఉండాలి. రూపం మారవచ్చును. దానిని గురించి చింతపనవసరం లేదు.

ఇప్పుడు శిష్యుడు సంతృప్తి చెందుతాడు. అతడు తన గురువర్యుని ధ్యానిస్తాడు. అతడి హృదయంలో ఆయన సాన్నిధ్య భావం ఉంటుంది. ఇది సరిపోవునని అను కుంటాను. దీని వెనుక ఒక తతత్వము దాగి ఉంది. మొదటి సారిగ పక్షిని పంజరములో ఉంచినప్పుడు అది రెక్కలు కొట్టుకుంటుంది. దానికి కారణం పంజరానికి అది అలవాటు పడలేదు కావున. అనంతుడైన వానిని నీ హృదయ పంజరంలో ఉంచావు. నీవు అర్థం చేసికొనుటకు అనంతుడైన వానిని పక్షితో పోల్చినపుడు, అది నీతో ఎగరడం ప్రారంభిస్తుంది. అప్పుడు దాని రూపాన్ని అన్వేషించడం మొదలెడతావు. ఎగరడం ప్రారంభించనంతవరకే ఆ రూపం కనబడుతుంది. మీరు యిరువురు కూడ కలిసి ఎగురుట వలన నీవు ఆయనతో ఏకమౌతావు. ఇది జరిగినప్పుడు అనగా నీవు ఎగరడం మొదలెట్టినప్పుడు, నీ సర్వస్వంతోపాటు ఎగరాలి.

## II

'A' తాను చేసే పని సర్వస్వాన్ని తన గురువర్యునికి అంకితం చేసి ప్రారంభిస్తే కాలక్రమంలో అది ఎంతమంచి అగునో ఊహించుము. ప్రతీదీ తన గురుదేవుని కోసమే చేస్తాడు. అంతేకాదు, తన గురువే చేస్తున్నాడనే భావంతో ప్రతీదీ చేస్తాడు. అతడా విధంగా భావించాలి. ఎందుకన, తను, గురువు యిద్దరు కలసి ఎగురుచున్నారు కావు. నిజం చెప్పాలంటే 'A' తన ఊహకు ప్రాణం పోసాడు. అతడి లక్ష్యముకు చైతన్యం వచ్చింది. ఇప్పుడు రెండిటికి జీవం వచ్చింది. ఆరోజు ఉదయం నుండే అతడు తన పనిని ప్రారంభిస్తాడు. తన దైనందిన స్నానపానాదులు అంతటిని తన గురువే చేస్తున్నారని తలుస్తూ చేస్తాడు. ఉదయం తీసుకునే ఆహారాన్ని తన గురువే తీసుకుంటున్నారనే భావంతో చేస్తాడు. ఆఫీసుకు వెళ్లడం, ఆపీసుకు పనిని చేయడం తన గురువే చేస్తున్నారనే తలంపుతో చేస్తాడు. ఇప్పుడు ఆఫీసునుండి తిరిగి వస్తున్నప్పుడు వచ్చే మధ్య దారిలో

ఆకర్షణీయమైన నృత్యమును చూస్తాడు. అతని దృష్టి ఆ నాట్యాన్ని అభినయిస్తున్న రూపం వైపుకు పోతుంది. అప్పుడు నిన్ను నీవు నిగ్రహించుకోలేకపోతే ఏమనుకుంటావు? నాట్యమును చూస్తున్నది నీవు కాదు, ఆ దృశ్యాన్ని చూస్తున్న నీనేత్రాలు ఆ గురువు గారివే అని భావించాలి. అది నీకు చేసే మంచి ఏమిటి? ఒక్కసారిగ ఆ నాట్యాన్ని చూడాలనే ఉత్సాహం పోతుంది. వెంటనే నీ గురవర్యుల శక్తి ప్రవహించనారంభించి, అప్పుడే రేకెత్తిన ఆ ఉత్సాహం నుండి విముక్తుడవుతావు. ఆఫీసు పని పూర్తిచేసి యిప్పుడు యింటికి వస్తావు. ఆఫీసు నుండి చాల గంటల తరువాత తిరిగి వచ్చిన నిన్ను చూసి నీ బిడ్డలు ఎంతో ఆనందించడాన్ని గమనిస్తావు. వారు సంబరపడడం చూసి నీవు ముచ్చట పడుతావు. అది సహజం కూడ. అప్పుడేమి చేస్తావు? నీ దృష్టి వారివైపుకు మళ్ళింది. తాత్కాలికంగా నీ పవిత్రభావము నుండి కొంచెము దూరమైనావు. అంతరంగంలో ఉన్న నీ గురువే వినోదిస్తున్నారని భావిస్తే అనుసరించిన యీ పద్ధతి సంపూర్తి అవుతుంది. దాని ప్రభావం ఏమీ లేకుండడాన్ని గమనిస్తావు. నీ స్వీయ ఆలోచనల నుండి దూరంగానూ ఉంటావు. ఇప్పుడు యింకొక పని జరుగుతుంది. స్నేహితులు వస్తారు. వారు కాలక్షేపం కబుర్లు ముచ్చటిస్తారు. నీవు కూడా వారి సంభాషణలోకి దిగుతావు. అది అనుదినం జరిగే విషయము. నీవు కాక, నీ గురువే వారితో ముచ్చటిస్తున్నట్లు భావింపుము. అదే ఉత్తమోత్తమ అభ్యాసమని చెప్పగలను. నీ దైనందిన చర్యలోను, నీ కార్యక్రమాలు అన్నింటిలోనూ అదే విధంగా నీకు నీవే సర్దుకు పోగలవు. నీవు నడుస్తున్నప్పుడు ఆ సమయంలో నీ గురువర్యుని గురించి ఆలోచించు. కాని నీవు ఆ రెండు పనులు ఒకేసారి చేసినట్లైతే ఎంతో శ్రేయస్కరం. నీ గురువుని గురించి తలవడం, అదే సమయంలో నీ గురువే నడుస్తున్నారనే భావాన్ని కూడ కలిగి ఉండడం జరుగుతాయి. ఆవిధంగా చేస్తే నీవు రెట్టింపు శక్తితో కొనసాగుతున్నావని అర్థం. అదేవిధంగా ధ్యానం చేసేటప్పుడు నీ గురువే తన స్వీయరూపం మీద ధ్యానం చేస్తున్నారని భావించాలి.

ఈ అలవాటును అలవరచుకున్నట్లయితే కాలక్రమంలో నీపై దాని ప్రభావం ఏమై ఉంటుంది? నీకు యిక ముందు సంస్కారాలు ఏర్పడవు. అనగా భవిష్యత్ భోగానికి అవసరమైన పరిస్థితులను కల్పించే లక్షణం క్రమంగా వృద్ధి చెందడం ఆగిపోయిందని అర్థం. అదే తాత్కాలిక జన్మరాహిత్యానికి మార్గం. కాని మన లక్ష్యం దానికన్న ఉన్నతమైనది. తరువాత వచ్చు అంతులేని పునర్జన్మ వలయం నుండి విముక్తి పొందాలని మన కోరిక. ఈ పద్ధతి చివరకు ఆ వ్యక్తిత్వానికి దారి తీస్తుంది. దీనిని ఆచరించి దాని ఫలితాన్ని అనుభవించాలి. అనతికాలంలోనే అది లభ్యమౌతుంది.

# ప్రాణాహుతి యోగశక్తి ద్వారా ఆధ్యాత్మిక శిక్షణ

నా గురువర్యుల కృపచే నేను ప్రజాసామాన్యానికి తెలియని ఒక గొప్ప రహస్య మర్మాన్ని వెల్లడి చేయడానికి ప్రయత్నిస్తాను. శ్రీకృష్ణపరమాత్మ, వివేకనందస్వామి, నా గురువర్యుల వంటి మహోన్నత వ్యక్తి ఒక మనిషి జీవిత గమనాన్ని అంతటిని మార్చివేయడం ఒక మహాద్భుతం. ఇది ఏవిధంగా జరుగుతుంది ?

ఇది అంతా తాను మారవలెననే సంకల్పం ఆ వ్యక్తిలో ఉండుట వలనే కాని, గురువు కేవలం నామమాత్రంగానే కారకుడని కొందరు సంశయాత్ములు చెప్పవచ్చు. అట్టి శక్తే శ్రీకృష్ణపరమాత్మకు ఉంటే కురుక్షేత్ర సంగ్రామాన్ని తీసికొని వచ్చుటకు బదులు దుర్యోధనునికి హృదయ పరివర్తనను ఏల కలిగించలేదు? అందుకు వారు ఒక నిరర్ధక వ్యక్తిని లేక నిర్జీవ వస్తువును మార్గదర్శకునిగా స్వీకరించి మహాయోగిగా మారిన ఎవరో వ్యక్తిని గురించిన కథలనేకములను చెప్పవచ్చు కూడ. కాని వాస్తవతత్వమును తెలిసికొనే ప్రయత్నానికి ఇది ఆటంకం కానవసరం లేదు. ఎందువలన అనగా దైవం అనుసరించే విధానాలు అనూహ్యమైనవి. కొందరు తమ స్వీయ ఆలోచనా వైఖరి కారణంగా మోసపోతారు. కొందరు దయాళుశక్తి (Divine grace)చే జ్ఞాన దీప్తిని పొందుతారు.

శ్రీకృష్ణ పరమాత్మకు ఎవరి నుండి తేజో ప్రకాశం వచ్చింది; అనే ప్రశ్న వేస్తే, ఆయన స్వయం ప్రకాశకుడని సమాధానం యిస్తాను. కాని అప్పుడు ఆ జిజ్ఞాసువు తాను, తదితరులు కూడ స్వయం ప్రకాశకులమని, అంతటితో తాత్విక పరిశోధన అంతా పరిసమాప్తమైందని భ్రమించి తప్పుదారి పట్టనవసరం లేదు. హృదయ తపనకు తర్క సంబంధమైన ఊహ చింతనలు ప్రత్యామ్నాయములు కావు. తర్కం ఎక్కడో ఒకచోట ముందుకు పోయే మార్గం లేక ఆగిపోయినప్పటికి హృదయం సంతృప్తి నొందదు.

ప్రాణాహుతి సంకల్ప శక్తి ద్వారా పనిచేసి ఎల్లప్పుడు సత్ఫలితాలనిస్తుంది. ఆధ్యాత్మిక శిక్షకుడు సాధకుడి మనస్సును తీర్చిదిద్దుటకు తన సంకల్పాన్ని ప్రయోగించినట్లైతే అది అమోఘమైన సార్థక ఫలితాలను యిస్తుంది. కాషాయ దుస్తులను ధరించిన వెంటనే గురు వృత్తిని చేపట్టిన అనేక స్వాముల వార్లు తమ శిష్యులు తాము చెప్పినదంతటిని శ్రద్ధగా వినినప్పటికి కుక్కతోక వలె వంకర ప్రవృత్తి కలవారుగ మిగిలి పోతున్నారని వాపోతారు. కారణం స్పష్టమే. ఆ స్వామి వారు తమ సంకల్పాన్ని ప్రయోగించక పోయి

యుండవచ్చును లేదా ఆయన ఆ శక్తి లేనివాడై యుండవచ్చును. కొందరు గురువులు కష్టతరమై, మానసిక ఒత్తిడిని కలిగించే అనేక పద్ధతులను సాధన చేయమని చెప్పి తన శిష్యులను వారి ఖర్మకు వారిని వదిలివేస్తారు. ఆ పద్ధతుల ఫలితము గురువుకు తెలియదు; శిష్యుడు కూడ తన విచక్షణా జ్ఞానాన్ని ఉపయోగించుటకు శ్రద్ధ వహించడు. ఫలితం శిష్యులకు అంతర స్థౌల్యము, బుద్ధి మాంద్యం, స్వేచ్ఛా రాహిత్యం; గురువులకు అవినీతి, పతనం, నైతిక నికృష్టత్వం. గురువులకు బోధించుటకు తమకు గల హక్కుపై మాత్రమే ధ్యాస ఎక్కువ; కాని తమ శిష్యుల ఎడల తమ కర్తవ్య బాధ్యదలను గురించి ఏమాత్రం పట్టించుకోరు.

సమర్థుడైన శిక్షకుడు ప్రాణాహుతి యోగశక్తి ద్వారా సాధకుని మనస్సులోని నీచ ప్రవృత్తులను బలహీనం కావించి, అతని హృదయాంతరాళంలో దివ్యతేజోబీజాన్ని నాటును. ఈ ప్రక్రియలో శిక్షకుడు అపార దివ్యశక్తి (Divine infinite power) ప్రేరితమైన తన స్వీయ సంకల్ప శక్తిని ఉపయోగించును. ఒక విధంగా అతడు 'దానిని' (That) గుర్తెరిగి దానినే తన సంకల్పమనే కటకం ద్వారా సాధకుడి హృదయంపై కేంద్రీకృతం చేస్తాడు. మొదట్లో సాధకుడికి ఎటువంటి అనుభూతి ఉండకపోవచ్చును. కారణం అతడు ఇంద్రియాల ద్వారా మాత్రమే అనుభవం పొందుటకు అలవాటుపడినాడు, కాని దివ్యశక్తి యింద్రియాలకు అతీతం. కొంతకాలం తరువాత అట్టి ప్రాణాహుతి ఫలితాలు అతడి అనుభవానికి రావచ్చు. అవి అతడి ముఖ్యాంగాలు పనిచేసే విధానాలలోను, అతడి మానసిక ప్రవృత్తులలోను సూక్ష్మమైన మార్పుల రూపంలో కూడా ఉంటాయి.

ఈ విధానానికి పోలిక ఇంద్రజాల, వశీకరణ విద్యలలో అపరిష్కృతంగా కనపడుతుంది. వాటి ఫలితాలు ప్రాణాహుతి ఫలితాలకు విరుద్ధమైనట్టివి. ఈ క్షుద్రకళలలో వశీకరణకర్త భౌతిక శక్తి ఆధారంతో తన సంకల్ప శక్తిని ఉపయోగిస్తాడు. వశీకరణానికి గురైన వ్యక్తి సంకల్పం బలహీనమై వశీకరణ పారవశ్యమైకం నుండి మేల్కొనిన తరువాత మందకొడిగాను, హృదయం బరువెక్కినట్లుగాను ఉండుట గమనించును. వశీకరణకర్త శక్తిమీదను, వశీకరణ గురైన వ్యక్తి యొక్క లోబడే తత్వం మీదను ఆధారపడి ఏదైన ఒకానొక వ్యాధి నయం కావచ్చు. ఒకానొక మానసిక ప్రవృత్తి కొంతవరకు అణచిపెట్టబడి ఉండవచ్చు. కాని ఆ ప్రభావం ఎంతోకాలం నిలవదు. భౌతిక వస్తువులను కాని, మానసిక రూపాలను కాని, ఏకాగ్రత కోసం లక్ష్యముగ ఉపయోగించి చేసే కొన్ని తీవ్ర మానసిక, శారీరక సాధనలచే వశీకరణ శక్తి పెంపొందుతుంది. ఈ సాధనలు తరచు మానసిక వైకల్యానికి, ఉన్మాదమునకు దారి తీస్తాయి. ఒక్కొక్కప్పుడు వాటి ఫలితంగా శారీరక

వైకల్యాలు కూడ సంభవిస్తాయి. ఒక్కొక్కప్పుడు వాటి ఫలితంగా శారీరక వైకల్యాలు కూడ సంభవిస్తాయి. ఈవిధమైన సాధన చాలాకాలం తరువాతనే విజయవంతమవుతుంది. దాని ఫలితంగా మహా అయితే కొంత భౌతిక శక్తిని సంపాదింప వీలవుతుంది. అది కూడ పరిమితమైనదై ఆ శక్తి ఉన్నంతవరకు కొన్ని రకములైన కోరికలు నెరవేరుటకు మాత్రమే ఉపయోగపడుతుంది.

ప్రాణాహుతి శక్తి పవిత్ర మనస్సు ద్వారా పనిచేయు ఒక దివ్యశక్తి అనే విస్పష్టమైన నిర్ణయానికి సాధకుడు యీ పాటికి వచ్చి ఉండవచ్చు. మనస్సు ఏవిధంగా పరిశుద్ధం కావింపబడుతుంది? అది ఏవిధంగా ఆ దివ్యశక్తితో అనుసంధింపబడుతుంది? మన ఆలోచన శాశ్వతంగా దైవంతో కలుపబడినప్పుడు యివి జరుగును. ఈ సమాధానం చెప్పడానికి సులభమే. మరి ఆలోచనను దైవంతో శాశ్వతంగా కలపడం ఎట్లు? దానికి అనేక సమాధానములు యీయబడ్డాయి. కాని నా హృదయాంతరం నుండి ఉప్పొంగి పైకి వెడలిన రహస్యం ఏమిటన ఆ పనిని చేసేవారు, చేసినవారు; చేస్తున్నవారు నా గురువర్యులే అని. నా గురువర్యులను నేను చూసినప్పుడు ఆయన తేజస్సుతో నా హృదయం నిండిపోయింది. ఆయననే నిరంతరం నా ప్రభువుగా, నా గురువుగా నా ఆత్మగా స్మరించడం మొదలెట్టాను. నిజమైన అన్వేషకులు ఎల్లరు ఆయనను పొందెదరు గాక! తథాస్తు !!!

# ప్రయోజనకర విధానము

మీమాంశ దర్శనంలో యీయబడిన కర్మకాండము శంకరాచార్యుల వారు తమ వేదాంత తత్వంలో వ్యతిరేకించారు. కాని పై అభిప్రాయములలో దేనితోను నాకు నిమిత్తం లేదు. నిస్సందేహంగా కర్మకాండ కొంతవరకు మాత్రమే సాత్విక ప్రవృత్తులను పెంపొందించడానికి సహాయపడతాయి. అవి ఆధ్యాత్మికతకు సన్నిద్ధులవడానికి తగిన ఏర్పాట్లను చేస్తాయి కూడా. ఆ విధంగా శాశ్వత సత్వప్రాప్తికై సహకరించే ప్రతి యితర విషయంతో పాటు దీనిని కూడ అనుసరిస్తే నాకు అభ్యంతరం లేదు.

సర్వసామాన్యంగా హిందువులలో దేవతారాధన మరీ ఎక్కువ ప్రబలి ఉంది. దీనిని పిల్లల శ్రేయస్సు గురించో, ప్రాపంచిక లాభం పొందాలనే లక్ష్యంతోనో చేస్తారు. ఎక్కువగా స్త్రీలే దీనిని ఆశ్రయించి పట్టుకొని ఉంటారు. దీనికి కారణం పిల్లలను కని, పెంచేవారు వారే. అందువలననే వారి అనురాగ బంధాలు బలీయమౌతాయి. వారి వంతు కార్యాన్ని వారిని నిర్వహించనీయండి. మనవంతుకార్యం ఎడల మనం శ్రద్ధ వహించాలి.

కేవలం బాహ్య లక్షణాన్నే కలిగిన జపమంటే నాకు సుముఖత లేదు. అయినప్పటికి కొన్ని సందర్భాలలో నేను కూడ జపం చేయమని సలహా యిస్తాను. కాని అది వేరు తరగతికి చెందినది. నిజమునకు యివి అభ్యాసి తన అభివృద్ధి కొరకు తాను చేయవలసిన ప్రయత్న సాధనాలు. కాని మన సంస్థలో యీ పని గురువే చేస్తారు. ఆయన ప్రాణాహుతి ద్వారా అభ్యాసిని ఆధ్యాత్మిక శక్తితో పోషిస్తారు. ఇప్పుడు భక్తి ప్రేమలతో గురువు నుండి సాధ్యమైనంత ఎక్కువగా రాబట్టడం అభ్యాసిపై ఆధారపడి ఉంది. భక్తి, శరణాగతులు ఎంత అధికంగా వుంటే అంత అధికంగా శక్తి తనలోకి ప్రవహిస్తుంది.

కలియుగంలో అనునిత్యం భగవాన్నామాన్ని జపించడమే రూఢియైన ముక్తి మార్గమని కొందరు మహాత్ములు చెప్పుదురు. భగవన్నామ జపం వలన ఉత్పన్నమయ్యే ప్రకంపనలలో మనం లీనమైతే గాని ఆశించిన ఫలితం తప్పక నెరవేరడం అనేది ఎన్నటికీ సాధ్యం కాదని నా నమ్మకం. నిర్విరామంగా 24 గంటలూ దైవ నామాన్ని జపిస్తే ఆయన దర్శనం అవుతుందని కొన్ని పురాణ గ్రంథాలు చెబుతాయి. చాలాకాలం క్రిందట ఒకసారి నా తల్లిగారు ఎంతో శ్రద్ధతో ఆ విధంగా చేసారు, కాని దాని వలన ఫలితం కనబడలేదు. అందరూ నమ్మే యీ దర్శన సిద్ధాంతం నాకు ఏమాత్రం సమ్మతం కాదు. ఇది శాశ్వత

సత్వప్రాప్తి విషయంలో నా స్వానుభవం ఆధారంగా చెప్పగలను. నేను కూడ కొన్ని సందర్భాలలో రామనామాన్ని మానసికంగా జపించమని సలహా యిస్తాను. అప్పుడు మన ఆలోచన సర్వదా ఆయన సర్వవ్యాపిత లక్షణం పై నిలచి వుండాలి. ఈ విధానం సతత స్మరణ స్థితిని తీసికొని రావడంలో సహాయకరంగా వుంటుంది కూడ. కచ్చితంగా చెప్పాలంటే, మనం నిజానికి ఏ జపమూ చేయం. మన ఆలోచనను ఆ లక్షణంపై నిలిపి ఉంచుతామే గాని దాని రూపాన్ని దృష్టిలో పెట్టుకొనుటకు ప్రయత్నించము. మనం నిర్గుణ పరతత్వాన్ని సమీపించవలసి ఉంది. అందుకు మనం మన ఎదుటనున్న ఆ గురువు రూపాన్ని స్వీకరించాలి. కాని అది కూడ గురువు అత్యున్నత సమర్థుడని సర్వత్ర ఆమోదింపబడినప్పుడు మాత్రమే జరగాలి. ఆయన అత్యంత పూజనీయులైన నా ఆధ్యాత్మిక పిత వలె దైవంలో సంపూర్ణ లయస్థితిని పొందినవాడై ఉండాలి. 37వ యోగ సూత్రంలో పతంజలి కూడ దీనినే చెప్పడం జరిగింది. ఈ విధానంలో మనకు తటస్థపడే నాలుగు స్థితులను "రాజయోగ ప్రభావము"లో వివరించబడినాయి. ఆఖరు స్థితి అహంకారమును దాదాపు అంతమొందిస్తుంది. ఇది తిరుగులేని విధానం. నా ఆధ్యాత్మిక జీవితమంతటా నేను దీనినే అనుసరించాను. అటువంటి గురువు లభ్యమైనప్పుడు ఆయన రూపం ధ్యానం చేయవచ్చు. లేనట్లయితే సాక్షాత్తూ రుజువిధానమే అత్యుత్తమం.

చివరగా శాశ్వత సత్వప్రాప్తికై నీవు తపన చెందుతూ ఉంటే ప్రకృతి వలె నిరాడంబరంగా ఉండటానికి ప్రయత్నించి అటువంటి పద్ధతులనే అవలంభించాలి. అది పసిబిడ్డను ముద్దాడి మురిపించడానికి పసిపిల్లల చేష్టల్ని ఏ విధంగా అనుకరిస్తావో అదే విధంగా జరగాలి.

మనం ఎటువంటి వ్యామోహ భావం లేకుండ ప్రతిదానిని విధి నిర్వహణగా చేస్తూ గృహస్థ జీవితాన్ని వైరాగ్య పద్ధతిలో గడపాలి. సరైన పద్ధతిలో తీర్చిదిద్దుకుంటే గృహస్థ జీవితాన్ని నిందించనవసరం లేదు. నీవు దేనినైనా బలవంతంగా చేయవలసి వచ్చినపుడు ఎటువంటి స్వలాభాపేక్ష లేకుండ దానిని, దాని కోసమే చేస్తే, అది మీ మనస్సుపై ఎటువంటి సంస్కారపు ముద్రను కలిగించని వైరాగ్య భావంతో చేసిన పనని నేనంటాను. ప్రతి పనిని దైవాజ్ఞానుసారంగ చేస్తున్నామని, మనం ఆఖరుకు భార్యాబిడ్డల విషయంలో కూడ యిదే విధంగా భావించాలి. ఈ విధంగా మన చర్యలన్నీ చివరకు పూజగా మారుతాయి. సర్వశక్తిమంతుడైన భగవంతునితో మీ ఆలోచనను అనుసంధానం చేయుటకు ఇది మిక్కిలి సులభమైన పద్ధతి.

# అన్వేషకునకు సూచనలు

మనిషి అంతరంగం నిగూఢమైనది. కేవలం ప్రశ్నలూ సమాధానాలతో అదెన్నటికీ బహిర్గతం కాదని నా అభిప్రాయం. నిజానికి సత్సంగం, అభ్యాసం వీటి ద్వారానే దీనిని తెలుసుకొనడం సాధ్యమవుతుంది. నేను గ్రంథాలను వేటినీ చదవలేదని బాహాటంగా ఒప్పుకుంటాను. అవి ప్రయోజనకరమైనవని నేనెన్నడూ భావించలేదు. నా లక్ష్యం సత్‌తత్వమే, అదొక్కటే పొందదగినదని నేను భావించాను. గ్రంథపఠనాన్ని పండితులకే వదిలేసాను. శంకరాచార్యుల వారు గాని, రామానుజాచార్యుల వారు గాని, ఇతరులు గాని వారి స్వీయానుభవం గురించి ఏమి చెప్పినప్పటికి, నేను చెప్పేదీ వ్రాసేదీ అంతా శాశ్వత సత్యప్రాప్తి మార్గంలో నా స్వానుభవాన్ని ఆధారంగా చేసికొని మాత్రమే. నేనిప్పుడు కూడ అప్పుడప్పుడు తప్పక చదువుతుంటాను. కాని అది కాలక్షేపం కొరకు మాత్రమే. నా అభిప్రాయాలను సులభంగా వ్యక్తం చేయుటకు, వాటిని నాకు సాధ్యమైనంత ఎక్కువగ జ్ఞాపకముంచుకొనుటకు ప్రయత్నిస్తాను. శంకరాచార్యుల వారి వివేక చూడామణిలో నేను చదివిన అటువంటి విషయం ఒకటి నాకు జ్ఞాపకముంది.

**దాని అర్థం :**

"శాశ్వత సత్యప్రాప్తికి గ్రంథములు మనకు సహాయపడవు; మరియు శాశ్వత సత్యప్రాప్తిని పొందినప్పుడు గ్రంథములు నిరుపయోగములు అవుతాయి."

మనం సాధనను ప్రారంభించి అంతిమ లక్ష్యాన్వేషణలో ఉన్నప్పుడు, మన సాధనకు దోహదకారిగా కనబడే దానిపైనే మనస్సును నిలిపి ఉంచుతాం. దాని ఫలితంగా ప్రతీది దైవ సంకల్పం మీదనే ఆధారపడి ఉంటుందని మనం ఊహించడం ప్రారంభిస్తాము. ఆ విధంగ మనం ఆ దైవ సంకల్పంతో సంబంధాన్ని కలిగి ఉంటాము. అది క్రమంగ సామీపత్య, అనురాగాలుగ పరిణమిస్తుంది. నిజానికి లయావస్థ స్థితి ప్రారంభమైందని దాని అర్థం. దానికై మనం, భక్తి, ప్రేమ మొదలుగా మన ప్రయోజనానికి దోహం చేసే అన్ని యితర పద్ధతులను ఆచరిస్తాము. సర్వస్వతంత్రమైన మన సంకల్పం మన పరిమితమైన పరిధి వరకు విస్తరించి ఉంటుందని, దైవ సంకల్పం ఆయన అనంత స్థితి వరకు విస్తరిస్తుందని మనం చెప్పవచ్చు. మనం మన పరిమితులను, బంధాలను ఛేదించుకునేటంత వరకు మన సంకల్పం ఆ దైవ సంకల్పం ఒకటేనని చెప్పుకోలేము.

ఇదే మనం చేసే అసలు సాధన. సత్ తత్వంతో లయాన్ని పొందడానికి మనం దీనిని చేస్తాం. "అనంతము వైపునకు" అనే మరో పుస్తకంలో యీ విషయం చర్చింబడింది. దానిలో మనిషి తన వ్యక్తిగత అస్తిత్వము కోల్పోయిన తర్వాత బ్రహ్మము ఏవిధంగా ఐక్యం అవునో నేను వివరించి ఉన్నాను. దైవ సంకల్పానికి, మాన సంకల్పానికి మధ్యన ఉన్న సంబంధాన్ని యీ విధంగ వివరించవచ్చు. మనం దైవ సంకల్పంపై దృష్టిని సారించినప్పుడు, ఆ మహత్తర విషయం అల్పతర విషయాన్ని ఆకర్షించ మొదలిడుతుంది. మన పరిమితులను అన్నిటిని విచ్ఛిన్నం చేసుకున్న తరువాత పరబ్రహ్మతో ఏకత్వాన్ని పొందినప్పుడు మనం ద్వందాతీత స్థితిలో నివసించడం ప్రారంభిస్తాం. కాని మనం ద్వంద్వ స్థితి నుండి మొదలెట్టి ప్రయాణం చేసిన తరువాత చిట్ట చివరకు అప్రయత్నంగానే ద్వందాతీత స్థితికి చేరుకుంటాం.

అందరు తమంత తాముగ దైవం వైపుకు పురోగమింతురా లేక దైవసంకల్పం వలన ఆ విధంగ జరుగుతుందా అని ప్రశ్నించారు. అందుకు సమాధానంగ ప్రతి నదీ తన స్వయంప్రతిపత్తిని సంపూర్ణంగ కోల్పోయి మహా సముద్రంలో తనకుతానుగ కలుస్తుందని చెప్పిన సరిపోతుంది. సముద్రం నదిలో కలవడానికి రాదు. అదేవిధంగా మనం మూలం వైపుకు వెడతాము. దానిలో అందరూ లయం కావలసిన సమయం వస్తుంది. అదే మహాప్రళయ కాలము. మనం మన ప్రయాణ మార్గాన్ని తగ్గించడానికి మాత్రమే సాధన చేస్తాము. ఆ విధంగ అంతవరకు వచ్చే అనేక జన్మల దుఃఖ పరంపర నుండి రక్షింపబడుతాము.

సృష్టికాలమున కేంద్రం చుట్టూ తిరుగుతూ ఉన్న చలనం యొక్క ఫలితంగ ప్రకృతి ఆవిర్భవించింది. ఆ చలనం శక్తిని జనింపజేసింది. తరువాత ఆదే సృష్టికి కారణమైంది. మహాప్రళయ కాలంలో ప్రకృతి తన అస్తిత్వాన్ని (existence) పూర్తిగా పోగొట్టుకుంటుందని నేను భావిస్తాను. ఎందువలన అనగా పదార్థ సముదాయం వలన ఏర్పడిన ఎటువంటి వస్తువైన మిగిలి ఉన్నట్లైతే నిజానికి మహా ప్రళయం సంభవించినట్లు కాదు. దాని తరువాత మిగిలినది ఏదైనా ఉంటే అది ఒక్కటి మాత్రమే. అర్థం కావడానికి మనం దానిని శూన్యము లేక ఆధారము అని అనవచ్చు. ఆధారం లేకుండ ఏ ప్రకృతి, ఏ విశ్వము కూడ నిలువలేదు. అస్తిత్వానికి ఆధారమంటూ ఒకటి ఉండి తీరాలి. ఆ ఆధారమే దైవం, లేక బ్రహ్మము. నిలబడటానికి ఎటువంటి ఆధారం లేనట్లయితే అది అర్థరహితం అవుతుంది. ఇక ప్రారబ్ధకర్మ గురించి చెప్పాలంటే, ఆ సంస్కారాలు భోగానికి సిద్ధమై ఉన్న దృశ్యం నాకు కనబడింది. ప్రతిచర్య శారీరకం గాని మానసికంగాని కొంత ప్రభావాన్ని కలుగజేస్తుంది.

గత సంస్కారాలన్నింటిని తొలగించుకున్నప్పుడే మనం ముక్తిని పొందగలము. నిజానికది ప్రయాసతో కూడిన పని. రాజయోగంలో అభ్యాసం వలన సరైన మార్గదర్శకత్వం వలన అవి దాదాపు దగ్ధమై వున్న స్థితిలో భోగానికి వస్తాయి. ఆధ్యాత్మికతలో అత్యంత ఆవశ్యకమైన గురువు యీ పూర్వ సంస్కారాలను స్వప్నావస్థలో కూడ భోగానికి తీసుకుని వచ్చే కార్యక్రమాన్ని నిర్వహించగల సమర్థుడైతే భోగ కార్యక్రమం నిద్రలో కూడ కొనసాగుతుంది. భక్తి సాధనల ద్వారా మనంతట మనమే యీ ముసుగు తెర నుండి బయట పడవలసి ఉంటుంది. నిజమైన జీవిత మకరందాన్ని రుచి చూడాలంటే విధి ఎగుడు దిగుడులతో నిమిత్తం లేకుండ నిర్భీతితో సాహసించి ఆధ్యాత్మిక రంగంలో ముందుకు రావాలి. మన జీవితానికి కావలసినది అదే కాని దాన ధర్మాలు కావు. నిజమైన త్యాగం అంటే ఉద్యోగాన్ని వదలి అరణ్యానికి పోవడం కాదు. నిన్ను నీవు విలయం చేసుకోవడమే. నిజమైన అన్వేషకునికి కావలసిందదే.

నిర్వికల్ప సమాధిని గురించి అడిగావు. సహజంగా అది ఒక యోగసిద్ధి; కాని అది నీ సమస్యను పరిష్కరించదు. అది నిన్ను తాత్కాలిక జన్మరాహిత్య స్థితికి తీసుకురాగలదు. కాని "సత్యోదయము"లో చెప్పినట్లుగ ముక్తి అనేది వేరొక విషయం. దైవంతో సమానంగ అత్యంత సూక్ష్మతను పొందినప్పుడు మాత్రమే నీవు ముక్తికి అర్హుడవని భావించవచ్చు. మన అభ్యాసంలో దానికే ప్రయత్నించడం జరుగుతుంది.

నీవు నిర్వికల్ప సమాధిని పొందినావనుకుందాం. అప్పుడు కూడ కల్పన ఏదో ఒక రూపంలో మిగిలే ఉంటుంది. అంతేకాక దానిలో పొందిన జడస్థితి నిరంతరం కొనసాగడం సాధ్యం కాదు. ఎందుచేతనంటే మన కర్తవ్య బాధ్యతలను కూడ శ్రద్ధతో నిర్వహించాల్సి ఉంటుంది కను. వాటిని కూడ పట్టించుకోకుండా వుంటామనుకుందాం. అప్పుడు కూడ దేహాన్ని కాపాడుకోవలసిన పవిత్ర కర్తవ్యమొకటి మనకింకా ఉంది, పరిపూర్ణత్వాన్ని పొందడానికి అది కూడ తప్పని సరిగ అవసరం. ఒకే స్థితి నిరంతరం నెలకొని ఉంటే వాస్తవానికి దాన్ని గురించి శ్రద్ధ వహించం. మనం సర్వదా ప్రాపంచిక పనులు, కర్తవ్యాలలో నిమగ్నులమై ఉన్నప్పటికి పరిశుద్ధము, సరళము అయిన సత్ తత్వముతో ప్రతిక్షణం అంటిపెట్టుకొని ఉండడమే నిజమైన సమాధి స్థితి. దానినే సహజ సమాధి అంటాము. అది ఒక మహోన్నత సిద్ధి, నిర్వాణానికి అసలు ఆధారం. దాని యోగ్యతలను మాటలలో వర్ణించలేము. కాని దానిలో వసించు వ్యక్తి దానిని గ్రహింపగలుగుతాడు. దాని పేరు సూచిస్తున్నట్లుగ అదేమంత సులభం కాదు. సంత్ కబీరు దానిని గురించి ఎంతో గొప్పగ చెప్డం జరిగింది. అదే పొందయోగ్యమైన విషయం.

నేను నీకు మరొక విషయాన్ని కూడ చెబుతాను. సరైన అభ్యాసానికి ఆ విద్యలో ప్రవీణుణ్ణి అన్వేషించడానికి ప్రయత్నించాలి. అటువంటి వ్యక్తి లభించినప్పుడు అతనికి సంపూర్ణంగ అర్పించుకోవాలి. నీకు అవసరమైన దాన్ని గురించి తగినంతగా వివరించానని అనుకుంటున్నాను. నిజమైన అన్వేషకుడి పాత్రను నిర్వహించడం వంతు యిప్పుడు నీది. నీవు లక్ష్యాన్ని పొందడానికి సహాయపడే పద్ధతులను అవలంబించాలి. మనం గమ్యాన్ని సమీపిస్తున్నామని సూచించే గుర్తులు మూడు వున్నాయి. అవి దివ్యచర్యలు, దివ్య జ్ఞానము, దివ్య భావనలు. వీటిని నీలో పెంచుకోడానికి ప్రయత్నించాలి. అందుకు ప్రాణాహుతి అను యోగపద్ధతి మీద ఆధారపడిన సూక్ష్మ పద్ధతి మనకు ఉంది. అభ్యాసికి ఆధ్యాత్మిక పథంలో అదెంతగానో తోడ్పడుతుంది. కొంతకాలం చేసిన పిమ్మట మాత్రమే దాని ప్రభావం తెలుస్తుంది. సూక్ష్మ విషయాన్ని పొందవలసి ఉంది కావున సూక్ష్మ పద్ధతినే ప్రయోగిస్తాం. ఈ భావం హృదయంలో లోతుగా నాటుకున్న ఎడల, అది సత్వరమే ఫలితాన్ని యివ్వడం తథ్యం. నన్ను అడగవలసినంది మరేదైనా ఉందా? ఇంకా ఒకటి ఉందని నేననుకుంటాను. అది "పరిపూర్ణత్వాన్ని పొందుటెట్లు?" అని అంతేనా కాదా? సమర్థుడైన గురువు లభించినట్లైతే అదేమాత్రం కష్టం కాదని నేను కచ్చితంగా చెప్పగలను. అటువంటి వానిని యిప్పుడు అన్వేషించాలి. మిత్రుడిగ నేను నీకు యిచ్చే సలహా అది. అతడు లభించినప్పుడు, పూర్తిగ నీవు అతనికి అర్పించుకో, ఆయన సాహచర్యం వలన నీకనేక విషయాలు తెలుస్తాయి. అదే అతనిని కనుగొనే పద్ధతిగ పనికొస్తుంది. నీ సమయాన్ని ఎంతో వృథా చేసాను. సమాధానంగా ఒకే ఒక వాక్యం సరిపోతుంది. అది "నీలోనే అన్వేషించు; నీ లోనే ఆయనను కనుగొంటావు. ప్రభువు అక్కడనే ఉన్నాడు. కాని ఎప్పుడు? నీవు అక్కడ లేనప్పుడు మాత్రమే."

# సమస్య - దాని పరిష్కారము

ఆత్మ దేహమనే వస్త్రాన్ని ధరించినప్పుడు మాత్రమే దాని వివర్త రూపము ఆవరణరూపంలో కనిపించింది. అనగా అదంతా స్వీయరూపంలో ఒక తాడుగా అయి అనేక ముడులను ఏర్పరుచుకుంది. ప్రియ సోదరా! ఆత్మతోపాటు మొదటనే మనము దాని వివర్త రూపాన్ని పునరుజ్జీవింప చేస్తాము. అగ్ని, నీరు కలిస్తే జ్వాల రెట్టింపు అవడం దానిలోకి వాయువు ప్రవేశించినప్పుడు అది మెరవడం, ఆ మెరుపుకూడ దానికి తగినట్లుగ ఉధృతం కావడం నీవు గమనించలేదా? ఈ జ్వాలేమిటి? ఇవి ఆత్మశక్తిపై ప్రకృతి సృష్టించిన విభిన్న చర్యలు. ఇప్పుడు వీటిలో అనగా మన దృష్టికి ప్రత్యక్షమైన పృధ్వీ, వాయువు, జలము, అగ్ని యొక్క క్రీడాకలాపంతో మన దృష్టి సత్య వస్తువు అయిన "దాని" వైపుకు ఎన్నడు పోలేదు. కొంచెం ఊహించు సక్రమంగా వినియోగించక పోవడం వలన వానియందు ఆ సత్యవస్తువు యొక్క చర్య తెరమరుగై దృష్టికి అగోచరం అయింది. ఆ పరిస్థితిని వాటిలో సృష్టించిందేది? వినాశనాన్ని కలిగించే అటువంటి చర్యను "అది" ఎందులకు చేయవలసి వచ్చిందో కూడ అర్థంకాదు. సత్యవస్తువు సృష్టి సంకల్పంతో పాటు ప్రపంచాన్ని సృష్టించాలనే ఆత్మ సంకల్పంతో కలవడం ఆ చర్యకు కారణమైంది. సృష్టి నిర్మాణమనే అనేకత్వభావం ఏకత్వభావానికి విరుద్ధంగా వుంటుంది. ఒక విధంగా యీ రెండూ కూడ పరస్పర వ్యతిరేకాలు. వేరు మాటలలో చెప్పాలంటే, సంకల్ప ప్రభావంగా ఏర్పడిన యీ రెండవది, దాని మూలం కంటె స్థూలమైనదిగా వుంటుంది. కాని యీ రెండూ చాలా సన్నిహితంగా కలిసిపోయి సృష్టి ఏర్పడాలనే సంకల్పాన్ని వేగపరచాయి. అదేవిధంగా వాటి చర్య కూడ అగ్ని, నీరుల సంయోగం వలన సంభవించే చర్యను పోలి వుంటుంది.

మనం ప్రకృతి నుండి ఆత్మను తీసుకొని వచ్చాము. దానియందు ఒక విధమైన చైతన్యము కూడ కలిసి ఉంది. విభిన్నస్వరూపాలు ప్రత్యక్షం అగుటకు కారణమైన పరమాత్మ సంకల్పము యొక్క ప్రధానమే ఈ చైతన్యం. ఇప్పుడు మన సంకల్ప ఫలితంగా మనతోవున్న వస్తువులకు మన ఆలోచన వలన శక్తి యిచ్చి వాటిని కూడ చైతన్యం కావించాయి. ఇంతకు పూర్వం అక్కడేముంది? ప్రశాంతత ఆత్మ లక్షణం, దేహం ఆత్మకు విరుద్ధమైనది కావున దాని లక్షణం ప్రశాంతతకు విరుద్ధంగా వుంటుంది. కాని మనం మాత్రమే దాని సృష్టి కర్తలం. ఇది మన స్వయంకృతమే. పైన వివరించినట్లుగ మన

కర్మఫలంగా ఏర్పడినట్టిదే. కేవలం అదే కష్టాలు బాధలతో కూడిన అశాంతి. దానికి శక్తిని యీయకుండ ఆపగలిగే సామర్థ్యం ఎప్పటికైనా మనకు కలిగితే, అప్పుడు దాని పరిస్థితి నీరు పోయని మొక్కల వలె వుంటుంది. అది ఏవిధంగా సాధ్యమవుతుంది? ఇప్పుడు మన ఆలోచన భౌతికతత్వం, శరీరం వైపు మొగ్గి ఉంది. దానిని ఆత్మవైపునకు మరల్చినప్పుడు మన చర్య ఫలితంగా కష్టాల రూపంలో ఏర్పడిన యీ విషయాలు క్రమంగా సమసిపోతాయి. దృష్టిని ఆత్మవైపుకు మరల్చడం వలన ఏర్పడిన ప్రభావం దానిని కూడ ప్రభావితం చేస్తుంది. క్రమంగా శుద్ధీకరణం వలన దానిస్థితి ఆ జ్వాల అదృశ్యమయ్యేటట్టు చేస్తుంది. ఈ స్థితి సజీవ సంకల్పం నుండి పొందిన చైతన్యశక్తిని ప్రయత్న పూర్వకంగా ఆత్మవైపుకు మరల్చడం వలన ఏర్పడినట్టిది.

సృష్టి ఏర్పడింది. చైతన్యం ప్రవేశించిన వెంటనే మన పరిస్థితి బలహీనుడైన రోగి కోలుకోవడానికి బలవర్ధక ఔషధాన్ని సేవిస్తే ఏవిధంగా ఉంటుందో ఆ విధంగా ఉంది. దాని ఫలితంగా అతడు మరింత విషయలోలుడైనాడు. ఆ విషయలోలత్వ కారణంగా అతడు మరల బాధ ననుభవిస్తూ మరణశయ్యపై ఉన్నాడు. అతడికిచ్చిన బలవర్ధక ఔషధంలో తప్పేమీలేదు. కాని లోపమంతా దానిని అనుచితంగా దుర్వినియోగం చేయడంలోనే ఉంది. బాధ ఏ రూపాన్ని దాల్చిందంటే ఔషధం యొక్క అవసరం తీవ్రమైనదిగా గుర్తించడం ప్రారంభించినాడు. రోగమే కనుక లేనట్లయితే మొదట్లో ఉన్న ఆరోగ్యస్థితిని ఎవ్వరు గుర్తుంచుకోరని నేను మళ్ళీ చెప్పవలసి వస్తుంది. రోగి మాత్రమే ఆరోగ్యపు విలువను గుర్తిస్తాడు. దీని నుండి ముక్తిని పొందినప్పుడు మాత్రమే ఆరోగ్య లక్షణాలు ఏర్పడుతాయి.

కొన్ని విషయాలను కష్టాలని, అసలు మూలానికి విరుద్ధమని అంటాం. వాటికి ఏవిధంగ శక్తి వస్తుందని అడుగవచ్చు. వాటి ఎడల మనం చూపే శ్రద్ధకు తగినట్లుగా చైతన్యశక్తి వాటిని శక్తివంతం చేస్తుంది. ఇదే దానికి సమాధానం. క్రమంగా వాటికి ఎంతో శక్తి ఏర్పడి ఆ విషయాలు మనల్ని, మన ఆలోచనా శక్తిని కమ్మివేస్తాయి. భక్తి, పూజల విషయంలో కూడ ఇదే జరుగుతుంది. మన దృష్టిని ఆదిమూలమైన దైవం వైపుకు మరల్చినప్పుడు, దైవమే శక్తి కావున ఆ శక్తి భక్తితో కూడ రావడం మొదలెడుతుంది. అప్పుడు దైవశక్తి అనే యీ రెండవ శక్తి క్రిందికి దిగి రావడం ప్రారంభిస్తుంది. ఈ అనావశ్యక విషయాలు వాటంతటా అవే బలహీనం కావడం ఆరంభిస్తాయి. ఈ విషయాలు మన ఆధీనంలోనే ఉంటాయి. కావున మనం వాటికి శక్తిని యిస్తున్నాము. ఆ విషయం అనగా దైవభక్తి లేక పూజ దైవాధీనమైనది కావున అది 'అచ్చుట' నుండే శక్తిని గ్రహిస్తుంది. దీని

తాత్పర్యం ఏమిటి? నిజంగా దైవం ఎడల మనం ఆసక్తిని చూపితే, యీ విషయాలు అన్నీ చివరకు క్షీణించిపోయి, క్రమంగా శ్రీకృష్ణ పరమాత్మ వర్ణించిన ఆ స్థితి ఫలిస్తుంది. ఈ స్థితి ఏమిటి? మనిషి తాను దేనికీ కర్తను కానని భావించడం. ఈ స్థితి వృద్ధి చెంది ఉన్నత స్థాయికి చేరుకున్నప్పుడు సంస్కారములు ఏర్పడడం ఆగిపోతుంది. ఈ స్థితిలోకి ఎవరైనా ఎప్పుడైనా ప్రవేశించి ముందుకు సాగినప్పుడు మిగిలేదేమిటి? అందులో ఒక భాగమే జీవన్మోక్షగతి అనగా ఒక వ్యక్తి జీవిత కాలంలోనే ముక్తి స్థితిని పొందడం. ప్రజలు అనేక విధాలుగా యీ స్థితిని నిరూపించుటకు ప్రయత్నిస్తున్నారు. ఆ స్థితిని వివరించడానికి యిది ఎంత పెద్దపదమో! కాని ప్రియ సోదరా! అది ఎంతో తేలిక, సులభం అయిన విషయం. దీన్ని పొందడమే మిక్కిలి సులభం. నమ్ము... సులభమైన విషయాన్ని ఎల్లప్పుడుమిక్కిలి అప్రయత్నంగను, సులభంగాను పొందవచ్చును.

ఇదెంతో సులభమైన విషయం, ప్రయత్నిస్తే సామాన్యులు కూడ దీన్ని పొందడం చాల సులభ సాధ్యం. నిజానికి దాన్ని గురించి ఏమీ తెలియని వారే సాధారణంగా యీ స్థితిని పొందే పద్ధతిని గురించి చెప్తారు. అంతేకాదు, వారు నిజంగా ఆధ్యాత్మిక రంగ ప్రవేశం చేసిన వ్యక్తి సాయంతో దాన్ని పొందాలని ఎన్నడు ప్రయత్నించి వుండరు. ఎల్లప్పుడు ఈ విషయం గురించి ప్రసంగించే అనుభవ శూన్యుల నుండి మాత్రమే యీ మార్గాన్ని తెలుసుకోడానికి ప్రయత్నిస్తారు. వారు ఎక్కువగ వేదికపై ఆసువుగ ఉపన్యాసాలిచ్చే వ్యక్తుల చేతనే ప్రభావితం అవుతారు. చెప్పాలంటే ప్రకృతిపై ఆధిపత్యాన్ని పొందిన వ్యక్తుల అమాయిక హృదయాలలోనే యీ సత్య వస్తువు ఉంది. ప్రజలు యీ విషయాన్ని తెలుసుకోవడం అరుదు. ఎందువలన? సులభమైన విషయాన్ని సులభమైన మార్గం ద్వారా పొందడానికి ప్రయత్నించరు. దేవతలకు కూడా దుర్లభం అయినట్టి అసలైన జీవిత మాధుర్యాన్ని ప్రజలు చవిచూసే ఆ రోజు ఉదయించు గాక! ప్రజలు ఎల్లప్పుడు తమ కష్టాగాధల్లోనే నిమగ్నులై వుంటారు. కొంత సమయం ఏకాంతంగా కూర్చొని, నీ సమస్యల కోసం ఎంత శక్తిని వినియోగిస్తావో కనీసం ఆ మాత్రపు శక్తితో దైవాన్ని తలుచుకొనాలి. అప్పుడు ఏమిటి జరుగుతుంది? అపరిష్కృత రూపంలో ఉన్న ప్రాపంచిక విషయాలను తెలుసుకోవడం ఎంత సులభమో అంత సులభంగాను నీవు నీ దైవాన్ని తెలుసుకుంటావు.

# దుఃఖము - దాని ఆది, అంతము

ఈ ప్రపంచంలో జన్మించిన ప్రతి వాడూ దుఃఖాలను చవిచూడడం తప్పదు. వాటి బారి నుండి అతడు తప్పించు కొనలేడు. అందుచేతనే మనం తపస్సులోకి పోయి వీటిని వదిలించుకోడానికి ప్రయత్నం చేస్తాం. ఋషులు దానికే పూర్తిగా అంకితం అయ్యారు. ఈ దుఃఖాలను అధిగమించడానికి అతి పవిత్రమైన దైవికభావనలకు మనం అంకితమవ్వడం తప్ప వేరే ఉపాయం లేదు. ఒక నదికి, కాలువలు వలన ఆ నది ప్రధాన ప్రవాహం బలహీన మవుతుంది. అదే విధంగ మన ఆలోచనలు ఆ ప్రధాన శక్తి ప్రవాహాన్ని చెల్లాచెదరు చేస్తున్నాయి. అనేక కాలువలను త్రవ్వడం వలన నదీ ప్రవాహం వడిగా వుండదు. మన విషయం కూడ అంతే. మన భావాలకు ఆలోచనలకు ఎల్లప్పుడు రెక్కలు వచ్చినట్లు కనబడుతుంది. అందువలన అవి ప్రధాన ప్రవాహాన్ని మరింత బలహీన పరిచాయి. పూజా సమయంలో వీటన్నిటిని మనం కూడదీసి ఒకటిగా చేసి ఒకే ఒక ప్రవాహంగ చేస్తాము. ఏ శక్తినుండి అనేక కాలువలు ఏర్పడ్డాయో, ఆ శక్తే ఆలోచనకు ఉంటుంది. అందుచేత అనంత విస్తారంలోకి మరిమరి లోతుగా పోవడమే మనం అవలంభించే పద్ధతి. 'దాని' వైపుకు పోవు శక్తి నలుమూలలకు విస్తరించిన నీటిని పవిత్ర ఆలోచనల శక్తివైపుకు లాక్కుంటుంది. దాని ఫలితంగ చెల్లాచెదురైన అనావశ్యక విషయాలు ప్రధానమైన ఆ మహత్తర ప్రవాహంలోకి వస్తాయి. అది యిప్పుడు మన ప్రధాన లక్ష్యం, గమ్యస్థానం అయిన సర్వశక్తిమంతుని వైపుకు ప్రవహిస్తుంది.

అనురాగ బంధం నుండి పుట్టినదంతా దుఃఖమే. బాధ, ఆనందాలు రెండు కూడ దుఃఖాలకే దారి తీస్తాయి. "మనిషి జన్మించకుండా ఉంటే, యీ దుఃఖపరిస్థితులకు అతడు గురికాకుండ ఉండెడివాడు. సంకల్పశక్తే జన్మకు కారణం. అదే జన్మించాలనే ఉన్ముఖతగాను, లక్షణంగాను పరిణమిస్తుంది. ప్రాపంచిక వస్తువుల ఎడల మానసిక అనుబంధం, తీవ్ర ఆకాంక్ష యీ లక్షణానికి కారణం. ఈ అనుబంధానికి కారణం వస్తువులను, దృశ్యాలను, శబ్దాలను అనుభవించి ఆనందించాలనే మన తపన, తృష్ణ. మన కోరికకు కారణం, మధురానుభూతులతో కూడిన మన పూర్వానుభవము. ఏదేని ఒక వస్తువుతో స్పర్శేంద్రియాల సంపర్కం ఉన్నప్పుడు మాత్రమే ఇంద్రియానుభూతి కలుగుతంది. పంచేంద్రియాలు, మనస్సు కనుకలేనట్లయితే యీ సంపర్కం అన్న ప్రశ్నే లేదు. దేహం, మనస్సుకల జీవి మీద ఈ ఆరు అవయవాల అస్తిత్వం ఆధారపడి ఉంది.

అదే గ్రహణశక్తి కల మానవ అస్తిత్వ నిర్మాణం. ఈ జీవే కనుక ప్రాణం లేనిదై, చైతన్యం లేనిదై ఉంటే, తల్లిగర్భంలో పెరిగి ఉండేది కాదు. కాని తల్లి గర్భంలోని పిండంలోకి దిగివచ్చే యీ చైతన్యశక్తి మన పూర్వ జీవితపు సంస్కారాల ఫలితమే. పునర్జన్మకై తయారు చేసుకునే సంస్కారాలకు కారణం అవిద్య. పరిపూర్ణ శాశ్వత సత్యప్రాప్తిని పొందినట్లయితే పునర్జన్మకు కారణమయ్యే ఎటువంటి కర్మ మనలో ఉదయించదు''. ఈ విధంగా మహాత్ముడైన బుద్ధుడు చెప్పడం జరిగింది.

గౌతమ బుద్ధుడు వ్యక్తి చేసిన యీ భావాలతో నేను సంపూర్ణంగ ఏకీభవిస్తాను. మన ఆధీనంలో ఉన్న సర్వశక్తిని వినియోగించి మన ప్రధాన విషయం అవుతుంది. ధ్యానపద్ధతికి పరిపక్వత వచ్చేవరకు దాన్ని చేయడం కొనసాగించాలి. ఇది ధ్యానం యొక్క చివరి దశ సత్యవస్తువుతో మనం ఐక్యం అయినప్పుడు, దాని తరువాత వచ్చు విషయాలు మనం వాటిని గమనించనంతగా మసకవుతాయి. వేరు మాటలలో చెప్పాలంటే, యీ విషయంలో మనం అంధులమై, సత్యవస్తువుపై దృష్టిని ఎక్కువగ పెడుతాం. మనం పూర్తిగ విలంయ అయ్యే ప్రమాణానికి, దీనిని తీసుకు వస్తాము. ఈ స్థితి వచ్చినప్పుడు మనం ముక్తి స్థితిలో ఉన్నామనే భావం కలుగుతంది. ఈ స్థితి పరిపక్వమైనప్పుడు సర్వ దుఃఖాలు అంతమవుతాయి. బాధ ఉండదు; విచారముండదు; ఆనందముండదు; సంతోషముండదు. ఇప్పుడు యీ శరీర యంత్రాంగం మనపై ఎటువంటి సంస్కారాలను ఏర్పరచకుండ పనిచేస్తుంది. మరో మాటలో, శరీరం మన కర్తవ్య బాధ్యతలకు అనుగుణంగా తనంతట తానుగా పనిచేసే ఒక యంత్రంగా తయారవుతుంది. ఇక్కడే ప్రతీది అంతమవుతుంది. సంస్కారాలు ఏర్పడవు. ఇక్కడ మనంతట మనమే సంపూర్ణ శరణాగతితో అర్పించుకుంటాం. ఇదే భగవద్గీతలోని తత్వం. దేవతలు కూడ పరితపించే స్థితి యిదే. ఇది కేవలం మానవుడికే ప్రత్యేకించబడింది. ప్రియమిత్రుడా! నీవు దీనికై పరితపించడం లేదా? మనలో ప్రతి ఒక్కరు యీ లక్ష్యాన్ని పొందడానికి ప్రయత్నించాలి. ఈ విషయం కనిపించేటంత కష్టమైనది కాదు. నాకు మాత్రం యిది చాలా సులభమైన విషయం. పవిత్ర భావన నిమగ్నత యీ లక్ష్యాన్ని సిద్ధింప చేస్తుంది.

# ప్రకంపన, శబ్దం, సంకేతం

పై నుండి క్రిందికి దిగి వచ్చినదంతా వ్యాకోచం చెందింది. దేనిని చూసినప్పటికీ, ఏది అనుభవానికి వచ్చినప్పటికి పరిస్థితి నిండుకుండలోని నీరు ఒలికినప్పుడు అది ఏవిధంగా విస్తీర్ణంలో పెరుగూత పోయిందో ఆవిధంగా అయింది. పొంగి పొరలే యీ ప్రవాహాన్ని పట్టి గ్రహించు కొనడానికి మన ఋషులుండిరి. అది కాల ప్రారంభం కావున వారి దృష్టి కూడ అటువైపే ఉంది. అప్పటివరకు వారిలో ఎటువంటి సంస్కారాలు లేవు. ఆ వస్తువు ఏవిధంగా ప్రకాశించి మెరిసిందో సరిగ్గా అదే విధంగా వారి గుర్తింపులోకి వచ్చింది. ఒకరి దృష్టి ఎక్కువ పరిమాణాన్ని దాల్చిన ఆ ఘనపదార్థం వైపుకు మరలింది. ఇంకొకరి దృష్టి తక్కువగా ఉప్పొంగి పొరలే ధారవలె ఉన్నదానిపై పడింది. ఆ ఘనపదార్థం ఏమై ఉంటుంది? ప్రతివ్యక్తి అవసరాలకు అతిముఖ్యమైన విషయాలే అవి. అందుచే, వారు వాటిని క్షుణ్ణంగా పరిశీలించి, సూక్ష్మ విషయాలను మరింత సూక్ష్మ స్థితిలో ఉన్న ఋషులకు వదిలారు. నిజానికి అగ్ని, నీరు, వాయువుల అవసరాలు ఉన్నాయి. వాటి వేగానికి అనుగుణంగా వారు అప్పుడప్పుడు పని చేయవలసి ఉంది. ఋషులు వీటిని మాత్రమే స్వీకరించారు. తమ ఆంతరంగిక స్థితిలో ఒకానొక మలుపును సృష్టించి దాని ఫలితంగా ఏ ప్రదేశంలో దట్టమైన ధారాప్రభావం ఉందో అక్కడ నుండే వారు వాటికి కదలికను యిచ్చారు. అందువల్లనే అగ్ని, వాయువు మొదలైనవి ఏ ప్రదేశంతో అనుసంధింపబడి ఉన్నాయో, ఎక్కడ దట్టమైన ధారా ప్రభావం తగినంతగా ఉందో అక్కడనుండి మాత్రమే వాటికి ప్రేరణ యీయబడింది. ప్రథమంగా ఆ దృష్టి ఆత్మశక్తితో నిండి ఉన్న పంచభూతాలను చేరిందని నావినమ్ర పూర్వక అభిప్రాయం. అందుచేతనే ప్రారంభంలో జీవితాన్ని నిలిపి కొనసాగించడానికి అవసరమయ్యే ఫలితాలను యిచ్చే మంత్రాలు మాత్రమే రచింపబడినాయి. అది కూడ ముఖ్యమైన విషయమే.

చాలాకాలం గడిచిన తరువాత పంచభూతాల ధ్యాసలో నిమగ్నమైన పిమ్మట నిరంతరం దానినే తలపోయుట వలన భావన దానిపైనే స్థిరపడినట్లనిపించింది. ఇదిగాక ఆధ్యాత్మికం అనబడే ఆ మూలప్రవాహం గురించి వారు తిరిగి ఆలోచించడం ప్రారంభించారు. దీని ఫలితమే ఉపనిషత్తులు. ఇది వారి సరైన ఆలోచనా విధాన ఫలితం. ఇప్పుడు పరిణామ స్వరూపం ఇందులో యిమిడి వుందని, ఇది మానసిక పరిశ్రమ యొక్క యితిహాసం అయిందని నిర్ణయింపకుందువా?

పైన చెప్పినది కేవలం ఒక పామరుడు వెల్లడించుకున్న ఉపోద్ఘాతం మాత్రమే. ఇది అతడి మానసిక యోచనా ఫలితం. (అతడి పరిపక్వ ఆలోచనా సారం) ఇప్పుడు నేను ప్రధాన సమస్యను గురించి ప్రస్తావిస్తాను.

వేదం అనగా నిజానికి యీ విశ్వం సృష్టింపబడటానికి ముందు ఉన్న స్థితి. దైవం నీకు ఆ స్థితిలోని ఆనందాన్ని అనుగ్రహించుగాక! నీవు దీనిని నిశ్చయంగా పొందుతావు. అందువలనే యీ విశ్వ సృష్టి నిర్మాణ సమయంలోనే వేదాలు పుట్టాయనడం నిజం. అవి గ్రంథాల రూపంలో మలచబడ్డాయి. ఆ స్థితులకు ఒక రూపకల్పన యీయబడి నట్లయింది. అప్పుడు ఉన్నది ఏమిటి? ఒకే మథన ప్రక్రియ స్థితి, అణుసృష్టి ఉంది. అణు నిర్మాణ వస్తువు యీ మథన ప్రక్రియ చర్యల ఫలితంగా ఏర్పడింది. మరోమాటలో ఇది యీ మథన ప్రక్రియ ఫలితంగా ఏర్పడిన అణువుతో సంబంధం కలిగి ఉంది. ఇప్పుడు ఫలితం అనేక యితర రూపాలను ధరించింది.

అదేమైనప్పటికి వారి మానసిక స్థితి వాటి మూలమందే నిలిచి ఉంది. ఆస్థితి ఏమైనప్పటికి అది నిశ్చయంగా శాస్త్రీయమైనదని చెప్పవలెను. ఎందువలనంటే ప్రాణవాయువు (oxygen), ఉదజని (Hydrogen)ల సమ్మేళన ఫలితంగా నీరు ఉద్భవించి తీరుతుంది. అట్లు జరుగకుండ ఉండడం అసంభవం. ప్రయోగం జరిపిన వారు ఎవరైనా, ఎల్లప్పుడూ ఒకే ఫలితాన్ని యిచ్చేదాన్ని మాత్రమే శాస్త్రీయమని అంటాను. ఫలితం ఏదైనప్పటికీ దృష్టి దాని అసలు స్థితి మీద పడినప్పుడు, అది మూలము యొక్క జ్ఞానాన్ని తీసుకు వచ్చింది. వేదకాలం నాటి ఋషులు యీ ప్రవాహధారల మథన క్రియచే ఏర్పడిన అస్పష్టమైన శబ్దాన్ని ఆధారంగా తీసుకుని యీ శబ్దానికి ఏది మూలమో "దాని" అన్వేషణలో ఉండిరి. అందుచేతనే ఋగ్వేదంలో తొలి భాగాలను పఠిస్తున్నప్పుడు నేను విన్నదానిలో యీ శబ్దమే ఉపయోగించబడింది. వేరు మాటలలో చెప్పాలంటే, సత్యవస్తువును తెలియజేసే కీలకం యిదే. వారు యీ కీలకాన్ని తెలుసుకున్నారు. సత్యవస్తువు బహిర్గతం అవడం ప్రారంభించింది. ఇప్పుడు యీ విషయమంతా వేరొక మలుపు తీసుకుంది. అనగా, ఆధ్యాత్మికత ప్రయోజనం కోసమై ఒక నూతనాధ్యాయం వెలికి వచ్చింది. ఆలోచన మరింత తీవ్రగా దూర తీరాలకు విహరించడం ప్రారంభించింది. ఋషులు శబ్దం ద్వారా సత్ తత్వాన్ని సూచనా మాత్రంగ తెలుసుకున్నప్పుడు దానిలో యింకా మరింత లోతుకు వెళ్లడానికి నిశ్చయించుకున్నారు. వారు దానిలోకి వెళ్ళి సత్‌తత్వంతో కలిపే ఆ లంకె యొక్క భాగాన్ని పట్టుకున్నప్పుడు, వారు గ్రహించిన మొదటి పాఠం "ఏకోహం బహుస్యాం" (ఒకటే అనేకం కావడం) అను భావం. కాని ఇది సత్యవస్తువు

యొక్క లౌకికత్వం, అనగా దాని యొక్క నిమ్న భావం. ఇప్పుడు వారి ఆలోచన యింకా ముందుకు దాటి వెళ్ళి, సత్‌తత్వంతో కలిపే లంకె పైభాగాన్ని వారు పట్టుకోవడం జరిగింది. ఇది ప్రవాహ చలనముల వలన కలిగిన ప్రతిధ్వని అని, దీనికి అతీతంగా కూడ ఏదో ఉందని వారు గ్రహించారు. వారి అన్వేషణ కొనసాగి, "ఏకోహం బహుష్యాం" అను యీ భావాన్ని దాటి వెళ్ళింది. ఇప్పుడు అటువంటి లౌకికత్వాన్ని విడిచి పెట్టడం జరిగింది. మరోలా చెప్పాలంటే, మొదట్లో మన దృష్టిలో ఉన్న ఆ సత్యవస్తువు యొక్క స్థూల రూపం మరుగైపోయి, మనం దానికి అతీతంగ దాటి వెళ్ళాము. అప్పుడు ఏమి జరిగింది? ఇదెంత వరకు కొనసాగగలదు అనే అనుమానంతో ద్వంద్వ భావంపైకి రావడం ప్రారంభించి, ఆత్మపై భారాన్ని మోపింది. వారు దాన్ని గురించి లోతుగా ఆలోచించారు. ఆవిధంగ లోతుగా ఆలోచించుట వలన, కేవలం మానవ స్వభావం వలనే మనం మనపై భారాన్ని మోపుకుంటున్నామనే ఆలోచన వారికి వచ్చింది. దీన్ని పూర్తిగా అర్థం చేసుకున్నప్పుడు, మన స్వభావం, ఆలోచన మనలో పాతుకొని ఉన్న ఆ సత్యవస్తువుతో అనుసంధింపబడి ఉంటాయి. ఆలోచన ఆ ప్రవాహంలో యీదడం ప్రారంభించిందా అన్నట్లుంటుంది. వారు ముందుకు వెళ్ళి మథన క్రియ ఫలితంగా సత్‌తత్వం కాదని సూచన ప్రాయంగ తెలుసుకున్నారు. ఇప్పుడు యింకా ముందుకు అడుగులు వేసారు. పైన వర్ణించిన మధ్య భాగానికి ప్రవేశం యిదే. ఇంకా ముందుకు పురోగమించడం వలన, ఆనందము యొక్క పరిమళం అనుభవానికి రావడం మొదలవుతుంది. భావన దానితో ఏకమైనపుడు అది అనుభవానికే విధంగా వచ్చిందనే ప్రశ్న ఉదయించవచ్చు. భావనలో మనం గ్రహించిన ఆ రేణువుల స్థూల స్వరూపమే ఆ మీగడ వంటిది. అదే దానికి గల ఒకే ఒక సమాధానం. ఆనంద స్థితి రావడం, మనం కూడ అక్కడ ఉండడం, దానిని అనుభవించడం కూడ జరిగింది. ఇదే మనం అన్వేషిస్తున్న వస్తువు అనే నిర్ణయానికి వచ్చాము. కొందరు అక్కడనే ఉండిపోయారు. మిగిలిన వారు యీ సచ్చిదానంద స్థితిని కూడ దాటి ముందుకు వెళ్ళారు. ముందుకు వెళ్ళినప్పుడు ఒకానొక స్థితిలో వారు మునిగి ద్వంద్వాతీత స్థితిలో చిక్కుకొని ఆగిపోయారు. దీని తరువాత వేదాలు బహుశః మౌనం వహించాయి. అవి దీనిని అనిర్వచనీయమని చెప్పి "నేతి! నేతి!" అంటే "ఇదికాదు, ఇదికాదు" అని ప్రకటించాయి.ఇప్పుడు మరొకసారి అదే శాస్త్రవిజ్ఞాన ప్రశ్న వస్తుంది. నేను కొంతవరకు సమాధానాన్ని యిచ్చానని అనుకుంటున్నాను. నీకు యింకా కావాలంటే మనం ఆ మార్గంలోనే ఉన్నామని, మనం సత్‌తత్వానికి అనుగునంగానే ఉన్నామని చెప్పాలి. అప్పుడు కేవలం సత్‌తత్వమే మన దృష్టిలో ఉందని నిశ్చయంగా చెప్పగలము. అంతేకాదు మనమే

ఆవిధంగా అయ్యాము. మనం అసలైన జ్ఞానానికి (Real Knowledge) నిలయమైనాము. అంతేకాదు; యిప్పుడు మనమే జ్ఞానమైనాము. 'X' చెప్పినట్లు మనం దానిలో పూర్తిగా విలయమైనప్పుడు అవి గణిత సంకేతాల కన్నా యదార్థాలనడం సరైనది. ఏది సరైన విషయమో అదే దృష్టికి వస్తుంది. మార్గాన్న పయనించే వారెవరైనప్పటికి, అతడికి అదే విషయం దృష్టికి వస్తుంది. దీనిలో కవితాపరమైన ఊహాకల్పిత విషయాలున్నాయని అతిశయోక్తికి కూడ అవకాశం కలదని నీవు అనుకోవచ్చు. నిజమే, ప్రియసోదరా! సత్యవస్తువును చూపడానికి దాని పరిసరాల నిర్మాణ కల్పనచే దాన్ని తెలుసుకోడానికి చేసే ఆలోచనకు అది తోడ్పడుతుంది. నేను కూడ తరచు కవిత్వ సహాయాన్ని తీసుకొనడం తప్పదు. ఉదాహరణకు నేనీ చిన్న పద్యాన్ని వ్రాసాను.

"ప్రేమికుడు బలహీనుడు,
ప్రియురాలు అతి సుకుమారి,
ఎవరైనా వచ్చి తెరను తొలగించండి."

దీనర్థాన్ని బాగా ఆలోచిస్తే ప్రేమికుడు, ప్రియురాలు యిద్దరూ కూడ అచేతనులని తేలిపోతుంది. అదే అసలు స్థితి. అనగా, సత్‌తత్వం అనబడే ఆ స్థితి ఆవిధంగా వ్యక్తం చేయబడింది. మన సిద్ధాంతం ప్రకారం మనిషి మొదట జన్మించినప్పుడు, అతడు పరిపూర్ణుడు. అందువలన కేలం మానవులే యీముడుల్ని తయారు చేసుకున్నారన్నది సుస్పష్ట విషయం. ఇవే మనదృష్టిని మూలం వైపుకు మరల్చడానికి అవరోధాలు. మనిషి కార్యకలాపాలే అతనిలో ఒక ప్రపంచాన్ని సృష్టించాయి. సృష్టికర్త మనల్ని పరిశుద్ధంగాను, స్ఫటికం వలె నిర్మలంగాను తయారు చేయడమే దీనికి కారణం. సృష్టికర్త యొక్క గొప్పతనానికి నిదర్శనం అదే. మనపై చేరిన యీ మాలిన్యం, చెత్త చెదారాలకు బాధ్యత కేవలం మనపైనే ఉంది. మనమే సంస్కారాలను తయారు చేసుకున్నాము. అవి పొరలు పొరలుగా తయారై పట్టుకాయలోని పట్టుపురుగువలె మనల్ని కప్పివేయడంలో విజయాన్ని సాధించాయి. సత్‌తత్వమనే మహాసముద్రం నుండి మనం ఉద్భవించాం. అందువలనే మనం ఆపాదమస్తంక సత్‌తత్వంగానే ఉన్నాం. మన ప్రథమ స్థితి ఆవిధంగా ఉండడం వలన, మన దృష్టి ఆ సత్‌తత్వాన్ని నిరాటంకంగా చూడగలిగింది. దానికి "సత్‌తత్వాన్ని" గురించిన జ్ఞానం ఉంది. ఆ జ్ఞానస్వరూపమే వేదాలు. సంస్కృత భాష మిక్కిలి సహజమైనదని చెబుతారు. దానికి కారణం అదే ప్రారంభం కావున. పరస్పరం చెప్పుకోవడానికి, అవగాహన చేసుకోవడానికి వారు అనుభూతి చెందినదానికి అనుగునంగ నాలుకను కదలించారు. సంస్కృత భాష యొక్క అక్షరమాలను గురించి ఆలోచిస్తే సహజమైన ప్రకంపన రూపంలో

హెచ్చుతగ్గులు దానిలో ఉన్నాయని తెలుసుకుంటావు. ప్రతి ప్రకంపనను వారు అనుభూతి చెంది ఆ భాషలో వ్రాసారు. దాన్ని సంసంస్కృతము (దివ్యమైనది) అని పిలువ నారంభించారు. వారికి ఆ దివ్యరహస్యాలు ప్రత్యేకించి ఏ భాషలోను విదితం కాలేదు. దైవసంబంధమైన రహస్యాలు యిప్పుడు కూడ ఎక్కువగా తమ యదార్థస్థితిని తిరిగి పొంది, అసలు మూలముతో సంబంధాన్ని సిద్ధించుకొన్నవారికి తెలియవస్తాయి. అది సముచితం కూడాను. అది ఎల్లప్పుడు తెలిసిన భాషలోనే వస్తుంది. అది మనస్సును తాకుతుంది. తాను నేర్చిన భాషా పదముల ద్వారానే వాటిని గుర్తిస్తాడు. దైవరహస్యాలు ఎక్కువగ కవిత్వ రూపంలోనే వెల్లడవుతాయని స్వామి వివేకానందగారు వ్రాసియున్నారు. కనీసం తన పరిసరాలలో చిక్కుకొని సత్‌తత్వాన్ని పోగొట్టుకోకూడని నిజమైన అన్వేషకుని విషయంలోనైనా ఆయన చెప్పినట్లు జరుగదు. పొగ అగ్నిని సూచిస్తుంది. అదే విధంగ పరిసరాలు తమతో సంబంధం వున్న దానినే సూచిస్తాయి.

# వివిధ రకాలైన గురుశిష్యులు

"ఈ పతనానికి కారణం ఏమిటి? ఈ ఆకర్షణ భ్రాంతి కంతకు కారణమైన వర్ణం ఏమిటి? మానవ మనస్సులలో ఉద్రేకాన్ని కలిగించేది ఏది? మన దృష్టి ఎల్లప్పుడు అటు యిటు తిరుగుతూ, పాయలను, పల్లాలను తయారు చేసుకోడానికి కారణం ఏమిటి? ఇదంతా ఏమిటి, దీనికి కారకులు ఎవ్వరు? అటువంటి పరిసర వాతావరణాలను ఎవరు సృష్టించారు - దైవమా లేక కేవలం మనిషేనా? దానిపై పొరలను ఏర్పరచుకుంటూ వెళ్ళిన వారెవరు?" ఈ ప్రశ్నలను గురించి నేను అప్పుడప్పుడు దీర్ఘంగా ఆలోచిస్తుంటాను.

నాకు వచ్చిన సమాధానం యిది. మనం నిజమైన స్వేచ్ఛను పొందడానికి దైవం మనల్ని సృష్టించాడు. కాని కాలగతిలో సంభవించిన సంఘటనలు గమనాన్ని పూర్తిగా వేరు మార్గానికి మరలించాయి. మన మనస్సు యదార్థమైన స్వేచ్ఛాస్థితి నుండి మరలి ఇంద్రియముల వైపుకు పరుగెత్తింది. మనం కూడ ఎంతో ఆనందాన్ని పొందాము. అది యీ వైఖరిని ప్రోత్సాహించింది. ఇంద్రియాల వైపు మొగ్గు చూపినవారు వాటిలోనే లీనమైనారు. వారు దాని నుండి బయటపడినప్పటికి, ఇంద్రియ వాంఛలను రేకెత్తించి, సంతృప్తి పరచేటటువంటి విషయాలను మాత్రమే వారు సృష్టించుకున్నారు. వారు ఆ విషయాలకు అతీతంగా వెళ్ళలేకపోయారు. వారికి తటస్థపడిన వ్యక్తులు కూడ అటువంటి విషయాలను గురించి చెప్పిన వారే. తాము సృష్టించుకున్న కేంద్రాన్నే వారు సమర్థిస్తున్నారు గావున వారు చెప్పిన విషయాలు వీరికి ప్రీతికరం అయినాయి కూడ. ఇదెలా జరిగింది? ఇంద్రియ భోగలాలసులై వుండి, ఉన్నంతగా పైకి చూస్తున్నట్లు నటించేటటువంటి వ్యక్తులతో వారికి గల సంబంధమే దీనికి కారణం. వారే మనకు మహాత్ములు. తాము సృష్టించుకున్న ఆ కేంద్రాన్ని ప్రజలు వదలుకోవాలని నీవు నేను అభిలషిస్తున్నాము. తాము ఏర్పరచుకున్న ఆ కేంద్రాన్ని దివ్యకేంద్రంలో కనుగొన్నప్పుడు మాత్రమే వారావిధంగా చేయడానికి సిద్ధపడుతారు. ఈ మాటలు చాలా కఠినంగ కనపడవచ్చు, కాని నేనీ విధంగా వ్రాయవలసి వస్తోంది. "గొర్రెల కళ్ళేలు తోడేలు చేతుల్లో ఉన్నాయి. మొత్తం గుంపు అంతా చెల్లచెదురైంది." సోదరా, యిప్పుడు సాధారణంగా మన మధ్యలో జరుగుతున్న ప్రతి విషయానికి బాధ్యులైన పెద్ద మనుష్యులలో వివిధ రకాల వారిని గురించి ఆలోచించు. వారిలో కొందరిని గురువులుగా భావిస్తున్నాం. వారీ క్రింది విధంగా ఉన్నారు.

1. గురు సిఫ్లి - నిమ్న తరగతికి చెందిన గురువు
2. గురు కితాబి - గ్రంథపఠన జ్ఞానానికి సంబంధించిన గురువు.
3. గురు అజ్లి - జన్మతః గురువు
4. గురు ఫజ్లి - ఉన్నత శ్రేణి గురువు
5. గురు అజ్లి ఫజ్లి - జన్మతః అత్యున్నత శ్రేణికి చెందిన గురువు

నిమ్న తరగతికి చెందిన గురువులు భూత ప్రేతాలను ఆరాధించమని చెబుతారు. వారికి కొన్ని మంత్రశక్తులు తెలుసు. గ్రంథపఠన జ్ఞానం కల గురువులు కేవలం గ్రంథాల ప్రమాణం ఆధారంగా యితరులను సాధన చేయమని చెబుతారు. ఆ సాధనల ఉద్దేశంతో వారికి నిమిత్తం లేదు. అవి ఎటువంటి పరిస్థితులలో ప్రయోజనకరాలవుతాయో వారికి సంబంధం లేదు. జన్మతః గురువులు ఏదో సాధనాపద్ధతులను చేయవలసిందని చెబుతుంటారు. దానివలన మనుష్యులు సుడిగండంలో చిక్కుకు పోకుండా ఉన్నట్లయితే వారు ఏదో ఒకానొక రంగంలో పరిపూర్ణత్వాన్ని పొందవచ్చు. కాని ఒకవేళ వారు, సుడిగుండంలో చిక్కుకుంటే, వారిని బయటకు లాగుట అట్టి గురువుల శక్తికి మించినది పని. ఉన్నతశ్రేణికి చెందిన గురువులకు "ఫజ్లి" అనే పదాన్ని ప్రయోగించాను. వారు ఎల్లప్పుడు దైవకృపానుగ్రహాలను ఆస్వాదిస్తూ వాటిని యితరులను చక్కదిద్దుటకు ఉపయోగింపగల సమర్థులు. ఇంకనూ మరొక తరగతికి చెందిన గురువులు ఉన్నారు. వారిని "అజ్లి-ఫజ్లి" అని అంటారు. వారిని కనుక్కోవడం మహా కష్టం. అత్యున్నత శ్రేనికి చెందిన యీ గురువు మహోత్కృష్టమైన ఆ మూలస్థితిని చేరి, నిరంతరం మూలంతో సంబంధాన్ని కలిగి ఉంటాడు. అందువలనే సోదరా, అటువంటి గురువునే మనం అన్వేషించాలి. అటువంటి వాడు లభ్యం కానట్లయితే మనం "ఫజ్లి" గురువుతోనే నెట్టుకురావాలి. గ్రంథ విజ్ఞానంపై ఆధారపడిన గురువు విషయంలో అన్నిరకాలైన శంకలకు అవకాశం ఉంది. అతడి ప్రవర్తన మంచిది కాకపోవచ్చు కాని ఫజ్లి, అజ్లి ఫజ్లి గురువులలో ఇది అసంభవం. దీన్ని ఎన్నిమార్లు చెప్పినప్పటికి నమ్మే మనస్సు లేని వారు దీనిని ఎన్నటికి నమ్మరు. కబీరు మాటల్లో చెప్పాలంటే "మొత్తం కుటుంబమే అంధులైనప్పుడు ఎవరిని నేను నమ్మించగలను?"

అజ్లి గురువు (జన్మతః గురువు) విషయానికి వస్తే, అటువంటి గురువు ఆటుపోటులు లేని ఆ మూలస్థితిని కలిగి ఉన్నప్పటికీ, తన అంతరస్థితి నుండి యితరులను ఉద్దీపింప గల సామర్థ్యం అతనికి ఉండదు. కాని ఫజ్లి గురువు దీనిని చేయగలడు. దివ్యానుగ్రహాన్ని అభ్యాసిలోకి పంపగలడు. దీనిలో రెండు రకాలున్నాయి. ఆ దివ్యకృప అప్రయత్నంగా

అతనిలోకి ప్రవహించినప్పుడు, తన వంతు భాగాన్ని యితరులలోకి పంపుతాడు. ఆ దివ్యకృప ప్రవహించక మునుపు అతడావిధంగా చేయలేడు. ఆ దివ్యకృపను తను లోబరుచుకొని దాన్ని తన యిష్టం వచ్చినప్పుడు యితరుల్లోకి పంపగల సమర్థుడే ఆ కృపను పూర్తి ఎరుకతో యితరుల్లోకి పంపగలడు. మన సహజమార్గంలో ప్రతి ప్రశిక్షకుడు (Preceptor) పూర్తి ఎరుకతో ఆ దివ్యకృపను ప్రసారం చేయగలడు. ఈ శిక్షణా విధానం అటువంటిది. ఇక అజ్లి-ఫజ్లిని గురించి చెప్పేదేముంది? కనురెప్పపాటులో తాను కోరిన దానిని చేయగల సమర్థుడతడు. అట్టి మహాత్ములు అరుదుగా కనబడతారు.

ఇప్పుడు వివిధ తరగతులకు చెందిన శిష్యులను గురించి కూడ చెబుతాను :

1. స్వార్థపరుడు
2. ఫజ్లి
3. అహ్లి
4. భక్తుడు
5. మురాద్

తమ స్వీయ ప్రయోజనాలను పొందగోరువారు స్వార్థపరులైన శిష్యులు. శ్రీ X అనే వ్యక్తి మహాత్ముడు, దైవభక్తుడని తెలిస్తే వెంటనే ఆ మహాత్మునితో సంబంధమేర్పరచుకుని, ప్రాపంచిక లాభాన్ని పొందాలనే భావంతో అతడి వద్దకు పరుగెడతాడు. ప్రాపంచిక విషయాలతోనే సంబంధం గల అటువంటి వ్యక్తులు ఏపని చేయరు. వారు తమ స్వార్థ ప్రయోజనాలు నెరవేరుటకు సత్సంగంలో పాల్గొంటారు. పొగడ్తలతో కావలసిన విషయాలను నెరవేర్చుకుంటారు. ఆ పని అయిపోయిన తరువాత మెల్లగా జారుకుంటారు. వారి పని నెరవేరక పోయినప్పటికి కూడ, వెను తిరుగుతారు. వారికి ప్రేమానుబంధాలతో ఏమాత్రం పనిలేదు.

ఫజ్లి తరగతికి చెందిన వారు అప్పుడప్పుడు ధ్యానానికి కూర్చుంటారు. అది కూడ ఆనందపూరిత వాతావరణంలో ఉత్సాహ మనస్సులై ఉన్నప్పుడు మాత్రమే. వారికి ఎటువంటి హృదయానుబంధం లేదు. అహ్లి తరగతికి చెందిన వారిలో ఉన్నతమైన ఆరాధనకు సంబంధించిన సంస్కారాలు ఉంటాయి. వారు ఆరాధనను చేయాలని, దానికి కొనసాగించాలని కోరుకుంటారు. వారిలో కొందరు పురోగమించి, భక్తుని స్థాయిని చేరుకోవచ్చు. కాని కొందరు ప్రప్రథమం నుండి భక్తుడి స్థితిలోనే ప్రారంభిస్తారు. గురువును ఎంతో గాఢంగా ప్రేమించువాడే భక్తుడు. అతడు సదా తన గురువుతో ఆంతరంగిక సంబంధాన్ని కలిగి ఉంటాడు. ఇటువంటి మనుష్యులు శిష్యుడికి ఉండవలసిన

లక్షణాలన్నిటిని కలిగి ఉంటారు. భక్తులలో ఒకరో, యిద్దరో, అరుదుగా ''మురాద్'' స్థితిని పొందుతారు. గురువు యొక్క ప్రేమకు లక్ష్యవస్తువు అయిన వాడే మురాద్. వేరు మాటలలో చెప్పాలంటే, గురువు దృష్టి సదా అతడిపైనే కేంద్రీకృతమై ఉంటుంది. అతడినిన ప్రేమించబడిన వ్యక్తిగా పేర్కొనవచ్చు కూడ. అటువంటి వ్యక్తులు అరుదుగా కనబడుతారు. ఈరోజుల్లో ''మురాద్'' కనబడడం మిక్కిలి అపురూపం. అదేవిధంగా గురువులు కూడ అరుదు. ఈ రోజుల్లో దేహానికి ఎన్ని రంధ్రాలున్నాయో అంతమంది ''మురీద్''లను చూపగలం కాని ''మురాద్''లు మాత్రం చాల అరుదు అని పూజ్య లాలాజీగారు ఒక ఉత్తరంలో నాకు వ్రాసారు.

# పదార్థం యొక్క నిజతత్వం

ప్రియసోదరా! భౌతిక పదార్థం యొక్క నిజతత్వాన్ని అర్థం చేసికోలేక పోయానని సరిగ్గా వ్రాసావు. పంచదార బొమ్మకు ప్రాణం పోస్తే అది కూడ తనను గురించిన యదార్థాన్ని తెలుసుకోలేదు. నిరంతర భౌతిక పదార్థంలో జీవితాన్ని గడపడం వలన మన స్వీయ పదార్థాన్ని అంటే సత్‌తత్వాన్ని పోగొట్టుకున్నాము. ఇదొక్కటే ఆటంకం. ప్రకృతి ఏ విషయాన్ని భక్తుడి నుండి రహస్యంగా ఉంచదు. ఎందుకంటే, నిగూఢమైన రహస్యం జటిలంగా ఉంటుందని చెప్పవచ్చు. ఎక్కడైతే జటిలత్వం ఉందో అది 'మాయ' తప్ప వేరుకాదు. ప్రకృతి తెరచిన గ్రంథంలాంటిది. కాని దానివైపుకు ఎన్నడు చూడం. మన దృష్టిని అంతా తలక్రిందులుగా చేసుకున్నాం. ప్రియసోదరా మొరటుగా చెప్పాలంటే మన నైపుణ్యం అంతా తలక్రిందులైందని చెప్పవచ్చు. మనం సత్‌తత్వానికి ఎదురుగ నిలిచినప్పుడే అది సాక్షాత్కారం అవుతుంది. అనగా మనం పదార్థాన్ని గురించి ఆలోచిస్తున్నప్పుడు, ఆత్మ వైపుకు కూడ మెల్లిగా చేరుకుంటాము. అప్పుడు రెండింటినీ పర్యాలోచిస్తే సత్‌తత్వాన్ని గురించి మనకు కొంత అవగాహన వస్తుంది. శాస్త్రజ్ఞుల గుట్టును బట్టబయలు చేయాల్సివస్తుంది. నిన్ను మాత్రం ఆ వర్గంలో చేర్చను. శాస్త్రజ్ఞులు తమ కృషినంతను ధారపోసి చివరకు మనిషిని పదార్థ శక్తికి బానిస అయ్యేటట్లు చేసారని ప్రజలు నాతో చెప్పడమో లేకపోతే యీ భావం నాకు రావడమో జరిగింది. యోగలక్ష్యమే కనుక ప్రకృతిపై ఆధిపత్యాన్ని పొందడం అయితే, దీనికన్నా యోగలక్ష్యానికి దూరమైన విషయం వేరే ఏదైనా ఉంటుందా? కాని, ప్రియసోదరా! సామాన్యమైన సర్కసు వాళ్ళు సైతం పెద్దపులి లాంటి క్రూర మృగాన్ని అదుపులో ఉంచి ఆశ్చర్యం కొలిపే అద్భుత కార్యాలను ప్రదర్శించారు. శాస్త్రసంబంధమైన వాటిని యితర వస్తువులనుపయోగించి విరుగుడు చేసి అధిగమించ వచ్చునేమో గాని యీ భయంకర లక్షణాన్ని జయించడం ఏ ఆమ్లానికి సాధ్యం కాదు. అందుచేతనే, సర్కస్ కళాకారుడు శాస్త్రజ్ఞుడి కంటె ఎంతో మిన్న. ప్రియ సోదరా! మానవ మేథస్సు అభివృద్ధి చెందడం వలనే పదార్థ శక్తిపై ఆధిపత్యం పొందడం సాధ్యమవుతుంది. కాని ఆధ్యాత్మిక మేథస్సు చేసే పని దాని పరిణామం వేరే విషయం. అక్కడ పదార్థ శక్తి పనిచేయదు. దివ్య సంబంధమైన జ్ఞానం దీనికి ఉండగా, దానికి అనగా మానవమేథస్సుకు మానవ మాత్రుడికి ఉండే మేధాశక్తి ఉంది.

మానవుడు సహజసిద్ధంగ తాత్వికుడనే నీ అభిప్రాయం సరైనది. దానికి నిదర్శనాలు

ఉన్నాయి. శిశువు జన్మించిన తర్వాత కొంచెం చూడడం ప్రారంభించగానే ఒక విధమైన ఆశ్చర్యానుభూతి వస్తుంది. ఇదే సర్వభౌతిక, ఆధ్యాత్మిక శాస్త్రాల సారాంశం. కొందరు వ్యక్తులు పళ్లను తింటూ వాటి రుచి భోగాన్ని అనుభవిస్తూ ఆనందిస్తారు. మరికొందరు చెట్లను లెక్క పెట్టడం ప్రారంభిస్తారు. కాని వీటన్నిటికి ఆధారం ఆశ్చర్యమే. శాస్త్రజ్ఞులు జటిలమైన భౌతిక పదార్థంలో మునిగి ఉంటారు. అన్వేషకుడు దీనిని విడచి సకల స్వరూపాలకు మూలమైన ఆ స్వరూపాన్ని చేరుకుంటాడు. పాషాణం (arsenic) లక్షణం మనకు తెలిసినప్పుడు, అది కలిసిన ప్రతివస్తువు విషం అవుతుందనే నిర్ణయానికి వస్తాం. లేదా దానితో కలిసిన ప్రతి వస్తువు విషపదార్థం అవుతుందని కూడ అనుకుంటాం. కేవలం యీ విషమే వస్తువులను విషయంగా మారుస్తుంది. ఎందుచేతనంటే పాషాణం యొక్క యీ లక్షణం దానితో కలిసిన పదార్థపు ప్రతి అణువులోను నిండి ఉంటుంది. అదేవిధంగా భౌతిక పదార్థంలో శక్తి పనిచేస్తోంది. ఆత్మ ''సర్వము తానే'' అనేటటువంటి స్థితిగాను, ''తాను తప్ప సర్వం నాస్తి'' అనేటటువంటి స్థితిగా కూడ ఎందుకు భావింపబడుతోంది అనే నీ సమస్యను యీ ఉదాహరణ పరిష్కరిస్తుంది. అభ్యాసి కూడ తన ఆధ్యాత్మిక ప్రతగతిలో మహాప్రళయానంతరం, ఆఖరుకు పదార్థం కూడ ఏవిధంగా మిగిలి ఉండదో అటువంటి శూన్యస్థితిని పొందుతాడు. ఎందుకంటే, ఏదైనా మిగిలి ఉన్నట్లయితే, మహాప్రళయమన్న పేరే దానికి తగదు. పదార్థం శాశ్వతమని నేను భావించను. ఆత్మ మాత్రమే శాశ్వతం. అదొక్కటే అన్నిటికి కారణమైనప్పుడు ''అది'' తప్ప మరేదీ మిగిలి వుండని సమయం ఆసన్నమవుతుంది. విశ్వసృష్టి సమయంలో పదార్థం ఏర్పడిందని ఆవిధంగా నిరూపించబడింది. పూర్వం ఈ పదార్థం ఏమిటి? అది ఘనపదార్థం ఏర్పడేటట్లు చేసే మధన క్రియలు. ప్రతి విషయం గుండ్రంగా కనబడుతుందని చెప్పడంలో ఎంతో చక్కటి తత్వం దాగి ఉంది. ఆ మహాశిల్పి శక్తిని వినియోగించి విశ్వాన్ని సృష్టించాలని సంకల్పించినప్పుడు, చలనాలు వలయాకారంలో ప్రారంభమై ఒక వర్తులాన్ని స్థిరంగా ఏర్పరచాయి. అందువలనే శక్తి పని చేయగలుగుతోంది. నీవు ప్రాణాహుతిని ప్రసారం చేసేటప్పుడు కూడ, నీ శక్తి వలయాకారంలో పని చేస్తుంది. దానివలన అభ్యాసి ప్రభావితుడవుతాడు. మనం ధ్యానం చేసేటప్పుడు సత్సంగీకులను వలయాకారంలో కూర్చుండ బెడతాము. ఎందుచేతనంటే ఇది కూడ మనకు సహాయపడవచ్చు. కాబట్టి యీ శక్తి కేంద్రీకరించబడినప్పుడు అది ఘన పదార్థమని తెలియబడింది. ఇది చలనశక్తి కారణంగానే జరిగింది. అభ్యాసి ఆపాదమస్తకం ఆత్మశక్తిగా తయారగుటకు యీ ఘనత్వాన్ని అతడి నుండి తొలగించాల్సి ఉంది. మౌలానా రూమి రాజు, యోగి కూడ. అతడు

షమ్సితాబ్రెజ్ యొక్క శిష్యుడు. అతడీవిధంగా అన్నాడు. “ఆయన తాను సర్వస్వతంత్రుడిగనే ఉన్నాడు మరియు ఆయన తన చేతనే బంధింపబడ్డాడు కూడ” నిజానికి యిది అస్తిత్వము యొక్క ఏకత్వాన్ని వివరిస్తుంది. కాని నాకు దీంట్లో నమ్మకం లేదు. విశ్వ ప్రకటనఅంతా ఒకటేనని మాత్రం నమ్ముతాను. ఏమైనప్పటికీ శక్తి మరొక మలుపు తీసుకుందనే యదార్థాన్ని ఇది తగినంత వెలుగులోకి తీసుకువస్తుంది.

ఈ భౌతికత మీద కాని, ఆధ్యాత్మికత మీద గాని సంపూర్ణ ఆధిపత్యాన్ని పొందడానికి ఏదో ఒక పద్ధతి ఉండాలని వ్రాసావు. ఒక కర్మాగారం పని చేస్తున్నప్పుడు యంత్రం నుండి శక్తి వచ్చి ప్రతి భాగాన్ని త్రిప్పుతుంది. దాని అదుపులో పెట్టుకోవాలని నీవు దాని చక్రాన్ని పట్టుకోడానికి ప్రయత్నిస్తే దాని ఫలితంగా నీ చేయి నలిగి ముక్కలైపోతుంది. ఆ యంత్రాన్ని ఆపాలనుకున్నప్పుడు దానికి ఎక్కడ నుండి శక్తి వస్తున్నదో ఆ మూలస్థానంపై ఆధీనం సంపాదించాలి. అప్పుడు యంత్రం ఆగిపోతుంది. భౌతికత్వంపై ఆధీనతను సంపాదించడానికి, ఆధ్యాత్మికత పై (చైతన్యంపై) ఆధిపత్యాన్ని పొందాలి. మనమందరం అదే చేస్తున్నాము. ఆధ్యాత్మికతపై ఆధిపత్యం సంపాదించడానికి కావలసిన పద్ధతులు నీకిప్పటికే తెలుసు. దానికి సాధన, సత్సంగము తప్పనిసరిగా అవసరం అవుతాయి. అయినప్పటికీ నేనొక విషయం చెబుతాను. ఆధ్యాత్మికతపై ఆధిపత్యం కావాలంటే ఆధ్యాత్మికత (చైతన్యము)కు కారణం ఏదైతే ఉందో దాన్ని ప్రవేశించాలి. దాన్ని ఏవిధంగా పొందగలం? దాని వైపుకు తిరిగినంతనే దాని పవిత్రత, స్వచ్ఛతలతో మనం నిండిపోవాలి. అప్పుడు మన పరిసరాలు మారి, సహజత్వం సృష్టింపబడుతుంది. నీవు దేనిని కోరినా అది జరిగి తీరుతుంది. ప్రియసోదరా! నీవు తేలుకుంటూ ముందుకు వెళ్ళాలి. తప్పకుండా మూలాన్ని చేరుకుంటావు. ఒకవేళ దాన్ని చేరాలనే కోరిక మరింత ఉధృతమై ఆ దివ్యకృపానదీ ప్రవాహం తనంతతానుగా నీలో ప్రవహించినట్లయితే, ఎటువంటి అభ్యాసం చేయాల్సిన అవసరం ఏమాత్రం ఉండదు.

“భౌతిక పదార్థం యొక్క నిజతత్వాన్ని కూడ అర్థం చేసికోలేకపోతున్నాను” అని నీవడిగిన దానికి సమాధానాన్ని చెబుతూ నీకు కొంచెం ఆనందాన్ని కూడ కలిగించాలని అభిలషిస్తున్నాను. నీ నిజస్థితిని నీవు తెలుసుకున్నప్పుడే పదార్థాన్ని గురించిన నిజతత్వాన్ని అర్థం చేసుకుంటావు. అప్పుడు నీవు పదార్థాన్ని కదలించగలవు కూడా.

భాగము - VI

# అమృతపు జల్లు

"తను విజ్ఞుడనని అనుకోవడం నిస్సంశయంగ తెలివితక్కువ పని అయినప్పటికి, తాను తెలివిహీనుడనని, బలహీనుడనని అనుకోవడం మరింత తెలివి తక్కువ పని అవుతుంది. అందరికీ ఒకే విధంగ వుండే దైవాదేశాలను పాటిస్తూ మనల్ని మనం దైవస్మరణకు అంకితం చేసుకోడానికి ప్రయత్నించాలి. అవే మనిషి సామాన్య బాధ్యతల యొక్క ప్రధాన అంశాలు"

# అమృతపు జల్లు

ఏకాగ్రత యింద్రియాలకు ఆహ్లాదకరంగా ఉంటుంది కావున ప్రజలు దానిని కోరుకుంటారు. అది ఆధ్యాత్మిక సాధనలో ఏమాత్రం సహాయపడదు. ఏకాగ్రతకు ఆలోచనల అణచివేతతో సూటిగా సంబంధం ఉంది. ఇంద్రజాలం వశీకరణ విద్యలు మనదృష్టికి వచ్చిన తర్వాతనే యీ భావం మన మనస్సులో ప్రవేశించింది. ఎందుచేతనంటే అక్కడ చివరి వరకు స్థూలమైన ఆలోచనా శక్తి ఉపయోగించబడుతుంది. ఏమైనప్పటికీ, దాని వలన ఎటువంటి ఆధ్యాత్మిక ప్రయోజనం నెరవేరదు. కాని అది ఒక వస్తువు యొక్క ప్రకృతి స్వభావాలను తెలియజేస్తుంది. అంతేకాని దాన్ని సిద్ధింపచేసికోడానికి ఏవిధంగాను సహాయపడలేదు. అందుచేతనే దైవప్రాప్తి విషయంలో అది ఒక సాధనం కావడం అసంభవం. ఇందుకు భిన్నంగా సత్‌తత్వం నుండి మనల్ని దూరంగా ఉంచే స్వభావం దానికి ఉంది. ధ్యానానికి ఆధారం సంపూర్ణ ఆధ్యాత్మికత కాగా ఏకాగ్రతకి ఆధారం కేవలం అహం. నీవు ఏకాగ్రతను సాధించాలనుకున్నప్పుడు "నీవు" అక్కడ నిశ్చయంగా ఉన్నావు. కాని నీవు ధ్యానం చేసేటప్పుడు ఏదో మహోన్నతమైన దానికోసం వేచి యుంటావు. అందుచేతనే అహంభావానికి దూరంగా ఉంటావు.

* * *

సంపూర్ణ విజయాన్ని సిద్ధించుకోడానికి ఆత్మవిలయం ఒక్కటే మార్గం. పట్టువిడువ కుండా దాన్ని కొనసాగించాలి. ప్రేమ, భక్తి అనేవి సహజంగా దాని ముఖ్యమైన అంశాలు. ఆత్మ విలయాన్ని కావించుకున్నప్పుడు శాశ్వత ఉనికిలోకి ప్రవేశిస్తాడు. అదే పొందదగిన నిజమైన జీవితం; జీవితగమ్యం కూడ. ఇది గురుదేవుల జీవిత కాలంలోనే పొందడం సులభసాధ్యం. ఎందుచేతనంటే, ఆయన శక్తి ఆయన జీవించి ఉండగా నిరంతరం ప్రవహిస్తూ ఉంటుంది. ఆ తరువాత అది కష్టం. అందుకే "ఆరిన జ్వాలలో ఆత్మాహుతి చేసికొనగల సామర్థ్యం ప్రతి దీపపు పురుగుకు ఉండదు" అని పెద్దలనడం జరిగింది (సొక్తన్ బర్ షమ్మా కుస్త అరె హర్ పర్వానా నేస్త)

* * *

హృదయమండలం తరువాత ఉన్న మనోమండలం అహంకారవలయం. సాధకుడు దీన్ని దాటినప్పుడు అది అహంకారం అతిసూక్ష్మస్థితి పొందిన స్థాయికి తీసుకువస్తుంది.

ఇంకా పైకి వెళ్ళి కేంద్రమండలంలో ప్రవేశించినప్పుడు అహంకారం విశిష్టత్వముగా మారుతుంది. తొలిదశలలో యీ అహంకారం మరింత స్థూలంగ ఉంటుంది. కాని సాధకుడు యీ మండలంలో వరుస వెంబడి వచ్చే వలయాలగుండా పురోగమిస్తున్నప్పుడు, అది తన పరిపూర్ణస్థితిని దాల్చువరకు మరింత సూక్ష్మం అవుతుంది. దాన్ని అహంకారం దాదాపు నిర్మూలమైన స్థితిగ భావించవచ్చు.

* * *

వివిధరకాలైన విధుల్ని స్త్రీలు నిర్వహించవలసి వస్తుంది. అందువలన వారి విషయంలో పూజకు కాలనియమం వీలుపడదు. ఈకారణంగా వారి విషయంలో దీన్ని గురించి నిర్భంధం చేయలేదు. కాని వారి తీరిక సమయాన్ని అందుకోసం వినియోగించ వచ్చు. అది వారి విషయంలో ప్రత్యేక మినహాయింపు. అంతేగాక, దైవాజ్ఞానుసారంగ తమ కర్తవ్యాన్ని నిర్వహిస్తున్నామనే భావంతో వారు యింటి పనిని చేసుకుంటే అదంతా పూజగా మారి అప్రయత్నంగానే ఎల్లప్పుడు దానితోనే ఉంటారు.

* * *

విద్య కేవలం బుద్ధినే వికసింపజేస్తుంది. కాని మానసిక వికాసానికి కావలసిన అతి ముఖ్యాంశం సంస్కృతి. అది మన ఆలోచనా సరళిని కార్యకలాపాలను సక్రమంగా ఉంచుతుంది. హృదయ గ్రంథాన్ని శ్రద్ధగా పఠించకుండా కేవలం గ్రంథాలను చదివినంత మాత్రాన ఉపయోగం లేదు. కాని నేను బాగా చదువుకున్న వాడిని కాదు కావున బహుశః "విద్య" అనే మాటకు గల నిజార్థాన్ని తప్పుగా అర్థం చేసుకుంటున్నానేమో. నేను అవిద్య స్థితిలోనే జన్మించాను. ఇప్పుడు మరింత అవిద్య స్థితిలో ఉన్నాను. ఎందుచేతనంటే నా హృదయ గ్రంథాన్ని తెరిచినప్పుడు, దానిలో నాకు కనబడిన ఒకే ఒక పదం "అవిద్య"

* * *

"విజ్ఞానమే సౌశీల్యం" అని సోక్రటీసు చెప్పడం జరిగింది. సౌశల్యం నిష్కామ స్థితికి చెందుతుందని ఆయన భావం. ఆయన ఉద్దేశంలో అది విద్య యొక్క సారాంశం. విద్యను సంపాదించడం వలన మనిషి ఆ నిష్కామ స్థితికి వస్తే విద్య యొక్క ప్రయోజనం నెరవేరిందని నా అభిప్రాయం. అది ఒక ఆధ్యాత్మిక స్థితి. దానిని ఏవిధంగా పొందగలం? సతత స్మరణే దానికి సులభమైన పద్ధతి. "ఎడతెగని ఆలోచనా పరంపరతో" అనే పదాలను సతతస్మరణకు చేరిస్తే అప్పుడా పద్ధతి సంపూర్ణం అవుతుంది.

* * *

అల్పకారణాలకే నీకు తరచు కోపం వస్తోందని అన్నావు. ఈ చెడు లక్షణాన్ని ఎంతగానో విమర్శిస్తూ వ్రాసిన విషయాన్ని నీవు గ్రంథాలలో చదివే ఉంటావు. అయినప్పటికి దీనిని జయించలేక పోతున్నావు. అప్పుడు నీ విద్యవలన నీకు ఒరిగిందేమిటి? స్వామి రామకృష్ణ పరమహంసను గురించి ఒక సంఘటనను చెబుతారు. ఆయన బాలుడుగా ఉన్నప్పుడు చిన్నపిల్లల పాఠశాలలో చదువుతూ ఉండేవారు. ఒకరోజున ఆయనకు ఒక పాఠం యిచ్చి చదువుకు రమ్మని చెప్పారు. ఆ పాఠం "ఎల్లప్పుడు సత్యమునే పలుకుము" అని. దాన్ని అభ్యసించడానికి ఆయన ప్రయత్నాన్ని కొనసాగించారు. ఆ పాఠాన్ని అభ్యసించడం అయిందా అని ఉపాధ్యాయుడు ఎప్పుడడిగినా ఆయన "ఇంకాలేదు" అని మాత్రమే సమాధానం యిచ్చేవారు. కొంతకాలం గడిచిన తరువాత తాను ఈ పాఠాన్ని బాగా అభ్యసించానని ఉపాధ్యాయుడికి చెప్పారు. అంత చిన్న వాక్యాన్ని నేర్చుకోవడానికి అంతకాలాన్ని ఎందుకు తీసుకున్నావని ఆశ్చర్యంతో ఉపాధ్యాయుడు అడిగారు. అందుకు ఆయన అప్పటివరకు తన దైనందిన నిత్యకృత్యంలో దానిని ఆచరించడం అభ్యసించలేక పోయానని వినమ్రంగా సమాధానం యిచ్చారు.

* * *

మన విద్యావిధానం విచిత్ర వర్ణములతో కూడిన పాశ్చాత్య ఆలోచనా సరళిచే రూపుదిద్దుకుంది. అది జీవితావసరాలను, అవి ఉండవలసిన పరిమితిని దాటి అసహజమైన రీతిలో పెరిగేటట్లు చేస్తోంది. ప్రజలు జీవితాంతం తమ శారీరక, మానసిక శక్తి యావత్తును వినియోగించి వాటి సముపార్జనకే ప్రయత్నాన్ని కొనసాగిస్తున్నారు. అదే వారి జీవితపు ప్రధానోద్దేశం అయింది. అపజయాలు, వైఫల్యాలు వారిపై దురదృష్టకరమైన ప్రభావాన్ని కలిగించి, వారి మనస్సును పాడుచేస్తాయి. మన మొండివైఖరే కోపానికి అసలు కారణం. దుష్ప్రభావ ఫలితంగా అలవడిన మూర్ఖస్వభావము మన వివేచనా శక్తిని కప్పివేస్తుంది. ఆవిధంగా అతడు యుక్తాయుక్త విచక్షణా జ్ఞానాన్ని కోల్పోయి, తన అభిప్రాయాలనే దృఢంగా నమ్మి యితరుల అభిప్రాయాలకు తావీయడు. నిస్సందేహంగా యిది ఆధ్యాత్మిక మార్గంలో ఒక తీవ్ర అవరోధం. ఆధ్యాత్మిక పథంలో ఉన్న వ్యక్తి మనస్సు, ఆత్మలను సాధ్యమైనంత వరకు తేలికగ వుంచుకోవడం అవసరం. తాను అన్వేషిస్తున్నదాని తలంపు యొక్క భారము నుండి కూడ విముక్తుడవ్వాలి. వాస్తవానికి యిదే దృఢ సంకల్పం యొక్క అసలు రహస్యం. మీకీ నాడు దాన్ని వెల్లడిస్తున్నాను. అటువంటి సందర్భంలో ఏర్పడిన ఆలోచన ఎటువంటిదైనప్పటికి అది కార్యరూపం దాలుస్తుంది. ఈ స్థితిలో శాశ్వతతత్వాన్ని పొందితే అది ఒక ఉన్నతశ్రేణికి చెందిన సిద్ధి

అవుతుంది.

* * *

నీవు ఎల్లప్పుడు ఆనందంగా ఉండాలని నా అభిమతం. కాని తన కర్తవ్యాన్ని సరిగా నెరవేర్చడంలోనే ఆనందం ఉంటుంది. భగవద్గీత దీని అవసరం గురించే నొక్కి చెబుతుంది. వాస్తవానికి యిదే ఆధ్యాత్మికతకు ప్రాణాధారం. తనతో సంబంధం వున్న వారందరి ఎడల తన కర్తవ్య మార్గంలో సంభవించే సమస్యల్ని, కష్టాల్ని అతడు ధైర్యంగా ఎదుర్కొనాలి. ఈ త్యాగం తృణప్రాయం మాత్రమే. మనకు రాబోయే సకల జన్మ పరంపర కష్టాలతో పోలిస్తే యిదేమీ కాదు. ఇహము, పరము యీ రెండింటి ఎడల మన కర్తవ్యాన్ని సరిగ్గా నెరవేర్చడం ఒక్కటే చాలా అవసరమైన విషయమని నేను దృఢంగా చెబుతాను. ఈ జీవితంలోనే ముక్తిని పొందాలంటే అదే సర్వస్వం.

* * *

మనం ఓరిమి, సహనాలను అలవరచుకోవాలి. ఇతరులు మనపై మోపే నిందల్ని, విమర్శల్ని నిదానంగా భరిస్తూ మనమే ఎక్కడే తప్పు చేసి ఉంటామని భావించాలి. ఆ మహత్తర గమ్యాన్ని పొందడానికి యిదేమంత గొప్ప త్యాగం కాదు. నా అభిప్రాయాలు నీకు నచ్చినట్లనిపిస్తే దయచేసి వాటిని అనుసరించడానికి ప్రయత్నించాలి. నీకు యిది మహాప్రశాంతతను చేకూర్తుంది. ఆవిధంగా చేయడానికి నీవు అసమర్థుడవని అనుకుంటే, అప్పుడు ప్రాధేయపూర్వక హృదయంతో ప్రార్థించడం తప్ప గత్యంతరం లేదు. ఈవిధంగా చేసి కోపాన్ని జయించగలిగావో లేదో చూడాలి.

* * *

ప్రజలు వారికి ఒకానొక విషయంపై గల ఆకర్షణా వ్యామోహంచే ఆ పనిని చేయడానికి పూనుకుంటారు. అటువంటిదే ఏదో ఆకర్షణ వారిని దివ్యత్వం వైపుకు లాగుతుంది. ఆ విధంగా ఆరాధనలోను, భక్తిలోను, సన్యసించడంలోను, ప్రశాంతత ఆనందాలలో కూడ ఆకర్షణ ఉంది. వారు ఆ సత్యవస్తువు కోసం కాక ఆకర్షణానుభూతి కోసమే శ్రమిస్తారు. కాని ఆకర్షణానుభూతి కోసమే శ్రమిస్తున్నంతకాలం అది ఒక వినోద కాలక్షేపమే అవుతుంది. ఆ కారణంగ అది నిజమైన లక్ష్యానికి చాలదూరమై ఉంటుంది. వాస్తవానికి శాశ్వత సత్యప్రాప్తిలో ఎటువంటి ఆకర్షణ కాని, వినోదం కాని లేవు; ఆఖరికి శాంతి, ఆనందం, సత్‌తత్వప్రాప్తి యొక్క ఎరుక కూడ అందులో ఉండదు. అది మార్పు లేకుండా ఎడతెగక కొనసాగే ఒక అచేతన స్థితి.

* * *

ఈ ప్రపంచం ఒక స్వప్నంలాంటి మిధ్య అని అంటారు. ప్రపంచం గురించి ఆవిధంగ భావించాలని పండితులైన గురువులు ప్రజలకు బోధిస్తారు. కాని స్వప్నావస్థలో ఉన్నంత కాలం ఎవ్వరు కూడ స్వప్నాన్ని మిధ్య అని ఎన్నడు అనుకోరు. అదేవిధంగా, మనం యీ మిధ్యా ప్రపంచంలో ఉన్నంతకాలం అది మనకు ఎన్నడు మిధ్యగా కనబడదు. మనం మేల్కొన్నప్పుడు కాని, ఆ స్వప్నం అంతమైనప్పుడు కాని మాత్రమే స్వప్నం అసత్యంగా కనపడుతుంది. మనం అదేవిధంగా మనం భౌతిక ప్రజ్ఞాస్తితికి అతీతంగా వెళ్ళినపుడు మాత్రమే యీ ప్రపంచం మిధ్యగా కనబడుతుంది. కాని కేవలం "యీ జగత్తుమిధ్య, ప్రతీదీ మాయ, భ్రమ" అని అనుకొనడం వలన గాని, ఊహించడం వలన కాని, నిరంతరం వల్లె వేయడం వలన కాని దీనిని పొందడం ఎన్నటికి సాధ్యం కాదు. ఆ స్థితి పెంపొందాలంటే సరైన సాధనా విధానం అవసరం.

* * *

ఒకానొక బిందువు లేక మండలింలో అభ్యాసి సాధించిన స్థితి గురుకృపచే ఉన్నత మండలాలలో కూడ ఒక్కొక్కప్పుడు ప్రతిబింబిస్తుంది. దాని ఫలితంగా అవి కొంతవరకు జాగృతమవుతాయి. అట్టి సందర్భములలో మన అవగాహనకు అభ్యాసి ఆ స్థితి వరకు ప్రవేశాన్ని పొందినాడని అనుకోవచ్చు. ఆవిధంగ మన ప్రవేశం రెండు విధాలుగా ఉంటుంది. ఒకటి (నా గురువర్యులు ప్రయోగించిన ఉర్దూ పదాలలో) "ఆక్సి" అనగా "ప్రతిబింబించినది" కాగా రెండవది "కస్బి" అనగా "సిద్ధించుకున్నది".

* * *

శిక్షణ పూర్తికాక ముందే కూడ దైవం తనపై కొంత బాధ్యతను స్వీకరించునని నా అనుభవానికి వచ్చిన విషయం. కాని ఆయన అభ్యాసి యొక్క సంపూర్ణ బాధ్యతను స్వీకరించినప్పుడు గురువు నిర్వహించవలసిన కార్యము దాదాపు పూర్తి అయినట్లే. అయినప్పటికీ అవసరమైతే ప్రకృతికార్యం సుగమం కావడానికి ఆయన నిర్మలీకరణ కార్యక్రమాన్ని యింకా కొనసాగించాల్సి వస్తుంది. నా అధిచేతన స్థితిలో నాకు తెలిసిన విషయం ఏమిటంటే అభ్యాసి కేంద్రమండలాన్ని ప్రవేశించినప్పుడు దైవమే అతడి బాద్యతను స్వీకరించును. ఇది అందరి విషయంలోను వర్తిస్తుంది.

మానవత్వం దివ్యత్వంతో నింపబడినప్పటికి పూర్తిగా నశింపక, ఇంకా ఉంటుంది. అది కేవలం సామాన్య స్థాయిలోనే ఉంటుంది. అందువలన, దైవంతో అత్యంత

సామీప్యతను పొందినప్పటికి కూడ, మానవ సహజమైన ప్రవృత్తి యింకా మిగిలి ఉంటుంది.

* * *

మనం పై నుండి పొందే శక్తిని ఆజ్ఞాచక్రం పంచిపెడుతుంది. ఆజ్ఞా చక్రంపై ధ్యానం చేసేవారికి స్థిరమైన స్థితికాక చంచల స్థితి అనుభవానికి వస్తుంది. నాకు అటువంటి ధ్యానంలో అనుభవం లేనప్పటికి అది నిజమని నేను భావిస్తాను. 'సహస్రారం'పై ధ్యానం ఆజ్ఞాచక్రంపై చేసే ధ్యానం కనన్న ఉత్తమం. మనం నిర్మించుకున్నది అంతా పోయినప్పుడే మనం అంతిమ గమ్యం చేరుతాం. అక్కడ పరిపూర్ణ శూన్యతా స్థితిలో ఉంటూ తననుతానే ఎక్కడా కనుగొనలేని స్థితి అనుభవానికి వస్తుంది. ఒక ఉర్దూ కవి అదే స్థితిని గురించి యీ క్రింది పద్యంలో చెప్పాడు.

> "హమ్ వహాఁహై జహాఁ సేహమ్ కో భీ కుచ్ హమారీ
> ఖబర్ నహీఁ ఆతీ."
>
> "మన స్వీయాత్మను గురించిన ఎటువంటి వార్త కూడ
> మనకు అందని చోట ఉన్నాము."

మనం కొంచెం కిందికి దిగి కార్యోన్ముఖులమైనప్పుడు ప్రతి అణువులోను మనదైన (ఆదివ్య) సౌరభాన్ని అనుభవిస్తాము. ఆస్థితిని క్షణమాత్రమైనా దర్శించాలి. లేనట్లయితే ఆ స్థితిని అర్థం చేసికోవడం కష్టమవుతుంది.

* * *

సాధారణంగా అభ్యాసీలు ఆనందస్థితిని గురించి పవిత్ర మత గ్రంథాలలో చదివి దాన్ని మాత్రమే పరిగణనలోకి తీసుకొని అదెంతో గొప్పదనే భావంతో చూడ్డం ప్రారంభిస్తారు. నిస్సందేహంగా అదెంతో ఆహ్లాదకరమైనది; కాని అది ఏవిధంగాను మన గమ్యంకాదు. అందరు అభ్యాసీలు "ఆనందం" నుండి "ఆనందరహితం" నుండి కూడ విముక్తులు కావాలని నేను కోరుకుంటాను. అందుకోసమే నా ప్రార్థన. నా ప్రాణాహుతి ప్రభావాన్ని శ్రద్ధగా పరిశీలిస్తే, ఆనందపు ఆకర్షణ ప్రభావం అది ఎంత స్వల్పంగా ఉన్నప్పటికి అతడు దాన్ని గమనించడం జరుగుతుంది. దానికి కారణం అభ్యాసీలకు యిష్టం ఉన్నా, లేకపోయినా సరే ఈశ్వర ప్రాప్తి యదార్థసారాన్ని వారిలో ప్రవేశపెట్టాలని నాకోరిక. అభ్యాసికి విసుగు కలుగకుండా ఉండటానికి నేను అప్పుడప్పుడు తేలికైన ఆనందాన్ని స్వల్ప మోతాదులో యిస్తూవుంటాను.

ఈ సందర్భంగా నేనొక సంఘటన గురించి చెబుతాను. ఒకసారి నా గురువర్యులను నాకప్పుడు ఉన్న ఆధ్యాత్మిక స్థితిని గురించి అడగడం జరిగింది. 'ఎంతో గొప్పగా చెప్పుకునే ఆనంద స్థితి యిదేనా? ఇందు కోసమేనా ఎంతో కాలంగా నాయందు ప్రేమతో మీరు అంతగా శ్రమించారు?'' అని అడిగాను. ''ఇప్పుడు నువ్వున్న యీస్థితి, రుచిహీనంగ ఉండవచ్చు; దాన్ని నీ నుండి వెనక్కు ఉపసంహరించుకుంటే ఏం జరుగుతుంది?'' అని ఆయన చిరునవ్వుతో అడిగారు. ఆ స్థితిని తీసివేయడం కన్న మరణాన్నే యిష్టపడతానని నేను వెంటనే చెప్పాను. ఈ ప్రస్తుత స్థితిని పొందక ముందు నాకిష్టం వచ్చినప్పుడు నేను ఆనంద స్థితికి తిరిగి వస్తుండేవాడిని. కాని యిప్పుడు నేనున్న రుచిహీనమైన యీ ''ఆనందరహిత'' స్థితి నుండి దిగి ఒక్కక్షణం కూడ ''ఆనంద స్థితికి'' రావడానికి యిష్టపడను.

ధార్మిక సాహిత్యంలో తలలు పండిన వారు లేదా ఇప్పటికే ఆ ''ఆనంద రహిత'' స్థితిలో ఉన్నవారు మాత్రమే నా వివరణను ఆమోదిస్తారు. కాని దీన్ని విశ్లేషించ కోరే వ్యక్తి ఇది ఒక మహోన్నత మానసిక స్థితి అనే నిర్ణయానికి వస్తాడు. అదెప్పుడూ తన గమనం సునిశితమైన మార్గంలో ఉండాలని కోరుతుంది. ఆత్మకు యిష్టా అయిష్టాల ప్రశ్నే ఉండదు. అది యథాతథంగానే ఉంటుంది. అత్యున్నత ప్రగతి స్థితిలో వ్యక్తిగత మనస్సు మహోన్నమైన కార్యానికి ఒక సాధనంగ అవుతుంది.

* * *

నేను ఆజ్ఞా చక్రాన్ని ధ్యానానికి కేంద్రబిందువుగా తీసుకోను. ఎందుకంటే పిండ ప్రదేశానికి శక్తి అందులోకి వస్తుంది. మరియు ఆ శక్తిని అది తన క్రింది ప్రదేశానికి పంచుతుంది. ఈ బిందువుపై ధ్యానం చేస్తే మెరపుల వంటిది ఏదో ధ్యానాన్ని ఆటంక పరుస్తున్నట్లు అనుభవానికి వస్తుంది. కెంపు వర్ణం కల చుక్కలు రావడం ఎంతో పరిశు ద్ధం కావించబడిన స్థితికి అసలైన సూచకము. నేనిది చెబితే అది నన్ను నేనే పొగుడుకుంటున్నట్లవుతుంది. కాని నిజాన్ని చెప్పి తీరాలి. బుద్ధ భగవానుని ఉద్దేశం ఈ విషయమేనా లేక మరేదైనా అనేది నాకు తెలియదు. టిబెట్‌లోని బౌద్ధులు ''ఓం మణి పద్మేహం'' అనే మంత్రాన్ని పఠిస్తారు. బుద్ధుడు చేసిన అద్భుత మహత్యం ఒకటి ఉంది. ఆయన కమల పుష్పదళాలతో అలంకరించబడిన ఒక స్థలంలో కూర్చుని ఉండగా, బుద్ధులు ఒకరి తర్వాత మరొకరు ఆకాశంలో ఎగురుచున్నట్లు కనబడింది. బుద్ధుని పవిత్రత యీవిధంగ చూపబడిందని నా అభిప్రాయం.

* * *

ఆజ్ఞాచక్రం ద్వారా కాని, దానికి కొంచెం పై నుండి కాని ప్రాణహుతిని ప్రసారం చేస్తే అభ్యాసి తేలికతనాన్ని అనుభవం చెందేట్లు చేస్తుంది. చిత్ సరస్సుకు ఎంతో పైన ఉన్న బిందువుపై ప్రాణాహుతి ప్రసార విషయంలో, అభ్యాసికి తేలికదనం అనుభవానికి రాదు కాని ఆ శక్తిని తట్టుకోలేనట్టయితే ఏదో ఒత్తినట్లు అనిపిస్తుంది. సూర్యుడు ఎల్లప్పుడు ప్రకాశించే ఆ ప్రదేశం మన జన్మస్థలం. అక్కడ చీకటికి తావులేదు. కాంతి కూడ అక్కడ నిష్క్రమిస్తుంది. మన యోగులు పొగను చూసి అగ్ని ఉందని చెప్పేటటువంటి తక్కువ స్థాయి వారుకాదు. వారు పదార్థాన్ని నేరుగ చూస్తారు. నిజమైన సహజావస్థకు చేరుకున్న వ్యక్తి. ప్రతి వ్యక్తి గత ఆత్మ యొక్క అసలు మార్గాన్ని ప్రకృతి పర్యవసానాన్ని తనయందే తెలుసుకొనగలడు. కొంచెం ఏకాగ్రత ఉంటే అది దీన్నంతటినీ వెల్లడిస్తుంది.

* * *

మనస్సు తన ఆహ్లాద ప్రభావానికే అంటిపెట్టుకుని ఉంటే, అది తన సహజ పద్ధతిలోనే ఆడుకుంటోందని అర్థం. మనస్సు అనే యీ పరికరం ద్వారానే సకల సిద్ధులు, మహిమలు నిర్వహించబడుతాయి. మనిషి దాని పరికరంగా ఉన్నంత వరకు, అది అతడిని ఎల్లప్పుడూ తనలోనే కప్పివేసి ఉంచినట్లు తెలుసుకుంటాడు. దైవాదేశాలు, ఆజ్ఞలు మనస్సు యొక్క ప్రభావానికి లోను కాని వారికే వస్తాయి.

హృదయ మండలం శిఖరం (సహస్రారం) వరకు విస్తరించి ఉంది. దాని తరువాత మనో మండలం ఉంది. అది తల వెనుక భాగం వరకు విస్తరించి ఉంది. “రాజయోగ ప్రభావం”లో నేను సూచించినట్లు దానిలో అధిచైతన్యం కూడ ఉంది; కాని అది అంత చైతన్యవంతం కాదు.

బ్రహ్మాండం ఆజ్ఞాచక్రం నుండి ప్రారంభమౌతుంది. పిండ ప్రదేశాన్ని దాటిన తరువాత ఆజ్ఞా చక్రానికి వస్తాం. ఆవిధంగా చిత్‌సరస్సు బ్రహ్మాండంలోనే ఉంది. సరస్వతి బిందువు కూడ అక్కడ ఉంది. “రాజయోగ ప్రభావం”లో హృదయ మండలం ఆపాదమస్తకం వ్యాపించి ఉందని చెప్పాను. సృష్టి యావత్తు శిఖరం (సహస్రారం) వరకు ఉన్న యీ పరిధిలోనే ఉంది.

పరబ్రహ్మాండ మండలం తరువాత మరో మూడు మండలాలు ఉన్నాయని నా అనుభవం తెలుపుతోంది. వాటికి పర్షియను భాషలో ఒక్కొక్కదాని స్థితి ననుసరించి పేర్లు పెట్టాను. దాని తరువాత అసంఖ్యాకాలైన బిందువులున్నాయి. ప్రతిదానికి ఒక ప్రత్యేక స్థితి ఉంది. సాధారణంగ యీ బిందువులను ఒక్కొక్కటిగ తీసుకుంటాను.

ఈ బిందువులన్నీ సహస్రారం (శిఖరం)లో ఉన్నాయి. సహస్రారం తరువాత హృదయమండలం అంతమవుతుంది. అప్పుడు మనోమండలానికి వస్తాము. అక్కడ కూడ ఒకవిధమైన అధిచైతన్య స్థితి ఉంది. ‘‘రాజయోగ ప్రభావం’’లో నేను దానిని చర్చించలేదు. దానికి కారణం అది దైవం తన కార్య నిర్వహణకై వినియోగించే పరికరంగా పనికి వస్తుంది. ఇతర అధిచైతన్య స్థితులన్నీ సామాన్యంగ మొగ్గవంటి స్థితిలో కనబడతాయి. అవి తెరుచుకున్నప్పుడు సంపూర్ణంగా వికసించిన పుష్పాలుగ మారుతాయి, కాని ఈ అధిచైతన్య స్థితి ఒక తలక్రిందు స్థితిని కలిగియుండి దాని పుష్పదళాలు క్రిందికి తిరిగి ఉన్నాయి. దాని ద్వారా పయనించిన అభ్యాసి కేంద్రమండలాన్ని చేరుకున్నప్పుడు యీ అధిచైతన్య స్థితి, అతడు దివ్యశక్తుల్ని పొందడానికి తోడ్పడుతుంది. కాని దానిని ప్రసాదించడం పూర్తిగ దైవం పైనే ఆధారపడి ఉంది. దానిని సంగ్రహించడం అభ్యాసికి అసాధ్యం. అభ్యాసి గురువుపై సంపూర్ణ భక్తి విశ్వాసాలతో కేంద్రమండలంలో ప్రవేశించి నప్పుడు, అది తనకు తానే తెరచుకొనుట ప్రారంభిస్తుంది. అది కేవలం అనుభవాత్మక విషయం.

దైవమే కేంద్రం; గురుకణము (Master Cell), మరియు ఇతర కణాలు అన్ని ఆయన సృష్టించినవే, ఎవరైనా కేంద్రంపై ధ్యానం చేయడానికి ప్రయత్నిస్తే అతడి శ్రమ విజయవంతం కాదు. అయినప్పటికి అతడు ధ్యానానికి కేంద్రాన్ని ఊహించుకొని దృష్టిఓ పెట్టుకోవచ్చు. దానికి గల ఒకే ఒక పద్ధతి ‘‘అనంతమువైపునకు’’ అనే పుస్తకంలో సూచించినదే. కాని ప్రతి వ్యక్తి ఆ పద్ధతిని అనుసరించి ప్రయత్నం చేయడాన్ని నేను నిషేధిస్తాను. నేనా విధంగా రెండు మారులు నా గురువర్యులను ప్రార్థించి ప్రయత్నం చేస్తాను. అది కూడ పట్టుకు రెండు మూడు సెకనులు మాత్రమే. దాని అంచున ఉన్న వలయం వద్ద అపార శక్తి ఉన్న కారణంగ నా హృదయాన్ని దృఢంగా అదుపులో పెట్టుకున్నాను. అదే సమయంలో గురువర్యుల శక్తివంతమైన అండ కూడా నాకుంది. అప్పటికి కూడ నేను దానిలోకి తొంగి చూడడం మాత్రమే చేయగలిగాను, కాని దానిపై ఏ మాత్రం ధ్యానం చేయలేక పోయినాను. దానికి కారణం నా హృదయం మీద ఒత్తిడి భరించలేనంత ఉధృతంగా వచ్చింది. పైగా ఆ వలయాన్ని సమీపించడం కూడ చాలా కష్టమైన పని. ఎందుచేతనంటే అది మనల్ని బలంగా వెనక్కు నెట్టి వస్తుంది. నేనావిధంగా చేసినందుకు గురువర్యులు నన్ను మందలించి, మళ్ళీ ఆవిధంగా చేయవద్దని హెచ్చరించారు.

* * *

ప్రత్యేకించి యీ సందర్భంలో నేను అంతగాఢంగా ఎందుకు చలించినానే ప్రశ్న యిప్పుడు ఉత్పన్నమవుతుంది. ప్రకటించిన ఆధ్యాత్మిక క్రమశిక్షణా నియమ నిబంధనలకు ఇది వ్యతిరేకం కావచ్చు. ఈ సందర్భంగా నా జీవితంలో ఒక పాత సంఘటనను గురించి వివరిస్తాను. సుమారు ముప్పయి సంవత్సరాల క్రిందట నా పెద్దకుమారుడు అతడొక్కడే. అప్పుడు నేను కనీసం మనం పెంచే రామచిలుక మరణించినప్పుడు పడే బాధనైనా పడలేదు. అప్పుడు మన శిక్షకులు ఒకరితో నేనా విధంగా చెప్పాను. నా అభ్యాసం ప్రారంభించిన ఎనిమిదో సంవత్సరంలోనో, తొమ్మిదో సంవత్సరంలోనే యిది జరిగింది. కాని నలభై సంవత్సరాల అభ్యాసం తరువాత యిప్పుడు నేను అటువంటి సంఘటనకే ఎంతో గాఢంగా చలించి పోయినాను. ఇది విచిత్రమైన తేడా! ఈ తేడా ఎందుకు వచ్చింది? విజ్ఞులు, పండితులు అయిన నా సహచరులు యీ కారణాన్ని కనుగొని పరిష్కరించాలి. అప్పటి నా ఆధ్యాత్మిక స్థితి యీనాటి దాని కంటె గొప్పది ఉన్నతమైనది అని భావించకూడదా? నా దృష్టిలో మాత్రం నేనిప్పుడు ఆనాటి కంటె ఎంతో పురోగమించి అధిక ప్రావీణ్యాన్ని పొందాను. ఈ రహస్యానికి పరిష్కారం నేను ప్రస్తుతం చెప్పను. కాని సూచన ప్రాయంగా మాత్రం నేను చెప్పేది, మానవత్వం, దివ్యతం రెండూ కూడ ప్రక్కప్రక్కనే కొనసాగాలని. నా దృష్టిలో పరిపూర్ణత్వం అంటే అదే.

* * *

నీ ఉత్తరంలో అయిదు రకాలైన విగ్రహాలను గురించి వ్రాస్తూ, ఒక్కొక్క దానినే వివరించావు. నా గురువర్యులు చెప్పిన యింకొక రకమైన విగ్రహారాధనను నీకు తెలుపుతాను. ఒక మనిషి కనక తన అలవాట్లకు బానిస అయినట్లయితే అతడు కూడ విగ్రహారాధకుడేనని ఆయన చెప్పారు. వాస్తవం కాని ఒక విషయాన్ని ఉందని మనం భావిస్తే అది కూడా విగ్రహారాధనే అని నేనింకా ముందుకు పోయి చెబుతాను. ఒక వ్యక్తి తన కుటుంబాన్ని, బిడ్డలను మొదలగు వారిని ప్రేమించినట్లయితే అతడు కూడ విగ్రహారాధకుడే. దానిని సంపూర్ణంగా తొలగించడం ఏవిధంగా సాధ్యమవుతుంది? అటువంటి సంస్కారాలను వేటినీ ఆలోచన స్వీకరించకుండ ఉన్నప్పుడు మాత్రమే యిది సాధ్యం అవుతుంది. ఆ సంస్కారం ఒకవేళ వచ్చినప్పటికి, అసంకల్పితంగానే వెనక్కు నెట్టి వేయబడుతుంది. కాని చాలావరకు పురోగమించిన తరువాతే అటువంటిది జరుగుతుంది. మనం ఉన్నతంగా పైకివెళ్ళి దానిని అందుకోవాలంటే స్థూల వస్తువులను ఆరాధించడం మానేయాలి. కొందరికి శాశ్వత సత్యప్రాప్తి యొక్క అనుభవం ప్రయోగాత్మకంగా యివ్వడం జరిగింది. అయినప్పటికి వారు శిలా విగ్రహారాధన వదలరు.

కొందరి అభ్యాసీల ఉదాహరణలు నావద్ద ఉన్నాయి. వారికి నేను శాశ్వత సత్వప్రాప్తి స్థితిని అనుభవాత్మకంగా చూపించాను. అది క్షణం మాత్రమే అయినప్పటికీ వారు అనుభూతి చెంది, అదెంతో విలువైనదిగ ప్రశంసించారు. కాని వారి విగ్రహాలను వదలుకోవడానికి వారు సిద్ధపడలేదు. దానికి కారణం వారు దానికి అలవాటు పడ్డారు. వారి వివేచన జ్ఞానం కూడ పూర్తిగ మొద్దుబారి పోయింది. వారు విచక్షణా జ్ఞానాన్ని యిదివరకే కోల్పోయారు. అదే వారి పతనానికి కారణం. విచక్షణా శక్తి పోయినప్పుడు భయం ప్రవేశిస్తుంది. వారు విగ్రహారాధనను వదలిపెట్టరు. ఎందుచేతనంటే వారి పూర్వీకులు ఎంతోకాలంగా దానిని చేస్తున్నారు కావున. ఇది ఒక విషయం, మరొక విషయం ఏమిటంటే దానిని వదిలేస్తే, ఏదో విపత్తు తమ మీద వచ్చిపడుతుందని భయపడుతారు. ఇదే మన విషాదగాథ.

* * *

సోమరితనం కూడ పుట్టవ్రణాన్ని (cancer) పుట్టిస్తుందనే విషయం నా వింత అనుభవం. సోమరితనం అంటే స్వార్థానికి లొంగిపోవడమే నన్న అభిప్రాయానికి వచ్చాను. మరో మాటలో చెప్పాలంటే ఆధ్యాత్మికాభివృద్ధికి ఆత్మహత్యా సాదృశ్యమైన స్వార్థానికి సోమరి లొంగిపోతాడు. నేను కూడా చాలా సోమరినే. కాని యిది నా ఇంటి పని విషయంలో మాత్రమే.

* * *

అక్కడ నిస్సందేహంగా లయావస్థ ఉంది. కాని ఆస్థితిలో మనిషి సత్‌తత్వంలో లీనమై ఉన్నప్పటికీ ఆవలివైపున ఉన్న యీ ప్రపంచంతో కూడ సంబంధం కలిగి ఉన్నట్లు అనుభూతి చెందుతారు. మానవత్వం ఉండటానికి ప్రకృతి పన్నిన వ్యూహం యిది. ప్రపంచంలేనిదే మానవత్వం మనుగడే అసాధ్యం. ఇది ముఖ్యావసరం కూడ ఎందుకంటే మనం శాశ్వతంగ కన్నుమూసే వరకు మానవులుగా జీవించడం మన ప్రథమ కర్తవ్యం. ఇది ప్రకృతి రహస్యం. ఈ వ్యాకులాలు పైభాగాన్నే ఉంటాయని నేనప్పుడే చెప్పాను. వాటిని గురించి దీర్ఘంగా ఆలోచించినప్పుడు, అవి ఉధృత రూపం దాలుస్తాయి. ఎందుకంటే అక్కడ శక్తి ఉంది. అటువంటి విషయం మనస్సుకు తట్టినప్పుడు, ఆ ఆలోచనను మనస్సు నుండి సహజ సిద్ధమైన శక్తితో తీసివేయాలి.

* * *

సహజ మార్గ శిక్షణా విధానం చాలా ఉన్నత ప్రమాణాన్ని కలిగిన విధానం. అది

సరిగ్గా మూలాన్ని తాకుతుంది. కేంద్రం నుండి పరిధి వరకు కొనసాగుతుంది. అది కేంద్రం నుండి పరిధి వరకు విస్తరించే అపకేంద్రక పురోగమనం. అది లోతుగా నాటుకొని శాశ్వత ఫలితాన్ని కలిగిస్తుంది. కాని కొందరు గురువులు వేరే పద్ధతిని అనుసరిస్తారు. వారు అభ్యాసి యింద్రియాలను నిర్వీర్యం కావించడానికి వారి స్థూల చైతన్యపు బాహ్య పొరలను స్పృశించి ఆవిధంగా ఒక అపస్మారక స్థితిని సృష్టిస్తారు. ఆవిధంగా కలిగించిన ప్రభావం ఆ సమయంలో అభ్యాసికి ఆనందకరంగా ఉన్నప్పటికి దాని ఫలితంగా చివరకు మానసిక మాంద్యం కలిగి మేధాశక్తి నశిస్తుంది. సహజమార్గ విధానంలో అభ్యాసి మేధాశక్తి దివ్యజ్ఞాన శక్తిగా మార్పుచెందేటంత వరకు అద్భుతంగ వృద్ధి చెందుతుంది. తగినంత సునిశిత్వం ఉన్నవాడు తన అస్తిత్వంలో క్రమంగా వచ్చే ఈ మార్పును గమనించ గలుగుతాడు.

"సృష్టి సమయానికి ముందే అణువులు ఉన్నాయి"... ఇక్కడ "అణువు" అనే పదం సామాన్యంగా వాడుకలో ఉన్న భౌతిక పదార్థపు అణువులనే భావంలో ప్రయోగించలేదు. ఎందుకంటే పదార్థం దాని సహజరూపంలో తరువాత సృష్టించబడింది. ఆ సృష్టి సమయంలో అది లేదు. అప్పుడు అక్కడ ఉన్నదానిని శక్తి అని అనడం మరింత సముచితం. ఇక్కడ ప్రయోగించిన పదం ఆ శక్తి అణువులకు సంబంధించినట్టిది. అది ఆ తరువాత ప్రథమ క్షోభ యొక్క చర్య ఫలితంగా పదార్థంగా పరిణమించింది.

"దైవానికి మనస్సు లేదు. సత్‌తత్వంతో కలపడానికి పరిణతి పొందిన మానవ మనస్సు అవసరం అవుతుంది". ఈ సందర్భంగా నేనింకో విషయం చెప్పవచ్చు. దైవానికి (బ్రహ్మము) కనుక మనస్సు ఉన్నట్లు భావిస్తే ఆ మనస్సుకు కార్య నిర్వహణ కూడ ఉండి తీరాలి. అప్పుడు దైవం (బ్రహ్మము) కూడ తన స్వీయ చర్యల ప్రభావానికి లోను కావలసి వస్తుంది. కాని ఆయన అటువంటి ప్రభావాలన్నిటికి లోనుకాని సర్వ స్వతంత్రుడని సర్వే సర్వత్రా అంగీకరించబడింది. అనగా మనస్సు యొక్క కార్య నిర్వహణ అక్కడ లేదని అర్థం. ఇది చివరకు మనస్సే లేదనడానికి సమానం అవుతుంది. దైవాన్ని గురించి అనేక అభిప్రాయ భావాలు ఉన్న కారణంగా మాత్రమే, ఈ ఆలోచనలో ఈ చిక్కు ఉత్పన్నమైంది. దైవాన్ని గురించి మాట్లేడేటప్పుడు

దైవమంటే పరిపూర్ణస్థితిలో ఉన్న బ్రహ్మని, సర్వాతీతుడని, శక్తికి, చలనానికి, చైతన్యానికి, ఆఖరుకు మనస్సుకు కూడా అతీతుడని నా భావం. ఇప్పుడు ఏ మానవ మనస్సు ద్వారా అది పనిచేస్తుందో, ఆ మనస్సు పూర్తిగా రహితం కావింపబడి వ్యక్తిగతంగ తనదైన కార్యనిర్వహణను కలిగి ఉండదు. దాని మాధ్యమం ద్వారా కార్యరూపంలోకి

వచ్చేవి అన్ని దైవ సంబంధమైనవే. అందుచేతనే అది దైవానికి పరికరంగా ఉపయోగ పడుతుంది.

* * *

"భౌతిక పరమాణువులను శక్తిగా మార్చవచ్చు." ఈ అభిప్రాయం అంత వివాదాస్పదమై నట్టిది కాదు. ఎందుచేతనంటే, అత్యంత సునిశిత స్థితిలోకి వచ్చినప్పుడు పదార్థము శక్తిగా మారుతుంది. వేరు మాటలలో చెప్పాలంటే పదార్థం స్థూలతర స్థితిలో ఉన్న శక్తి మాత్రమేనని చెప్పవచ్చు. అది ఒక శాస్త్రసంబంధమైన సూత్రం. నాకు తెలిసినంతవరకు అది ఆధునిక విజ్ఞాన శాస్త్రంచేత ఆమోదింపబడింది కూడ. మన ప్రాణాహుతి విధానంలో యిది ప్రాథమిక ఆధారం. "ప్రాణాహుతి పదార్థాన్ని శక్తిగాను, శక్తిని పరతత్వంగాను మారుస్తుంది." అని నీవే చక్కగ వ్యక్తం చేసావు.

* * *

ఆనందమయమనేది ఒక కోశం. అది శూన్యము లేక సున్నగ వర్ణించబడినట్టి పరతత్వ స్థితి మాత్రం కాదు. ఆనందమయ కోశం పంచకోశాలలో ఒకటి. ఈ కోశాలన్ని నిస్సందేహంగ అవధులున్న పరిమితులు. ఆధ్యాత్మిక గ్రంథాల ప్రామాణికంగాకూడా అది నిజం. ఆనందమయి కోశం ఒక స్పష్టమైన పరిమితి కావున దానిని పరతత్వం స్థితిగ తీసికొనలేము. వాస్తవ విషయానికి అది ఆనందంతో సహా అన్నింటికి కూడ అతీతమైనట్టిది. దీనిపై ఎక్కువ వివరణలు ఈయదలుచుకోలేదు. నీ ఆనందమయ కోశం విచ్ఛిన్నం అయిన తరువాత నీకు వచ్చిన స్థితిలో నీ స్వీయానుభవాలు ఈ విషయాన్ని గురించి తగినంత వివరణను యిస్తాయి.

* * *

"అత్యున్నత చైతన్యము కాని, కేంద్రమే తనంతట తాను కాని ఈ దేహనిర్మాణ క్రమాన్ని పరిశుద్ధం చేసినప్పుడు మాత్రమే, మానవ మాత్రుడిగానే ఉంటూ కూడ కేంద్రంతో నేరుగ సంబంధాన్ని కలిగి వుండవచ్చు". నేను వేరేచోట వ్యక్తం చేసిన కొన్ని అభిప్రాయాల సందర్భంగా ఈ విషయం తలెత్తుతుంది. అందులో అత్యున్నత స్థితిని పొందే పద్ధతి కూడ ఈయబడింది. నా గురువర్యులు బోధించిన విషయాలలో యిది నిస్సందేహంగ ఒక అత్యంత విచిత్రకరమైన అంశం. ఈ మహోన్నత స్థితిని పొందడానికి పరిపూర్ణ పవిత్రత తప్పక అవసరం. అయినను దానిని పొందగల సామర్థ్యం మాత్రం ఒక దివ్య బహుమతి (దివ్యకానుక).

ఆ గ్రంథంలో చర్చించిన తాత్త్విక సిద్ధాంతాన్ని గురించి నేను ఒకటి చెప్పవలసి ఉంది. అది ఈ విషయాన్ని చర్చించాలనే నిర్దిష్టమైన ఉద్దేశమేదీ నాకు లేదు. కావున ఆ గ్రంథంలో దాన్ని ఒక క్రమపద్ధతిలో వివరించడం జరుగలేదు. అక్కడ ఉన్నది ఏదైనప్పటికి అది యిప్పుడు చర్చింబడుతున్న విషయాలకు సూటిగ సంబంధించిన చెదురు మదురు సూచనల రూపంలో మాత్రమే ఉంది.

* * *

'రాజయోగ ప్రభావం'లో నా గురువుగారు చేసిన అద్భుత పరిశోధనను గురించి చెప్పాను. అది మనిషి సశరీరిగానే కేంద్ర మండలాన్ని చేరుకోవచ్చుని. మనిషి కేంద్ర మండలాన్ని చేరుకున్నప్పుడు, అతడు క్రింది మండలాలతో కూడ సంబంధం కలిగి యుంటాడని ఒక బంధము ఉంచబడుతుంది. ఈ బంధమే కనుక ఉండకపోతే ఆత్మ శాశ్వత శాంతిలో దుమికి, జీవితం అంతమవుతుంది. అందుచే అప్పుడప్పుడు క్రింది మండలాలలోని గాలిని కూడ ఆస్వాదించడం అవసరమవుతుంది. ఈ ప్రపంచంలో కేంద్రమండలాన్ని ఏదోవిధంగా చేరుకుని అత్యున్నత స్థితిలో ఉన్న ఋషికి కూడ ఉండే స్థితి యిదే.

శూన్యత్వం యొక్క అత్యున్నత స్థితిలో తాకిడి మిక్కిలి స్వల్పంగ అనుభవానికి వస్తుంది. ప్రతిదశలో ముందుకు పయనించడానికి ఎల్లవేళలా అవకాశం కనబడుతుంది. ప్రతీది సవ్యంగా ఉండి, దివ్య శక్తితో పూర్తిగా నింపబడినప్పుడు, కేంద్ర మండలంలో ఈదడం ప్రారంభమవుతుంది. కాని అది కాంతి వలయాలను దాటిన తర్వాతనే ఈదడం ప్రారంభించుటకు మహోన్నత శక్తి సహాయం అవసరమవుతుంది.

* * *

నా గురువుగారి మహత్తర బోధనల ప్రకారం దేహంలోని ప్రతి రంధ్రానికి తనదైన శక్తి కేంద్రం ఒకటి ఉంది. దానికదే ఒక మహాఖండము. విశ్వంలో గ్రహకూటమితో సహా అంతా అందులో కనబడుతుంది. అవన్నీ వారి సంపూర్ణ ఎరుక స్థితికి రావలసిందే. నా సహచరులెల్లరు ఆ స్థితికి రావాలని, అటువంటి సేవను అందించే అవకాశాన్ని నాకు దైవం యివ్వాలని నేను ప్రార్థిస్తున్నాను. నీ గురువర్యులకు అది ఒక క్షణకాలపు పని. వారికి మాత్రమే అది సాధ్యం. కాని ఒక్క చూపు మాత్రాన్నే అట్టి శక్తిని గ్రహించడానికి సంసిద్ధంగ ఎవరున్నారు? నా సహచరులు ఈ దివ్యశక్తిని తట్టుకునే సామర్థ్యాన్ని కలిగి వుండాలని నేను ప్రయత్నం మీద ప్రయత్నం చేస్తున్నాను. అందుచేతనే మనం క్రమంగ

ముందుకు పురోగమించే పద్ధతికే కట్టుబడి ఉంటాము.

* * *

దయాళుశక్తి (grace) సర్వదా ఉండనే ఉంది. అయినప్పటికి అదెంత మాత్రం నా అనుభవానికి రావడంలేదని మాత్రం నేను చెప్పగలను. ఏదో మంచి కారణం కోసమై నేను ద్వంద్వత్వ స్థితిని స్వీకరించినప్పుడు మాత్రమే దానిని అనుభూతి చెందుతాను. దివ్యత్వం నుండి ఏదో క్రిందికి దిగుతున్నట్లు భావించినప్పుడే అది ఎక్కువగా నా అనుభవానికి వస్తుంది. అది ఒక వింత స్థితి. దానికి వ్యక్తం చేయడానికి మాటలు చాలవు.

* * *

శక్తి ఉపసంహరించబడినట్లు ఉండే అనుభవం అంటే కొంచెం శూన్యత్వ స్థితికి సన్నిహిత సంబంధం ఉన్నదేదో అని అర్థం. నాకు శక్తి కూడ అవసరం లేదు. కాని దాని అంతిమ స్థితే కావాలి. ఆ స్థితిలో అవసరం అయినప్పుడు శక్తి అక్కడే ఉంటుంది.

ప్రాపంచిక జీవితాన్ని కొనసాగించడానికి అవసరమైన సకల వస్తువులు మనకు లేకుండా పోయినప్పటికి వాటి స్థానే యోగ్యమైనట్టి ఆంతరంగిక జీవితాన్ని మనకు యిచ్చినట్లయితే మనం ఏవిధంగాను నష్టపోమని నా వ్యక్తిగత అభిప్రాయం.

ఈ మార్గంలో బాహ్య పరిస్థితులను మార్చడం అనే ప్రశ్నే పొసగదు. దైవ సంకల్పానికి విధేయతను అలవరచుకోవానికి అభ్యాసి పరిస్థితులకు అనుగుణంగా సర్దుకుపోవడం మేలు. దైవ సంకల్పం ప్రబలమైనట్టిది. పరిస్థితులు దాని ఫలితాలు, వాటిని దైవానుగ్రహ ఫలితంగా వచ్చిన కానుకలుగా స్వీకరించడం మనం నేర్చుకోవాలి. సహజంగ సామాన్య మానవుడికిది అంత సులభమైన పనికాదు. అందుచేతనే ప్రకృతి సిద్ధమైన పరిమితులు అతనికి మితిమీరిన దుఃఖాన్ని కలిగించేవిగా కనబడుతాయి. కాని తన ఆధీనంలో లేని ఈ పరిస్థితుల గురించి వ్యాకులం చెందడానికి బదులు తన స్థూలస్థితిని సరిదిద్దుకోడానికి శక్తిని వినియోగించడం యింకా మేలు.

కాని సమస్య ఏమిటంటే ఆధ్యాత్మిక సాధన కోసం వచ్చినామనం చెప్పుకునే వారిలో అనేకులు ఆంతరంగిక భౌతిక ప్రయోజనాలను ఆశించినవారే. అవి తమ అభిరుచికి, అభీష్టానికి అనుగుణంగ సరిదిద్దబడాలని వారు కోరుతారు. వారు వాటిని పొందకపోతే, తెంచుకుని బయటకు వెళ్ళిపోతారు. ఒకవేళ పొందినప్పటికి, వారి ప్రయోజనం నెరవేరిందని కనుక సాధనను కొనసాగించరు. అటువంటి సందర్భాలు ఎన్నో ఉన్నాయి. నా

గురువర్యులు ఆధ్యాత్మిక శిక్షణా విధానాలు ఎటువంటి ప్రాపంచిక వాసనలు లేని పూర్తి స్వచ్ఛమైనవి. కొందరు మహాత్ములు అటువంటి భౌతికపరమైన ఆకర్షణలను యివ్వచూపి కొంతవరకు విజయాన్ని సాధిస్తారని నాకు తెలుసు. కాని యీ విధంగా చేయుటకు వారు సరైన మార్గాన్ని వదలి, ఆధ్యాత్మిక వ్యతిరేక పద్ధతులను ఆశ్రయిస్తారు. నాకు మాత్రం యిది ఆమోదయోగ్యం కాని విషయం. మహా చేదు మాత్రవంటిది. నా గురువర్యులు నిర్దేశించిన విధానాన్నే నేను కచ్చితంగా పాటిస్తాను. ఎట్టి పరిస్థితులలోను ఆధ్యాత్మిక వ్యతిరేక పద్ధతులను అవలంభించుటకు యిష్టపడను.

* * *

నా వద్దకు వచ్చే ప్రతివ్యక్తిలోను ఆ సమయానికి ఎంతవరకు వీలగునో అంతమేరకు మార్పు తీసుకురావడానికి ప్రయత్నిస్తాను. అది నా కర్తవ్యముగా భావిస్తాను. కాని అది ఆ వ్యక్తిపై కూడ కొంతవరకు ఆధారపడి ఉంటుంది. మార్పును అది పనిచేసే ప్రకారం దానిని పనిచేయనివ్వడం అతడి వంతు. ఎక్కడైతే ఈ సహకారం ఉండదో, ఆ సమయానికి సాధన చేయడానికి ఆకర్షితుడైనప్పటికి ఆ వ్యక్తి కొంతకాలం తరువాత మానేస్తాడు.

నాకు అనేక రకాలైన యిబ్బందులు ఉన్నాయి. సాధకుడికి ఆధ్యాత్మిక విషయాలను చర్చించి నచ్చచెప్పడం, ఆధ్యాత్మిక తపనను, స్థిరత్వాన్ని కలిగించడం, తీర్చిదిద్ది మార్పు తీసుకు రావడం, చివరగా ఆధ్యాత్మిక మార్గంలో దృఢంగా నిలబడునట్లు చేయడం వంటి ప్రతి విషయానికి నేనే బాధ్యత వహించాలి. అయినప్పటికి అవతలివైపు నుండి పూర్తి సహకారం వచ్చినట్లయితే దీనికి నేను బాధపడను. కాని కొన్ని సందర్భాలలో ఈ సహకారం కూడ లేకపోవడం శోచనీయ పరిస్థితి. వారు అపేక్షించేది అంతా బాహ్యామైనవి, భౌతికమైనవి. మన విధానం ప్రత్యేకంగా ముక్తిని, దాని కతీతంగా ఉండే స్థితులను సిద్ధించుకోడానికే, అందుచేతనే అది క్షుద్ర లక్ష్యాలకు దూరమైన విధానం. దీనినే నా తొలిపరిచయం నుండి ప్రతి ఒక్కరికి యిస్తాను. కాని ఇది సంపూర్ణత్వాన్ని సంతరించు కునేటట్లు పరిపక్వత పొందాలంటే కొంతకాలం పడుతుంది. అందుకు అతడు ఆతృతగ ఉండాలి కూడ. నిజమైన తపన లేకుండ నావద్దకు వచ్చేవారికి ఈ మార్పు వారిలో లోతుగ వేళ్లూని, క్రమంగా దాని ఫలితాలు బహిర్గతమయ్యేంత వరకు ఓరిమి ఉండదు. నాకు నేనుగా సర్వస్వాన్ని వారిలోకి బలవంతంగా చొప్పించడానికి పూనుకుంటేనే తప్ప అటువంటి వారి విషయంలో ఏం చెయ్యాలో అర్థంకాక దిక్కుతోచదు. కాని అది ప్రమాదకరమైన పద్ధతి.

* * *

ఆధ్యాత్మిక శిక్షణను యిస్తామిన చెప్పుకునే ఒక సంస్థ మన దేశంలో ఈ ప్రాంతాన ఉంది. దానిని అనుసరించే సభ్యులు హెచ్చు సంఖ్యలో ఉన్నారు. దానిలో చేరినవారు దానిని విడిచి బయటకు వెళ్ళరు. నాకు వ్యక్తిగతంగా తెలిసిన వారిలో కొందరు దానిపై ఎంతో విరక్తి, అసహ్యము చెందినప్పటికి కూడ, విడిచి వెళ్ళలేదు. వారు ఆకర్షణలు చూపి, ఆశలు కలిగించడమే కాక, భయపెట్టి బెదిరించడం వలన కూడ అభ్యాసీలను గట్టిగా కట్టిపడవేసే ఆధ్యాత్మిక వ్యతిరేక విధానాలను అవలంబించారని నేను తెలుసుకున్నాను. వారి అంతరస్థితిని పరిశీలించినప్పుడు వారిలో ఒక్కరు కూడ ఆధ్యాత్మికంగా సాధించింది ఏదీ లేకపోవడమే కాక, ఏదో భౌతికశక్తిచే బంధింపబడినట్లు తెలుసుకున్నాను. వారిలో ఒక్కరు కూడ ఏ విధంగాను లక్ష్యానికి సమీపంగ ఉన్నట్లు కనబడదు. కాని మన సంస్థలో ప్రశిక్షకులు (Preceptors)లో ఒక్కరు కూడా వారు చేసే ప్రాణాహుతి ప్రసారాలన్నిటిలో మాయా లక్షణం అవలేశమైన ఉండదని గమనించి ఆనందిస్తావు. అతడి నుండి అభ్యాసికి ప్రవహించేది పరిశుద్ధమైన తరంగాలు మాత్రమే. నా ఉద్దేశంలో పవిత్రత ధర్మం సర్వత్రా వృద్ధిచెందడానికి, ఎటువంటి పరిస్థితులలోను కూడ అట్టి పవిత్ర విధానాలకు అంటిపెట్టుకుని ఉండాలి. ఈ ప్రపంచ వికాసానికి పనిచేసే అట్టి మహానుభావులు తయారు కావాలని నేను ప్రార్థిస్తున్నాను. కాలం మాత్రమే ఫలితాలను వెలుగులోకి తీసుకుని వస్తుంది. భావి ప్రపంచానికి ఉపయోగకరంగా ఉండి సహాయపడే అట్టి మహాత్ములను తయారు చేయడానికి మనం హృదయపూర్వకంగా ప్రయత్నించాలి. కొంతమంది మన నుండి విడిపోయినంత మాత్రాన నష్టమేమీ లేదు. ఎందుచేతనంటే మనతో ఈ స్వల్పకాలం పాటు వారికి ఉన్న సంబంధంలో వారు సంపాదించినది ఈ జన్మలో కాకపోయినా, తరువాతి జన్మలోనయినా అభివృద్ధి చెందుతుంది. ఆవిధంగా మన శ్రమ ఏవిధంగాను వృథాకాదు.

* * *

ఒక మహాత్ముడు తన అత్యున్నత ఆధ్యాత్మిక స్థితిలో కూడ, మానవత్వాన్ని పూర్తిగ తుడిచివేయలేడు. ఎందుచేతనంటే అట్టి పరిస్థితిలో జీవితం అంతమవుతుంది. ఈ మానవత్వ పరిమితి ఎల్లప్పుడు ఉంటుంది. అది ఏదో ఒక పాత్ర నిర్వహిస్తుంది. అది ప్రకృతి రహస్యం.

* * *

‘‘ఆదిత్య వర్ణం తమసః పరస్తాత్’’ యొక్క అర్థాన్ని నాకున్న కొద్దిపాటి శక్తిని అనుసరించి వివరిస్తాను. భగవద్గీత ఎనిమిదవ అధ్యాయంలో 19వ శ్లోకంలో (*కవిం పురాణ మనుశాసితార; మణోరణీయాం సమను స్మరేద్యః । సర్వస్య ధాతార మచిన్త్యరూప; మాదిత్య వర్ణం తమసః పరస్తాత్ ॥*) సమస్త ఉపాసనల లక్ష్యమైన ఆ అనంతత్వం యొక్క తేజో స్వరూపాన్ని శ్రీకృష్ణ పరమాత్మ వర్ణించారు. ఇదే సమస్తం ప్రారంభమైన ప్రదేశము. ఆదిత్య వర్ణంలో ‘‘ఆది’’ అనే మాట దీనిని సూచిస్తోంది. కాని దానికి ఆవల యింకా సున్నితమైన సత్‌తత్వము యొక్క ప్రదేశం ఉంది. దీనినే శ్రీకృష్ణ పరమాత్మ అదే ఆధ్యాయంలోని 20వ (*పరస్తస్మాత్తు భావోఽన్యోఽ వ్యక్తోవ్యక్తాత్సనాతనః । యస్స సర్వేషు భూతేషు నశ్యత్సు నవినశ్యతి ॥*) 21వ (*అవ్యక్తోఽక్షర ఇత్యుక్తస్తమాహుః పరమాం గతిమ్ । యం ప్రాప్య ననివర్తన్తే తద్ధామ పరమం మమ ॥*) శ్లోకాలలో వర్ణించారు. ఇది సమస్త ప్రారంభానికి అతీతమైన ప్రదేశం. మనం సామాన్యంగ అర్థం చేసుకునే భావంలో అక్కడ ఉపాసన కూడ అంతమవుతుంది. ఆ స్థితిని సహజ పద్ధతిలో యింకా రుచిచూడని వారికి ఉపాసనాంతాన్ని గురించి చెప్పడం ప్రమాదకరం కావున వారికి ‘‘ఆదిత్య వర్ణం’’ను పరతత్వ స్థితియని వివరించడం శ్రేయస్కరం.

* * *

ఆయన (భగవంతుడు) ఊహించిన దానికి, కన్నదానికి, విన్నదానికి అన్నిటికి అతీతుడు. ఆయన సృష్టించిన తేజస్సును శబ్దాన్ని దాటిన తరువాత మనం ఆయనను చేరుకుంటాం.

* * *

‘‘అన్న’’ అను పదాన్ని ‘‘ఆన్’’ (अन) శ్వాసించుట అనే మూలం నుండి సంగ్రహించడానికి ప్రయత్నించడంలో నీవొక అతి సున్నిత విషయాన్ని నిరూపించావు.

ప్రకృతి దృక్పథాన్నుండి సత్‌తత్వ పరిణామన్నుండి పదముల ప్రాముఖ్యతను గ్రహించడంలో వ్యాకరణ కర్తలు ఒక్కొక్కప్పుడు విఫలులయ్యారు. వారు గుర్తులకే అమిత ప్రాధాన్యతను యివ్వడం, భాషపైనే తదేక ధ్యాసను కలిగి ఉండడం దీనికి కారణం.

మార్చి 30వ తేదీ రాత్రి నాకొక విచిత్రమైన స్వప్నం వచ్చింది. నాకు జ్ఞాపకం ఉన్నది నీముందుంచుతున్నాను. ‘‘అన్న’’ అనే మాట యొక్క అర్థాన్ని యిది విశదీకరించవచ్చు. బాకుతో నామెడలో గాయం ఏదో విధంగా అయి నేను మరణించాను. నన్ను నదిలోకి విసిరేసారు. శ్వాసలేదు, గుండె కొట్టుకోవడం లేదు. కాని జరిగిన దానిని గురించి నాకు ఎరుక ఉంది. నన్నెవరో చంపేసారని తెలిసి ఒక వ్యక్తి పోలీసులకు తెలుపుదామనుకున్నాడు.

అందుచేత, అతడు నన్ను క్షుణ్ణంగా పరిశీలించాడు. నా నాడిని పరీక్షించాడు. అది ఆగిపోయింది. గుండె కొట్టుకోవడం కూడ ఆగిపోయిందని తెలుసుకున్నాడు. శ్వాస లేనప్పటికి దీనిని అంతటిని కూడా నేనెరుగుదును. అప్పుడు మరల ప్రాణం మెల్లగా రావడం మొదలు అయింది. నాడి కొట్టుకోవడం ప్రారంభమైంది. గుండె తన పనిని తిరిగి ఆరంభించింది. ఆ తరువాత నిద్రనుండి మేల్కొని దీనిని గురించి ఆలోచించడం మొదలెట్టాను. అక్కడ శ్వాస మొదలైన యితర విషయాలు లేనప్పటికి శరీరం నిర్జీవంగా పడి ఉన్నప్పటికి చైతన్యము ఉందనే నిర్ణయానికి వచ్చాను. జీవితానికి మూలకారణం చైతన్యమేనని యిది చూపుతుంది. శ్వాసను గురించిన రహస్యాన్ని పరిష్కరించడానికి నాకు ఈ దృశ్యం కనబడింది.

* * *

ఇతర అనుభవాలు అన్ని నశించినప్పుడు పరతత్వానుభవం ప్రారంభమవుతుంది. మానవ మాత్రుడికి సాధ్యమయ్యేంత మేరకు బ్రహ్మంలో లయావస్థను పొందిన వారు అందులో ఒక్కొక్కప్పుడు పూర్తిగాను, ఒక్కొక్కప్పుడు కొంచెం తక్కువగాను మునిగి ఉంటారు. బ్రహ్మంలో సదా సంపూర్ణంగా లీనమై ఉన్నవారు ఏ పనినైనా చేయగలరు, కాని శిలాప్రతిమవలె కనపడతారు.

* * *

ఆత్మ పరిపూర్ణత్వంలో దివ్య లక్షణాలు పెంపొందుతాయి. దానికి వేరే దానితో సంబంధం ఉన్నట్లయితే అప్పుడు అది సంపూర్ణ శాశ్వత సత్వప్రాప్తికి సిద్ధంగా ఉన్నట్లుకాదు. జరిగిపోయిన దాని స్మృతి తనకు లేదనే ఎరుక దానికి ఉంది. స్వల్పంగా చక్కదిద్దినట్లయితే అది అగోచరమైన విషయాన్ని తెలుసుకోడానికి సహాయపడుతుంది. శాశ్వత సత్వప్రాప్తి శిఖరాగ్రాన ఉన్నప్పటికి కూడ మానవత్వం మిగిలి ఉంటుంది.

* * *

మార్పులేని అచంచల స్థితిలో ఉన్న వ్యక్తి ప్రాపంచిక పరిసరాల వలన నిస్సందేహంగ చలించబడుతాడు. మనిషి శాశ్వతత్వంలోకి పూర్తిగ దాటి వెళ్ళిపోకుండ నిరోధించడానికి స్వల్ప రూపంలోనైన మానవత్వ బంధము తప్పనిసరిగ మిగిలి ఉండాలి. అత్యున్నత సామర్థ్యం కల వ్యక్తి విషయంలో ఒకటి తరచుగా సంభవిస్తుంది. ఎప్పుడైనా ఒక ఆలోచన వస్తే దాన్ని గురించి సంపూర్ణ శక్తితో ఆలోచిస్తాడు. ఫలితంగా దాని తీవ్రత మరింత వృద్ధి అవుతుంది. నిజానికి మన పని నెరవేరడానికి అవసరమయ్యే మేర వరకే మన ఆలోచనను

ఉపయోగించాలి. కుటుంబ భారం మన భుజాలపైన ఉంది కావున ఆందోళన మెల్లగా ప్రవేశిస్తుంది. కాని ఆందోళన అవధులను దాటిందని అనిపించినప్పుడు దానిని తాత్కాలికంగా ఆ సమయానికి విడిచిపెట్టాలి.

* * *

భారతదేశ పరిస్థితి, ప్రపంచ పరిస్థితి కూడ మెరుగు పడుతుందనే ఆశ పూర్తిగా ఉంది. ప్రపంచ మార్పుకై పనిచేస్తున్న ఆ యుగపురుషుడు తన కార్యాన్ని యించుమించు పూర్తి చేసాడు. అది చాలా నెమ్మదిగ భూమికి భౌతికరూపంలో వస్తోంది. అది ఒక్కసారిగా మిక్కిలి వడిగా వచ్చినట్లయితే ఆ యుగపురుషుడు తన పని పూర్తయింది కావున వెంటనే ఈలోకాన్ని విడిచి వెళ్ళవలసి వస్తుంది.

ప్రాపంచిక కష్టాలను గురించి చెప్పాలంటే, భౌతిక రూపాన్ని కల వ్యక్తి ఎవ్వడు వాటినుండి విముక్తుడు కాలేడు. మన అవతారములు కూడ కష్టాల నుండి విముక్తులు కాలేదు. జన్మ జన్మల నుండి మనకు సంక్రమించే కష్టాలను అంతం చేసికోవాలి. కష్టాలతోనున్న వారిని మనతో పోల్చుకుంటే, మన బాధలు తక్కువస్థాయిలో ఉండటాన్ని మనం తప్పక గమనిస్తాం. దానికి కారణం ఏదో లోపల అంతటా ఆవరించి ఉండి మన బాధలు ఉదృతం అయినట్లు అనిపించకుండ చేస్తుంది.

* * *

సమర్థుడైన ప్రశిక్షకుడు (Preceptor) కూడ ధ్యాన సమయంలో ఆలోచనలు అతిక్రమించి వస్తున్నాయని వాపోతాడు. నా గురువర్యులు ఒకానొక రచనలో చెప్పినట్టుగ ప్రాణాహుతి ప్రసారం జరిగేటప్పుడు శిక్షకుడి సూక్ష్మ శరీరం అతడికి తెలిసినా తెలియక పోయినా, అభ్యాసి శరీరంలో ప్రవేశిస్తుంది. అందువలన అభ్యాసికి వచ్చే అలల వంటి ఆలోచనలు అతడికీ వస్తాయని నేను నమ్మకంగా చెప్తాను. అదృష్టవశమున, నీకు చాలా మంచి అభ్యాసీలు ఉన్నారు. కావున నీచపు ఆలోచనలు దుష్ట సంకల్పాలు నిన్ను ముట్టడించవు. దురదృష్టవశాత్తు నేను కొందరు వ్యక్తులకు ప్రాణాహుతిని యిచ్చేటప్పుడు నాలో వెగలు కలిగించే భావాలు కలగడాన్ని నేను గమనించాను. అప్పుడు నేను వారిని సంస్థ సభ్యులుగ స్వీకరించడానికి నిరాకరించాను. ఇంకొక వ్యక్తి విషయంలో అతడికి నేను ప్రాణాహుతి యిచ్చినప్పుడు అతడు వేశ్యాలోలుడు కావున నాకు దిగంబర స్త్రీల దృశ్యాలు రావడాన్ని గమనించాను. అందుచే నేను అతడిని మన సంస్థలోకి చేర్చుకోలేదు. గురువర్యులు కూడ రెండు సందర్భాలలో అటువంటి అనుభవాలనే చూడడం

తటస్థించింది. సమర్థుడైన ప్రశిక్షకుడు (Preceptor) తనలో అటువంటి ఆలోచనలు కలగడాన్ని తగ్గించదలుచుకుంటే ప్రాణాహుతిని ప్రసారం చేసేటప్పుడు అభ్యాసి వ్యక్తిగత మనస్సును అటువంటి క్రియాకలాపాన్ని ఆపివేసామని సూచనను యివ్వవచ్చు. దానికి కారణాలు ప్రశిక్షకులు (Preceptors) తమ వ్యక్తిగత మనస్సు సహాయంతోనే అభ్యాసీలను గురించి అనేక విషయాలు తెలుసుకుంటారు.

* * *

దయాళుశక్తి (grace) పై నుండి శిక్షకుడి ద్వారా వస్తుంది. ఆ కారణంగ అభ్యాసీలకు ఒక్కొక్కప్పుడు మహోన్నత స్థితులు అనుభవానికి వస్తాయి. శిక్షకుడు తనకు తెలియకుండానే కూడ చాల ఉన్నత స్థితుల నుండి ప్రాణాహుతి ప్రసారం చేయడం కూడ జరుగుతుంది. సునిశితులైన అభ్యాసీలు ఆ ప్రభావాన్ని గుర్తిస్తారు.

* * *

ప్రియ సోదరా, నా అభ్యాస కాలంలో నేనెంతో తాపపు మంటలతో బాధపడ్డాను. దాని ఫలితంగా నా హృదయం అంతా కాలిన గాయాలే ఉన్నాయి. కాని అవి పూలతోటలు గాను, అగ్ని పుష్పాలుగాను అయినాయి. నేను శాంతిని విక్రయించి ఆధ్యాత్మిక రంగంలోకి వచ్చాను. అంటే దాన్ని పొందడానికి శాంతిని త్యాగం చేసాను. సాధకుడు ముందుకు పురోగమించడానికి ''బార్జక్''లలో (మధ్యనున్న ప్రదేశాలు) కొంతకాలం ఆగవలసి ఉంటుంది. అటువంటి బార్జక్‌లు (మధ్యనున్న ప్రదేశాలు) ఎన్ని ఉన్నాయో ఆ దైవానికే తెలియాలు. బార్జక్‌ల (మధ్యనున్న ప్రదేశాల) స్థితులను గురించి నేనొక ఉత్తరం వ్రాసాను. దాన్ని నువ్వు శ్రద్ధగా పరిశీలించు, అందులోని విషయాల గురించి నాకంతగా గుర్తులేదు. ప్రియ సోదరా ఒకానొక వ్యక్తి నుండి నిజమైన ఆధ్యాత్మిక లాభాన్ని పొందగలమనే నిజం అనుభవానికి వచ్చినప్పుడు తనకుతానుగా ఆ వ్యక్తి ఆధీనానికి ఒప్పగించుకోవాలి. ఇక్కడ మనం కేవలం ఒక జీవితంలోనే ముక్తిని పొందాలి కావున సంస్కారాలు అన్నింటిని, అందులో కొన్నింటిని భోగాన్ని అనుభవించడం ద్వారాను, మిగిలిన వాటిని దగ్ధం చేయడం ద్వారాను వదిలించుకోవాఆలి. సంస్కార భోగ పరంపర ఒకటి శ్రీ 'x'పై వచ్చిపడింది. నేను దాన్ని గమనించాను. కాని దానికి యిదే కాక ఇతర కారణాలు కూడా వున్నాయి. అతడు కూడ ఆ అనుభూతిని పొందగలడనే ఉద్దేశంతో నేను వాటిని గురించి అడగతలచాను. అతడిని సంతృప్తి పరచుటకు గురువర్యులను ప్రార్థించడం ద్వారా నేను వాటిని తొందరగా క్షాళన చేయవలసి వచ్చింది. లేనట్లయితే అతడి ప్రయోజనం

కోసమే అతడిని అక్కడే ఉంచదలచాను. ఏమైనప్పటికి అటువంటిది మున్ముందు జరుగకుండునట్లు దయచేసి ప్రార్థించు.

దేహ నిర్మాణాన్ని క్షాళనం చేయడానికి అనేక నెలలు తీసుకుంటుంది. శ్రీ 'y' కు పెద్దగ అనుభవం కలుగకపోవడానికి కారణం యిదే. మనిషిని సరిదిద్దడానికి ఈ నిర్మలీకరణం తప్పనిసరిగా అవసరం. నా దృష్టి ఎల్లప్పుడు దీనిపైనే ఉంటుంది. పూజ్య లాలాజీ వారి ఆదేశం కూడ యిదూ. శ్రీ 'x' సహజంగ ఎక్కువ పరిశుద్ధంగా ఉన్నాడు. అందుచేతనే అతడు అతి తొందరలో లాభాన్ని పొందాడు.

* * *

ప్రియ సోదరా, ప్రతి ఒక్కరిని పవిత్ర మార్గానికి తీసుకురావడం వంటి అన్ని పనులను విశిష్ట యుగపురుషుడు (Special Personality) చేయగలడని నేను భావించడం లేదు. శ్రీకృష్ణ పరమాత్మకు కూడ దుర్యోధనుడి మనస్సును సక్రమంగ మార్చడం సాధ్యంకాలేదు. అటువంటి వ్యక్తులు అనేకులు అప్పుడున్నారు. చివరకు ఆయన మహాభారత యుద్ధాన్ని తీసుకురావలసి వచ్చింది. ఇప్పుడు కూడ యుద్ధాలు, రక్తపాతం వలన ప్రపంచంలో ఎక్కువ భాగం నిర్మానుష్యం కావడానికి అవకాశం ఉంది. శ్రీకృష్ణ పరమాత్మ భక్తులు మాత్రమే ఆయన వలన లాభం పొందగలిగారు. అందుచే విశిష్ఠయుగ పురుషుడే ప్రజలను ఆధ్యాత్మికత వైపు మారుస్తారని శ్రీ 'x' చెప్పడం సరికాదు. విశిష్ట యుగపురుషుని వలన మనం లాభం పొందవచ్చునని నీవు యిచ్చిన సూచన ఎంతో సమంజసమైనది.

* * *

సామాన్య నియమానుసారంగ ఏవిధమైన సంకల్ప ప్రయత్నం లేకుండానే కాంతి దానంతటదే ప్రవహించాలి. ప్రజలను తమకు తెలియకుండానే ఒక వ్యక్తి నుండి ఆధ్యాత్మిక లాభాన్ని పొందనారంభించినప్పుడు, అతడు శిక్షకుడుగా చేయబడుటకు అర్హుడు.

* * *

ధ్యానం చేసేటప్పుడు నీకు నీవే శ్వాసను ఆపివేయనవసరం లేదు. అదంతట అదే ఆగిపోతే మంచిదే. ఆధ్యాత్మిక యాత్రలో చాల ఉన్నత స్థితులలో విహరించేటప్పుడు గంటల తరబడి కూడ శ్వాస ఉండకపోవడం తరచు సంభవిస్తుంది. భావరాహిత్యం ఏర్పడినప్పుడు శ్వాస తగ్గుతుంది.

* * *

ఏది నెరవేరడం వలన హృదయానికి ఆనందం కలుగుతుందో, ఏది నెరవేరక పోవడం వలన విచారము, దుఃఖము, బాధ కలుగుతాయో అది కోరిక అనబడుతుంది. దానిని అనుభవించి ఆనందించేది నీవు మాత్రమే, దానికి కర్త కూడ నీవే. కర్తవ్య బాధ్యత అంటే ఏ ఉద్దేశంతోను నిమిత్తం లేని ఆజ్ఞాపాలనే. ఘజనీ మహమ్మద్‌కు ఆయాజ్ అనే బానిస ఒకడుండే వాడు. అతడిని ఘజనీ మహమ్మద్ ఎక్కువగా ప్రేమించేవాడు. చక్రవర్తి యొక్క ఈ ప్రవర్తన ఆయన ఆస్థానంలో యితరులకు నచ్చలేదు. "ఆయాజ్‌ను అంతగా ఎందుకు ప్రేమిస్తారు?" అని ఎవరో చక్రవర్తిని అడిగారు. కొంత సమయం దాటిన తరువాత చక్రవర్తి తన ఆస్థానంలో ఉన్న ప్రతి ఒక్కరిని భారతదేశం నుండి తను తీసుకువచ్చి దర్బారు భవనంలో పైనుండి వ్రేలాడగట్టిన ఎంతో ఖరీదైన వజ్రాలవృక్షాన్ని తునాతునకలు చేయమని ఆజ్ఞాపించాడు. కాని అతడి ఆస్థానంలో ఎవ్వరు కూడ దానిని ముట్టుకోలేదు. అప్పుడు చక్రవర్తి ఆయాజ్‌ను పిలిచి ఆ వజ్రాల వృక్షాన్ని ముక్కలు ముక్కలుగా చేయమని ఆజ్ఞాపించాడు. వెనువెంటనే ఆయాజ్ తన ప్రభువాజ్ఞను శిరసావహించి దానిని తునాతునకలు చేసాడు. "నేను ఆయాజ్‌ను ఇందుకు మాత్రమే ప్రేమిస్తాను. అతడు నా ఆజ్ఞను శిరసావహించడం తన కర్తవ్యంగా భావించి లాభనష్టాలను గురించి ఎన్నడు విచారించలేదు" అని చక్రవర్తి తన ఆస్థానంలోని వారికి చెప్పాడు. అందుచేతనే కర్తవ్యాన్ని కోరిక అని అనడానికి వీలులేదు.

* * *

తర్కం ద్వారా సత్‌తత్వాన్ని చేరుకోవడం అసాధ్యం. వాస్తవానికి సత్‌తత్వము భావాతీత ప్రజ్ఞకు సంబంధించిన (వాజ్‌దాని) విషయం. ఇది పూర్తిగ నిజం. సూఫీలు (ముస్లిం తత్త్వవేత్తలు) సహజ జ్ఞాన స్థితియైన "వాజ్‌దాని"నే నిజస్థితి అని భావిస్తారు. కాని మన తాత్వికులు దీనికన్నా యింకా ముందుకు వెళ్ళారు. "వాజ్‌దాన్" అనేది ఎట్లయినను భౌతిక పదార్థంతో సంబంధం ఉంది. దానిలో "నేను" అనే భావం దాగి ఉంది. వాస్తవానికి దీనికి అతీతంగా ఉన్న స్థితినే నిజస్థితి అని అనాలి. తర్కజ్ఞానం దాన్ని చేరడం సాధ్యం కాదు. వ్యక్తిగత మనస్సు నుండి వ్యక్తిగత అస్తిత్వం వెడలి పోయినప్పుడు కేవలం మనస్సే మిగిలి ఉంటుంది. అదొక్కటే ఉంటుంది. అప్పుడు దాన్ని మహత్ అని అనవచ్చు. కేవలం అది మాత్రమే ఆత్మయొక్క యదార్థ స్థితిని దృష్టికి తీసుకు వస్తుంది. నీవు ఆ రెండవ విషయానికి ఎంతమేరకు ప్రాధాన్యతను యిస్తావో అంతవరకు తర్కం వెళ్ళగలదు.

* * *

నా సత్సంగీకులు నాకంటె ముందుకు పురోగమించాలని నా మనఃపూర్వక అభిలాష. కాని ఇదంతా వారి ప్రేమ, కృషి ఈ రెండిటిపైనా, మరియు దైవానుగ్రహంపైనా ఆధారపడి ఉంటుంది. ప్రేమ, కృషి ఉన్నప్పుడు వాటిని జోడించి కదులుతాము. ఈ రెండింటితో మనం కదిలినప్పుడు వచ్చే గలగల శబ్దం తప్పక గురువర్యులకు వినబడుతుంది.

* * *

నిరీక్షించడం కూడ ఒక విధంగా తీవ్రమైనట్టి స్మరణే. అది ఆధ్యాత్మికతకు మిక్కిలి ప్రయోజనకరమైనట్టిది. "ప్రేయసి కోసం నిరీక్షించడంలో నేను కనుగొన్న ఆనందాన్ని కలయికలో పొందలేకపోయాను" అని ఒక కవి కూడ వ్రాసియున్నాడు.

* * *

పూర్వాచారవైదిక సాంప్రదాయం తన ఎదుటనే కట్టుకున్న అడ్డుగోడ వంటిదని, దానివలన దారి మూసి వేయంబడుతుందని నా అభిప్రాయం. ఇది ఏదో విధంగా ప్రవేశిస్తుంది. ఎంతోకాలంగా ముస్లింలను గమనిస్తూ ఉండటం వలన యీ లోపం మనలోకి ప్రవేశించింది. అట్లు కాకున్న ఏ ఒక్క అణువు కూడ మనకుండిన నదీ ప్రవాహాన్ని అడ్డుకోలేదు.

* * *

ఈ విషయాలు ఏదో ఒక సమయంలో బుద్ధిపై తమ ప్రభావాన్ని తప్పక కలిగి వుంటాయి. అట్లు కాకుండ ఉండటం అనేది అసంభవం. ఉప్పుగనిలోకి ఏది వెళ్ళినా అది ఉప్పుగా అవుతుంది. మన దేశంలో కొన్ని ప్రాంతాలలో నీవు మేధావి వర్గాన్ని కలుసుకునే ఉంటావు. వారు తమ భావాలనే ప్రేమిస్తారు.

* * *

నేను పరతత్వస్థితిని గురించి వ్రాస్తే, శాస్త్రవేత్తలు బహుశః నాపై విరుచుకుపడతారు. పరతత్వం అవధిని గురించి వివరించడం మహా కష్టం. అయినప్పటికి నేనిది మాత్రం వ్రాస్తాను. అభ్యాసతనను, దైవాన్నీ కూడ మరచినప్పుడు అతడు మరల తిరిగి ఎన్నటికి యీ ప్రపంచంలోకి ఏ రూపంలోనూ రాలేడు. ఆ స్థితిలో అతడొక మహాసముద్రంలో మునిగి ఉంటాడు. అతడికి "అది" తప్ప వేరేదీ ఉండదు. దానికి ముందు ఆ మరో ప్రపంచం కొరకు తన ప్రపంచాన్ని త్యాగం చేసి ఉండేవాడు. ఇప్పుడు ఆ మరో ప్రపంచాన్ని కూడ త్యాగం చేయగలిగితే కేవలం సత్ తత్వమే మిగి ఉంటుంది.

* * *

ప్రియురాలు ప్రేమికుడిని తన యిష్టం వచ్చినట్లుగ కదిలేటట్లు చేయగలదు. కదలడం కూడ ప్రియురాలే ప్రేమికుడికి నేర్పుతుంది. ఆ కదలికకు ప్రేరణను కూడ ప్రేమికుడు ప్రియురాలి నుండే గ్రహిస్తాడు. అందుచే, నేను దేనిలో బయలుదేరానో ఆ ఉద్యమం కనుక సరైనదే అయితే నీయొక్క ప్రశంసను అందుకుంటుంది. అదే కనుక సరైనది కాకపోతే నీకు నీవే ద్రోహం చేసుకున్నట్లు అవుతుంది. ఇప్పుడు దీనిని నీవు విశాల దృష్టితో ఆలోచిస్తే, ఆయన నుండే యీ కదలికను మనం స్వీకరించినామని నీకు అర్థం అవుతుంది. ఆయన స్మరణ భక్తుడిలో తీవ్రమైన నిర్విరామతను రేపుతుంది.

* * *

సృష్టి సమయంలో ప్రతీది సరైన పరిమాణంలో లభ్యం కాలేదు. అందుచే ప్రతీది తన యదార్థ స్థితిని ప్రతిబింబిస్తూ ప్రత్యక్షమైంది. ఎదురుగా నది ఉంది. ఎటువంటి రేణువు కూడ దృష్టికి అడ్డుతెరగా ఏర్పడలేదు.

* * *

మొదటిగా నీవు చేస్తున్నదే సతత స్మరణ. రెండవది, మొదడు అలసిపోయినప్పుడు "దాని" స్మరణ అదే ప్రభావాన్ని కలిగిస్తుంది. విముక్తి పొందడమే మన లక్ష్యం. ఆంతరంగిక స్థితి ఒకే విధంగా ఉండటం లేదని, ఒక్కొక్కప్పుడు ఎంతో సూక్ష్మంగాను, తేలికగాను, ఒక్కొక్కప్పుడు దానికి భిన్నంగాను ఉంటోందని వ్రాసావు. ఇది ఆవిధంగా జరుగుతూనే ఉంటుంది. తేలికతనం, బరువు పరస్పర వ్యతిరేకాలైన యీ స్థితులు దృష్టికి రానట్లయితే, అత్యంత సూక్ష్మస్థితి అయిన ఆ శాశ్వతస్థితిని (Changeless State) గుర్తించడం వీలుకాదు. ఇదేకాక, మనం ఉన్న ప్రస్తుత సూక్ష్మస్థితి నుండి ఆ తరువాత స్థితికి పురోగమించునప్పుడు బరువుతనాన్ని అనుభవించడం జరుగుతుంది. దాని ప్రభావం తొలగిపోయి అటు పిమ్మట సూక్ష్మస్థితి ప్రవేశించే సమయం వరకు ఆ బరువుతనం అట్లాగే ఉంటుంది. ఆపైన మరే స్థితులు లేని స్థితికి మనం వచ్చేవరకు యీ పరంపర కొనసాగుతూనే ఉంటుంది. అందుచేతనే ఆ విషయాలన్నీ నీవు సాధించిన ప్రగతి స్థితిని తెలుపుతున్నాయని నీవు యీపాటికే అర్థం చేసికొని ఉంటావు.

* * *

"మీరు నాకేది ముఖ్యంగా అవసరమని భావిస్తారో దానినే నాకు ప్రసాదించండి" అని వ్రాసావు. అంతేకాక "మీరు తప్పక నాకు ప్రసాదిస్తారని ఆశిస్తున్నాను" అని కూడ వ్రాసావు. నేను నీవాడనైనప్పుడు నా సర్వస్వం నీదేనని దీనికి నేను లౌకికంగా సమాధానం

యిస్తాను. నా అసలు కోరిక కూడ నేను అమ్ముడు పోవాలనే. కాని నన్ను కొనే వారెవరు ముందుకు రావడం లేదు. దీనికి కారణం నాకెటువంటి ధరను నేను నిర్ధారించక పోవడమే. నాకెటువంటి వెల లేకుండ ఉచితంగానైనా సరే నన్ను స్వీకరించడానికి ఎవ్వరు యిష్టపడరు. కాలం ఆ విధంగా ఉంది. ఇది కూడ ఒక రకంగా నయమే. ఎముకల గూడును ఎవరేం చేసుకుంటారు? ఓ నానక్! ముసలి ఎద్దును పోషించి తిండిపెట్టే వారెవరు?'' కావున ప్రియసోదరా! ఇంటింటికీ తిరుగుతూ నన్ను నేనే అమ్మజూపుకునే పరిస్థితి లేకుండ చేయడానికి దయుంచి నన్ను కనుక్కోవడానికి నీవు సిద్ధం కావాలి.

ప్రియ సోదరా, ఆరోగ్య ఐశ్వర్యాలు కావాలనే కోరిక ప్రతి ఒక్కరికి కొంతవరకు ఉంటుంది. నిస్సందేహంగా యిది వాస్తవం. కాని నీవు కాంక్షించేది నీ ఒక్కడికే చెందింది. నీతోనే ఉంది కూడ. అందుచేతనే దాని కోసం నీవు ఎక్కువగ తపన పడుతున్నావు.

* * *

సున్న (శూన్యం) యొక్క అర్థం ఇతరులకు తెలిసినంతగా నాకు తెలియక పోవడం అనేది సాధ్యమే. ఎందుకంటే సున్న మరొక సున్న యొక్క స్థితిని తెలిసికోలేదు. అదేవిధంగ మృతి చెందిన వాడు శవం యొక్క స్థితిని తెలిసికోలేడు. ఒక విధంగా దాన్ని సమస్త ద్వంద్వాలు అదృశ్యమై మనం జీవస్మృతుల వలె తయారైన స్థితిగా చెప్పవచ్చు. లేదా, సమస్త విచక్షణా జ్ఞానాన్ని కోల్పోవునంతగా మనం సత్ తత్వంలో లయమైపోతామని చెప్పవచ్చు సత్‌కు, దాని అనుకరణకు మధ్యగల తేడాను తెలిసికోము.

* * *

శ్రద్ధను ఏవిధంగా పెంపొందించుకోవాలని నీవడిగావు. శిక్షకుడిలో కొంత నమ్మకాన్ని ఉంచి అతడి వలన కొంత లాభాన్ని పొందినట్లైతే నిజమైన అన్వేషకుడి హృదయంలో ఇది శ్రద్ధగా వృద్ధి చెందనారంభిస్తుంది.

"బుద్ధి అనుభవం రెండూ ఎన్నడూ ఒకటి అవుతాయి?'' అని చాలా చిక్కు ప్రశ్న వేసావు. "లైలా, మజ్ను యిద్దరు ఒకే చోట నివసిస్తున్నారు'', అనేదే సంక్షిప్తంగా దానికి సమాధానం. (బహం లైలా వ మజ్ను ఏక్ హై మెహమిల్ మె రహతే హై).

వారి కలయికను దేహాత్మల కలయిక గాను మనస్సు, బుద్ధిల కలయికగాను భావించవచ్చు. రెండు యించుమించు తప్పనిసరిగా కలిసి వుంటాయి కొంచెం ముందుకు పోతే బుద్ధి వేరే రూపాన్ని దాలుస్తుంది. దానినే దివ్యజ్ఞానమని అంటారు. ఇది జరిగినప్పుడు అనుభవ స్వరూపం కూడ మార్పు చెందుతుంది. అనగా అనుభవం కూడ దానిని

అనుసరించి ఉండడం ప్రారంభిస్తుంది. ఒకటి చూపేది, రెండవది తెలిపేది. నేనింకొకటి కూడ చెబుతాను. అనుభవానికి ఆత్మతో అతి సన్నిహిత సంబంధం ఉంది. బుద్ధి అనుభవంతో సాన్నిహిత్యాన్ని కలిగి ఉంటుంది. వేరు మాటలలో చెప్పాలంటే అనుభవం ఆత్మకు సన్నిహితమైనట్టిది కాగా బుద్ధి అనుభవానికి సన్నిహితంగా ఉంటుంది. ఈ రెండింటిలో ఏదీ నిన్ను వదలిపోదు. కాని వాటిని సక్రమంగా వినియోగించుకోవడం ప్రారంభమౌతుంది. నీ సతత స్మరణ బుద్ధికి సంబంధించినది కాదు హృదయానికి సంబంధించినది. దయచేసి బుద్ధి అనుభవాల గురించి పండితులనే అడిగి వారిని వేధించు. వారు మంచి సమాధానాన్ని యిస్తారు. నాది పామరుడు యిచ్చే సమాధానం. సతత స్మరణ అనుభవానికి వచ్చేది కాదు. అది మనం చేయవలసినట్టిది. దానికి పద్ధతి నీకీ పాటికే తెలుసు.

* * *

నిజం చెప్పాలంటే ప్రతి ఒక్కడు మూడు విధాలైన ఋణాలను తీర్చవలసి ఉంటుంది. నీవు కూడా యీ ఋణాలను తీరుస్తున్నావు. సోదరా, "ఋషి ఋణము"కు బదులు "గురు ఋణము" అనే మాటలను ఉపయోగించడానికి యిష్టపడతాను. నేను యీ ఋణాన్ని తీర్చాలని అభిలషిస్తున్నాను. నా గురువర్యులు నన్ను తయారు చేసిన విధంగ నేను కూడ ఒక వ్యక్తిని ఆ విధంగా తయారు చేయగలిగినప్పుడు మాత్రమే యిది సాధ్యమవుతుంది. కాని ఆ ఋణాన్ని తీర్చడం కూడ నిజానికి నా గురువర్యుల చేతుల్లోనే ఉంది.

* * *

ఈ ప్రాపంచిక జీవితంలో ప్రతి ఒక్కరు వైఫల్యాన్ని పొందడం సహజం. నీ జీవితంలో నీకిదే జరిగింది. నీవు దేనిని ప్రేమికుడైన దైవం నుండి వచ్చిన కానుకగ భావింపలేకపోతే పిశాచం వంటి క్షుద్రశక్తి నుండి వచ్చిందనుకో. అప్పుడు నీకు కొంత ధైర్యం వస్తుంది. దైవానుగ్రహంచే ఆ భారం తొలగిపోతుంది. అది బహుశః యీ పాటికే తొలగిపోయి వుండాలి.

ఇస్లాం మతం ప్రకారం మనం 'ఏడమ్' (Adam) యొక్క సంతతని వారము. భగవంతుడు నిషేధించిన ఫలాన్ని తినడం వలన అతడు యీ భూమిపైకి తోసివేయబడ్డాడు. సహజంగా, యిదే మనందరిలోను జరిగి ఉండాలి. కాని సోదరా! యీ సంఘటన జరిగిన తరువాత కోట్లాది సంవత్సరాలు గడిచాయి. దాని ప్రభావం నీ రక్తంలో ఇప్పుడు

ఏవిధంగా ఉండగలదు? రక్తంలో కలసిపోవడం వలన ఆ ప్రభావం పోయింది. కాని ఏడమ్ భార్య 'హవ్వ' మనల్ని వెంటాడడం మానలేదు. తరతరాల నుండి ఆమె ప్రత్యక్షమవుతూనే ఉంది. ఈ "హవ్వే" స్వస్థలం నుండి స్వర్గానికి మనల్ని తీసికొని వచ్చింది. ఆమె తన పదాలతో తన్నడం వలన మనం యీ భూమిపై పడటం కూడ జరిగింది. సోదరా, ఎంత దిగజారినాము! మనం యిప్పుడు యీ 'హవ్వ' వెంబడి పరుగెత్తడం మానేసినట్లయితే మరొకసారి మనం పోగొట్టుకున్న స్వర్గాన్ని తిరిగి పొందుతాం. నీవే "ఏడమ్" అనే భావాన్ని మరచిపో. అప్పుడు చూడు. నీవెక్కడి నుండి వచ్చావో ఆ అసలు స్వగృహాన్ని చేరుతావు. మన హిందూ పురాణాలతో మనువు, శత రూపల కథలకు, ఏడమ్, హవ్వల కథకు సారూప్యత కనబడుతుంది. నీవే 'ఏడమ్' అనే భావాన్ని మరచిపో. 'ఈవ్' నుండి నిన్ను విముక్తుడ్ని కావించడం నా బాధ్యత. "ఏడమ్" అనే భావాన్ని వదలించుకోడానికి నీవు రూపం పై ధ్యానం చేస్తున్నావు. గాలిబ్ యీ విధంగా వ్రాసాడు.

"అక్కడ ఏదీ లేనప్పుడు, దైవం ఉన్నాడు. నేనిది కాకుండ వుండినట్లైతే, దైవమే అయ్యుండే వాడిని. ఈ పరిణామం నన్ను పతనం చేసింది. నేనే లేకుండినట్లయితే ఏమి జరిగి ఉండేదో?".

* * *

ప్రేమలో మందలింపులను కూడ సహిస్తాం. కాని ప్రియసోదరా, ఆ మందలింపులలో ఒక వింత మాధుర్యం ఉంది. ఆ మందలింపులు కూడ ప్రేమ మైకంలో ఉన్నప్పుడు మాత్రమే రాగలవు. అటువంటి మందలింపులో జారత్వం కాని, నీతి బాహ్యత గాని ఉండదు. ప్రసిద్ధి చెందిన సూరదాస్ పద్యాన్ని నేను వ్రాస్తాను. అతడు కృష్ణుడు పై ప్రేమతో ఆ పద్యాన్ని పాడాడు. "నేను బలహీనుడనని తలచి నీవు నాచేతి పట్టు నుండి తప్పించు కుంటున్నావు; కాని నా హృదయం నుండి బయటకు వెళ్లగలిగినప్పుడే నీవు నిజమైన మగాడివని భావిస్తాను." అతడు గ్రుడ్డివాడు కావడం చేత ఒక బావిలో పడ్డాడు. అప్పుడు దీన్ని వ్రాసాడు. శ్రీకృష్ణ పరమాత్మ అతనిని బయటకు తీసికొని రాగా, కృష్ణుడి చేతిని పట్టుకొని ఆయనను వెళ్లనీయనని అన్నాడు. కాని కృష్ణుడు అతడి పట్టునుండి విడిపించుకుని, పారిపోవడం జరిగింది.

అందరు తప్పులు చేస్తారు. తప్పు చేయడం మానవ సహజం. ప్రియసోదరా, నా గురువర్యులు నాతో యీ విధంగ అన్నారు. "ఇతరులు చేసిన తప్పులన్నింటిని క్షమిస్తాను కాని నీది ఒక్కటి కూడ క్షమించను," అని. ఈ ప్రత్యేక ఆదరణ ఆయనకు గల విశిష్ఠ ప్రేమవలనేనని, అదెంత మాత్రం సందేహం లేదని నేను ఆనందించాను. దీనికొక కథ

వుంది.

మజ్ను తన ప్రియురాలు లైలాతో ఎడబాటు కారణంగా శరీరానికి బూడిద పూసుకొని భిక్షాటనకు బయలుదేరాడు. ప్రతి గురువారం లైలా పేదలకు రొట్టెలు పంచి యిచ్చేది. మజ్ను కూడ తన వద్దకు భిక్షాపాత్రతో రావాలని ఆమె అసలు ఉద్దేశం. ఆమె అతడికి రొట్టెను యివ్వడానికి బదులుగ అతడి పాత్రను పగులగొట్టేది. ఆమె ప్రవర్తనకు మజ్ను మత్తెక్కిన ఆనంద పారవశ్యంతో నాట్యం చేసేవాడు. ''నువ్వెంత మూర్ఖుడవు! ఆమె అందరికి రొట్టెను యిస్తూ, నీ పాత్రను పగుల కొడుతున్నప్పటికీ నువ్వు వెర్రి ప్రేమలో పడి నాట్యం చేస్తున్నావు.'' అని అక్కడి వారు అతనితో అనగా ''ఈ దరణ నా ఒక్కడికి మాత్రమే. ఇదే ఆమె ప్రేమలోని విశిష్ఠత'', అని అతడు సమాధానం చెప్పాడు.

* * *

ఈ సారి పెద్దగా ప్రయోజనాన్ని పొందలేక పోయితిననే నీ ఆలోచన నీ ఆధ్యాత్మిక తృష్ణ ఎంతో పెరిగిందని చూపుతోంది. రూపంపై ధ్యానం చేయలేక పోతున్నానని అనిపించినప్పుడు, ఆ రూపం నీ ముందరే ఉందని ఊహించు. ఇది కూడ చేయలేక పోయినప్పుడు ఆ ధ్యాన విధానం తానంతటదే నీకు వెల్లడవుతుంది.

* * *

ఫకీరు ఎప్పుడు కదులుతూనే ఉండడం మంచిది. నువ్వు ఎక్కడా ఆగిపోవలసిన అవసరం లేదు. నీ అంతిమ స్థితి కేవలం ''అక్కడే''. దానిని చేరుకునే ముందు ఆనందం కూడ వదలి వెళ్ళిపోతుంది. అక్కడ స్థితి ఎలా ఉంటుంది? దానిని అజ్ఞానమని అందామంటే, అది కూడ మనల్ని విడిచిపోతుంది. దానిని తెలియజేయగల పదం మాత్రం ఒకటి ఉంది. అది ''పరిపూర్ణ అజ్ఞానము'' లేక ''అజ్ఞానత''. నేను దీనినే శాశ్వత స్థితి అంటాను. యదార్థానికి ఇదే 'సత్' తెర. ఆధ్యాత్మికత అప్పటికి ఎలాగూ తొలగిపోయి ఉంటుంది. ఇదే సమస్త కృషి, శ్రమల సారమని చెప్పవచ్చు. అందుచేతనే, ప్రియసోదరా, యీ విషయాన్ని ఎన్నడు ప్రజలు కాంక్షించలేదు. అట్లు కానట్లయితే దీనినప్పటికే పొంది ఉండేవారు. దాన్ని గురించిన సరైన అభిప్రాయం ఎవ్వరికీ లేనప్పుడు దానిని కాంక్షించేవారు మాత్రం ఎవరుంటారు? దానిని ప్రజల దృష్టికి తీసికొని వచ్చిన వారు నా గురువర్యులు. ఆయనకు ధన్యవాదాలు. ''పరిపూర్ణ అజ్ఞానము'' (అజ్ఞానత) అనే పదాన్ని అవును, కాదు అను వాటికి మధ్యనున్నది ఏదో ''అదే''ననే భావంలో తీసికోవచ్చు. ఇది కబీరు అభిప్రాయం. ఇప్పుడు నేనసలు విషయానికి వస్తాను. వాస్తవానందం అనేది ఆనందం లేనటువంటిది.

అనందానుభూతి ఉన్నంతవరకు దానిలో మాయ (భౌతికత్వం) యిమిడి ఉంటుంది. నీ ఆనంద స్థితి భారంగా ఉందని చెబుతున్నావు. అనగా నీ సంబంధం కేంద్రంలో (లేక అజ్ఞాన కేంద్రంలో) కలుపబడిందని ఇది నిరూపిస్తుంది. అది పరిమితి కారణంగానే జరుగుతుంది. దాన్ని భారం అనడం కన్న విసుగు అనడం మిరంత ఔచిత్యంగా ఉంటుంది. నువ్విప్పుడు బాగా ఎత్తైన ప్రదేశంలో సంచరిస్తున్నావు కావున నీకు ఆహ్లాదకరమైన పిల్లవాయువు కావాలి. విసుగు అంటే అర్థం అదే. శాంతి ఎన్నటికి నిరుత్సాహపరచదు. దానికి కారణం పైన తెలిపాను. రెండు కళ్ళూ పోవడానికి బదులు ఒక కన్నునే పోగొట్టుకున్న వాడు అదే మేలని భావించి యిష్టపడతాడు. గుడిసెలో నివసిస్తున్న వానికి అదృష్టవశాన ఒక మంచి సౌఖ్యమైన గృహం లభించినపుడు అతడు దాన్నెంతో యిష్టపడతాడు. కాని చాలాకాలం ఆ యింట్లో నివసించిన తరువాత దానికి అలవాటుపడినప్పుడు దాని కన్న కూడ మేలైన గృహాన్ని గురించి ఆలోచించనారంభిస్తాడు. నువ్వెందుకు విసుగును, మందకొడితనాన్ని అనుభవిస్తున్నావో తెలియ జెప్పడానికే యీ వివరణంతా. “ఈ స్థితినుండి బయటపడాలని నా మనస్సు కోరుతున్నట్లనిపిస్తోంది; అందుచేతనే నా మనస్సు యింకా సంసిద్ధంగా లేకపోయి అయినా ఉండాలి లేదా అది నిజమైన, ప్రశాంతత, ఆనందాల స్థితులు కాకపోయి ఉండాలి.” అని వ్రాసావు. మనస్సు సహజలక్షణం, మంచి విషయాలన్నీ అనుభవించడమే. అది భౌతికమైనది కావచ్చు; ఆధ్యాత్మికమైనది కావచ్చు. అందుచే దాని దృష్టికి వచ్చేది ఏదైనప్పటికి ప్రశాంతత కాని, ఆనందం కాని దానితో అనుబంధాన్ని కలిగి ఉంటుంది.

* * *

నీకు పద్ధతిని చూపించాను. కాని దాని చికిత్సకు అనేకమంది వైద్యులున్నారు. అటువంటప్పుడు మిక్కిలి అరుదైన ప్రత్యేక సందర్భాలలో తప్ప మనకు దానితో ఎటువంటి పని ఉండకూడదు. నీకు ఉన్న పని ఏవిధంగాను తక్కువనది కాదు. అదింకా ఎక్కువగా పెరిగే సావకాశం ఉంది. నీవు దైవదూత (మెస్సయ్య)వు కావాలని అభిలషిస్తున్నందులకు నేను నిజంగా ఆనందించాను. కాని నీవు అట్లు కాబోయే ముందు మొదట నీలో నువ్వు వేదనను సృష్టించుకోవాలి.

* * *

సాధకుడు తన సంకల్పాన్ని గురువు యొక్క సాహసంతో దృఢంగా కలుపుకోవాలి. శ్రద్ధ అంటే అర్థం అదే.

* * *

నేను యిచ్చేది నిజమైన వజ్రం మాత్రమే. నగల వ్యాపారి మాత్రమే దానిని పరీక్ష చేయగలడు. అద్దాల వ్యాపారి వజ్రపు విలువను తెలుసుకోనట్లయితే ఆ తప్పు వజ్రానిది కాదు. "గబ్బిలం సూర్యుణ్ణి పగటిపూట చూడలేనట్లయితే, అది సూర్యుడి లోపం వలన కాదు." అని ఒక పర్షియను పద్యం చెబుతుంది. ఒక వస్తువు వలన యితరులు అనేకులు ప్రయోజనం పొంది ఉండగా, ఒక్క వ్యక్తి మాత్రం ఆ ప్రయోజనాన్ని పొందక పోయినట్లయితే అది అతడి పొరబాటు వలనే. నీ వద్దకు ఎవరైన శిష్యుడుగాను, అన్వేషకుడిగాను వచ్చినట్లయితే, అతడు ఎన్నటికి ప్రయోజనం పొందకుండా ఉండడు.

* * *

నీ సునిశతత్వంలో ఎటువంటి లోపం నాకు కనబడలేదు. కాని విశ్వాసం లోపించడం వలనే ఆ తప్పు కనబడుతుంది. ఒక విషయం సరైనది అయినప్పుడు హృదయంలో సంతృప్తి భావం ఉంటుంది.

* * *

నిజమైన ప్రేమ ఉంటే శరీరంలోని ప్రతి అణువు ఏడు సంత్సరాలలోనే మార్పు చెందాలి.

* * *

వీలైనంత వరకు పొదుపుగా ఉండటానికి ప్రయత్నించు. నా భావంలో పొదుపంటే బిడ్డలకు యిబ్బంది కలిగించే లోభిత్వం కాదు.

* * *

సేవ చేయాలనే నీ ఆలోచనే నీ ఆధ్యాత్మిక శిక్షణారంగంలోకి మనుష్యులను తీసుకు వస్తుంది. ఆధ్యాత్మికపరుడైన మనిషి ఆలోచనే అతడి ఆలోచనా స్వభావాన్ని అనుసరించి తగిన వాతావరణాన్ని సృష్టిస్తుంది. కాని మనమందరం మానవ మాత్రులం. కావున మానవ విజ్ఞత ఎటువంటి పద్ధతులు కావాలని కోరుతుందో వాటిని మనం అవలంభించాలి. ఇది మన కర్తవ్యం కూడ. ఒక్కసారి కెరటం పైకి లేచినప్పుడు దాన్ని శాంతింపచేయడం అసాధ్యం. మనం ఆ కెరటాన్నే లేపడానికి ప్రయత్నించాలి. ఎటువంటి ప్రచారం ఉండకూడదని నేను కోరుతున్నాను. అయినప్పటికి ప్రతి పని సేవాభావంగా మార్పు చెందకపోతే అది దానంతటదే ప్రచారం జరుగుతుంది. అందుచేతనే దయతో ఆ

మార్పును పొందడానికి ప్రయత్నించు. మనం చేస్తున్నది అదే.

* * *

శ్రీ 'x' తన ఉత్తరంలో తన కోపం గురించి బాధను వ్యక్తం చేసాడు. కన్నీటి ధార పొంగి ప్రవహించే విధంగ దాన్ని తొలగించమని దైవాన్ని ప్రార్థించాలి. ఇదే సమాధానం.

* * *

అభ్యాసి మరింత పైకి వెడుతున్న కొద్దీ, అందునా ముఖ్యంగా 'A' బిందువు తరువాత, శిక్షణ యివ్వడానికి నాకు మరింత సులభం అవుతుంది. అంతఃశ్శక్తులు సరిదిద్దబడతాయి. ఏమైనప్పటికి, అంతఃశ్శక్తులను ప్రకృతికి అనుగుణంగ తీసుకు రావడానికి శ్రమించవలసి వస్తుంది. 'తయారు చేయడం' అంటే యిదే. ఇది మిక్కిలి శ్రమతో కూడిన పని.

* * *

ఒక మహాత్ముడు ఎంతటి ఉన్నతస్థాయిని చేరుకున్నప్పటికి, మానవత్వం యింకా మిగిలి ఉంటుంది. మానవత్వం అనేదే ఒక పరిమితి. ''ప్రజలు మృత్యువు అంటే భయపడతారు. కాని సంపూర్ణ బ్రహ్మానందాన్ని పొందడానికి మరణించాలని నేను ఎంతో కోరుకుంటాను.'' అని కబీరు ఒకసారి అన్నారు. ''ఒక్కొక్కప్పుడు నేను స్వర్గ సింహాసనాన్ని అధిష్టిస్తాను, ఒక్కొక్కప్పుడు నా పాదం కంటె కూడ తక్కువ స్థాయిలో వుంటాను,'' అని ఒక పర్షియన్ కవి అంటాడు. ఈ పరిమితిని లేక బంధాన్ని తెంపేస్తే, అశాశ్వతమైన యీ మానవ శరీరాన్ని విడిచి ఆత్మ ఎగిరిపోతుంది. అందుచేతనే గురువులు దాన్ని ముట్టుకోరు. మన లాలాజీ కనిపెట్టిన అనేకమైన వాటిలో పదహారు వృత్తాలు ఒకటి. అది ''సత్యోదయం''లో పటంలో చూపబడింది. నా గురు మహారాజ్ మరియు ఆయనచే అనుగ్రహింపబడిన వారు తప్ప మరెవ్వరు వాటిని దాటి యింతవరకు వెళ్లలేకపోయారు. తను 17వ వృత్తంలోకి ప్రవేశించాలనే సంతోషకరమైన వార్తను ఎవరైనా తీసుకుని వస్తే ఆత్మమూలంలోకి ఎగిరి పోకుండ ఉండేట్లు అక్కడ ఒక బంధాన్ని సృష్టించడం గురువు కర్తవ్యం. నా జీవితకాలంలోనే ప్రజలు తాము దీనివరకు ప్రవేశాన్ని పొందామన్న సంతోషకరమైన వార్తను తేవాలని నా కోరిక. కాని యిదంతా దైవం చేతిలోనే ఉంది. దీని కతీతంగా వెళ్లడానికి ఎటువంటి ఆరాధన, సాధన కూడ ఎన్నటికి సహాయపడ జాలదు. దీని వరకు ప్రవేశాన్ని పొందిన గురువు సంకల్ప శక్తి మాత్రమే ప్రయాణంలో ముందుకు పోవడానికి తోడ్పడుతుంది.

* * *

ప్రియ సోదరా, నువ్వు గురు దక్షిణ గురించి నన్నడిగావు. నువ్వే గురువని నేను భావిస్తాను. అందుచేతనే సేవకుడు చేసిన పనికి అతడి నుండే యజమాని కూలిని అడగడం ఆశ్చర్యంగా వుంది. ఇంకొకటి కూడ వ్రాయమంటావా? కాని నేను నా ప్రావీణ్యతను ప్రదర్శిస్తున్నావని అనుకుంటారేమోనని భయంగా ఉంది. ప్రియసోదరా, నాకు దైవం కాని శిష్యుడు కాని లేనప్పుడు నా ప్రావీణ్యతను ఎవరికి చూపెడతాను? దైవానుగ్రహం వలన నేను యించుమించు ఎల్లప్పుడు శూన్యతా స్థితిలోనే ఉంటున్నాను. అక్కడ నేను లేను, నా దైవం లేడు. ప్రజలు నన్ను నాస్తికుడంటారని నా భయం. నాస్తికత్వాన్ని ఎప్పుడో ఛేదించుకున్నాను. ఇది నా గురువర్యుల ఆశీర్వాద కారణంగానే జరిగింది.

“విగ్రహారాధన అయినా ‘అల్లా’ (దైవం) నామ జపం అయినా, ఆపూజలో నిజమైన విశ్వాసం లేకుండ ఉండదు,” అని ఓ కవి చెప్పాడు. ప్రియసోదరా, శూన్యత్వస్థితి ఉప్పులేని రాయివంటిది. దాన్నుండి విడిపోవడానికి నువ్వు యిష్టపడవు. ఉప్పులేని రాయిలో సారం ఏముంటుంది. అందువలన యీ శిక్షణా విధానంలో ప్రాణాహుతిని ప్రసారం చేసేటప్పుడు యీ స్థితి నుండి కిందికి దిగి రావలసి ఉంటుంది. కాని నేనట్లు చేయలేను. ఈ కారణంగానే సంస్థ నియమావళిలో అభ్యాసికి నమ్మకం కలిగే విధంగ శాంతి, ప్రశాంతతలు తప్ప మరే భావోద్వేగం అతడిలో సృష్టించబడదు. కాని ఒక్క క్షణం పాటు నా పూర్వస్థితిలో ప్రవేశించినంత మాత్రంలోనే ఆ స్థితి యొక్క ప్రతిబింబం నా అనుభవానికి వచ్చేది. నేను ఒకసారి ఎవరికో యీ విధంగ వ్రాయడం నాకు గుర్తు. “ప్రియసోదరా! నువ్వే నాకు ఆధ్యాత్మిక శిక్షణను యిచ్చావు. నీవలన మాత్రమే నేను ఆధ్యాత్మికతలో పురోగమించాను.” ఇది పూర్తిగా సరైన భావం. నేను అటువంటి స్థితికి వచ్చినప్పుడు నాకు నువ్వే గురువుగా కనబడుతావు. అంతేకాదు, నువ్వే గురువు అవుతావు. కేవలం మీరందరే నాకు శిక్షణను యిచ్చారని ఒప్పుకుంటాను. మీరు ఏమైనా అనండి. నా సహచరులు వారి తప్పుల్ని గురించి, తెలివి తక్కువ తనం గురించి నాకు చెప్పాలని కోరుతాను. కాని నేను యితరుల నుండి దీన్ని ఆశించేటప్పుడు మొట్టమొదటగా నా తెలివితక్కువ తనాన్ని వారి ముందుంచాలి. ఒకప్పుడు ఒకానొక ‘x’ అనే పండితుడు తన విద్యా పాండిత్యాలను చూసి గర్వపడుతూ విజ్ఞానరంగంలో నేనోడిపోయానని భావించాడు. ఈ గర్వాన్ని పెంచుకోవడం అతడికి మంచిది కాదని భావించాను. అందువలన నేను వెనక్కి తిరిగి ఒకప్పటి నా పూర్వస్థితిని పొంది అప్పుడు అతడికి ఉత్తరం వ్రాసాను. నేను వ్రాసిన దానిని తెలుసుకుంటే నీకు నవ్వొస్తుంది. “రాముణ్ణి, కృష్ణుణ్ణి యీ ప్రపంచలోకి

పంపింది నేనొక్కడినే! కేవలం నేనే ఋషులకు శ్రుతలన్నీ ప్రత్యక్షమయ్యేటట్లు చేసాను;" అని వ్రాసాను. తరచు నువ్వు అంధకారంలోనే ఉంటున్నట్లగ ఎందుకు అనిపిస్తుందో నీకిప్పుడు అర్థం అయి ఉంటుంది.

* * *

శూన్యత్వ స్థితిలో ఉన్న వ్యక్తి తనంతట తానుగా యితరుల విషాదాన్ని చూసినప్పుడు విచారం చెందాలి; ఆనందాన్ని చూసినప్పుడు ఆనందించాలి. కాని యిది పైపైన మాత్రమే ఉండాలి. ఆ తరువాత తన యధాస్థితికి వచ్చేయాలి.

* * *

కేవలం మేధస్సే సమస్త విషయాల్ని గురించి ఆలోచిస్తున్నప్పుడు మనం హృదయంపై ధ్యానం ఎందుకు చేస్తాము? మనస్సుకు కార్యరంగం హృదయం. శరీరంలోను మేధస్సులోను ఉండే బిందుస్థానాలు యించుమించు అన్నీ కూడ హృదయంలో కనబడతాయి. దానిపై ధ్యానించడం వలన, ఆ బిందు స్థానాలన్నీ మరింత సులభంగా పరిశుద్ధం కావింపబడుతాయి.

* * *

ప్రాపంచిక బాధలు హృదయంలో భారాన్ని కలుగచేస్తున్నాయని వ్రాసావు. నీ హృదయం పూవు యొక్క మధుర పరిమళాన్ని కూడా తట్టుకోలేనంతగ క్షాళన కావించబడిందని యిది నిరూపిస్తోంది. అయినప్పటికి బాధలనేవి ఎగిరిపోయే రూపంలో ఉండాలి. వాటిని గురించిన ఎరుక హృదయానికి ఉండకూడదు.

* * *

శ్రీ 'x' తనలో మార్పును తీసుకురావలసిందని నాకు తిరుపతికి టెలిగ్రాం (తంతి) పంపించాడు. దాన్ని నేను అలహాబాద్‌లో అందుకున్నాను. టెలిగ్రాం ద్వారా అతనిలో మార్పును తీసుకొని రాలేకపోయినందుకు విచారిస్తున్నాను. కాని ఆధ్యాత్మిక పథంలో దైవాన్ని పొందాలనే అతడి తపనను అది నిశ్చయంగా సూచిస్తోంది. అది మంచిదే. రెండు రోజుల క్రిందట నేను దానికి సమాధానం యిచ్చాను. దానిలో కొంత తర్కాన్ని వ్రాసి సూర్యుడికి దివిటీని చూపడం వంటిది చేసాను. కాని, సోదరా, అతడు చాల మంచివ్యక్తి, ప్రేమించడం కూడ ప్రారంభించాడు. కాని ప్రియ సోదరా నేనేం చేయను? ఈ సామాన్య మానవ మాత్రుడి ఎముకల్లో సారం ఏదీ మిగల్లేదు. ఈ కారణంఆనే నేనంటే ప్రజలకు

యిష్టం ఉండకపోవచ్చు. ఇప్పుడు అద్దంలో నాముఖాన్నే చూసుకుంటూ, నన్ను చూసి నేనే మురిసి పోవలసిందేనా? కాని అలా చేస్తే దాంట్లో నాబింబమే నాకు కనబడదేమోనని నా భయం. అయినప్పటికీ, ఏమీ లేని దానిలో కూడ ఏదో కొంత ఉండి తీరాలని నా అభిప్రాయం. అవును యిది వాస్తవం. ఎందువలనంటే శూన్యతలో మాత్రమే సత్‌తత్వం కనబడుతుంది.

* * *

మన మహాత్ములు, సన్యాసులు భారతదేశపు ఆర్థిక స్థితిని గురించి పట్టించుకోకుండ ఎన్నో డబ్బాల నేతిని హోమంలో పోసి ఆహుతి చేస్తారు. ఎడతెరిపి లేకుండ ఇరవైనాలుగు గంటలూ రెండు, మూడు నెలలపాటు వారు అగ్నికి కానుకలను ఆహుతి చేస్తారు. ఏ మహాత్ముడైనా సరే తననుతాను ఉద్ధరించుకోవాలనుకున్నప్పుడు భారతదేశపు సంపదను హోమంలో దగ్ధం చేయడంతో ప్రారంభిస్తాడు. ప్రతి సంవత్సరం అటువంటి వార్తలను మనం వింటూనే ఉంటాం. దక్షిణ భారతంలో పరిస్థితిని గురించి నాకు తెలియదు. బహుశః అక్కడ కూడ వారు ఆవిధంగా చేస్తారేమో. ఆవిధంగా చేయని వారు ప్రజలను కుండలిని అనే ఎండమావిలోకి ఆకర్షిస్తారు. ఇంత చేసినప్పటికి మన మహాత్ములలో ఒక్కరు కూడ కనీసం ఒక్క వ్యక్తి హృదయంలోనైనా యింతరవకు ఆధ్యాత్మిక జ్వాలను రగల్చకపోగా వారి బిడ్డలకు ఉపయోగపడి, హృదయం మెదడు సక్రమంగా పెరగడానికి దోహదం చేసే నేతిని మాత్రం అతి ఎక్కువగ దగ్ధం చేసారు. ప్రాణాన్ని ఆహుతి యివ్వడం ద్వారా శ్రీరామచంద్ర మిషన్ కనీసం ఒక్క వ్యక్తిలోనైనా ఆధ్యాత్మిక జ్వాలను రగిలించ గలిగితే, అది వేయి యజ్ఞాలకన్న మేలైన పని. దీనిని గురించి లోతుగ ఆలోచించినట్లయితే, నీవు అనేక హృదయాలలో ఆ జ్వాలను రగిలించి ఉన్నావని తెలుసుకుంటావు. ఇంకా అనేకులలో యీ జ్వాలను రగిలించగలవని కూడ తెలుసుకుంటావు. నీవు కూడ ఆవిధంగ ప్రభావితుడైన వాడవే. ఏదో సందర్భంగా నేను వ్రాసిన ఒక చిన్న వాక్యం నిన్నెంతో ప్రభావితం చేసి, నీలో ఆరిపోయిన జ్వాలను మళ్లీ రగిలించింది. ఇది ఎంతో తేజోవంతమై ప్రజ్వరిల్లి జ్వాలలు బయటకు వెళ్లడం ప్రారంభించాయి. నీవు సిరగ్గానే ప్రారంభించావు. రంగాన్ని సిద్ధం చేయవలసి ఉంది. అది సిద్ధం చేయబడుతోంది కూడ. అటువంటి నీ హృదయానికి ఎదురుగ జ్వాల ఆరిపోయిన హృదయాలు వచ్చినట్లయితే, వాటిలో ఎటువంటి వేడి లేకపోయినప్పటికి, అవి తప్పక రగులుకుంటాయి. నీ కార్యరంగాన్ని విస్తరింప చేయాల్సి ఉంది.

ప్రకృతి తప్పక నీ నుండి పనిని స్వీకరిస్తుంది. నీవు త్వరలోనే ఆ పనికి సిద్ధం కావాలి. నీవు పని చేయడం తప్పనిసరి. పరిమితులను కొంచెం సడలించవలసి వుంది.

* * *

ఇక్కడకు వచ్చే ప్రతీవ్యక్తి అనుమానంతోనే కొనసాగుతున్నాడు. తన సామర్థ్యాన్ని శీతోష్ణాలను శోధించే పరికరంగ తయారు చేసుకొని పరీక్షిస్తూనే వుంటాడు. ఇక్కడ ఉష్ణము వుండదు, శీతలం ఉండదు. అందుచే వారప్పుడు తమ కల్పనాశక్తిని వినియోగించి ఏదో ఒక నిర్ణయానికి వస్తారు. అనుమానంతో వస్తారు కావున అది వారిని నిరాధారమైన నిర్ణయాలకు తీసుకు వెడుతుంది. నిజాన్ని చెప్పగల వారెవ్వరు కనపడరు. అనేకమంది అసత్యాన్నే వాస్తవత్వంగా చిత్రీకరించారు.

* * *

ప్రతి ఒక్కరు విజ్ఞులను కొనియాడుతారు. నేను కూడ ఆ విధంగా చేస్తాను. దైవం కూడ బలహీనులకు సాయం చేయదని నేనొక చోట పరిహాసానికి చెప్పాను. ఆత్మ విశ్వాసం లేని వాడే బలహీనుడు. మూర్ఖులకు దైవం ఒక స్థలాన్ని ప్రత్యేకించి నిర్ణయించాడంటాను. అదే స్వర్గం. పాపాత్ములకు అజ్ఞానులకు నరకమే స్వరగం. విజ్ఞులకు స్వర్గం లాంటి స్వర్గం; అమాయకులకు బ్రహ్మలోకం వున్నాయి. పై విభాగాలు సరైనవని అనుకుంటాను. నేను దీన్ని వివరిస్తే, అనేక పుటలు కావలసి వస్తుంది. అందుచేతనే యీ వివరణను మీకే వదిలేస్తున్నాను.

* * *

నేనొక చిక్కు ప్రశ్న వేయాలనుకుంటున్నాను. "దైవం ఎవరిని ఎక్కువ ప్రేమిస్తాడు? ఆయనను ఒక్కసారి మాత్రమే దర్శించి వుండి, అయినప్పటికి ఆయనకు దూరంగా ఉండేవాడిని! దీనిపై ఒకటి రెండు వాక్యాలు వ్రాయాలనుకుంటున్నాను. దైవంనుండి ఎప్పుడు విడిపోయాము? మూలాన్ని వదిలి ప్రస్తుత రూపమైన మానవదేహాన్ని ధరించినప్పుడు. అటువంటి మాహామూలం నుండి బయలుదేరి, దానికెంతో దిగువనున్న సూక్ష్మతలానికి వచ్చినప్పుడు, పంచభూతాల పంజరంలో మన నివాసాన్ని ఏర్పరచుకున్నాం. భక్తి పరిధిలో వుండి పాంచభౌతికమైన మన ప్రస్తుత స్థితిని అర్థం చేసుకొనడానికి మనం దాని స్మరణను కూడ కొనసాగించాలి. దైవలక్షణాలకు సంబంధించినంత వరకు, ఇప్పుడు మనం ఉన్న ప్రదేశం దైవానికి అనేక మైళ్ళ దూరంలో ఉంది. శాశ్వత సత్యప్రాప్తి తరువాత కూడ దైవానికి మానవుడికి గల తారతమ్య భావం కొనసాగాలని దాని అర్థం. క్లుప్తంగా

చెప్పాలంటే శాశ్వత సత్యప్రాప్తి తరువాత మానవ సహజ ధర్మాన్ని విడనాడ రాదు.

* * *

వాస్తవానికి ఎటువంటి రంగు, వాసన, రుచి లేనట్లు అవడంలోనే నిజమైన ఆధ్యాత్మికత వుంది. దీనికి కారణం దైవానికి యివేమీలేవు. మన విధానంలో, సాధకుడిని సత్‌తత్వం వరకు తీసుకొని వెళ్ళడానికి ప్రయత్నం జరుగుతుంది. ఏ ఒక్క వర్ణమైనా మిగిలి వుంటే పరిశుద్ధత ఏమాత్రం వుండజాలదు. ఈ విషయాలన్ని నీకు తెలుసు.

* * *

"లైలాను మజ్ను కళ్ళతో చూడు" అనే పర్షియన్ సామెత ఒకటుంది. అంటే లైలా అనాకారి పిల్లకావున ఆమెను చూడ్డానికి మజ్ను కళ్ళు మాత్రమే కావాలి. అదేవిధంగా దైవాన్ని చూడాలంటే అట్టి ఉన్మాదపు చూపులే కావాలి.

* * *

శ్రద్ధయే అస్తిత్వం, లేక ఆధారం. శాశ్వత సత్యప్రాప్తి ప్రారంభమయ్యేది యీ శ్రద్ధ అనే ఆధారంపైనే. శ్రద్ధ అనేది ఒకసారి ఏర్పడిన తరువాత ఎవరిచేతనూ విచ్ఛిన్నం చేయబడలేనటువంటి అఖండ అనుబంధం. శ్రద్ధ పెంపొందించుకోని అభ్యాసి ఎన్నటికి ప్రగతిని సాధించజాలడు.

* * *

ఒరనుండి తీసిన ఖడ్గం చేసే పని నరకడమే అయినప్పటికీ, అదెంతగానో స్తుతించ బడింది. ఇప్పుడు అది తనని, తన మిత్రుడిని కాక శత్రువుని మాత్రమే దెబ్బతీయునట్లు ఉపయోగించడానికి తెలివి తేటలు అవసరం.

* * *

శిష్యుడు గురువులో పూర్తిగా లయమైనప్పుడు గురువు అతడిని యింకా ముందుకు తీసుకొని వెళ్ళడానికి ఆతృతతో వుంటాడు. అది కూడ ముఖ్యంగా శిష్యుడు తనంతతానుగా ముందుకు వెళ్ళలేకున్నప్పుడు బహుశా ప్రతివారి హృదయంలో ఉత్పన్నమయ్యే ప్రశ్న ఒకటుంది. దానికి నేను సమాధానం యిస్తాను. అది గురువు "బకా" (Baqua) ప్రదేశంలో పయనించే వాడైనప్పుడు, శిష్యుడు ఉన్నతమైన ప్రదేశాన్ని అవసరమైనప్పుడు చేరుకోవడం ఏవిధంగ సాధ్యమవుతుంది?" గురువు కనుక ముక్తిని పొందినవాడే అయితే, శిష్యుడు తప్పక అతని సహాయాన్ని పొందుతాడు. అందుకు తన పిలుపు గురువుకు చేరునట్టి

స్థితిని అతడు పెంచుకొని వుండాలి. గురువుచే దీక్షోపదేశాన్ని పొందినవారి పిలుపే ఆయనకు త్వరగా చేరుతుంది. ఇదికాక శిష్యుడి అవసరాలను తీర్చే ప్రతినిధులు శిక్షకులు కూడ వున్నారు.

* * *

ఒక వ్యక్తి తను చేసిన తప్పులకు పశ్చాత్తాపం చెంది వచ్చి, ఆధ్యాత్మికత్వం వైపుకు మొగ్గు చూపినట్లయితే అతడిని చేర్చుకోవలసి వుంటుంది. కాని అతడు ఆ తప్పులను తిరిగి చేయకూడదు. తను చేసిన పాపాలకు పశ్చాత్తాపంతో దైవం వైపుకు దృష్టిని మరల్చినట్లయితే అతడు త్వరలోనే పునీతుడైతాడు. తన పాపాలకు విలపిస్తూ క్షమింపుమని వేడుకోవడం యిందులో వుంది. పవిత్ర ఖురాన్ గ్రంథంలో యీ విధంగా వ్రాసి వుంది. ''భక్తుడు కనుక క్షమించమని ప్రార్థిస్తూ విలపిస్తే నేను సిగ్గుపడి అతడిని మరల స్వీకరిస్తాను''.

* * *

దైవం యొక్క ఏకత్వంలో మనకు విశ్వాసం లేదు. మనం కొంత పరిసరాల వలన ప్రభావిత మవుతాం. కొంత సాంగత్యం వలన పాడవుతాం. పాశ్చాత్య నాగరికత ప్రభావం కూడ కొంతవరకు ఉంది. ఆ విధంగ యిప్పటికే పతనం అయినాము. తప్పుడు ఆధ్యాత్మిక శిక్షణ మన పతనాన్ని పూర్తి కావించింది. దాని ఫలితంగ ఆధ్యాత్మికత నుండి మనం వేలాది మైళ్ళ దూరం విడిపోయాము.

* * *

ఒక్క తప్పుకే మనిషికి నాలుగు శిక్షలు ఏవిధంగ యివ్వబడినాయి? మనిషి ఒక జటిలమైన ప్రాణి. అతడొక మంచిని కాని చెడును కాని చేస్తున్నప్పుడు, మనస్సు ఆలోచిస్తుంది. హృదయం నిర్ణయిస్తుంది, మానవ అవయవాలు వాటి పనిని అవి చేస్తాయి. మంచి, చెడు ఈ రెండింటి విషయంలోను మనస్సు నుండి, హృదయం నుండి సహాయం వస్తుంది. అప్పుడు పనిచేసిన యింద్రియాలు కూడ తప్పు చేసినవే అవుతాయి. ఇవి శరీరంలో ఒక భాగం కావున శరీరం కూడ బాధ్యతను కలిగి ఉంది. మనం చెడు విషయాలను గురించి ఆలోచించేటప్పుడు వాతావరణంలో చెడు భావాల ముద్రలను వదులుతాం. అందుకు ప్రకృతి మనల్ని వేరుగా శిక్షిస్తుంది. వ్యక్తి తను చేసిన తప్పు ననుసరించి కష్టతరమైన జీవితాన్ని కాని, నరకాన్ని కాని పొందుతాడు. అతడు నరకంలో ఎంతవరకు శిక్షింపబడవలసి వుందో అంతవరకు శిక్షింపబడతాడు. మిగిలనది యీ లోకంలో

మరో జన్మ నెత్తడం ద్వారా అనుభవించాల్సి వుంది. తను చేసిన పని చెడ్డదని భావించిన మనస్సు శిక్షను అనుభవించింది. దాని ప్రభావం చెడ్డది. ఇదే హృదయానికి శిక్ష. సంఘం కూడ అతడిని గేలి చేసి నిరసించింది. అతడు వాతావరణాన్ని పాడుచేసిన వాడు కావున అతడికి నరకం ప్రాప్తించింది. శరీరం దాని అవయవాలు పొందినది మూడవ శిక్ష. ఆవిధంగ తప్పును చేయడంలో తోడ్పడినవి అన్నీ శిక్షను పొందాయి.

"నా ప్రియురాలిని చూసినప్పుడు, నా మనస్సు చలించింది. తప్పు కన్నులదే, కాని హృదయానికి గాయం అయింది".

* * *

ఆధ్యాత్మిక పరుడైన వ్యక్తి మాంసాహారాన్ని తినకూడదని నా గురువర్యులు చెప్పుతుండేవారు. నేను అదే పద్ధతిని అనుసరిస్తాను. నిజానికి మాంసాహారాన్ని అలవాటుగా తిన్న మహాత్ములు వున్నారు. మాంసాహారాన్ని వదలుకోవాలి.

* * *

ప్రశిక్షకుడు క్రమశిక్షణ లేని వాడైతే అతడా పనికి యింకెంత మాత్రం అర్హుడు కాడు. ప్రశిక్షకుడిని అవమానించడం తేలికైన విషయం కాదు. అది నా గురువర్యులను అవమానించినట్లే అవుతుంది.

* * *

నాకు సంబంధించినంతవరకు నేను ఎల్లప్పుడు గురువర్యుల పైనే ఆధారపడి వున్నాను. నా గురువర్యులు ఎవరైన ఒక వ్యక్తి ఆధీనంలో వుండమని నన్ను ఆదేశిస్తే నేను అతడి ఆధీనంలో వుండడానికి సమ్మతిస్తాను. ఈవిధంగా ఆధారపడి వుండడం వలన మాత్రమే నేను అటువంటి సంకల్పశక్తిని పెంపొందించుకున్నాను. దాని ఫలితంగా ఒక సెకనులోనే వేలాది మందిని ఆధ్యాత్మిక శిక్షణ యిచ్చుటకు తయారు చేయగలను. ఇది కేవలం నా గురువర్యులు అనుగ్రహించిన కానుక.

* * *

సోదరా, నేనెక్కడ నుండి మహిమలను ప్రదర్శించగలను? నా దృష్టి ఎప్పుడు అటువైపు లేదు. మీరు ఎప్పుడైన ఏదైన కావాలని కోరినప్పుడు, కొన్ని మహిమలు సంభవిస్తాయి. నాకు మహిమలను ప్రదర్శించే శక్తి ఉందని నా గురువర్యులు చెప్పారు. నాకా నమ్మకం కూడా తప్పక వుంది. అయినప్పటికీ నేను ఎట్టి పరిస్థితుల్లోను దాని వైపు మొగ్గు చూపను.

రెండవది ప్రజలను ఆకర్షించేది ఎల్లప్పుడు బోధనలు మాత్రమే. ఏసుక్రీస్తు తన జీవితమంతా మహిమలను ప్రదర్శించారు. కాని ఆయన పన్నెండుగురు శిష్యులు మాత్రమే సంపాదించుకోగలిగారు. వారిలో ఒకరు ఆయనకు శిలువ వేయడానికి కుట్ర పన్నేంత కృతఘ్నుడుగ మారాడు. ఆయన మరణించిన తరువాత ఆయన బోధనలు ప్రపంచాన్నంతా ఆకర్షించాయి. హిందువులు ఆ రోజుల్లో సముద్రయానం దైవాపచారమని భావించడం ఆయనకు సహాయపడిన మరో విషయం. నేను చెప్పదలచిన ఒక విషయం ఏమిటంటే నా గురువర్యుల కృపచే నేను చేయగలిగిన మహిమలు ఎవ్వరూ చేయలేదని. కాని చూడ గలవారే దీన్ని తెలుసుకుంటారు. సోదరా ప్రకృతి కార్య నిర్వహణలో ఆ విధంగా చేయడం తప్పనిసరి అవుతుంది.

* * *

సంకల్పం, కోరిక యీ రెండింటిని వివరించడానికి నేను కొన్ని విభజనలు చేయాల్సి వస్తుంది : (1) జంతుస్థాయి (2) మానసిక స్థాయి (3) ఆధ్యాత్మిక స్థాయి ఇవి కోరికల్లో రకాలు. కోరికలు మంచివి వుంటాయి. చెడ్డవి కూడ వుంటాయి. చెడ్డ కోరికలు కామం మొదలుగాగల భావోద్రేకాలతో సంబంధం కలిగి ఉంటాయి. అతి వ్యామోహం మొదలైనవి కూడ యీ తరగతిలోకే చేరుతాయి. మానసిక స్థాయిలో వున్న కోరికల్లో స్వార్థపరత్వం, స్వీయపురోగతి, స్వశక్తి మొదలైన వాటి రహస్యం దాగి వుంటుంది. ఈ విషయాలను ఆధ్యాత్మిక స్థాయికి కొనిపోయినప్పుడు తన కర్తవ్యం గుర్తుకు వచ్చి, యీ ఉచ్చులోంచి బయటపడడానికి కలత చెందుతాడు. అతడి దృక్పథం ఈశ్వర ప్రాప్తి వైపుకు మళ్ళు తుంది. అదే దృక్పథం ఒకప్పుడు జంతుస్థాయిలో సంబంధం కలిగివుంది. కాని దానిలో కర్తవ్య భావం యిమిడి వుంది కావున దాన్ని కోరిక అనడం పొరపాటు. సంకల్పం మానసిక స్థాయితో సంబంధం కలిగి వుంది. గమ్యాన్ని దృష్టిలో వుంచుకొని ఆలోచిస్తూ, మానసికంగా పనిచేయడం ప్రారంభిస్తావు. ఇది చివరి వరకు కొనసాగుతుంది. ప్రతి రంగంలోను యిది కొత్త జీవితాన్ని సంతరించుకుంటూ పోతుంది. అది పవిత్రంగా వున్నంత మేరకు త్వరగా పనిచేస్తూ, సందేహాల నుండి విముక్తి పొందుతుంది. అంటే దాని శక్తి వృద్ధి చెందుతూనే వుంటుంది. మహామాయ అని పిలువబడే ప్రాపంచిక రంగాలన్నింటిలోను అది చేసే పనులు ఫలవంతంగా ఉంటాయి. ఆ తరువాత అది స్వచ్ఛమైన మూల స్వరూపాన్ని పొందుతుంది. నిజానికది ఒక అమూల్యమైన ఆభరణం వంటిది. ఆ స్థాయికి చేరుకున్నప్పుడు, ఎవరినైనా సరే ఒక ఆధ్యాత్మిక స్థాయి నుండి మరొక ఆధ్యాత్మిక స్థాయికి క్షణమాత్రం లోనే తీసుకొని పోవడం చాలా సులభం అవుతుంది. మనిషి బ్రహ్మంలో

గాఢంగా లీనమైవున్న బ్రహ్మనిష్ఠుడు అయినప్పుడు, అతడి సంకల్పం అజేయమవుతుంది. కాని, సోదరా, అటువంటి స్థాయికి ఎదిగిన యీ సంకల్ప శక్తి దైవకార్యాలకు మాత్రమే సహాయపడుతుంది. "అనంతం వైపు" అనే పుస్తకంలో నువ్వు చదివి వుండొచ్చు. మనిషి తన సందేహమపు ఆధారాన్ని నిర్మూలించినట్లయితే సంకల్పం మహా శక్తివంతం అవుతుంది. పాశ్చాత్యతత్వం సందేహం మీద ఆధారపడింది. కాని ప్రాచ్యతత్వంలో దానికి స్థానం లేదు. సందేహానికి తావిస్తే యింట్లో దొంగకు స్థానం కల్పించినట్లువుతుంది. సోదరా, యీ విషయాలన్నీ అవంతట అవే అభ్యాసం ద్వారా తెలుస్తాయి. పద్ధతి సరైనదై వుండాలి. గురువు సమర్థుడై వుండాలి. స్థూలత్వాన్ని తొలగించుకొని, అతి సూక్ష్మస్థితులలో వసిస్తూ కొనసాగాలి.

* * *

ప్రజలకు దైవంపై నమ్మకం లేదు. నా ఆరోగ్యంపై నాకూ నమ్మకం లేదు. తన ఆరోగ్యంపై నమ్మకం లేకపోవడం బలహీనతకు సూచన. దైవంపై నమ్మకం లేకపోవడం ఆధ్యాత్మికంగా ఆత్మహత్య చేసుకున్నట్లేనని సూచిస్తుంది. ఈరోజుల్లో పంటలు బాగా పండడం లేదని ప్రజలు అంటూంటారు. అంటే భగవంతుడు యిప్పుడు ముసలి వాడయినాడని అందువలన ఆయనకు కొన్ని విషయాలు గుర్తుండవని దాని అర్థం. కాని ఆయన యిచ్చిన శక్తితోనే తాము ఆయన పనిలో ఎంత గందర గోళాన్ని సృష్టించారో వారర్థం చేసికోరు. పనులు కూడ అందుకు తగినట్లే జరుగుతున్నాయి. మనం చేసే పనులు ప్రకృతికి విరుద్ధంగా వుండి, వాతావరణాన్ని అస్తవ్యస్తం చేస్తాయి. దానివలన మన కుత్తుకలు తెగిపోతున్నాయి. ఇప్పుడు వీటిని క్షాళనం చేయాల్సి వుంది. అది కొంతవరకు జరుగుతోంది. ఇక ముందు కూడా కొనసాగుతుంది. అదంతా మీ అందరి వలన మాత్రమే జరగాలి. ప్రతి మహాత్ముడు తనకు తెలియకుండానే ఎంతోకొంత చేస్తాడు. నాకు ధైర్యం వుంది; గురువర్యుల అనుగ్రహం వలన నాకు దీనికిక కొరతలేదు. ఆవిధంగా చేయడానికి నాకొక్క క్షణం కూడ ఎక్కువ అవసరం లేదు. మీరందరు కూడ మీలో ధైర్యాన్ని పెంపొందించుకోవాలనే యీ విషయాలన్నిటిని వ్రాసాను. కాని నేను ఇది చేయను. ఎందువలనంటే తమ శక్తి యుక్తులను దుర్వినియోగ పరచి యీ అస్తవ్యస్త పరిస్థితి అంతటిని సృష్టించిన వారు తమ అకృత్యాల ఫలితాన్ని అనుభవించాలి. ప్రకృతి కూడ దాన్నే కోరుతోంది. వినాశం రావడం తప్పదు. అది ప్రారంభమయ్యింది కూడ. దానికి కారణాలు యివే.

* * *

నేను నీకో విషయాన్ని చెపుతున్నాను. పూర్తి "ఆత్మవిశ్వాసం"తో చేసింది ఏదైనా సరైనదే అవుతుంది. దానికి పై మాటలో "ఆత్మ" అనే పదం నిజంగా ఎవరికి ఉద్దేశించిందనే విషయం దృష్టిలో వుండరాదు. నీ మాటల్లోనే చెప్పాలంటే నేను అనే భావం పూర్తిగా అదృశ్యమై పోవాలి.

* * *

సాయంకాలం చేసే క్షాళన పద్ధతి వలన ప్రజలు ప్రయోజనం పొందడం లేదని తెలుస్తోంది. వారు దాన్ని చేసే విధానం లోపభూయిష్టంగ వుండడమే దానికి కారణం. మీకేంద్రంలో సత్సంగాన్ని నిర్వహించే వారందరికి చెప్పి, నీవు కలిసే వారందరికి మాట పూర్వకంగ వివరించాలి. నిజానికి వారు మొదట స్థూలత్వంపై ధ్యానం చేయడం ప్రారంభించి, అప్పుడు అది వెనుక వైపునుండి పొగ రూపంలో వెళ్ళిపోతున్నట్లు భావిస్తారు. నిజం చెప్పాలంటే వారు అది పొగరూపంలో వెళ్ళి పోతోందని భావిస్తూ దాన్ని సంకల్ప శక్తితో బయటకు నెట్టివేయాలి.

* * *

ఆరాధన గురించి మన హృదయంపై ఒత్తిడిని సృష్టించుకోవాలనే దీని అర్థం అంతా.

* * *

"పాపాత్ములకు దైవకృప అనుగ్రహించబడినప్పుడు, పాపాత్ములు కానివారు దాన్ని అవమానంగ భావించారు", అని ఒకానొక కవి ఎంతో అందంగ చెప్పాడు.

గునాహ్‌గారోన్ కో పూచ్ఛా జో వుస్కి రహమత్ నే

బహుత్ కాఫీ హువే జో గునాహగర్‌న థే ।

తాను పాపాత్ముడనని అనుకోవడం వినమ్రతకు ఒక గుర్తు. కాని యీ భావం ఇస్లాం మతానికి సంబంధించినది. బహుశా మనమతంలో దీన్ని గురించి ఎక్కడా చెప్పలేదు. వాస్తవానికి దీంట్లో మర్యాదకు సంబంధించిన విషయం ఒకటుంది. మనం పాపాత్ములమని భావించుకున్నప్పుడు, మన హృదయం ఆయన కృపను మన వైపుకు లాక్కోవడం ప్రారంభిస్తుంది. ఈ స్థితిలో మనం పూర్తిగ ఆయన కృపపై ఆధారపడినప్పుడు ఎంతో ప్రయోజనాన్ని పొందుతాం. ఇది శరణాగతిలో ఒక భాగం. మనం ఒక ఉన్నతమైన దాని వైపుకు పురోగమించేటప్పుడు, మన అల్పత్వం అనుభవానికి రావడం మొదలెడుతుంది.

దాని ఫలితంగ మనం ఆదైవకృప కోసమే చూస్తూవుంటాం. మనం అస్తిత్వం లేని వాళ్ళం అవుతాము. అంటే ఆ దైవకృప కోసం మనం శూన్యాన్ని సృష్టించుకున్నామని దానర్థం సత్‌తత్వం గురించి చెప్పే దీనిని అన్వేషకుడు మాత్రమే దాన్ని తెలుసుకోగలడు.

* * *

ప్రేమ సర్వత్రా ప్రస్తుతింపబడుతుంది. మహాభారతంలో ఒక కథ వుంది. శ్రీకృష్ణ పరమాత్మ విదురుడు యింటికి వెళ్ళినప్పుడు విదురుడి భార్య వివస్త్ర అయి స్నాన మాచరిస్తోంది. శ్రీకృష్ణుడి గొంతు విని ఆనంద పరవశంలో ఆమె తలుపు తీసి బయటకు వచ్చింది. శ్రీకృష్ణుడు తనపై వస్త్రాన్ని తీసి ఆమెకు కప్పాడు. ఆమె ఆయనకు అరటిపండ్లు తినిపించింది. ఆ పారవశ్యంలో ఆమె పండును విసిరేసి తొక్కనే ఆయనకు యిచ్చింది. విదురుడు వచ్చి ఆమె చేస్తున్న పని ఏమిటో ఆమెకు గుర్తు చేసాడు. అప్పుడామె స్పృహలోకి వచ్చి ఆయనకు పండును తినిపించడం ప్రారంభించింది. అప్పుడు కృష్ణ పరమాత్మ తొక్కను తిన్నప్పుడున్న రుచి పండును తినడంలో లేదని చెప్పడం జరిగింది. భక్తి ప్రేమలు అంతగా ఆవహించినప్పుడు, ఆధ్యాత్మికంగా కొంచెం పురోగమించిన వారు కూడ విదురుడు భార్యకు వచ్చిన స్థితిని అనుభవం చెందుతారు.

* * *

నేను చిక్ మగళూరు తప్పని సరిగా వెళ్ళి తీరాలని శ్రీ 'x' వ్రాయడం జరిగింది. కాని నా ఆరోగ్యం నిరర్థకమైన యీ ప్రయాణపు శ్రమను తట్టుకొనే పరిస్థితిలో లేదు. నేనక్కడికి వెళ్లడం వలన ఆయనకు యోగ్యత లభిస్తుందని అనుకుంటున్నాడు. కాని నిజానికి అది "రాకత్" వలనే పొందవచ్చు. దీని అర్థము నీకు తెలుసు. క్లుప్తంగా చెప్పాలంటే ప్రార్థన, భక్తి వలనే యోగ్యతను సంపాదించడం జరుగుతుంది.

* * *

మనిషి ఏదో విధంగ తనలోని పశుత్వాన్ని వదిలి నిజమైన మానవుడగుటకు ఒక పద్ధతి కనుక తెలిస్తే ఎంతో బాగుంటుందని నా తీరిక వేళల్లో అనుకుంటుండేవాడిని, సృష్టిలోను, నాలోను అంతటా పరిశీలించినప్పుడు, నేను రెండు విద్యుత్ యంత్రాలను (డైనమో)లను చూసాను. మొదటిది వ్యక్తిగత సృష్టికి సంబంధించిన విద్యుత్ యంత్రం, రెండవది విశ్వ సృష్టికి సంబంధించిన విద్యుత్ యంత్రం. ప్రస్తుతానికి నేను రెండవ యంత్రం జోలికి పోవడం లేదు. ఎందువలనంటే దానికి ఉపయోగించే శక్తి ఆ విశిష్ఠ యుగపురుషుడికి మాత్రమే వుందని నాకు తెలుసు కావు. సామాన్య మహాత్ములెవ్వరు

దీనిన గురించి కనీసం ఆలోచించ లేరు. ప్రస్తుతం మన సంస్థలో దాన్ని ఉపయోగించ గలవారు ఇద్దరు, ముగ్గురు ఉన్నారు. కాని యీ విషయంలో నేను వారికెటువంటి సూచనను యివ్వదలుచుకోలేదు. దానికి కారణం నేను వారు అక్కడ ఉండడానికి ప్రత్యేకమైన శక్తిని యివ్వాలి. లేనట్లయితే వారి యీ జీవితం దానిలో లయం అవుతుంది.

నేనిప్పుడు వ్యక్తిగత సృష్టికి సంబంధించిన విద్యుత్ యంత్రాన్ని గురించి చెప్తాను. నా గురువర్యుల అనుగ్రహం వలన దీన్ని పరిష్కరించ గలిగాను. ఆయనిచ్చిన పరిష్కారం చాలా మంచిది. నేను దాన్ని గురించి భావించిందంతా కూడ సరైనదేనని. నా గురువర్యులు కూడ ఆమోదించారు. ఈ పరిష్కారంలో ప్రమాదం ఏమీలేదు. అది చాల ప్రయోజనకరమైన సాధనం. దాన్ని ప్రయోగించే వ్యక్తి ఎంతో మెళకువగా ఉండాలి. పరిశీలన నిమిత్తం ఇద్దరిని తీసికొన్నాను. కాని జీవిత కాలమంతటికి కేవలం ఒక్క ప్రయోగమే సరిపోతుందా లేక కొంత విరామం తరువాత అనేకమార్లు ఆ ప్రయోగాను తిరిగి చేయాలా అన్నది చూడాల్సివుంది. నేను ప్రాణాహుతి ప్రసారం చేసిన వారిలో మార్పుల సూచనలు కనపడుతున్నాయి; అది ఏరకం మార్పు అనేది. ఆ విషయం దృష్టిలో వున్నప్పుడు మాత్రమే తెలిసికోడానికి వీలవుతుంది. ఈ విధానాన్ని "అణుపద్ధతి" అని అనవచ్చు.

* * *

ప్రతి సత్సంగి 'మిషన్' తనదని భావిస్తే ప్రస్తుతం మన సంస్థ ఎదుర్కొంటున్న యిబ్బందులు అదృశ్యం కావచ్చు. మన బిడ్డలు మన స్వంతమని భావించినప్పుడు వారి సౌఖ్యానికై ఎటువంటి కష్టాన్నైనా అనుభవించడానికి మనం సిద్ధం అవుతాం.

* * *

నేను నీ నుండి ఎంతో పనిని తీసికోవాల్సివుంది. నీమీద కూడ నేనెంతో పని చేయాల్సి వుంది. ఆవిధంగా తీసికొనడం, యివ్వడం రెండు కూడా యిమిడి వున్నాయి. "ఇచ్చి పుచ్చుకోవడం దొంగతనం కాదు" అనే సామెత ఆంగ్లంలో వుంది. నీ తీరిక సమయంలో నీవు దైవస్మరణ తప్పక చేయాలి. దాన్ని కొనసాగిస్తూ వుంటే నీవు కొన్ని మార్పులు జరుగుతున్నట్లు గమనించవచ్చు. ప్రస్తుతం నేను దీన్నిప్పుడే ప్రారంభించాను. భవిష్యత్తులో ఇది నీకు అవగతం కావచ్చని ఆశిస్తున్నాను. దీనికి నీవు "అంతరిక్షంలో" పని చేయడానికి సిద్ధం కావాల్సి వుంది. అభ్యాసి ఒక్కొక్కప్పుడు ధ్యానంలో నిమగ్నతను పొందడం జరుగుతుంది. ఒక్కొక్కప్పుడు అట్లు జరుగదు. దీనికి కారణం గాఢంగా నాటుకు పోయిన సంస్కారాలు బయటకు పోవడానికి హృదయం వైపుకు వస్తాయి. ధ్యానం హృదయంలో

ఒక శూన్యాన్ని సృష్టించడం వలన ఇది జరుగుతుంది. సంస్కారాలన్నీ బయటకు పోనంత వరకు ముక్తి ఉండదు. వాస్తవానికి నిత్యం జరిగే పద్ధతిలో కూడ వాటిని నేను క్షాళనం చేస్తూనే ఉంటాను. సహజ మార్గ పత్రికలో ఎక్కడో ఒకచోట యీ విషయంపై నేనొక వ్యాసాన్ని కూడా వ్రాసాను.

ధ్యానంలో ఏ స్థితి వచ్చినప్పటికి, అది అభ్యాసికి ప్రియమైనను, అప్రియమైనను సర్వవిధాల ప్రయోజనకరమే అవుతుంది.

ఆధ్యాత్మికత అనేది చాల సులభమైన విషయం. దాన్ని సిద్ధింప చేసికోవడానికి ఏమంత కాలం పట్టదు. కేవలం భక్తి, శ్రద్ధలను వృద్ధి చేసుకోవాలి. మరల మరల స్మరించడం ద్వారా భక్తి కలుగుతుంది.

* * *